శ్రీరస్తు.

---

భైరవకవిప్రణీతమగు

# శ్రీరంగమాహాత్మ్యము.

ERABAD

ఇది

వనపర్తి సంస్థానాధీశ్వరులగు

## సవై రాజా రామేశ్వరరావు

బహిరీబల్వంతు మహాభూపాలరావు బహద్దరు వారి

యాజ్ఞానుసారముగా

## మా. రామకృష్ణకవిగారిచేఁ

పరిష్కరింపఁబడి

---

చెన్నపురి

జ్యోతిష్మతీముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

---

1912.

29425

T
294.5925
BH6S

University of Hyderabad
LIBRARY
Acc No. 29425
Date 17.9.87
Hyderabad - 500 134.

# గ్రంథకర్తృప్రశస్తి.

LIBRARY

శ్రీరంగమహత్త్వము గారుడపురాణాంతర్గతమైనది. దీనిని గౌతమగోత్రుండును గౌరనామాత్యపుత్రుండును నగు భైరవకవి విరచించెను. ఇతండు శ్రీశైలమల్లికార్జునస్వామి దేవి యగు భ్రమరాంబిక కృపచేత సారస్వతసిద్ధిం బొందినవాండు. తుదిగద్యమున "శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసారస్వతవిలాసగౌరవ గౌరనామాత్యపుత్ర...భైరవ" అని వ్రాసికొనెను. రత్నశాస్త్రి యనుచిన్నకృతిలో, "భ్రమరాంబికామహేశ్వర । సముదితనిరవద్యహృద్యసాహిత్యకళా । క్రమవిమలప్రతిభాసం । క్రమణుండ మతిశాలి నైన గౌరనసుతుండన్" అనియు, "భైరవుండ నుభయభాషా । పారీణుండ లోభిధనభవ భూమవ్యా । పారపవికారదుష్కవి । ఘోరపికాచము లదల్చుకొను భైరవుండన్" అని చెప్పెను. కవిరాజగజాంకుశ మనుగ్రంథమున రత్నశాస్త్రిములో నుండి నేనుదాహరించిన రెండుపద్యములును గలవు; మఱియు, "శ్రీమత్పరమశివానన । తామరసవికాసలీలం దనరినభ్రమరాం । బా మధుమత్తభ్రమరిక । నామానసనరసిరుహమునన్ వసియించున్" అని యాలక్షణగ్రంథమును బ్రారంభించెను. కావున నీమూండుకృతులకుం గర్త యొక్కండే యని నేను వేఱ చెప్పనక్కఱలేదు. శ్రీరంగమహత్త్వమున,

మ. కృతవిద్యాఖురళీపరిశ్రమకళాకేళీవిలాసుం జన
స్తుతచారిత్రుని గౌతమాన్వయపవిత్రుం గౌరనామాత్యస
త్సుతుం గల్యాణకవిత్వలక్షణసమర్థున్ సూక్తిముక్తాఫలా
తతకాంతిస్ఫుటచంద్రికోల్లసితవిద్వత్కైరవున్ భైరవున్

అని తనగోత్రాదులం జెప్పుకొనెను. గౌరనామాత్యసత్సుతుం డనుటచే నియోగి బ్రాహ్మణుం డని కొందఱు చెప్పుదురు. అమాత్యశబ్దము కేవలము నియోగులయందును భట్టశబ్దము వైదికులయందే ప్రయోగింపంబడుచుండె ననునియతి నేంటికాలపుకవిచరిత్రకారులకే కాని శ్రీనాథభట్టాదులయందు వర్తింప దని నేను తలంచెదను. ఈభైరవుం డే కాలమునం దుండెనో గు[illegible]ఱుంగవలసియున్నది. ఇతని శ్రీరంగమహత్త్వములోనుండి యప్పకవియు ముద్దరాజు రామనయు వసంతర్తువర్ణనపద్యము నుదాహరించియున్నారు. మఱియుం బాండ్యభూపాలుం డగుముద్దళగిరిభూపాలునకు విద్యావతీదండకము రచించిన ప్రఖ్యాతుండు గణపవరపువేంకటకవి భైరవునిం బేర్కొనెను. తత్పాండ్యభూపతిని జయించిన కళువె-వీరభూపాలుండు తన వీరభూపాలీయమున భైరవునిం బ్రామాణికునిగాం జెప్పెను. వీరందఱుం గ్రీ-శ 1660 ప్రాంతములం దుండినవారు. వీరిలోం బూర్వుండు ముద్దరాజు రామన్న. ఆతండు తనకవిసంజీవనిలోం గవిగజాంకుశములోనిపద్యములు గూర్చెను. మఱియు లింగముగుంట-తిమ్మకవి సులక్షణసారమునం గవిగజాంకుశమునుండి

పెక్కుపద్యము లుదాహరించెను. ఈతిమ్మకవి క్రీ.శ. 1600 కుఁ బూర్వమే యున్న వాఁడు. ఇతఁడు తెనాలిరామకృష్ణుని యక్కకొమారుఁ డని యొకరు చెప్పిరి గాని నిక్కము తెలియరాదు. అట్లయినచో భైరవుఁ డంతకుం బూర్వుఁడే యగును. షట్చక్రవర్తిచరిత్రను రచించిన కామినేనిమల్లారెడ్డి తనశివధర్మోత్తరఖండ మనుగ్రంథమున,

సీ. కడుఁగతాగతి యని కందు డింగఁగ మోఁది శశికిఁ గళాశాస్త్రసరణి దెలుపు
మందబుద్ధి యని ముందఱ చెక్కులిఁగొట్టి కవిగజాంకుశ మింద్రకరికిఁ జూపుఁ
బకులకాపరి యని వెసఁ గోక హరికొని హలికి హలాయుధం బెలమిఁ గఱపు

అని శ్లేషవైచిత్రి చూపుచుఁ గవిగజాంకుశమును బేర్కొనెను. ఈమల్లారెడ్డియన్న యగుకామిరెడ్డి,

శా. శ్రీరాజత్సులతానసంస్థితమహాశ్రీకృష్ణజాంబాదర
స్ఫారాదేదులఖానరాడఖబరుష్మాపాలసింహాసనా
దారాక్రాంతనితాంతసన్నుతచరిత్రప్రాభవోద్దామకా
మారెడ్డిక్షితినాథహృజ్జలజధామా సిద్ధరామేశ్వరా.

అని శివధర్మోత్తరఖండమున ద్వితీయాశ్వాసాంతపద్యమున సూచింపఁబడినట్లు లఖబరుకాలమునను ఏదిలఖానుకాలమున నున్నచో మల్లారెడ్డియుఁ దత్కాలము వాఁడే; “అఖబరుష్మాపాలసింహాసనాదారాక్రాంతనితాంతసన్నుతచరిత్ర” యనుటచేఁ నక్బరు చక్రవర్తి కించుకసహాయ మొసఁగి యుండవచ్చును. అక్బరు క్రీ. శ. 1556-నుండి 1605 వఱకుఁ బరిపాలించెను. పైఁ బ్రస్తావించిన కామిరెడ్డితమ్ముఁ డగు నెల్లరెడ్డి కంకితమీయఁబడిన బ్రహ్మోత్తరఖండ మనుకృతిలోఁ దత్కర్త యగుపట్టమెట్టసోమనాథకవి కామారెడ్డిని వర్ణించుచుఁ దదాస్థానకవులు తత్కాలపుశాలివాహనశకవర్షము లెన్నియో యందఱని చిత్రముగాఁ జెప్పెను. “కలిమి దిక్కనవోలి శ్రీకామిరెడ్డి । భూమివిభు నాశ్రయించిన బుధులు నిజము । శాలివాహనశకవర్షసంఖ్యఁ బదియు । నైదునూర్లునవర్తమానాబ్దము లగు.” ఈ బ్రహ్మోత్తరఖండమునకుఁ బూర్వమే షట్చక్రవర్తిచరిత్ర మల్లారెడ్డి రచించె నని తానే చెప్పుకొనెను. పైయంశము లాలోచించి చూడ క్రీ. శ. 1570 వఱకును భైరవునికాలము నిశ్చయ మగుచున్నది. భైరవునితండ్రి గౌరన; వీరు గౌతమగోత్రులు గదా. గౌరన యనుకవి గౌతమగోత్రుఁడు హరిశ్చంద్రకథాద్విపదయు నవనాథచరిత్రయు నవగ్రహస్తుతియు రచించియున్నాఁడు. ఈకవిని కూర్మపురాణము విరచించినరాజలింగకవి పూర్వునిగా వర్ణించెను. ఇతనితండ్రి పెదతండ్రులు రాజన్న పోతన్నలు రేచర్ల సింగభూపాలుని యొద్ద మంత్రులుగా నుండిరి. గౌరన యాంధ్రకావ్యములు గాక సంస్కృత

మున లక్షణదీపిక యను ఛందశ్శాస్త్రమును రచించెను. దానిలో సంస్కృతాంధ్రములఁ బ్రఖ్యాతము లగు ఛందోగ్రంథము లుదాహరింపఁబడినవి. శ్రీధరచ్ఛందమును ధర్మసూరి ప్రణీత మగు సాహిత్యరత్నాకరముగూడ నుదాహరింపఁబడియున్నవి. ఈ గౌరన భైరవుని తండ్రి యా యనుసంధానము కలుగుచున్నది. గౌరన సింగభూపాలునిపుత్రుఁడగు మాధవుని కాలమున నుండెను. లక్షణదీపికలో, "అస్తి ప్రశస్తావనిపాలమౌళి రత్నాళిరంజిత పాదపీఠః రేచర్లవంశార్ణవపూర్ణచంద్రో మహాబలి స్సింగయ మాధవేంద్రః" అని చెప్పఁబడియున్నది. ఈ మాధవుని తాత యగు మాధవేంద్రుఁడు శ్రీమద్రామాయణవ్యాఖ్య రచించె నని యీ క్రిందిచాటు శ్లోకమునందున్నది.

శా. శాకాబ్దే నిధివార్ధిరామశశిగేఽప్యబ్దే ప్లవంగే శుభే
మాసేప్యాశ్వయుజే రఘూద్వహపదే రామా రాఘవీయాహ్వయాం
టీకా మర్థపటుప్రబోధఘుటనామాణిక్యపుష్పాంజలిం
కృత్వా రాజతి రావుమాధవనృపో రామాయణస్య శ్రియా:

అనఁగా నీమాధవేంద్రుఁడు క్రీ. శ. 1427 లో నుండెను. అతని మనుమఁడు 1500. లలో నుండుట యాశ్చర్యము కానేరదు. కావున గౌరన 1500 లో నుండియుండును మఱియు, మల్లారడ్డి శివధర్మోత్తరఖండమున :—

సీ. మానితవరధరామరకులతిలకంబు గౌతమగోత్రాబ్ధికల్పశాఖి
మల్లికార్జునపండితోల్లసద్వంశుండు గౌరనారాధ్యశేఖరసుతుండు
శ్రీమల్లమాగర్భసింధుశీతకరుండు గంగమాంబామనఃకంజభాను
సకలాగమజ్ఞానసారధౌరేయుండు పరవాదిదుర్మతిభంజనుండు
చలగ గురుదక్షిణామూర్తిసద్గురులను। గౌరనాహ్వయదేశికుఁ గన్నతండ్రి
ప్రవిమలాస్మత్కులోద్భవారాధ్యుఁ బుణ్యు। రణ్యకరసాధ్యు లింగనారాధ్యుఁ దలఁతు.

అని చెప్పుటచే లింగనారాధ్యుఁడు గౌరనపుత్రుఁడఁట. పైచెప్పిన గౌరనయు నీ గౌరనయు విద్వాంసులు, గౌతమగోత్రులు ననూచానసంతానులు మల్లికార్జునపండితాదులు వసించియుండిన శ్రీశైలప్రాంతములవారు. రేచెర్లభూమిపాలు రేలినజటప్రోలు మొదలగు సంస్థానములు శ్రీశైలప్రాంతములలోనివే. ఈయంశము లింకను దీర్ఘముగా నాలోచింప నిద్దఱు గౌరనలును నేకపురుషనామములే యనియు క్రీ. శ. 1500 ల కాలములో నతఁడుండెననియు నూహింపవచ్చును. భైరవకవికులగోత్రములును గౌరనకులగోత్రములును వాసస్థానములును గాలమును సరిపోవుచున్నవి గావున భైరవుఁడు లక్షణదీపికాదిగ్రంథములు రచించిన గౌరనపుత్రుఁడని తలంచెదను. అట్లయినచో నితఁడు క్రీ. శ. 1530 లో

నుండవచ్చును. ఈసిద్ధాంతమునకుఁగూడ నొకబాధకము గలదు. ఏదనఁగా, గౌరన తన లక్షణదీపికలోఁ గవిగజాంకుశమునుండి నాల్గుపద్యము లాంధ్రము లుదాహరించెను, ప్ర ద్రునిలక్షణగ్రంథమునుండి యుదాహరించెనా యనునదే సందియము. లక్షణదీపికాప్రతులు నాయొద్దను బ్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునను గలవు. కవిగజాంకుశప్రతులు భిన్న దేశప్రతులు నాయొద్ద నాల్గుగలవు. చెన్నపురియడయారుసంస్కృతపుస్తకశాలలో నొకటి గలదు. లక్షణదీపికలో నన్నిప్రతులలో నానాల్గుపద్యములు గవిగజాంకుశములోనివనియే యున్నవి. కవిగజాంకుశప్రతులలో నానాల్గుపద్యములలో నేదియుఁ గానరాదు. ఈయుభయగ్రంథములను బ్రతులన్నియు సంపూర్ణములై శుద్ధములుగా నున్నవి. కావున లక్షణదీపికలో నుదాహరింపఁబడినకవిగజాంకుశము భైరవప్రణీతము గాక మఱియొక ప్రాచీనకవిరచితమై యుండునేమో. భైరవుఁడు గ్రంథాంతమునఁ గవిరాడ్గజాంకుశమని నామమిచ్చెను. అది భైరవునిదే యయిన క్రీ. శ. 1500 లకుఁ బూర్వుఁడే యగును. ఇతఁడు గొప్పలాక్షణికుఁడు. ఇతఁడు తనకవిరాజగజాంకుశము కేవలము సూత్రగ్రంథముగాఁ గూర్చెనుగాని పూర్వకావ్యలక్ష్యము లిచ్చినవాఁడు కాఁడు. ఇతనిశ్రీరంగమహాత్మ్యమును లాక్షణికు లందఱుం జదివియున్నట్లుదాహృతపద్యములే ఘోషించుచున్నవి. ఈకృతి మనోహరమై శైలీపాటవముగలదై "మత్స్యవిఘోరపఠాచముల" నదల్చునట్లున్నది. భైరవునిపదబంధము ప్రౌఢమై యొక్కొకయెడ శ్రీనాథపెద్దనలఁ దలఁపించుచున్నది. రెండవయాశ్వాసములోనిఋతువర్ణనమును నాల్గవయైదవయాశ్వాసములఁ బురవర్ణనమును గవిప్రతిభారచితములుకాని మూలమునఁ గానరావు. ఉభయభాషాపాండిత్యము చూపుచున్నయాపట్లు స్వరచితార్థసంపత్తిమై మెఱయుచున్నవి. దీనిలోనిపద్యములు 1600 క్రీ. శ. లో నుండినజగన్నాథకవిచే రత్నాకరమునను బ్రబంధమణిభూషణమునను దత్తత్కథాభాగములకు ననుకూలముగా నున్నవి గ్రహింపఁబడినవి.

దీనిలోని కథ ప్రఖ్యాత మగుశ్రీరంగక్షేత్రమహాత్మ్యము. ఇది మూలమున నూఱధ్యాయములుగలది. ఈదివ్యచరిత్రమును బెక్కండ్రుకవులు రచించి తమభక్తిని గల్పాంతస్థాయినిగా లోకమున నెలకొల్పిరి. అనేకదివ్యక్షేత్రములలో శ్రీరంగము చాలముఖ్యమైనందున నాల్గురుకవులు దీనిఁ దెనిఁగించిరి. శ్రీనాథుని కాశీఖండభీమఖండములకుఁ బిదప క్షేత్రమహాత్మ్యముల నింతప్రౌఢముగాఁ దెలిగించినకవి యన్యుఁ డెవ్వఁడు గానరాఁడు. వేంకటాచల సింహాచల కాళహస్తి హాలాస్య మంగళగిరి గోకర్ణ శ్రీశైలాదిమహాత్మ్యము లింత ప్రౌఢము లయినవి కావు. శ్రీరంగమహాత్మ్యముఁ దెనిగించినవారిలోఁ గందాళయప్పళాచార్యునిశిష్యుఁ డగుముకుందవరోగి ద్విపదరూపమున రచించె నయ్యది స్త్రీబాలకజనంబున కత్యంతోపయోగి యని తలంచెదను. కొంగునాటిలో రాజమంత్రిగా నుండిన

వరముల నరసార్యునిచేఁ గందపద్యములలో విరచిత మగు శ్రీరంగమహాత్మ్యముకూడ నప్రాప్తమైనదే. ఇఁకఁ దక్షిణవానిలో భైరవునికవితతో నించుక వాసికి వచ్చునది కట్టా వరదరాజకవిప్రణీత మగు కావ్యమే. అతఁ డళియ రామరాయల పెదతల్లికుమారుఁడు. అతఁడు దీనిని పదియాశ్వాసములలో మనోహరముగాఁ దెనిఁగించెను. అయ్యది మృదుపదవిన్యాసమై వైదర్భీరీతి నెలకొనుచున్నది. వీరిరువురును మూలమును కొఱవడనీయక రసపోషణమునకై యచ్చటచ్చట వర్ణనలఁ జేర్చుచుఁ దమవిద్యావిలాసమును నెలకొల్పిరి గాని యఖండమహాప్రవాహిని యగు భైరవునిశైలికి సుకుమార పదబంధము గల వరదునికవిత యాకాశగంగకును సమతల ప్రవాహిని యగు కావేరికిఁ గల యంతరమే చూపుచున్నది. భైరవుఁడు వేదాంతశాస్త్రమునఁ జక్కఁగాఁ బరిశ్రమించినట్లు తద్గ్రంథపఠనము వలనఁ దెలియుచున్నది గాని కృతిపతి యగు రాఘవమంత్రి వైష్ణవుఁడో లేక మాధ్వుఁడో కావున నతఁడు విష్ణుభక్తాగ్రేసరులు క్షేత్రరాజ మగు శ్రీరంగమును హృదయ సన్నిధానమున సదా కొలుచుచుండుటకై భైరవునిచేఁ దీనిఁ దెనిఁగింపఁజేసెను. వరదరాజు వైష్ణవుఁడు; భైరవుఁడు శైవుఁడు; అయినను దీనిలో శివపక్షపాత మగు నంశము లేవియు లేవు.

భైరవుని శ్రీరంగమహాత్మ్యములోని దని లాక్షణికులచే నుదాహరింపఁబడిన క్రింది పద్య మందులోఁ గానరాక భోజరాజవిభూషణ మనునీతిగ్రంథమునఁ గలదు.

ఉ. ఆసలవృత్తి రాఘవుశరాగ్రమునందుఁ దృణాగ్రలగ్ననీ
రాకృతి వార్ధి నిల్చుట దశాననుఁ డీల్గుట మిథ్య గాదె వా
ల్మీకులు చెప్పకున్నఁ గృతిలేని నరేశ్వరవర్తనంబు ర
త్నాకరవేష్టితావని వినంబడ దాతఁడు మేరు వర్తినన్.

శ్రీరంగమహాత్మ్యము గారుడపురాణమున నూఱధ్యాయములుగా బ్రహ్మాండపురాణమునఁ దొమ్మిదియధ్యాయములుగా నున్నది. భైరవుఁడును వరదరాజకవియు గరుడపురాణాంతర్గత మగు కృతినే తెనిఁగించిరి. భాగవతుల- రామకవి ముకుందయోగి మొదలగు వారు బ్రహ్మాండపురాణాంతర్గతకథనే యనువదించిరి. వరదరాజకవనధోరణి తెలియుటకై భైరవకృతిలో మూఁడవయాశ్వాసమున 729-వ పద్యమునుండి గల కథాభాగము ననుసరించి వరదునికృతిలో నుదాహరించెద; సహృదయులు కవననైపుణవిశేషమును గ్రహింతురు గాక.

ఉ. మేళము ఘుమ్మనన్ శ్రుతి సమేళముగాఁ జతగూర్చి మద్దెలన్
తాళము లావజంబులును దండెలుఁ జెంగులు నొక్కక్రమంతగా
నాలతి నేసి దృష్టిపరిహారతకై మును తుంబురుండు దా
గౌళవరాళినాటలను గాయనరూఢికిఁ బాడి చూపినన్

క. గాంధర్వమేళసంగతి। గంధర్వవరుండు వీణ గైకొని దివిష
ద్గంధేభగామినీమణి। సంధించినమసకతిత్తి జతి రాణింపన్.

సీ. ఒకరాగమునకంటె నొకరాగ మందమై బయకారులను సిగ్గుపఱచుచుండ
నొకతానమునకంటె నొకతాన మొఱపులు వెదచల్లి వీనులవిందుసేయ
నొకగీతమునకంటె నొకగీత మతిచిత్రగమనావిర్భవ రంగుమీఱ
నొకఠాయమునకంటె నొకఠాయమున శుద్ధభరతవేత్తల కుదాహరణములుగ
నొక్కతాళంబునకు మీఱ నొక్కతాళ। మొకప్రబంధంబునకు మించ నొకప్రబంధ
మొక్కనామావళికి మీఱ నొకటి గాఁగ। వీణ వాయించె వేలుపుగాణ యపుడు.

క. ఆవీణ యొకనిచేతికి। నావల నందిచ్చి దండె యందుక పాడెన్
రావణశంకరనారద। పావనిముఖ్యులకు నోజబంతి యనంగన్.

క. ఘనదేశిశుద్ధవైఖరి। వినిపించిన చిత్రసేనువీణానాదం
బున మూర్ఛనల మునింగిన। జనుల సచేతనులు గా నిజంబునఁ బాడెన్.

సీ. ఘనవిధంబులఁ బాడ గాయక స్తంభంబు తొగరుఁజాళులఁ గ్రొత్తచిగురు లొత్తెఁ
బంతుమార్గంబునఁ బాట వాడినఁ గుడ్యమణిపుత్రికలకుఁ జెమ్మటలు వొడమె
దేశివైఖరిఁ బాడుచో శిరోవళము కే లెత్త శయ్యాభోగి యొత్తగిల్లెఁ
దగుహారంగములు వింతగఁ బాడఁ గాంచనకలశాంబుపూరముల్ కఱడుగట్టెఁ
బదము వాడెనుచోఁ దరువనముఁ బాఁకు। చోట నాళ్వారులకుఁ జొక్కుచూపునడియు
మావునెమ్మోము గలవాఁడు మధురగాన। రీతిఁ దంగేశుఁ బాడుసంగీతసరణి.

మ. ఏకతాళంబున వీరమద్దెలరవం బేకంబుగా నట్టువల్
ధికతోంత తకఝుంకఝుంకుకిణతాంగిత్తాంగినల్లోధికు
ద్ధికుతత్తైయ్యథిమిక్కిటక్కిధిగద్దోందిత్తాత్తతాళంబులన్
గనుబంతంబులు మాఱువల్కఁ గొనకో ల్గన్నట్లు ము న్నాడఁగన్.

ఉ. దేశివిధంబు గట్టణము దివ్యకళాసియుఁ గోలచారి కై
లాసికి పేరణీవిధము లాగులు జక్కిణి చిందు కొల్వణుల్
బాసలు కోపుమాపులునుఁ బాట పదాభినయంబు రేకయున్
వాసిగ మీఱ నాట్యకలనం బ్రకటించెను హావభావముల్

క. పాడినకైవడిఁ బాడుచు। నాడినయాట్లు లాడుచుండు నలరంగములోఁ
గ్రీడామృగశుకశారీ। నీడజముఖతిర్యగాత్మనిచయం బెల్లన్.

మ. కవితాధోరణి యుక్తగానరచనల్ గంధర్వగాంధర్వమున్
హావణింపం గనకప్రసూనముల కత్యామోదసంపర్కమై

మివులన్ మెచ్చఁగఁజేసి శేఖరుల (?) భూమిన్ సత్కళావంతులన్
భువనంబెల్లను ముంచె నద్భుతరసాంభోరాశి నుల్లాసియై.

ఈ భాగమును జదివినవారెల్లరు వరదునికవితయు భావప్రౌఢిమగల దనియు భైరవునికవనముకంటెను మిగులు నని తలంతురు గాని యది కొన్నిచోట్లఁ జేఁపలబుట్ట యల్లినట్లు నీరసపదభావభూయిష్ఠ మయి రుచికొలుపదు. భైరవునియన్యోక్తికవితాధారయు రసభావగతివిశేషములు శ్లాఘ్యతరములు గావున నీరెంటిలో భైరవకృతినే ముద్రింప దొరకొంటిని. తాళీదళసంపుటకాంతారమునఁ దిరిగి ప్రమాదకంటకములఁ దొలఁగించుకొనుచు నపూర్వపదార్థవిచేవనంబు సేయుచుండువారియవస్థ తత్తుల్యులకుఁ గాని యన్యుల కెఱుంగరాదు. వాక్ప్రతిష్ఠాకోశము నిగ్రహార్యాదము; ప్రతిభ నవనవోన్మేషిణి; కాలము విస్మృతినిదానము; సామాన్యలోకము జీవయాత్రికపరాయణము; అయోగ్య యుఁక మృతిచెందుచున్న పురాణకవిబ్రహ్మలగతి యెట్లు? అని యనుతాపమాత్రంబున సముద్రజలమునకేతము గట్టిన ట్లీకావ్యోద్ధరణక్రియకుం బూనితిఁ గాని వైదుష్యదర్పమునం గాదు. వ్యయప్రయాసములమాటఁ బోనిచ్చి శతచ్ఛిద్రవ్యాకులం బగుతాళీదళపరిశోధనం బభ్యాసవశంబున జాగుప్సారహితంబుగ నలవఱచుకొని కార్యము నెట్లో నిర్వహించుచుండుటయుఁ గొంద ఱీర్ష్యాగ్రహాగ్రస్తులు చూచి యోర్వక పరిపరివిధముల ననుఁ బొటుపఱచుచున్నారు. అక్కటా, యీయల్పకార్యారంభమునకే జ్ఞాతిత్వము లేకయె యీర్ష్యావిద్వేషమునఁ గన్నుపొడచువా రుండఁగా భగవంతునియనంతగుణములం జూచి యోర్వక తామసులై యతనితోఁ బోరఁగడంగు రాక్షసులయవిద్యా ప్రభావమును సహస్రముఖముల వర్ణించినవ్యాసాదులవిజ్ఞానము తప్పక కొనియాడఁదగినదే. విద్యాసంస్కారము చాలనివాఁ డట్టివాఁడు సేయుపరిశోధనమున దోషసంధులు గలుగుట నిశ్చయము. వాని నన్వేషించి చూపినమాత్ర వివేకి యాగ్రహస్థానము గా నేరఁడు. విద్వత్కల్పులు చేయుకౌటిల్యముమాత్రము నిరసనీయమే. భగవచ్ఛ్రీదయామహిమంబుననె నాయల్పోద్యోగము నెఱవేఱుంగాక యని పరమవిశ్వాసమున దీని నింతటితో విరమించుచున్నాఁడను.

భైరవుఁడు గొప్పలాక్షణికుఁ డని ప్రఖ్యాతి వహించియు నాంధ్రవ్యాకరణదోషములు పెక్కులు పరిహరింపఁ జాలఁడయ్యె. "తలమా వులుకక" యిత్యాదిస్థలముల యడాగమమునకు మాఱుగా ద్రమిళభాషలోవలె వకారాగమంబు వచ్చుట వ్యాకరణసిద్ధము గాదు. "స్వర్గమును" మొదలగుచోట్ల నగాగమంబు రామి శ్రవణశుభగము గాదు.

"భరద్వాజమునికి సాటెంగించిన యీ వినుతేతిహాసపఠనము," 1001

ఇట్టి ప్రయోగములు దీనిలోఁ బెక్కులు గలవు. ప్రౌఢవ్యాకరణములో నుదాహరింపఁబడినయన్నయభట్టారకప్రయోగములకును వీనికిని జాలభేదము గలదు. ఆంధ్ర

మున లాక్షణికులె లక్ష్యైకవేద్యు లగుకవులకంటె నెక్కుడప్రయోగములు కూర్చి వానికి సాధుత్వ ముద్ఘోషింపఁ బ్రయత్నించిరి. ఇట్టిదోషముల సూచించుట కర్తవ్యమని చూపితిఁ గాని నేఁటికాలమునఁ బాణినిపతంజలుల యంతరంగమును గుర్తించి విచిత్రవ్యాఖ్యానవైఖరీప్రభావంబున మునిత్రయమును మునిసప్తకంబు గాఁ జేయఁజాలిన గ్రామ్యభాషోద్ధారకుల కివి హాస్యభాజనములు గాక తక్కవు.

ఈకృతి నాకు రెండుప్రతులు వనపర్తిసంస్థానాధీశ్వరుల తాళపత్రలిఖితగ్రంథములలోనే లభించినవి. అందులో నొకటి 186 సంవత్సరములకుఁ బూర్వమునను దానికి బుత్రిక యగువేఱొకటి 96 సంవత్సరములకుఁ బూర్వమునను దత్సంస్థానాధీశ్వరుల ప్రేరణంబుననే లిఖింపఁబడినవి. నేను దత్సంస్థానాధీశ్వరాశ్రయము నొందనికాలమున గ్రంథాన్వేషణమునిమిత్తము గద్వాలవనపర్తిసంస్థానాదులఁ గొంతకాలము సంచరించి వారివారియనుగ్రహంబునకుఁ బాత్రుండనై గద్వాలలో భోజరాజీయాదికృతులు సంపాదించి వనపర్తిలోఁ బుస్తకముల శోధించుటకు ననుజ్ఞవడసి వానియెదుటఁ గూర్చుండి తాళీదళసంపుటములు విప్ప దొరకొనుసమయమున నకస్మాత్తుగా నప్పకవి యుదాహరించిన "గంధపుగొండనెత్తముల" యనుభార్గవునిపద్యము మనస్సునకు స్ఫురించెను. అంత నయ్యా మన కీల యీకావ్య మీగ్రంథసమితిలో లభింపదా యని మొట్టమొదటిపుస్తకము విచ్చి కొన్నియాకులు ద్రోచి చదువఁగాఁ బ్రప్రథమమునఁ బైపద్యమే దృష్టిగోచర మయ్యెను నాకుఁ గలిగినయానంద మిట్టి దని చెప్పఁజాల. కుమారసంభవాదిసత్కృతులను న్నిది తీసిపోయినను నేనుత్సుకుఁడనై వెదకినకృతిలోఁ బైపద్యమె మొదట గోచరించుట వైచిత్రీవిశేష మని తెలియఁబఱచితిని. నాఁడు మొదలు తత్సంస్థానాధీశ్వరులగు శ్రీమంతుసవై రాజా రామేశ్వరరావు జహీరీబల్వంతు మహాభూపాలరావు బహద్దరుగారు దీనిఁ బ్రచురింపు మని సర్వవిధముల నన్నుఁ బురికొల్పి యాజ్ఞాపించినను గారణాంతరములచే నేనే కాలవిళంబము చేసితిని. ప్రత్యంతరము లభింపకుండుటచే ననివార్యము లగుదోషములు కొన్ని నిలచినవి. గ్రుడ్డికంటె మెల్ల మే లందురుగదా. దీనిం బండితలోక మనుగ్రహపూర్వకముగా గ్రహింతు రని నేను విశ్వసించుచున్నాఁడను.

చెన్నపురి.
5 జూన్ నెల 1912.

మా. రామకృష్ణకవి,

# శ్రీరంగమహాత్మ్యము.

## ప్రథమాశ్వాసము.

శ్రీమన్మూర్తిరుచుల్ తటిద్ఘనఘనశ్రీ నామతింపన్ గటీ
సీమన్ వామకరంబు సాఁచి వలచే శీర్షోపధానంబుగా
రామం బైనఫణీంద్రతల్పమున శ్రీరంగంబునం దాశ్రిత
క్షేమస్థేమమతిన్ సుఖించుహరిఁ బూజింతున్ దయాంభోనిధిన్. 1

మ. శయనంబై యుపధానమై నిలయమై సచ్ఛత్రమై పాదుకా
ద్వయమై మంగళపీఠమై సృకులవస్త్రంబై సమస్తోచిత
క్రియలం జక్రికి నిత్యసంనిహితమూర్తిన్ బొల్చు శేషాహి న
క్షయమేధానిధిఁ గావ్యలక్షణకళాచార్యున్ బ్రశంసించెదన్ 2

ఉ. ఆయతచండతుండనిహతాహినికాయునిఁ దప్తహాటక
చ్ఛాయుని సర్వవేదమయసన్నుతకాయుని దేవదానవా
జేయుని నప్రమేయుని నశేషవిహంగకులాధిపత్యధౌ
రేయునిఁ బ్రస్తుతింతు సుచరిత్రవిధేయుని వైనతేయునిన్ 3

క. శ్రీరమణచరణసేవా । చారనిరూఢావధాను సత్కీర్తిజయ
శ్రీరాజమాను దానవ । వీరక్షయసైన్యుఁ దలఁతు విష్వక్సేనున్. 4

మ. వినుతింతున్ హరిభక్తిపెంపున జగద్విఖ్యాతులై పుణ్యకీ
ర్తనులై నట్టిపరాశరుం గపిలు వేదవ్యాసుఁ బ్రహ్లాదు న
ర్జును రుక్మాంగదు నంబరీషుని వసిష్ఠుం బుండరీకున్ మరు
త్తనయున్ భీష్ము విభీషణున్ సురమునిం దాల్భ్యున్ శుకున్ శౌనకున్. 5

వ. అని సపరిచ్ఛేదంబుగా నభీష్టదేవతాభివందనం బొనర్చి.

గీ. అఖిలభువనైకపావనం బగుచు శ్రవణ । మంగళం బైనరఘునాథమహితచరిత
మసమవాక్ప్రౌఢి విరచించె నట్టియాద్య । సుకవిశేఖరుఁ బ్రాచేతసుని భజించి. 6

చ. లలితకవిత్వరేఖ సఫలత్వము నొంద నశేషకిల్బిషం
బులఁ దొలఁగించి నిత్యసుఖమూలములై హరిభక్తిదంబులై
వెలయుపురాణసత్కథలు వేడ్క రచించి జగత్ప్రసిద్ధులై
పొలుచుమహాత్ములన్ సుకవిపుంగవులం బ్రణుతించి వెండియున్ 7

క. రహి నిక్కనకవితల ఁదహ । తహఁ జొక్కనృపులచేతఁ దగ సత్కృతులై
మహిఁ దక్కనకళలందును । వహి నెక్కనకవుల నేఁటివారలఁ బ్రీతిన్. 8

క. నుతిసేసి వాణికరుణను । శతముఖములఁ బరిఢవించు సాహిత్యకళా
ప్రతిభాసంపద పెంపునఁ । జతురుఁడ నగు నేను హృదయజలజములోనన్ 9

క. సుతుఁడును గృతియును దేవా । యతనము నల్లిల్లుఁ జెఱువు నారామము నూ
ర్జితధననిక్షేపము నన । సతతము ధరఁ బరఁగు సప్తసంతతు లందున్ 10

క. కలుగు ధన మఖిలదిశలను । వెలుఁగు యశం బతిశయించు విద్యలు ప్రీతిన్
జెలఁగు సుధీతతి యెడనెడఁ । దలఁగు శివేతరచయంబు దగుకృతిఁ జెప్పన్. 11

వ. అదియును.

సీ. శబ్దార్థరూఢిరసస్థితిబహువిధవ్యంగ్యభేదములు భావములు గతులు
శయ్య లలంకారసరణులు రీతులుఁ బరిపాకములు దశప్రాణములును
వృత్తులు వస్తువివేకంబు గుణములుఁ గవిసమయములుఁ జమత్కారములును
వర్ణనంబులు గణవర్ణఫలంబులుఁ దత్కాలంబులు నధిదైవతములు
గ్రహములును శత్రుమిత్రయోగములు దశలు, నంశవేధయు భూతబీజాక్షరముల
పొత్తువులుఁ దెల్పి కాంతవిస్ఫురణఁ దనరు। సత్కవీంద్రునికృతి బుధసభల వెలయు. 12

వ. అట్టిమహాకావ్యసముదయంబునందు.

క. లోకోత్తరగుణపుణ్య । శ్లోకకథామధురిమధురశుభవాక్యర
త్నాకల్పం బగుకావ్యం । బాకల్పం బగుఁ గృతార్థుఁ డగుఁ గవివరుఁడున్. 13

వ. కావున భువనైకకథాసంబంధబంధురంబుగా నొక్క ప్రబంధంబు రచియింపవల

యు నని వితర్కించు సమయంబున నతిప్రసన్నవదనుండును నాకారవిజితమదనుండును ననుపమగుణభూషణుండును నతిమధురప్రియభాషణుండును నవికృతవేషుండును నపగతదోషుండును నకలంకమణికుండలమరీచిమంజరీరంజితగండమండలుండునునై ప్రతాపసమగ్రుండై, రాజశేఖరుండయ్యును శ్రీకలత్ర పరిగ్రహుండై, రాజీవాక్షుండయ్యును దుర్గాధీశుండై, పద్మినీవల్లభుండయ్యును గువలయానందకరుండై, కళానిధియయ్యును నిత్యప్రవర్ధమానుండును, వజ్రధరుండయ్యును గోత్రవిరోధిగాక, నసమాంబకుండయ్యు ననంగుండుగాక, భోగీంద్రుండయ్యుఁ గుటిలప్రచారిగాక, భీమసేనుండయ్యు దుశ్శాసనాభిముఖుండు గాక, విజయుండయ్యు గర్ణకంటకుండుగాక, నారాయణుండుంబోలె సర్వప్రియుండును, నదీనాయకుండుఁ బోలె ఘనసత్త్వసమగ్రుండును, నాకేశశైలంబునుంబోలె సువర్ణకటకోజ్జ్వలుండును, నై యనురాగిలుచుఁ జాగయామాత్యసాగరసంపూర్ణసుధాకరుం డగు రాఘవమంత్రిశేఖరుం డొక్కదివసంబున, నవసరసఘుసృణమలయజాభిషిక్తప్రదేశంబును, సవ్యస్వర్పిత బహురూపధూపధూమగంధానుబంధిగంధవహవాసితాశావకాశంబును, విలంబిత కుసుమమాలికా విసరపరిమళవిలోలరోలంబ ఝుంకారఝుంకరితంబును, బంకజోదరపర్యంక ఫణిశిరోక్షకనిగ్గల మహావితాన వితతవితానాభిశోభితంబును, ప్రభాతప్రభాకరబింబవిడంబిత జాంబూనదశిఖరరాజివిరాజితంబును ముక్తాఫలముకురతలవిమలభిత్తిచిత్రితహరిలీలావతార విహారంబును, నై వెలయుసభాగారంబున నశేషనయవిద్యావిశేషస్వతంత్రు లగు మంత్రులును, సకలకర్మప్రయోగచాతురీమహితు లగుపురోహితులును, అవక్రబలపరాక్రమవంతు లగుసామంతులును, అసమసంగ్రామరంగవిహారవీరావేశసముద్వృత్తు లగు బిరుదరాహుత్తులును, బహువిధనాటకాభినయపాటవసముద్భటు లగునటులును, శ్రుతిసంధాయక గాన విద్యానుసంధాయకు లగుగాయకులును, సచమత్కారకారణ గుణానుబంధబంధురప్రబంధవచనానిస్తంద్రు లగుకవీంద్రులును, నిజశేముషీ విశేషానుకృతశేషు లగు మనీషులును భారతరామాయణాదికథాకథనచతురరచనామృతపరిద్వేణిక లగు పౌరాణికులును, నలనహుషనృగభగీరథాది రాజన్యధన్యగుణశ్లాఘాముఖరం బగుపాఠక ప్రకరంబును, సమంచితలీలాసంచితానూనపటిమానధనం బగు విలాసినీజనంబును, గొలువఁగొలువుండి సకలశాస్త్రసారంబగు హరికథామృతపూరంబు వీను లలరం జవిఁగొనుచు నందు గారుడపురాణ ప్రసిద్ధంబై సిద్ధమునిగణస్తోత్రపాత్రం బగు శ్రీరంగక్షేత్రప్రభావంబు భావంబునకుఁ బ్రమోదం బావహించిన. 14

క. శ్రీరంగమాహాత్మ్యము ప్రియ । మారంగఁ దెనుఁగుభాష నతిమృదులవచః
శ్రీరుచిరత్వంబుగఁ దన । పేర రచింపింప నాత్మఁ బ్రీతిగొనువేడ్కన్. 15

ఉ. తొల్లిఁటిసత్కవుల్ కృతులు దొంతులు పేర్చినమాట లూఁతగా
జల్లిపదంబు లూఁదుకొని సంధులు దాఁటుచు నొక్కజాడగా
నల్లినకబ్బముల్ సభల నార్యులు నవ్వఁ బఠించుదుష్కవుల్
మొల్లము వారిచేతఁ దుదముట్టునె భవ్యము లైనకావ్యముల్ 16

ఉ. పుట్టకుఁ బుట్టికోమలికిఁ బుట్టినప్రాఁగవు లాదరించి చేఁ
బట్టిన గాదె రాఘవనృపాలకధర్మజకీర్తిచంద్రికల్
నెట్టన సర్వలోకములు నిండిన విప్పుడు నిందు నందులన్
ముట్టి నఖర్వసర్వసుఖమూలము కావ్యమ వో తలంచినన్. 17

మ. కృతవిద్యాఖురళీపరిశ్రమకళాకేళీవిలాసుం జన
స్తుతచారిత్రుని గౌతమాన్వయపవిత్రుం గౌరనామాత్యస
త్సుతుఁ గల్యాణకవిత్వలక్షణసమగ్రున్ సూక్తిముక్తాఫలా
తతకాంతిస్ఫుటచంద్రికోల్లసితవిద్వత్కైరవున్ భైరవున్ 18

చ. ననుఁ దనసమ్ముఖంబున మనం బలరం బిలిపించి యాదరం
బెనయ విచిత్రవస్త్రమణిహేమవిభూషణదర్పసారచం
దనహిమవాలుకాదివివిధస్తుతనిస్తులవస్తుసంపదల్
దనియఁగ నిచ్చి వక్త్రికమలంబున లేనగ వాటిలింపఁగాన్. 19

క. లలితమరుసమయసముదిత । మలయానిలచలితమధురమాకందసుమ
జ్జ్వలకుసుమవిసరసౌరభ । కలితవచస్స్ఫురణ వెలయఁగా నిట్లనియెన్. 20

శా. వ్యాసప్రోక్తమహాపురాణములు ముయ్యాఱెంటియందుం జగ
ద్వాసుం డై నరమామనోహరుమహాత్మ్యవ్యక్తిమూలంబులై
భాసిల్లుం దగు నాలు గందును బహూపాఖ్యానవిఖ్యాతమై
యాసౌపర్ణపురాణ మొప్పు బహువేదాంతార్థగంభీరమై 21

వ. అందుఁ బురాణసారంబై శ్రవణమంగళం బగుశ్రీరంగమాహాత్మ్యంబు మదంకితంబుగా

నాంధ్రీభాషాకౌశలంబు పచరించి రచియింపవలయు నని యభ్యర్థించిన నయ్యర్థి
పారిజాతంబునకు నభిమతం బొదవ నిట్లంటి.

క. శ్రీరంగరాజమహిమో । దారం బది కృతి దలంపఁ దత్పతి సుగుణో
దారుఁడు రాఘవుఁడఁటె శుభ । కారణ మగునిట్టిపొందు గలదే యెందున్. 22

క. చెప్పెదఁ గావ్యము రసములు । చిప్పిల వర్ణనల నింపు చిలుకఁగఁ బాకం
బొప్పతిలఁ జిత్రరచనలు । చొప్పడ శబ్దార్థఘటన సుకవులు మెచ్చన్. 23

వ. అని యమ్మహామంత్రిచింతామణిచేత నత్యంతబహుమానపూర్వకంబుగాఁ గర్పూ
రసమేతం బగుతాంబూలంబు గైకొని సమ్మదంబున నిమ్మహాపురాణకథ రచి
యింప నుపక్రమించితి నిట్టికృతినాయకునన్వయక్రమం బెట్టిదనిన.

మ. జగముల్ మూఁడు తలంపులోపల జనించం జేయువాగ్వల్లభున్
మిగులం గూర్మితనూజుఁగాఁ గనినలక్ష్మీనాథుఁ దెవ్వానికిన్
బాగ న్పొందన్ సుతుఁ డయ్యె నట్టిసుమహాత్మున్యం బ్రశంసింపఁగాఁ
దగదే కశ్యపసన్మునీంద్రుని విశుద్ధజ్ఞానని స్తంద్రునిన్. 24

క. ఆమునివంశసుధాంబుధి । సోమునికరణిన్ జనించె సురుచిరలక్ష్మీ
ధాముఁడు కేశవదేవమ । హామంత్రీశ్వరుఁ డుదారయశుఁడై వసుధన్. 25

క. అతని కతి భాగ్యలక్షణ । వతి మాదాంబికకు నుద్భవం బయ్యె జగ
న్నుతచరితుఁ డబ్జమిత్ర । ప్రతిమానుఁడు మాయిదేవవండితుఁ డెలమిన్. 26

క. అమ్మంత్రిమణికి బొమ్మా । యమ్మకు సుతు లిరువు రుదయ మై రఖిలజగ
త్సమ్మద కారు లుదారులు । సమ్మర్దితచటులకులశాస్త్రవీరుల్. 27

వ. వెలయుచుండ,

సీ. ఈప్రధానశ్రేష్ఠు కెనవచ్చు గనకాద్రి భవునిచేఁ దలవంపు పడక యున్న
నీసచివాగ్రణితో సమం బగు వార్థి యుఱ్ఱుచేతిమాత్రలో నడఁగకున్న
నీయమాత్యునిరహి కెక్కుఁ గల్పకశాఖి భూలోకమున వీటిఁబోక యున్న
నీమంత్రిమణికి జో డౌ మీనకేతనుఁ డంగవైకల్యంబు నందకున్న

ధైర్యగాంభీర్యదానసౌందర్యములను । నసఁగ నాశ్రితవిద్వదర్థార్థిబంధు
మిత్రసంతతభాగ్యలక్ష్మీవిలాస । బంధువుం డొప్పుఁ జాగయప్రభువరుండు 28

చ. అతులధృతిం దనర్చి విబుధాశ్రయమై క్షమఁ బూని భూమిభృ
త్తతి కతిమాన్యమై యచలతామహిమన్ వహిం కెక్కెయున్ జన
స్తుతుఁ డగుచాగయప్రభువుతో సరిగాదు సుమీ సుపర్వప
ర్వత మనదగ్ర కార్యమున వక్రత నొందుట దక్కనుండుటన్. 29

వ. తదనుసంభవుండు.

శా. శ్రీవిభ్రాజితుఁ డుల్లసద్గుణమణిశ్రేణీసుధాంభోధి వి
ద్యావాణీపతి యన్యరాజసచివోద్యద్వంశవంశాటవీ
దావజ్వాలి ముకుందపాదకమలద్వంద్వార్చనోత్సాహి యా
గోవిందప్రభుఁ డొప్పు బంధుజనచక్షుఃపూర్ణిమాచంద్రుఁడై 30

గీ. అయ్యమాత్యమణికి నంగనారత్నంబు । మాణికాంబకును సమగ్రబాహు
శౌర్యశాలి భాగ్యసంపన్నుఁ డుదయించెఁ । బరఁగ విశ్వనాథపండితుండు. 31

సీ. లక్ష్మీనృసింహలీలావైభవధ్యానబద్ధానురాగప్రసిద్ధబుద్ధి
శుంభద్విరోధిసంరంభసంస్తంభనక్షమతాసముద్యుక్తశౌర్యశక్తి
బంధువిద్వత్కవిప్రకరపాఠకనిత్యఫలితకల్పకశాఖ భాగ్యరేఖ
చక్రవాళోపరిస్థానరంగస్థలీనర్తనోల్లాసవిస్ఫూర్తికీర్తి
గాఁగ నేమంత్రి మెఱయు నఖండితప్ర । తాపసౌభాగ్యగాంభీర్యధైర్యమహితుఁ
డతఁడు గోవిందపండితసుతుఁడు ఘనుఁడు । విశ్వనాథుండు శుభగుణశాశ్వతుండు. 32

మ. హరి దుగ్ధాంబుధికన్యఁ జంద్రధరుఁ డయ్యద్రీంద్రపుత్రిన్ బురం
దరుఁ డింద్రాణిని బెండ్లియైనగతి నుద్యద్వైభవం బొప్పఁగా
వరియించెం దగఁ జాగయప్రభుఁడు శశ్వద్బంధుసన్మానత
త్పరతారూఢపతివ్రతాగుణకదంబన్ బ్రేమ దేమాంబికన్. 33

ఉ. వారలు ముప్పురం గనిరి వంశవివర్ధనులన్ మనోహరా
కారుల నిర్వికారుల జగన్నుతనిర్గలధర్మమార్గసం

చారుల నప్రతీపభుజసారుల శూరుల నర్థిలోకమం
దారుల వైరిదుర్మదవిదారుల ధీరుల సత్కుమారులన్. 34

వ. అందుఁ గ్రమంబున.

గీ. భవ్యచరితుండు నరసింహపండితుండు । భాగ్యవంతుండు విఠ్ఠలప్రభువరుండు
రాజ్యలక్ష్మీవిలాసుండు రామదేవ । మంత్రిమణియును నన నొప్పు మానధనులు. 35

క. అం దగ్రభవుని సురకరి। చందనమందారకుందశశధరసురభి
స్మందిరసిద్ధలయశుఁ డై । ప్పం దగు నరసింహదేవపండితు నెందున్ 36

సీ. అతులితైశ్వర్యరూపాతిశయంబుల నసమాంబకఖ్యాతి నంద మొంది
సుమహాత్ప్రతాపతేజోవిశేషంబులఁ జిత్రభానుస్ఫూర్తిఁ జెన్ను మిగిలి
విశ్వసంరక్షణవిపులధైర్యంబుల నవనీధరస్థితి నతిశయించి
యంచితదానమహాభాగ్యరేఖల రాజరాజప్రౌఢి నోజ మెఱసి
ధరణిఁ బెంపుమీఱె నరసింహపండిత । ప్రవరుఁ డమృతమధురభాషణుండు
సకలసుజనవినుతసద్గుణమణిమయ । భూషణుండు వైరిభీషణుండు. 37

క. అతనిసుతుఁ డఖిలజనహితుఁ। డతులబలాధికుఁడు హరిపదాంబుజసేవా
నిరతుఁడు మతిజితవాచ । స్పతి గోవిందార్యుఁ డెన్నఁబడు బుధసభలన్. 38

శా. వాహారోహణచాతురీతురగరేవంతుం బ్రతివ్యూహవా
ర్వ్యాహాటోపపటుప్రభంజనుని శశ్వద్దానకేళీసము
త్సాహున్ సాహసవిక్రమార్కుఁ గరిదంతక్షీరతారామరు
ద్గోహింరామలకీర్తిఁ జెప్పఁ దగు నాగోవిందమంత్రీశ్వరున్. 39

క. అతనిపినతండ్రి లక్ష్మీ । పతి నిత్యకృపాకటాక్షపరిణతభాగ్యో
న్నతుఁ డుభయవంశదీపకుఁ। డతులితనయశాలి విఠ్ఠలామాత్యుఁ డిలన్ 40

శా. దేవబ్రాహ్మణపూజనాభిరతు ధాత్రీగోహిరణ్యాదిదా
నావిర్భూతయశోవిశాలు జగదీశాభ్యర్చనాలోలస
ద్భావున్ బావనశీలు నాశ్రితహితప్రారంభనిత్యోర్జిత
శ్రీవిభ్రాజితు విఠ్ఠలేంద్రసచివశ్రేష్ఠున్ నుతింపన్ దగున్. 41

మ. పటుధాటీముఖజృంభమాణకలహప్రౌఢాగ్రసంఘాతవి
స్ఫుటరింఖాపుటకోటిఘట్టనపరిక్షుణ్ణక్షమాద్యద్విశం
కటసూళీపటలప్రశోషితమహాకర్ణాటసేనాసము
ద్భటపాథోనిధి విఠ్ఠలేంద్రుఁ బురణింపన్ మంత్రు లేరీ ధరన్. 42

సీ. చండదిగ్వేదండకాండధూర్వహమహీమండలోద్ధరణసమర్థ మగుచు
దుర్వారపరిపంథిసర్వసంపద్గర్వనిర్వాపణక్రియానిపుణ మగుచు
వేదాదివిద్యావినోదవిద్వజ్జనామోదాతిశయసముత్పాది యగుచు
జంభజిన్మదకుంభికుంభీనసాధీశశంభుభూభృద్ద్యుతిస్వచ్ఛ మగుచుఁ
బరఁగు నేమంత్రిభుజబలప్రకటశౌర్య। దానసత్కీర్తు లప్రతిమానమహిమ
నాతఁ డిమ్మడి సైపఖానాధిరాజ్య। భారధుర్యుఁడు విఠ్ఠలప్రభువరుండు. 43

క. ఆమంత్రిచంద్రునకు రమ। ణీమణి లీలాంబకును జనించె నుదార
శ్రీమంతుఁ డమితసుగుణ। స్తోముఁడు బాబాజిపండితుఁడు మొద మొదవన్: 44

సీ. వినుతసత్త్వప్రభావిభవసత్కాంతుల భీము రుద్ధాము సుత్రాము సోము
నైశ్వర్యచాపవిద్యానయోదయముల ధనుని రాఘవుని భార్గవుని ధృవుని
సౌందర్యసంగీతచాతుర్యజయముల మరుని దుంబురుని వాగ్వరుని నరునిఁ
జటులవిక్రమదానశక్తిరక్షణముల నహివైరి సౌరిఁ గ్రౌంచారి శౌరిఁ
బోలుఁ బరిపంథిధారుణీపాలసచివ। ఫాలతలభూరితరభాగ్యమూలవర్ణ
జాలనిరసనకరణసంశీలచరణ। సరణి బాబాజి భద్రలక్షణవిరాజి 45

ఉ. శ్రీజయభోగభాగ్యకులశీలవివేకకృపాగుణంబులం
దీజగతిన్ బ్రధాను లెనయే సురరాడిభరాజరాజతా
రాజతనూజరాజతధరాతులకీర్తికి విఠ్ఠలేంద్రుబా
బాజికి నాజిరంగపరిపాటితశాత్రవసైన్యరాజికిన్. 46

వ. తత్పితృవ్యుండు.

సీ. సతతప్రసన్నతాసదనంబు వదనంబు వినుతసత్యామృతవేణి వాణి
శరణాగతత్రాణసదయంబు హృదయంబు ఘనదానవైభవాకరము కరము
గురుధర్మకార్యానుకూలంబు శీలంబు సంపాదితస్వామిజయము నయము

హరిపదారాధనాయత్తంబు చిత్తంబు భూరిసౌభాగ్యవిస్ఫూర్తి మూర్తి
గాఁగ నేమంత్రి విఖ్యాతి గనియె నతఁడు । విక్రమాపాదితానేకవిమతదుర్గ
లబ్ధసామ్రాజ్యలక్ష్మీవిలాసభాసి । చాగయామాత్యరాఘవసచివవరుఁడు. 47

మ. చలనం బందక యూని యూని ప్రకటించం బోక నల్దిక్కులన్
గలఁగం బాఱక నీరసత్వమున కాగారంబు గాకుండ నేన్
దలఁపన్ గల్పకకామధేనుఘనచింతారత్నముల్ సాటియా
నలఘుత్యాగగుణాభిరాముఁ డగు రామామాత్యసింహంబు సోన్. 48

సీ. ఘోరఘోణాదిమఘోణిదంష్ట్రాచలావాసప్రయాసంబు నోసరించి
కమఠాధిపవ్యూఢకఠినకర్పరపీఠసంశ్రయక్లేశంబు జరపిపుచ్చి
చక్రీశ్వరక్రూరవక్త్రస్ఫుటాభోగనిరసనోద్యోగంబు నిస్తరించి
కుంభదుర్మదహరిత్కుంభికుంభస్థలావస్థానభేదంబువలనఁ బాసి
భోగభాగినియై మించె భూమిభామ । వర్తితానూనబహుతరవస్తుదాన
చతురముగఁ జాగదేవపండితకుమార । రాఘవామాత్యభుజశిఖరంబునందు. 49

సీ. శ్రీభోగధైర్యప్రభాభూరిధనములఁ జక్రీంద్రధరమిత్రసమితిఁ దనరి
త్యాగశుద్ధిక్షాంతిదీర్ఘగభీరతలను ఘననదీరాజవిఖ్యాతి నెసఁగి
భూతికశాధుర్యనీతికార్యంబుల శివభద్రసత్కవిస్థితిఁ దనర్చి
బలధర్మధైర్యశోభనమహత్త్వంబులఁ గరికాలనరదేవగరిమఁ బొదలి
వెలయుఁ బటుబాహువిక్రమవిజితవిమత । నృపసమానీతమణిరమణీహయాది
బహువిధోపాయనాంచితప్రాంగణుండు । రణజయోల్లాసి చాగయరాఘవుండు. 50

సీ. చటులసంధ్యానటత్పటిమధూర్జటిజటాఘటితగంగాఫేనపటలిఁ దెగడి
పూర్ణచంద్రాతపస్ఫురణసముద్ధూతదుగ్ధాబ్ధివీచిపంక్తుల నదల్చి
భారతీవక్షోజభారార్పితోదారకర్పూరహారరేఖల హసించి
చందనాచలమరుచ్చలితనిర్ఝరతరుప్రసవగుచ్ఛావలి భంగపఱచి
వెలయు నేమంత్రిశేఖరువిశదయశము । వాఁడు రణదివ్యబిరుదనిర్వాహకుండు
ప్రకటసంగ్రామనిష్కంపఫల్గునుండు । రమ్యవిభవుండు చాగయరాఘవుండు. 51

మ. ఒసఁగెన్ జాగయరాఘవుండు వినయం బొప్పన్ బ్రతిద్వాదశిన్
వసుధామండలిఁ గల్గువిప్రతతికిన్ వాంఛానురూపంబుగా

రసవన్మృష్టపదార్థజాలపరిపూర్ణం బైనయన్నంబు ను
ల్లసితానేకవిధాంబరంబులు ననల్పస్వర్ణనిష్కంబులున్. 52

వ. అయ్యమాత్యవరునకుఁ దగినపత్నీరత్నంబు. 53

ఉ. సైరణ భూమి భాగ్యమున సాగరసంభవ సర్వమంగళ
శ్రీరమణీయత న్గిరిజ శీలమునం దననూయ నిత్యగం
భీరత గంగ సత్యపరిపేశలభాషల వాణి వాఁగ నొ
ప్పారి సతీలలామ లకుమాంబ సమస్తగుణాకరంబయై. 54

క. శ్రీలక్ష్మియు నజ్జాతుఁడుఁ। బోలెను వారలకుఁ గలిగెఁ బుత్త్రుఁడు గుణర
త్నాలంకారుఁడు భాగ్యవి। శాలుం డగు నాగనాథసచివుం డెలమిన్. 55

సీ. సతతప్రసన్నుఁ డాచారసంపన్నుఁడు వినయాన్వితుండు వివేకశాలి
సుజనసేవితుఁడు భూసురకామధేనువు వితరణఖని జగద్ధితయశుండు
స్మితపూర్వభాషి లక్ష్మీనృసింహార్చనారతుఁడు సమస్తశాస్త్రప్రవీణుఁ
డార్యసమ్మతుఁడు నిత్యైశ్వర్యకలితుండు సంభృతగాంభీర్యశౌర్యధనుఁడు
చండకోదండపాండిత్యసవ్యసాచి। యశ్వరేవంతుఁ డసమబాహాబలుండు
ఘనుఁడు నాగయమంత్రిరాఘవునికూర్మి। సుతుఁడు శ్రీనాగనాథపండితవరుండు. 56

క. ఉరుతరవితరణగుణముల। సరి యాగదరు నాగనాథసచివునకు మరు
త్తరుసురభిధనదసురమణి। తరణిజశిబిశరధిసలిలధరబలిఖచరుల్. 57

వ. ఇట్టి విశుద్ధకులదుగ్ధార్ణవంబునకుఁ బూర్ణసుధాకరుం డగు రామదేవపండితమహాప్రధా
నరత్నంబునకును.

## షష్ఠ్యంతములు.

క. శ్రీనిత్యవిభవునకు ఘన। దానరవిప్రభవునకును దామరసాక్షు
ధ్యానానురాగరంజిత। మానసపద్మునకు విమలమణిసద్మునకున్. 58

క. చాతుర్యభోజునకు బహు। నూతనవిభ్రమవధూమనోజునకు జగ
ద్గీతగుణదివ్యబిరుద। ఖ్యాతునకును విఠ్ఠలేంద్రుననుజాతునకున్. 59

క. సింహతలాటాంకను కుప। సంహృతకర్ణాటకటకజననాథచమూ
రంహునకుఁ జారులతుగ। సంహాసునకు నమితభాగ్యసంపన్నునకున్. 60

క. బాహుబలభీమునకు ను। గ్రాహవరామునకుఁ బటుజవాధికతురగా
రోహణరేవంతున కతి। సాహసవంతునకు నమితసామంతునకున్. 61

క. మాఘవసతులితునకు శర। లాఘవపటుతావిశేషలక్ష్మణునకు దూ
తాఘవరమతికిఁ జాగయ। రాఘవసచివాగ్రణికి నిరతసద్గుణికిన్. 62

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా నారచియింపం బూనినయిప్పురాణకథకుఁ బ్రారంభం
బెట్టి దనిన.

## కథారంభము.

గీ. త్రిభువనైకపుణ్యదేశాగ్రగణ్య మూ। ర్జితపయస్సరోవరేణ్య మసమ
బహుళసుకృతిగత్నషణ్యము నైమిశా। రణ్య మొప్పు మునిశరణ్య మగుచు. 63

వ. మఱియు నప్పరమపవిత్రక్షేత్రం బతివిచిత్రకిసలయకుసుమఫలపలాశరుచిరరుచకనిచుళ
కరకకురునకవకుళలికుచపురఫలఫలినీతమాలకృతమాలదేవదారుహింతాలనారికేళపారిభ
ద్రభద్రదారుకారంభారంభామలకతిలకతృణరాజరాజధనపున్నాగనాగకేసరపాటలా
ఝాటలాశోకమధూకకదంబాదితరుకదంబశిఖర సుఖాసీనకలకంఠకాలకంఠకలాపిక
లాలాపకలితంబై లలితమాలతీలవంగ ఫలితావలీవలయితనికుంజపుంజపరిభ్రమద్భ్ర
మర మిథున మధుర ఝుంకార ముఖరితంబై సకలకాలసంఫుల్లహల్లకకమలకువలయ
కుముదసముదయానుమేయతోయస్వచ్ఛజలాశయశతసతతకేళీవిలోలమదకలకలహంస
చక్రవాకబకబలాకాదికానేకజలవిహగజాలకోలాహలవాచాలితదిక్చక్రవాళంబై పు
ణ్యజలపూర్యమాణమాణవకకరకరకాముఖపరిభవఘుమఘుమధ్వనిమనోహరంబై స
మిత్కుశకుసుమఫలపలాశభారవహనపటువటుకానుగమ్యమానాధ్యాపకషట్కమపవి
త్రితలంబై విశాలపర్ణశాలాభ్యర్ణకీర్ణవన్యధాన్యచర్వణగర్వితశాఖామృగచంక్రమణక్రి
యాలోకనాలోలమునికన్యకాకటాక్షకాంతికల్పితానల్పకువలయతోరణాలంకృతంబై
పృథులపీనభారమంథరరోమంథబంధురహోమధేనుస్తన్యపానసముత్సుక వత్స వదనవి
గళితపయఃఫేనబిందుకశాద్వలస్థలవిడంబితతారకాంబరతలంబై ద్యుమణిమణిశిలాతలర
క్తచందనోపలిప్తసప్తాశ్వమండలసమర్పితారుణకరవీరకుసుమవిసరాభిరామంబై యూప
జాతిపరిచయపత్రిపతత్రిపవనప్రజ్వలితజ్వలనహుతాజ్యధారాదళవితతపుణ్యగంధాను
బంధధూమధూపితాంతరిక్షంబై నికటకుంజకుటీర కుక్కుటకులోపయుజ్యమాన వైశ్వ
దేవబలికబళావశిష్టపులకాంకితప్రదేశంబై హరిహరపూజా సమయరణితఘంటాఘణఘ
ణారవశ్రవణహరిణార్ధకీలితగళితఘాసకబళంబై ప్రతిశాఖాగ్రలంఘనపటులశాఖామృగ

నికరకరపాతితపరిపక్వఫలరసపూర్ణాలవాలతరుమూలశీతలస్ఫటికశిలాతలాస్తీర్ణవిస్తీర్ణ మృగాజినాసీనమునిముఖ్యవ్యాఖ్యాయమానశాస్త్రవిస్తరంబై నందనారామం బునుంబోలె సురసాలోపశోభితంబై బృందావనంబునుంబోలెఁ గృష్ణసారసంచార పూతంబై నాకలోకంబునుంబోలె నమృతాహారస్థానంబై రాఘవసైన్యంబునుంబోలెఁ బనసనీలనలగజగవయగవాక్షోపలక్షితంబై గాంధర్వంబునుంబోలె శ్రుతిస్వరసంపూ ర్ణంబై సముద్రంబునుంబోలె బాడబాస్పదంబై వెలయు; నందుఁ గుసుమంబులయంద రజోవిజృంభణంబును భృంగంబులయంద మాతంగదానాభిలాషణంబులును నదుల యంద ప్రతికూలప్రవర్తనంబులును గిరులయంద సానురాగోద్రేకంబును దరులయంద శాఖాచలనంబును నాగంబులయంద భోగానుపాలనంబును శబ్దస్వరూపంబులయంద ధాతువిపర్యయంబును గాని యొండెడల నరయఁగ మెఱయు; నచట శిశిరకరకరనికర విశదకేసరికిశోరకేసరంబులు సరసబిసాంకురశంక నొండొండతుండంబులఁ బుడుకు శుండాలంబులును శుండాలగండమండల కండూనిరసనమసృణంబు లగునరాళకరాళ నఖరశిఖరంబులంగలచిత్రకాయంబులును జిత్రకాయకుటుంబినీతను స్తనస్తన్యపానపర పుష్టాంగంబు లగుకురంగలోకంబులును గురంగడింభంబులంగూడి చెరలాడురేచులును, రేచుగూనల నేచినమక్కువం బ్రక్కల డాఁచుబిడాలంబులును, బిడాలంబులపోరలు పారలం దెరలకమరగి తిరుగుగిరికలును, గిరికానికరంబులనిజభోగంబులంబొదివి యను రాగంబొసఁగునాగంబులును, నాగంబుల కొండరాకుండ విరివిగలపురులు విచ్చి చేరఁ వచ్చుబుషిపర్ణన (?) మయూరంబులును గలిగి యుల్లసిల్లు నందు.

క. ద్వాదశవార్షికసత్త్రము మోదంబున శౌనకాదిమును లొనరింపఁ
గాఁ దద్విలోకనోత్సుకు లై దివ్యక్షేత్రవనమహాచలవాసుల్. 64

సీ. పల్లవారుణజటాభారు లారచితత్రిపుండ్రాభిరాములు భూతిలిప్త
సర్వాంగు లుజ్జ్వలస్ఫటికాక్షసూత్రులు రుద్రాక్షభూషణరుచిరు లమరఁ
బుణ్యతీర్థోదకపూర్ణకమండలు లజినోత్తరీయు లత్యంతమృదుల
పరిధానవల్కలపరిధాను లభినవదండపాణులు దీప్తదహనతేజు
లలఘుదివ్యతపశ్శక్తికలితు లఖిల వేదవిద్యారహస్యసంవేదు లసమ
సవనకర్తలు సంయమీశ్వరులు వచ్చి రలమి శిష్యప్రశిష్యసమేతు లగుచు. 65

చ. వనజభవానుభావు లగువారల నందఱఁ జూచుకోర్కి సౌ
మ్యనమునఁ దిక్కటిల్ల బుధమాన్యుఁడు సాత్యవతేయశిష్యసం

దనుఁ డగురోమహర్షణుఁడు దాఁ జనుదెంచిన నమ్మహాత్ము ల
యయ్యనఘునిఁ గాంచి యిట్టులని రాదరమేదురపామభాషలన్. 66

క. ఏకడనుండి యిపుడు నీ, రాక సుధీవర విచిత్రరమణీయకథా
నీకప్రసంగ మేమే, నాకర్ణింపంగఁ గలిగె ననుదిన మింకన్. 67

చ. అనవుడు సూతసూతి వినయంబున వారలతోడ నిట్లనుం
జనకమహీతలేశ్వరునిసత్రమహోన్నతిఁ జూచువేడుకం
జని యటనుంటి నిన్నిదివసంబులు తార్క్ష్యపురాణసత్కథా
వినుతసుధాసరిద్విపులవీచిక లుల్లము నిల్ప నాఁగినన్. 68

వ. అమ్మహాపురాణంబునందు.

క. సారంబై మోక్షపదా, ధారంబై పుండరీకదళనయననిజా
గారంబై మహిఁ బరఁగిన, శ్రీరంగమహాత్త్వ మతివిచిత్రము దలఁపన్. 69

గీ. అనిన హరిచరణభక్త్యదివ్యానసక్తి, చిత్తజలజాతమును వికసింపఁజేయఁ
దనుఁ దదీయకథాంశవిస్తార మడుగఁ, జెలఁగి వారల కిట్లని చెప్పె నతఁడు. 70

ఉ. అమలచరిత్రులార వినుఁ డమ్మిథిలాపురి నధ్వరోత్సవం
తమున మునీశ్వరానుమతుఁడై తను వేఁడెడినాగదంతసం
యమికిఁ బరాశరాత్మజుఁడు దాత్తకథాపరిపాటిఁ బుణ్యతీ
ర్థములును బుణ్యభూములు ముదంబునఁ దెల్పఁగఁ బూని యిట్లనున్. 71

చ. త్రిభువనధర్మరక్షణధురీణవిచిత్రచరిత్రుఁ డిందిరా
విభుఁ డెచటన్ వసించు దగువేళల నెందుఁ జరించు నేయెడన్
శుభమతి నాదరించు నెటఁ జూచుఁ గృపాన్వితదృష్టి నేమిటం
దభిరతి గల్గియుండు నివి యన్నియుఁ బుణ్యతరప్రదేశముల్. 72

క. హరిచరణకమలరేణువు, పరమాణువు సోఁకినంతఁ బావనతరమై
కరము నుతికెక్కు సలిలము, తిరముగ నధికంబు సకలతీర్థంబులకున్. 78

చ. మురహరపాదపంకజసముద్ధతమై పెనుపొందెఁ గాదె శం
కరవిలసజ్జటాకలితకైరవబంధుకళామరీచులన్
వరనిజవీచులన్ నెఱయ వన్నియ కెక్కు త్రిలోకపావనీ
కరణధురీణతన్ గగనగంగ తరంగిణులందు మేటియై. 74

వ. మఱియును.

సీ. కలుషపంకజకలికాతమి గౌతమి సకలసజ్జనమాన్య జహ్నుకన్య
జంతుసంతతమనశ్శర్మద నర్మద శమితతాపత్రయపవన యమున
శ్రితసాధుజనలబ్ధజీవిక దేవిక సత్యసంవిద్భోగ చంద్రభాగ
సతతజప్తాచలాశని భవనాశని దూరీకృతక్షుద్ర తుంగభద్ర
బహులసౌభాగ్యదానసంపన్న పెన్న। భగ్నదుర్మోహపాశ విపాశ యనఁగ
భువిఁ బ్రసిద్ధికి నెక్కిన పుణ్యనదులు। హరికి లీలావిహారయోగ్యములు గావె. 75

మ. విను మీమాటలు వేయు నేటికిఁ దపస్విశ్రేష్ఠ గోవిందశో
భనలీలాచరణక్రియాకలితసంబంధానుసంబంధబం
ధ్యనుబంధిక్రమయోగయోగ్య మగుభవ్యద్రవ్యలేఖంబుతో
నెన గా వన్యపదార్థకోటులు నసంఖ్యేయప్రభావంబునన్. 76

సీ. హరిదివ్యనామధేయామృతం బింపారఁ జెలఁగి యాస్వాదించుజిహ్వ జిహ్వ
గోవిందకల్యాణగుణవిశేషంబులు పలుమాఱుఁ దలపోయుతలఁపు తలఁపు
కమలాక్షునిత్యమంగళమూర్తివిభవంబు సొంపార వీక్షించుచూపు చూపు
ఫణిరాజతల్పుశ్రీపాదపద్మంబులు చేరి యర్చనసేయుచేత చేత
వాసుదేవప్రియంబైన వ్రతము వ్రతము। దైత్యభేదినుపాసించుతపము తపము
శౌరి నారాధనముసేయుజపము జపము। విష్ణుపదభక్తి సమకొల్పువినికి వినికి. 77

సీ. పటుతరభవరోగపరితాపములఁ బాప నబ్జాక్షుసేవ దివ్యౌషధంబు
అంచితజ్ఞానమహానిధానముఁ జూప నచ్యుతభక్తి శుద్ధాంజనంబు
దుర్వారభయములు దొడరకుండఁగఁ జక్రపాణిసంస్తుతి వజ్రపంజరంబు
ఇష్టార్థఫలసిద్ధు లెసఁగింప హరినామపఠన మంగళకల్పపాదపంబు
విపులదుర్మోహతిమిరంబు విరియఁజేయ। నరకశమనునిపూజ సూర్యోదయంబు
అనిమిషానందలీలల ననిచి మనుపఁ। గమలనాభునిపదతీర్థ మమృతసరము. 78

క. కరణత్రయకృతపాపా। వరణముల హరింపఁజేయువారికి మురభి
చ్చరణసరోరుహసతత। స్మరణము కా కరయ నెందుశరణము గలదే. 79

గీ. అఖిలలోకములకు నక్షయానందసం। భూతికారణంబు పుండరీక
నయననామకీర్తనంబ యీ యర్థంబు। నిఖిలవేదశాస్త్రనిశ్చితంబు 80

క. కావున ఘనదురితావిల । భావుల కెందును ముకుందపరిచితతీర్థా
ప్లావము దక్కఁగఁ జక్కన । పావనత ఘటింప నొండుపాయము గలదే. 81

గీ. అనిన నాగదంతుఁ డనఘ తీర్థప్రభా । వమునఁ దలఁచి చూడ వానివాని
కవియ యెక్కువైనయట్లుండు నిం దెద్ది । సకలపుణ్యతీర్థసారతరము. 82

శా. ఏతీర్థంబు దలంచినన్ వినిన నన్వేషించినన్ జూచినన్
బ్రీతిం జేర్కొనినన్ దురంతదురితాపేతాత్ములై నిర్జర
వ్రాతప్రార్థితనిత్యసౌఖ్యయుతులై వర్తింతు రత్యంతవి
ఖ్యాతిన్ మానవు లట్టితీర్థ మెఱుఁగంగాఁ జెప్పవే నావుడున్. 83

వ. పరమజ్ఞానపరిపాకపరిచితపరాపరవివేకపారాయణుం డగుబాదరాయణుండు నత
పోధనసత్తమున కిట్లనియె. 84

క. శుభగుణనిధి యగురఘుకుల । విభుకృప ననపాయుఁ డగుచు వెలసినదితిజ
ప్రభుచే నానీతుండై । త్రిభువనసంస్తుత్యనిత్యదివ్యస్ఫూర్తిన్. 85

శా. రంగత్కేతువిచిత్రతోరణమణిప్రాసాదవప్రప్రభల్
నింగిం బర్వ భుజంగతల్పునకుఁ గేళీసద్మమై యొప్పుశ్రీ
రంగం బేతటినీతటిన్ మెఱయుఁ దా రమ్యోత్సవశ్రీనటీ
రంగంబై యది వో జగంబుల నదీరత్నంబు వర్ణింపఁగన్. 86

సీ. ఏయేటినడుఁదిన్నె నేప్రొద్దుఁ జలిగొన్న సికతాతలంబులఁ జెలఁగి చెలఁగి
యేతరంగిణి నించుకించుక వికసించుక్రొత్తమ్మితావులఁ గొసరి కొసరి
యేనదీక్రీడల నెసఁగురాయంచలకలకలంబుల కాత్మ నలరి యలరి
యేసరిత్తటమున నేచినకల్పక మేదురచ్ఛాయల మెచ్చి మెచ్చి
నేఁడు నొకనాఁడుఁ బాయఁ డన్నాఁడు శౌరి । యతిమనోహారి నిశ్శ్రేయసానుకారి
వివిధతాపనివారి భూవినుతవారి । కలితకావేరి భవకరికలభవైరి. 87

వ. మఱియును నన్నదీప్రవాహరత్నంబు నాయతనప్రవర్ధమానసుధాసమానపానీయపూర
పారంబు లగునారికేరంబులును, గమలభవకామినీకపోలపాళికాసవర్ణపరిపూర్ణరాగ
కరనాగవల్లీవేల్లితాభోగంబులగుపూగంబులును, మృదుముదితపరిమళపరిజ్ఞానసంకేత
కంబు లగుకేతకంబులును, జగజ్జయప్రయాణప్రవణపంచబాణప్రబలబలధూళీధూసరం
బు లగుకేసరంబులుఁ గలనాగకేసరంబులును, గవలయాకుల విలీనమదకలకలవింక

కలకలముఖరశిఖరశిరోవళినటనారంగంబు లగునారంగంబులును, ధారాధరసమయధారాళమధుగమధురసధారాసారకలికాకదంబంబు లగుకదంబంబులును, వనదేవతాచరణమణిమంజీరఝుళఝుళధ్వని మగ్నసూచకశ్రవణాళిగ్మరీమర్మరస్వనసముత్తాలంబు లగుతాళంబులును, బరిపక్వఫలరసమాధురీరమాధరీకృతసురసాలంబు లగురసాలంబులును, దరుణతరణికిరణప్రసరణభయపలాయితబంధురాంధకారసందేహమూలబాలప్రవాళరుచినిచయరచితకృతజీమూతమూలంబు లగుతమాలంబులును, మేదురామోదముదితాయమానమానసమానవనికాక్రమేయ (?) ప్రవర్ధితపులకంబులై వనీముఖతిలకంబు లగుతిలకంబులును, బ్రచలితపరిస్ఫుటితఫలపరిమళప్రశంసాధరాధికవాఙ్మనసంబు లగుపనసంబులును, సుధారసపూరంబు లగుతీరంబులును, దళితసౌగంధికమణిబంధురప్రభాపటలపాటవపాటచ్చరచటులచంచూపుట పాటితమృణాళనాళమరాళతరళతరగరుదుదితసమీరసమీరితంబులై రంగరమణమంగళపూజాసమయసముచితచతురజలదేవతాంజలిపుటసముత్క్షిప్తపుష్పావహాశుభాకరంబు లగుశీకరంబులును, బరస్పరసంపాతకంపమానసంఫుల్లహల్లకవిసరదున్మదభృంగంబు లగుభంగంబులును, సేవాపరీణతవరుణకన్యకాకరసరోజవీజ్యమానవిస్ఫుమరచమరవాలశంకాలవాలంబు లగుకల్లోలంబులును, జలకేళీలోలబాలానువతటీపటీరపంకప్రవర్ధమానంబు లగుఫేనంబులును, ముహుర్ముహురున్మజ్జనప్రవణఫణిఫణాముక్తాఫలానుగుణగణనాత్యద్భుతంబు లగుబుద్బుదంబులును, నిశాంతఃకృతావగాహపావనదేహజనసందోహనివర్తితభావిభవావర్తంబు లగునావర్తంబులును, వారిప్రసారతీరగారుత్మకమత్తమయూరరేఖామతల్లిక లగుశైవాలవల్లికలును, శశికలవిశదవిశాతవనవరాహదంష్ట్రాముఖవిఖండితపర్యస్యముస్తకోశిరపరిమళప్రాయంబు లగుతోయంబులును, నిరంతరనిరంతరాయనారాయణవినీతధ్యానపారాయణపరమయోగీంద్రపరిచితంబులై యనల్పకర్పూరపరాగపూగనిర్మలినంబు లగుపులినంబులును, సమీపాశ్రమనివాసితాపసకుమారపరిక్షాళితమృదువల్కలకషాయరసపాటలంబు లగునికటస్ఫటికశిలాతటంబులును, దంతావళకలభదంతకాంతిదంతురితశశికాంతసోపానసులభప్రవేశంబు లగుజలావతరణప్రదేశంబులును, కలరవానుమేయకలహంసకులకువలయంబు లగుకువలయంబులును, ఘనఘనాఘనఘనరసపానసమయసముద్గమఘుమఘుమధ్వనిసమున్మేషంబు లగుఘోషంబులును, సంకల్పభవసుఖానుభవసంకల్పనిలింపదంపతికల్పితకల్పకిసలయానల్పతల్పమంజులంబు లగువంజులకుంజంబులుగలిగి కలశాబ్ధియునుబోలె నమృతానందకారణంబై, రణరంగంబునుంబోలె ననేకశతపత్రవిసరంబై, సరసిజాసనాకపోలంబునుంబోలె దర్పసారమకరీకాంతంబై, కాంతా

రంబునుంబోలె నుద్దండపుండరీకభాసురంబై, సురాచలశరాసనురేఖయుంబోలె నిర్దా లితానేకపురసాలపలాశబలంబై, బలానుజవిక్రమంబునుంబోలె నవనయితనరకవిగ్రహంబై గ్రహప్రచారంబునుంబోలెఁ గృతతారకోల్లంఘనంబై, ఘనాగమనంబునుంబోలె నుదంచితలోహితంబై, లోహితాంశుతేజంబునుంబోలె నపహృతతమోవ్యాసంబై, వ్యాసవాగ్విలాసంబునుంబోలె నభివ్యాప్తిసుధీవరజాలంబై, జాలపాదంబునుంబోలె నకలుషమానసభాసమానంబై, మానవపంచాననువాననంబునుం బోలె సహస్రదంష్ట్రిజ్వాలంబై, జ్వలనజ్వలితంబునుంబోలె సంతర్పితగోచరంబై, చరమాచలంబునుంబోలె నవిక్రాంతవేగాక్రాంతకటకంబై, కటకంబునుంబోలెఁ గలితసువర్ణపద్మరాగంబై, రాగంబునుంబోలె శ్రుతిప్రసిద్ధంబై, సిద్ధరసంబునుంబోలె శమితపరోరుతాపంబై తాపసాశ్రమంబునుంబోలె దూరీకృతోపప్లవంబై, ప్లవాక్షీణంబయ్యును బరమహంససేవితంబై, సముదితాబ్దంబయ్యును ఘటితచక్రంబై, తరణిమండలమండితంబయ్యును బ్రవృద్ధకుసుమంబై హరివిహారస్థలంబయ్యును సమదనాగంబై, లక్ష్మణానందంబయ్యును మేఘనాదాభ్యుదయంబై, ఆకాశానువర్తియయ్యును సుకృతిస్తుతిపాత్రంబై, యతులస్పర్శంబయ్యును బహువారాగతవీప్రకరకలితంబై యర్జునశరపాతభయంబయ్యును సింధురాజప్రీతికరంబై విలసిల్లు వెండియు.

ఉ. ఉన్నతరంగధామలలితోభయపార్శ్వములం బ్రసన్నమై
యున్నది యబ్ధిపాలుఁ గలితాయతకంకణమౌక్తికద్యుతి
చ్ఛన్నమృదుప్రవాహములు సాఁచి చిరాగతుఁ బ్రాణనాయకుం
జెన్నుగ నిందుకాఁగిటికిఁ జేర్చి చెలంగువృగాత్మకైవడిన్. 89

చ. అనుపమదివ్యబోధమహితాత్ములు తత్తటినీతటంబులం
దనిశము నిశ్చలస్థితికినై చరరూపము లుజ్జగించి నే
ర్పున వివిధాచరాకృతులఁ బూనఁగఁ గోరుచు రంగధామముం
గొనకొని పుట్టుచుందురు ముకుందపదార్పితమానసాబ్జులై. 90

క. ఈవసుమతిఁ గలతీర్థము । లావాహిని సెల్లప్రొద్దు ననుకూలమునై
సేవింపుచుండుఁ బ్రవిమల । భావంబున నంబురాశిపర్యంతముగాన్. 91

క. సురనరయక్షాసురముని । గరుడోరగసిద్ధసాధ్యఖచరాదులు త
ద్వరతీర్థసార్థసేవా । పరులై కనిరభిమతార్థఫలసంసిద్ధుల్. 92

సీ. అది విను సంయమిప్రవర స్వర్గద్వార మనునది దేవగణైకసేవ్య
మాప్రదేశమునఁ బిండప్రదానాదులు పితృకోటి కతుయప్రీతిదములు

తిలధేనుదాన మతిప్రశస్తము హరిసేవ కైవల్యలక్ష్మీకరంబు
తత్సరమునఁ బ్రసిద్ధము పుండరీక మచ్చో నొప్పు ఘనవటక్షోణిజాత
మదివ్యాప్తి కేశవావాస మాసమీప
మందుఁ బెంపొందుఁ గోశలాఖ్య శైనశైల
మచటఁ దప మొండి కాద ము స్నాకపాలి
బ్రహ్మహత్యామహాఘంబుఁ బాసి వెలిఁగె 93

మ. కల దయ్యద్రికిఁ దూర్పుచక్క వకుళాఖ్యం బైనతీర్థంబు ము
న్నలజంభారి సురాధిపత్యహరితుండై తత్ప్రతీరంబునం
బలివిధ్వంసిగుతించి భక్తిఁ దప మొప్పం జేసి యాకల్పని
శ్చలలోకత్రయరాజ్యలక్ష్మిఁ దనరెన్ సంప్రీతచేతస్కుఁడై. 94

గీ. అనిన నాగదంతుఁ డనఘశ్రీరంగంబు దితిపులోద్భవుండు తెచ్చె నంటి
వది కవేరకన్య కాధ్యర్ధ్యవంబున నెచట నునిచె నానతిమ్ము నాకు. 95

క. అనవుడుఁ బరాశరాత్మజుఁ । డను నతనికి వకుళతీర్థ మని యిప్పుడె చె
ప్పినయాచటికి దక్షిణమున । ననఘ కల దనంతశయన మనుతీర్థ మొగిన్ 96

సీ. ఎయ్యెడ లక్ష్మీసమేతుఁడై వసియించు నాదినారాయణుం డవిరతంబు
నెచటిదోయస్పర్శ మింత గల్గినమాత్ర నరులు పాపశ్రేణిఁ బరిహరింతు
రచ్చోట నొకదివం బేని నిల్చినవారి కపునర్నరత్వమహత్త్వ మొదవు
నెందుఁ దపస్స్థితిఁ జెందిసిద్ధర్షులు బహులతాగుల్మరూపముల నుందు
రేనెలవునందు దళమాత్ర మైనఁ దునుమ । బ్రహ్మహత్యాసమం బగుపాప మొదవు
నేస్థలంబునఁ గీటాదిహింస సేసి । పతనమొందుదు రతిపుణ్యభావు లైన. 97

మ. సహజజ్ఞానయుతంబులై సరసభావల్ ప్రీతిఁ జేతస్సుఖా
వహముల్ గాఁ దగఁ బల్కుచున్ మెలఁగు సత్త్వస్ఫూర్తి నెందేని న
య్యహిమార్జాలవృషప్లవంగనకులవ్యావిశ్వవిద్విట్కురం
గహరివ్యాఘ్రమదేభశల్యరురుఖడ్గక్రూడభేరుండముల్. 98

క. ఎందు వసించును జేతన । బృందం బాధ్యాత్మికాదిపీడావకులం
బొందక యాపద గలఁబడిఁ । బొందక యాఁకటఁ గృశించిపోవక యులమిన్. 99

సీ. గతవర్తమానైష్యత్కాలవేదులు సర్వకామగంతులును సంఘటితభూత
హితులు సర్వజ్ఞు లహీనసత్త్వులు దుఃఖరహితులు జ్ఞానవైరాగ్యయుతులు
బ్రహ్మజ్ఞు లధిగతబ్రహ్మతేజులు పరస్పరమిత్రు లతిపుణ్యపరులు సములు
నిత్యశుద్ధాత్ములు నిర్మలుల్ నిత్యులు నిర్మముల్ సత్యులు నిత్యతృప్తు
లనఘు లవికారు లద్వంద్వు లనుపహతులు। సుప్రసన్నులు సుముఖులు శుభవచనులు
నై చరింపుదు రెందు నరామరాసు। రాదు లిచ్ఛాశరీరత్ము లగుచు సెప్రుదు. 100

మ. వినవేర్పుం జెవిటైన మూఢుఁ డయినన్ విద్వాంసుఁ డౌ వెఱ్ఱియై
నను విజ్ఞాని యగున్ ఖలుండు నతిశాంతస్వాంతుఁ డౌ వక్రుఁడై
నను సౌమ్యాకృతిఁ దాల్చుఁ బాపరతుఁడైనన్ దోషనిర్ముక్తుఁ డౌ
ఘనపుణ్యం బగు నీప్రదేశము చేరంగాఁ గల్గుమాత్రంబునన్. 101

వ. అట్టిసకలకళ్యాణకారణంబై తీర్థవరేణ్యంబైన పుణ్యక్షేత్రంబున దైత్యకులపవిత్రుం
డైన విభీషణుం డాదిశ్యధాము నందు నిలిపె నాఁటనుండియు 102

క. శ్రీమెఱయునుభయకావే। రీమధ్యమునం దనర్చు శ్రీరంగము తే
జోమహిమ చంద్రపుష్కరి। ణీమహితతటంబునందు నిగమస్తుతమై. 103

శా. ఏపుణ్యాయతనంబుఁ జొచ్చి నియతిన్ వీక్షించుపుణ్యుల్ మహా
పాపశ్రేణి జయించి నిర్మలమతిం బ్రాపించుసుజ్ఞానులై
తాపంబుల్ వెడఁబాసి దండధరదూతవ్రాతముం దోలి యా
వ్యాపన్నం బగుసత్పథంబునఁ దుదిన్ వర్తింతు రత్యున్నతిన్. 104

క. కృతనిష్ఠీవనపతిత। ప్రతిభాషాన్వితదురుక్తిపతనాదుల స
న్మతి శ్రీరంగముఁ జేర్కొను। నతఁ డఘములఁ బాసి పొందు నచ్యుతపదమున్. 105

గీ. అతివిదేశవాసులైన నన్యద్వీప సలయులైన భక్తి నిర్వటిల్లఁ
జేతు లెత్తి మ్రొక్కి శ్రీరంగమునకు మరి భజించి కాంతు రభిమతముల. 106

మ. అరవిందాక్షుదినోపవాసము తులస్యాస్వాదముం జంద్రపు
ష్కరిణీస్నానము రంగమందిరలసత్సందర్శనానందమున్
వరగీతాపఠనంబు గల్గునొకజన్మం బందు నెవ్వారి క
ప్పురుషుల్ ప్రాప్తసమస్తకాములు జగత్పూజ్యుల్ ముకుందాకృతుల్. 107

క. చాతుర్మాస్యస్థితిఁ బ్ర । ఖ్యాతశ్రీరంగసీమఁ గల్గినసుకృతం
బాతలఁ బెక్కుతీర్థంబుల । నే తెఱఁగున సంభవింప దెవ్వాఁ డున్నన్. 108

క. శ్రీరంగభవనమున ముద । మారఁగ నొకరాత్రి యున్న యట్టిఘనులు దు
ర్వారమహాపాతకతతి । పారంపర్యములవలనఁ బాయుదు రనఘా. 109

క. గురుమతి శ్రీరంగమునకు । నరిగినసుజనులందు భక్తి నతనికి నన్నం
బరసి యిడునతఁడు లోకో । త్తరచరితులు దుహిణబింబదళనస్ఫురితుల్. 110

క. ప్రతిదినమును దిలపాత్ర । త్రితయము దానంబు చేసి ధృతిఁ బొందుసమం
చితసుకృతఫలము సమకొను । నతులశ్రీరంగమందిరాలోకమునన్. 111

వ. అందు హేమదానం బతిప్రశస్తంబు భూదానం బంతకంటె నధికంబు గోదానవస్త్ర
దానంబు లత్యుత్తమంబు లివియన్నియు 112

క. తమతమపట్లన నిత్య । త్వమునకు మదిఁ గలఁగి దేవతలు రంగక్షే
త్రమునందుఁ బొందుమనుజ । త్వముఁ గోరుదు రందు ముక్తిధామం బగుటన్ 113

క. రవి కన్యాగతుఁ డగున । య్యవసరమునఁ గృష్ణపక్షమందులఁ జేతో
భవతిథిఁ బితృకృత్యమునకు । నవుముఖ్యవ్రతము మాఘమందును జెల్లున్. 114

సీ. తమయన్వయమున నుత్తముఁ డొకఁ డైనను జనియించి శ్రీరంగమునకు నరిగి
యచటఁ గావేరీజలావగాహ మొనర్చి యగ్రజన్ములకు నాహారమైన
నత్యల్పదక్షిణ యైనఁ దిలోదకమైన ధేనుగ్రాసమైనఁ దనకు
గలిగినరీతిఁ దక్క కహరిసన్నిధి మమ్ము నుద్దేశించి యిమ్మనొసఁగు
వాఁడు గల్గునొకో యని వారివారి । యెదురు చూచుచునుందురు పెల్లప్రొద్దు
నమరలోకసుఖంబులపోనిఁదలఁచి । పితృసమాజంబు లక్షయస్థితులకొఱకు. 115

గీ. ఒక్కనదిఁ గ్రుంకువేళ వేఱొక్కనది ను । తించు టఘకారి శ్రీరంగతీర్థవరము
చంద్రపుష్కరిణీజహ్నుజలము సకల । నదులయందును దలఁపఁ బుణ్యము ఘటించు. 116

వ. విశేషించి మాఘమాసంబునఁ జంద్రపుష్కరిణీస్నానంబును, శ్రీరంగదర్శనంబును
క్షేత్రోపవాసంబును నతిదుర్లభంబులు. ఈ నదీసరోవరక్షేత్రదేవతాప్రభావంబుల
యం దెవ్వరు సందేహింతు రట్టిదుష్కర్ముల ధర్మనిరతుం డగుభూపాలుండు చం
డాలుగ సంగతి మనుపవలయు నని మఱియును, 117

మ. శ్రుతికోటిం బ్రణవంబు వైష్ణవరహస్తోత్రంబు లం దంబికా
పతి పెన్నేటుల గంగ తెల్పుగమిలోఁ బద్మాక్షుఁ డెబ్భంగి న
న్నతకీర్తిన్ విలసింతు రట్టు మహిఁ బుణ్యక్షేత్రజాలంబులోఁ
గతపాపౌఘనికాయమై వెలయు రంగక్షేత్ర మాకల్పమై. 118

క. శ్రీరంగమునకు నరుగుఁడు । శ్రీరంగం బనుచు జపము సేయుఁడు మదిలోఁ
శ్రీరంగముఁ దలఁపుఁడు భవ । భారముల హరింపనోపుఁ బగలును రేయిన్. 119

ఉ. అంచితరంగమండలమహాత్త్వము వైష్ణవకోటి కింపు రె
ట్టించ లిఖించి యిచ్చినఁ బఠించిన విన్న ధరించినన్ జనుల్
సంచితపుణ్యులై సకలసంపదలం బెనుపొంది కీర్తి దీ
పించి సుఖించి పొందుదురు ప్రీతి ముకుందపదస్థితిం దుదిన్. 120

చ. అనవుడు నాగదంతుఁడు ప్రియంబున సాత్యవతేయుతోడ నో
మునివర దివ్యదేశముల ముఖ్యతరం బగు రంగమండలం
బునఁ గడు నద్భుతంబు లగుపూర్వకథల్ విన వేడు కయ్యెడున్
ఘనదయ నట్టివెల్ల నెఱుఁగన్ రచియింపుఁడు నాకు నావుడున్. 121

క. నిగమవ్యాసవిశారదుఁ । డగుముని నీ వడిగినట్టి యాశ్చర్యకరం
బగు నితిహాసము గల దది । తగ విను మని పలికె నాగదంతునితోడన్. 122

చ. కలరు సుబోధసత్త్వ లనఁగా మును లిద్ద ఱవారితని
ర్మలచరితుల్ చతుర్ముఖసమప్రతిభుల్ బహుధర్మమర్మవే
దులు ఘనదివ్యబోధసహితుల్ మహితుల్ రజనీముఖజ్వల
జ్జ్వలనవిశాలనేత్రు లనివారితభూరితపోబలాధికుల్. 123

క. వారఖిలభువనవిస్మయ । కారణదృష్టఘోరనిష్ఠఁ గదలక గంగా
ద్వారమునఁ దప మొనర్పఁ బ । లారాతి దరాతికంపితాత్మకుఁ డగుచున్. 124

వ. నిరంతరంబును దదంతరాయంబునకు నుపాయంబు లాచరింప నానిలింపపతితోడ రాయిడింప నొల్లక యెడఁబాసి వాసిగలతీర్థంబు లాడు వేడుక నిలావలయంబు గలయం జరింపుచు వచ్చి వచ్చి పురోభాగంబున. 125

మ. సతతానేకమునీంద్రబృందకృతపూజావందనం జందనా
గతమందానిలకందలీకృతతరంగస్యందనన్ దీగసం

గతమాకందమకరందబిందుసహితార్కస్యందనం గాంచి ర
థ్యాతు లింపొందఁ గవేరనందనఁ ద్రిలోకానందసానందనన్ 126

క. కని తదవేక్షణలోలత । ననిమిషత వహించి యద్భుతానందంబుల్
మనమునఁ బిరిఁగొనఁ బులకిత । తనులై ప్రణమిల్లి భక్తితాత్పర్యములన్ 127

సీ. గురుధర్మచరితానుకూలంబు కూలంబు సంక్షాళితాఘకజ్జలము జలము
ఘనముక్తినృత్తరంగములు తరంగములు వినీతకుజనభైరవము రవము
విహతతాపత్రయోద్వేగంబు వేగంబు లలితభక్తానందలహరి లహరి
కుశలప్రశంసానుగుణములు కణములు విధ్వస్తదుర్గ్భవీచి వీచి
నిరుపమజ్ఞానసంపద నెఱపు నెఱపు
భరితబహుమోహపటలిఁ బో నఱువు నఱువు
గాన నెన గాన మీనదితో సమాన
మహిమ వహిఁ నెక్కుతీర్థసమాజములను. 128

క. అని మఱియుఁ బలుదెఱంగులఁ । గొనియాడి తదీయవారిఁ గౌతుకంబున ము
న్కొని యాడి దివ్యతేజో । ఘనులై ఘనవిరహతాపఘనులై రెలమిన్. 129

క. క్షితిఁ గలనదులందలివి । శ్రుత యగు కావేరినీరు సోఁకిన మాత్రన్
ధృతి సద్గతిఁ గనుఁదిర్య । క్తతి యయినను జెప్పనేల తక్కనవారిన్. 180

గీ. ఆవిధంబునఁ గృతకృత్యులై తదీయ । తీరవనభూమి లోకకొన్ని దినము లుండి
వారలొక నాడు సంధ్యాభివందనార్థ । మై నిశావధిఁ గావేరి కరుగుటయును 131

వ. అమ్మహావాహినీప్రభావం బెడనెడఁ బొడవడినయెడలఁ బొడవడునిసుకపిదపిదవి
పదనెగసి కూలుదరులును, దరులుగూడినఁ బెల్లుకొనఁ దాఁకుతెల్లున మొదళ్లు బలువద
లు వదలుమూలంబుల తెఱపుల నఱముతి బయలుపూరంబులు దోరంబులుగా నేచి పూచి
తోచినం బెకలి తలకడవై వడిఁ జెడ వెంబడిఁ బొరలి పోవుతరులును, దరుతండంబులగం
డికడల నడ్డంబు దగిలి దట్టంబులై కట్టవెట్టినలాగునఁ జాఁగనీక వేగం బాఁగినఁ జిఱిగి మలసి
యెదురుదన్ని మిన్నులకప్పంబులై వచ్చుపై యేఱులబలిమికలిమిం దొట్టి నిట్టవొడిచిన
నెట్టుకొని తఱమినం దఱుము లిడి నిబ్బరంపు బిరుసునం దెరలద్రొబ్బినఁ గడకం బడఁకుల
నెల్లదరి యురులు గిరుల చఱుల ప్రచండరవంబుగా డొల్లుగండశైలంబులును, గండశైలంబు
లొండొండ గుభులుగుభుల్లనం దొడఁగురభసంబున నభశ్చరులు తల్లడిల్ల నెల్లెడలం బెల్లగ

యుఁ గల్లెడలును, కల్లెడల మొల్లంబెరి మేదినీకుహరంబుల హరనటనటనపాటవమహాభైరవ
ఢక్కారవప్రతిభటకటధ్వనిబంధురంబులై దిగంబడు కబంధంబులం బహులావర్తంబుల
క్రందనం బెగి నిగుడ మగుడ వెఱఁగవడి తిగురుకువదుజలగ్రహంబులును, జలగ్రహంబు
లొండొండ నంటునంటుఁగ నొరసి గొంటికంటికొనల ననలస్ఫులింగంబులు చెదర నదరి
కలహంబునకుఁ దిమురుచు నమురుగవిసి యప్పటప్పటికి జిఱజిఱం ద్రిప్పి వేయుచటుల
వాలఘాతంబుల నుద్ధూతంబులై మసరుకొని విసవిస విసరు గాడ్పుల దూలి వెడగువడఁ
జల్లుజలకణంబుల నల్లుకొనుచున దరియరాని సమీపదేశంబులును, సమీపదేశవాసి
నీజనంబు భయావేశంబునం బాసి చనఁ దోడన జలంబు వెడవెట్టి నివ్వగిలినఁ జువ్వన
నెగయుమందిరంబుల పొందు దప్పక తెప్పలుగతిఁ దేలి పోవుపురనగరగ్రామసమూహంబు
లును, సమూహంబులై నింగి నెంగటం దలఁగి నివ్వెఱపడి చూచుఖేచరులుఁ గలిగి వ్యవహా
రసమర్థుం డగుసార్థవాహునర్థసమితియుం బోలె మితుల కగ్గలంబై బహుముఖంబులం
గూడుచు, నతిరథపటిష్ఠనిష్ఠురబాణశ్రేణియుంబోలె ముంపుదప్పక యొడ్డు ఛేదింపుచు,
మహావదాన్యుని యసామాన్యకీర్తిస్ఫూర్తియుఁబోలె బలువంకల నల్లసిల్లుచు, గరాలకర
వాలధారయుంబోలె నొరసిన మేనిఁ ద్రెంపుచు, నయసంపన్నుసంపదయుంబోలె ముంపు
దప్పక, వసంతసమయతరుసంతతియుం బోలె బలుమోసులెత్తుచుఁ, ద్రివిక్రమదివ్యదేహ
స్ఫురణయుంబోలె నడుగులకొలఁదిగానంబడక, హరిమాయయుంబోలె నాకలం బెఱుమతం
లం గడవ నశక్యంబై, పెన్నిధిఁ గన్నపేదయుంబోలె నంతకంతకుబ్బుచు, తగవరి యగు
చుట్టంబునుంబోలె నెఱసులు దోపకుండ వర్తింపుచు, వీరభటవితతియుంబోలె మిగుల
వడిగలిగి, సన్నద్ధహయపంక్తియుంబోలెఁ బల్లంబుల నేపుదీపింపుచు, నదృశవార్తయుం
బోలె నతిదూరంబుగా మ్రోయుచు, నభేద్యకవచంబునుంబోలె నాటఁజిక్కక, యధ్యాత్మ
విద్యయుంబోలె నెల్లవారికి వితర్కింప నశక్యంబై, మెఱసి పెన్నఁ జిన్నచేసి, తుంగ
భద్రను భంగపఱచి, కృష్ణఁ దూష్ణీకరించి, సరస్వతీతరస్వి నిత్యంబు దెగడి, నర్మద నిర్మదఁ
గావించి, భాస్కరిం దిరస్కరించి, జాహ్నవి నిహ్నవించి, గౌతమి లోతమి యడంచి, సార
వంబు గౌరవం బుడిచి, యన్యసరిన్నివహంబు నపహరించి, సంవర్తసమయసముజ్జృంభ
శుంభదంభోధరానర్గళత్కాండప్రకాండతాండవితసంఘుసమున్నిద్రంబు లై సముద్రతో
యంబు లుద్రేకించి లోకంబు లేకార్ణవంబుగా నందంద యారవడించు చందంబున
చూడ్కులకు వెక్కసంబై యుప్పతిల్లి యేపుదప్పక కనుంగొనునంతలోన 182

క. ఇరవుగఁ దొలునా డన్నది । దరి నొకచో వార లిడినదండాజినసు
త్కరణస్నానపటాదులు । పరుకడి యయ్యేటినీటఁ బడి వడి నరిగెఁ 183

ఉ. అంత ననంతధర్మమహిమాంచితకృత్యుఁడు సత్యుఁ డాసరి
త్స్వంతతజృంభణోదయవిచారవిశారత బుద్ధిఁ బూని భా
స్వంతము విష్ణుసంజ్ఞకము సత్యము సర్వశుభప్రదంబు శ్రీ
మంతము నైనదైవము నమానుషలీలఁ దలంచు చున్నెడన్. 134

క. కల్పాంతతీవ్రబాడబ । కల్పసమానప్రతాపఘని యవితథసం
కల్పుఁడు సుబోధుఁ డట్టియ । నల్పక్షోభంబుఁ గని మహోద్భుతమతియై 135

శా. కాలాంభోధరగర్జితప్రతిధనోగ్రధ్వానగంభీరముల్
హేలాదర్పవిజృంభణస్ఫురణ నిష్ఖేలా యవేళన్ సము
ద్వేలంబైనది యానదీమణి కడున్ వేగంబె యావేగము
ల్లోలద్వీచిపరంపరల్ పొదువదే లోకంబు లేకంబుగాన్. 136

గీ. కాన దీనికిఁ బ్రత్యుపకార మింక । నెద్ది గల దట్టి దిఁప్ప దూహించి చేయ
కొకనిమేష ముపేక్షించి యున్ననైన । బ్రతుకఁబోలునె విశ్వప్రపంచమునకు 137

సీ. చటులదిక్కరికర్ణపుటపాటనప్రౌఢి నొదవునిర్భరఘోషమదము ముదుఁగ
పాథోధిమండలప్రాణింధనము లైన కల్లోలవితతుల త్రుళ్లడంగ,
మకరనక్రగ్రాహమత్స్యకచ్ఛపకోటు లొరలుచు నొండొంటి మఱువుకొదుఁగఁ
జక్రటిట్టిభసారసక్రౌంచముఖజలవిహగజాలము గమివిచ్చి పఱవ,
నారసాతలనిమ్నంబు లైనమడువుఁ
బట్లు పంకావిలంబులై బయలుపడఁగ,
శిలలు గుల్లలు నిసుము చిప్పలును దక్క,
నెసఁగి యాతోయ మాతోయ మేఁగ్రహించు. 138

క. అని సంరంభవిజృంభణమునఁ దత్సలిలంబు సకలమును బాణితలం
బున నిలిపి లీల నాపో । శనముగఁ గొనఁబూని దశదిశల్ గనుఁగొనినన్. 189

మ. జలధుల్ పిండలివండుగాఁ గఁలఁగె భూచక్రంబు క్రుంగెన్ దిశా
వలయుం బల్లలనాడె గోత్రశిఖరవ్రాతంబు గంపించె న
ల్కలు దుల్లెన్ గగనంబు బిట్టవిరె నర్కస్ఫూర్తి మాసెన్ మదిం
దలఁకెన్ వజ్రి విరించి వంచెఁ గృతచింతన్ వక్త్రపంకేజముల్. 140

వ. అయ్యవసరంబున. 141

గీ. వలవ దుడుగుము భూసురవంశవర్య । యిట్టియనుచితకృత్య మూహింప నీకుఁ
దగునె యనుచు ధారాధరధ్వానధీర । మైనవాక్యంబు వీతెంచె నంబరమున. 142

క. ఆపలుకు లేటపడ విని । యేపున ముని గ్రోలఁ గేల నిడి పూనినత
ద్వీపవతిజలము చలమునఁ । దాపసవర్యుండు వదలెఁ దత్క్షణమాత్రన్. 143

వ. అప్పుడు మఱియు నంతరిక్షంబున నంతర్హితుం డైనదివ్యపురుషుం డతనితో నీకకాదు కవేరకన్యక సకలభువనమాన్య దీని సామాన్యఁగా దలఁపవలవ దమృతప్రాయంబు లగునీ తోయంబులు ప్రజాజీవనోపాయంబులై ప్రవర్తిల్లెడు నదియునుం గాక పుండరీకమండలమధ్యమండనాయమానంబై దురంతదుర్భరాతపసంతప్తజంతుసంతానంబునకు నిరంతరచ్ఛాయానోకహంబై సనకసనందనప్రముఖప్రసిద్ధసిద్ధమునిశుద్ధాంతఃకరణసిద్ధాంతీకృతసుకృతవస్తుసారంబై రామాభిరామహేమదామాకలితహరినీలమణికరండంబై శేషశయనంబు శ్రీరంగంబు శ్రీరంగధర్మం బను నామంబుల ధన్యంబైనదిగా నవ్యయంబైనదివ్యధామంబై తదుభయప్రవాహపరిపాలితంబై మెఱయునది గావున నీపుణ్యతరంగిణి సరసభాజనంబైనది గాని విరసభాజనంబు గా దని చెప్పి యూరకుండె వెండియు. 144

క. ఆదివ్యపురుషవర్యుం । డాదరమున నతనితో మహామునివర యీ
ఖేదమును మాని మది నీ । కేది ప్రియం బదియె వేఁడు మిచ్చెద ననినన్. 145

ఉ. అచ్చెరువంది సంయమికులైకవిభూషణుఁ డక్రియం బ్రియం
బిచ్చఁ దలిర్పఁ బల్కె నతఁ డెవ్వఁడు తద్వచనంబ కాని యూ
పెచ్చుటఁ గానఁ బోల దిది యెంతయునుం గలరో యథార్థమో
చెచ్చెర వాదుపూన్కి వృథసేయఁగఁ బన్నినవిష్ణుమాయయో. 146

వ. అని యివ్విధంబున. 147

క. చింతింప మఱియు నంతట । నంతర్హితుఁ డైనదేవుఁ డాతనితో నీ
కింత దగుదాయ మేటి క । నంతగుణా వేఁడు మిష్ట మని పల్కుటయున్. 148

గీ. ఆసుబోధుఁ డలరి యఖిలేశ నీవు నా । దెసఁ బ్రసాదబుద్ధి యొసఁగ వేని
నిన్ను దెలియఁగఁ జెప్పి నీదివ్యరూపంబు । సొంపు మీఱ నాకుఁ జూపవలయు. 149

వ. అనిన నప్పరమేశ్వరుం డతని కిట్లనియె. 150

క. దేవాదిచతుర్విధభూ । తావళిఁ బొడమింపఁ బెంప నడఁపం బతినై
యీవిశ్వము నాధారం । బై వెలయుదు నిత్యసుఖపరాయణలీలన్. 151

చ. నినుఁ జరితార్థుఁ జేయుమతి నేఁడు ప్రసన్నుఁడనై మదీయమై
యొనరినదివ్యరూపమహిమోన్నతిఁ జూపితిఁ గాని పాకశా
సనపురశాసనాదులును జాలరు గానఁ బ్రపన్నులైనస
జ్జనులకుఁ దక్క నన్యులకు శక్యమె నిక్కము నన్నెఱుంగఁగన్. 152

వ. అని యాక్షణంబ. 153

మహాస్రగ్ధర. బహుభాస్వద్భాసమానప్రభలు నభముసం బర్వ వార్వాహగర్వా
పహనీలాంగద్యుతుల్ భూషణమణితతి మించన్ లసద్వైజయంతీ
సహితోరఃకౌస్తుభాంశుల్ జడిగొనఁ గనకాచ్ఛాదనం బొప్ప శౌర్యా
వహచంచద్దోస్సహస్రావళి మెఱయ బలిధ్వంసి ప్రత్యక్షమయ్యెన్. 154

ఉ. అప్పుడు తన్మనోహరభయానకదివ్యవపుర్విశేషముం
దప్పక చూడ నోడి ప్రమదంబు భయంబును విస్మయంబు లో
ముప్పిరియై పెనంగొన సుబోధుఁడు దీపితసుప్రబోధుఁడై
యప్పరమేశు నిట్లని సముంచితభక్తి నుతించె నమ్రుఁడై. 155

సీ. సర్వేశ సర్వజ్ఞ సర్వభూతప్రియ శరణాగతార్తిసంహరణనిరత
మధుదైత్యదుర్మదమథన సమస్తకల్యాణస్వరూప పరాపరాత్మ
భవదీయముఖమునఁ బావకుఁడును దృష్టిఁ జంద్రసూర్యులును భుజముల దిశలు
కళలు శ్రోత్రంబుల గగనంబు నాభిఁ జరాచరాత్మక మైనయవని పదము

తే. లందుఁ బెంపొందుచుండు ధరాదిపంచభూతములు బుద్ధ్యహంకారములు మహత్తు
ప్రకృతిపురుషులు దగముక్తిపరమ మగుచు నెగడు నాపరంజ్యోతియు నీవ దేవ. 156

చ. తెలివగుభక్తి నొండొకటి నేరక సర్వశరణ్య నిన్నుఁ బ
ల్మఱు నుతించుచున్ మదిఁ దలంచుచు మ్రొక్కుచు నుందు రవ్వ రి
త్తెఱఁగునకైన నట్టిసుకృతిప్రకరంబున కెల్ల మెట్టలుం
గిఱుతలబంటి గాదె పరికింప భవాంబుధి సత్కృపానిధీ. 157

క. దివసాగమవికసితసిత । నవసారసదళవిశాలనయనంబుల దా
నవసామజపంచానన । భవసాగరమగ్ను నన్నుఁ బాలింపు హరీ. 158

వ. అని ప్రస్తుతించి యప్పుండరీకాక్షుతో నతండు దేవ నీవు నాయెడఁ బ్రసన్నత వహిం
చితేనియు నిఖిలవిరోధం బైనమదపరాధంబు సహింపు సహింపు మాచక్రవాళాచలా

చక్రవాళంబులై సుకృతాలవాలంబులై దురంతదుష్కృతసంహారణసమర్థంబు లైనతీర్థంబు లెల్లకాలంబు నీసరిత్కూలంబులఁ గలసి మెలసి చరింప ననుగ్రహింపు మీధునీవారిం జేరినయసాధునీవారిఁ గలపి యనుగ్రహింపు మీప్రదేశంబున నొనర్చుజపతపోహోమదానంబు లక్షయసుఖనిదానంబులుగాఁ బ్రసాదింపు మని వినయవినమితోత్తమాంగుండై యూరకున్న నన్నలినోదరుండు సాదరుండై యతనిమనోరథంబు లవితథంబులుగా నొసంగి మఱియును. 159

క. ధరణీసుర నన్నెఱుఁగుము । పరాత్పరుఁ బ్రధానపురుషుఁ బరుసామ్యుఁ జరా
చరభూతజాతభయసం । హరు నారాయణు నమేయు నవ్యయుఁ గాఁగన్. 160

గీ. నిఖిలకర్తయు భోక్తయు నేన కాక । లేదు నాకంటెఁ బర మొకలేశమైన
నంతవాఁడను నాతెఱఁ గెఱుఁగలేరు । సకలలోకనియంత్రి మత్సహజశక్తి. 161

వ. అని యఖిలభక్తమనోరథానుసంధాయకుఁ డగుశ్రీరంగనాయకుఁడు తానగుట తేటపడుటకై యతని కాత్మావతారకథావృత్తాంత మాద్యంతంబును దెలియ నానతిచ్చె నత్తెఱం గెఱింగించెద నాకర్ణింపుము. 162

క. ఏలావనహరిచందన । జాలాభినవప్రసూనసౌరభవిలస
ద్వాలానిలమృదులీలాం । దోళితకల్లోల మైనదుగ్ధాబ్ధిపయిన్. 163

మ. అఖిలప్రాణిహితైకబుద్ధి నురగేంద్రానల్పతల్పంబునన్
సుఖలీలన్ శయనించి యున్నహరిఁ దేజోమూర్తి నాతాపస
స్తముఁ గళ్యాణకరుం గుఱించి దివసంబుల్ పెక్కు భక్తిం జతు
ర్ముఖుఁ డత్యుగ్రతపం బొనర్చినఁ గృపాపూర్ణప్రసన్నాత్ముఁడై. 164

క. ఆలోకపితామహునకు । నాలోకనసమధికోజ్జ్వలాకృతిపటుభూ
పాలోక మెసఁగ నవ్విభుఁ । డాలోఁ బొడచూపి వేఁడు మభిమత మనినన్. 165

గీ. లీలఁ జాఁగిలి మ్రొక్కి కెంగేలుఁగవలు । ఫాలభాగంబునందలి గీలుకొలిపి
బహువిధంబుల వినుతించి పద్మభవుఁడు । వేడ్కఁ దనకోర్కె యిట్లని విన్నవించె.

ఉ. నేరెడుపండుచాయ తనరించెడుమేనఁ బదాఱువన్నెబం
గా రొఱఁబట్టుపట్టుఁ బసగందనితామరరేకు మైసిరుల్
దోరణఁ గట్టి యేలుకనుదోయును బొందుకు సుద్దియై మెఱుం
గారుసరంబు కెంపు దయసానినయుల్లము చల్లచూపులున్. 167

క. అలరిన లలితాకృతి నా । తలఁపున నెలకొల్పినట్లు దైత్యాంతక యి
మ్ముల నెల్లప్పుడు కనఁగద । లలరఁ గనుంగొనెడిభాగ్య మంటించఁగదే. 168

వ. అని ప్రార్థించిన నాశ్రితవత్సలుం డగు శ్రీవత్సలక్షణుం డతనిదెస నెసఁగుదయావిశే
షంబున నట్లకాక యని యానతిచ్చి యంతర్హితుం డయ్యె ననంతరంబ. 169

సీ. ధ్వజగరుత్మద్దేహధగధగద్యుతులు లోకాలోకచరమాంధకార మణఁప
స్వచ్ఛముక్తాతపత్రచ్ఛాయ లసమయచంద్రికావిలసనోత్సవముఁ జూపఁ
బటుశాతకుంభకుంభద్యుతిస్ఫూర్తి లంభోదపథమునఁ గుంకుమప్రభలు నెఱప
మహనీయతోరణమణిమయస్ఫూర్తియు గోచరప్రతతిచూడ్కులు మరల్ప
నుదధి నావిర్భవించె సముద్యదధిక । దివ్యతేజోవిశేషదేదీప్యమాన
పద్మగర్భాండభాండప్రచండ మగుచు । మంగళం బైనశ్రీరంగమందిరంబు. 170

శా. ఆదివ్యాయతనోపజీవు లయి దుగ్ధాంభోధిమధ్యంబునన్
ప్రాదుర్భావము నొందిరచ్యుతదయాపాత్రత్వమిత్రుల్ భవ
చ్ఛేదావాప్తసదాసుఖోదయులు రాజీవప్రభూతేంద్రము
ఖ్యాదిత్యప్రకరార్చనీయు లగు నందాదుల్ మనోజ్ఞాకృతుల్. 171

గీ. వారితోడను వైకుంఠవాసులై ప్ర । సిద్ధులైనసనందాదిసిద్ధమునులు
నమరగంధర్వకింపురుషాహియక్షు । గరుడవిద్యాధరాదులు గానఁబడిరి. 172

వ. అయ్యవసరంబున. 173

సీ. రావించె నిరవద్యరావనారదవాద్య కలితతుంబురుహృద్యగానవిద్య
మెఱసెఁ గింకిణీరావమిళితమై దివి దేవసతులనర్తన భావగతులఁ దేవ
బలసె దివ్యానేకభవ్యస్తవశ్లోకముఖరమై యెడలేక మునులమూఁక
తోరఁగాఁ బైపైఁ బెల్లుతోలువాసనలఁ జల్లు పరువమై వికసిల్లువిరులజల్లు
బొరసె నమృతాంబునిధిఁ దేలి పువ్వుగాలి । దైవతోద్యానవనకేళిఁ దనరుగాలి
యఖిలకల్యాణమూలమోక్షాలవాల । రంగజనవాతివేలసంరంభవేళ. 174

క. అప్పుడు. 175

సీ. ధరియించెఁ దద్దివ్యధవళాంబు ఖగరాజు కఠినబంధురతరస్కంధపీఠిఁ
బట్టె దర్వీకరప్రభుఁడు శ్వేతచ్ఛత్ర మురుఫణామండలస్ఫురణ మెఱయ

నిడిరి వింజామరలిరుగెలంకుల జోకరై సుధాకరుఁడు సహస్రకరుఁడు
బకలంబు సేసె హాటకవేత్రపాణియై తఱిమి విష్వక్సేనదండనాథుఁ
దలికఘటితహస్తాబ్జులై యంతనంత । బలసి కొలిచిరి సకలదిక్పాలవరులు
వచ్చె శ్రీరంగధామంబు వచ్చె ననుచుఁ । జదలఁ గొదలేక కాహళస్వనము లెసఁగ.

వ. ఇవ్విధంబున స్వయంవ్యక్తంబును, తేజోమయంబును, ప్రణవస్వరూపంబును బ్రభూతవైభవాభిరామంబును, నగు శ్రీరంగధామంబు దృగ్గోచరం బగుటయు దిగ్గన గ్రమ్ము సమ్మదామృతరసంబునఁ బులకాంకురంబులు దలఁకొనఁ గనకనికషసుషమావిశేషంబున నుపమేయం బగుధాతుం బోలుచు కాయంబు భూభాగంబునఁ జాఁగిల్లఁ బ్రణమిల్లి శారదావల్లభుండు యుగపదుల్లసితచతుశ్శ్రుతిప్రయుక్తంబు లగునూక్తంబుల నభినుతించె నంత నఖిలగుణగణప్రశస్తుండును వేత్రహస్తుండును నగుచు నందుం డాశతానందునకు నమ్మహనీయమందిరంబుఁ జూపి యిట్లనియె. 177

మ. అరవిందాసన నీ తపంబు ఫలితం బై తోఁచె లక్ష్మీమనో
హరుగేహం బిదె చూడు లోచనము లింపారంగ నీరంగము
దిర మయ్యిందిరతోడఁ గూడి యనురక్తిన్ యోగనిద్రాళుఁడై
హరి యున్నాఁడు జగత్కుటుంబపరిరక్షాయత్తచిత్తంబునన్. 178

వ. అని నిర్దేశించినఁ గనకగర్భుండు నిర్భరానందంబునఁ దత్ప్రదేశంబు డాయంజనునప్పు డూర్ధ్వాధస్థలంబులఁ గనకమహీమండలంబులును మధ్యభాగంబున శ్రీదేవియు నభ్యంతరంబున ననంతభోగియుఁ బ్రతిహారాంతికంబున జయవిజయులుఁ బార్శ్వంబుల దుర్గాపేరంబులును శిఖరంబునఁ బ్రణవస్వరూపిణి యగుభారతియును, కనకకలశంబుల నామ్నాయసముదాయంబును నాసాముఖంబున రహస్యజాతంబును బాదతలంబులఁ గ్రతుప్రతతియు నంగుళీసంచయంబుల యజనంబును నుదరంబున హవిర్జలంబును, మఱియు నెడనెడఁ బాకశాసనపరేతరాజపలలాశనపాశపాణి పవమానపౌలస్త్యపాశుపతులును నాదిత్యరుద్రమరుదశ్వివిశ్వదేవసిద్ధసాధ్యులును సప్తర్షులు నక్షత్రగ్రహతారకంబులు నాదిగాఁ గలచరాచరభూతజాలంబులెల్లను దోఁచినఁ బరమాద్భుతసంభ్రమంబులు డెందంబున సందడింప నద్దివ్యమందిరంబునకుఁ బ్రదక్షిణాభివందనంబు లొనర్చి యభ్యంతరంబుఁ బ్రవేశించి యందు. 179

సీ. తలగడగా నిడి తల యూఁది కలచెంపఁ గుడిహస్త మెత్తుగా నిడినవాని
మేలిచేఁదొడవుల మెఱుఁగుదాపులు మించు నెఱకేలు కటిఁ జాఁచి మెఱయువాని

సిరి మేనిపొందునఁ జిత్తంబు సొగయింప వరమోద్పుఁగన్నుల వఱలువాని
వాంఛితోన్నతం బగువామపదమున బిరుదునూపురము శోభిల్లువాని
మొలకనగవులఁ దెలివొందుమోమువాని। మెఱుఁగు గలమేఘరుచిఁ బొల్చుమేనివాని
నురగశయ్యపై వొదకిలి యున్నవాని। సకలశుభదాయి శ్రీరంగశాయిఁ గనియె. 180

వ. కని యప్పరమేశ్వరు నిత్యనిరతిశయనిరుపమనిరవధికలావణ్యసౌందర్యసౌకుమార్యచాతు
ర్యధైర్యగాంభీర్య సౌశీల్యవాత్సల్యతేజః ప్రభావసౌభాగ్యసౌహార్దదయాద్యనంత
కల్యాణగుణామృతసాగరాంతర్నిమజ్జదఖిలానయవసుఖానుభవసముత్కటానంద పరి
పూర్ణమానసుండై పునఃపునఃప్రణామంబు లాచరించి నితాంతభక్తివినయవినమ్రదేహుం
డై యిట్లని స్తుతించె. 181

దండకము. జయజయజగదేకకల్యాణభావానిశత్రాణపారీణనిస్తారణాపారకారుణ్యరత్నా
కరా శ్రీకరామ్నాయసారాభిధా సామృతాపారశాంతాఘ సంతాపయుక్
తాపసౌఘాః స్తవాభిర్భజంతే యజంతే చ నిశ్శ్రేయసోద్యోగినోఽష్టాంగయో
గాంచితజ్ఞానయజ్ఞైః ప్రశంసంతి వేదాగమాస్తావకా భూయోభూయః ప్రసాదాభి
లాషీ సదా సేవతే దేవతానాంగణ స్త్వం సమస్తప్రతీతం గుణాతీత మాధార
భూతం ప్రకృత్యాః సమానాధికోపేత మాద్యంత మేకం భవంతం భజేఽహం
ప్రసన్నః సువర్ణధ్వజః ప్రత్యుషశ్చిత్రభానుప్రభాజాలజాజ్వల్యవచ్చక్రధారా
లిభిన్నారివక్షఃశిరః కల్యకైవల్యసామ్రాజ్యలక్ష్మీసమర్థైక మూర్ధాభిషిక్తప్రణామ
త్పదాబ్జావహం విశ్వ మావర్తతే శాశ్వతం జ్యోతిరాకారలోకోత్కరం తత్త్వ
సంకల్పమాత్రప్రభూతాలిసంభూతభూతావకాశ్యం దినానాథతేజో ముఖం
మిత్రరాత్రీశ్వరౌ నేత్రయుగ్మం దిశః శ్రోత్ర మేషా ధరిత్రీ పదౌ మాతరిశ్వా స
నిశ్వాసభూతో నభో నాభి రావాసభూర్మస్తకం, శ్రీః కళత్రం మనో
ర్భూభర్మనోఽహశ్చ రాత్రిశ్చ పార్శ్వే నిలింపాః ప్రతీకా స్త్వ మేవాంత
రాత్మా షడంగాని వేదాశ్చ ధర్మాణి శాస్త్రాణి సర్వాగమాః పాంచరాత్రం
తథా సాంఖ్యయోగం తవాజ్ఞా హి వేదాంతవేద్యస్త్వ మేకప్రసాదోఽహ మగ్ర
స్త్వదీయాతిరోప స్త్వదన్య త్పరం నాస్తి నీహారభానూబృహద్భాను రంభోజినీ
బాంధవో గంధవాహః ప్రమత్తా భవంతే ప్రభీతాః ప్రయాంతి ప్రజాస్స్వన్వహం
మృత్యు రభ్యేతి మర్త్యేషు కాలేజనిష్యత్త్వమేవాఖిలం వా భవంతం భవచ్చాపస్య
శాహూయుపాదప్రభూతం మహీదైవతక్షత్రవిట్ఛూద్రజాతంసవర్ణాశ్రమాచారధర్మ

స్త్వమేకస్త్వమేవక్రతుర్విశ్వమూర్తే సుధీనాథ మీనాకరాధీనహీనాసురాధీనమా
నాధికానూనసానాగమాదానసూరాయ, మత్స్యాకృతాకారాయ, ధీరామృతాహార
నీరార్ణవక్షీరపూరార్పితోదారభారాచలాధారరూపాయ కూర్మస్వరూపాయ
సర్వంసహోఖర్వ దుర్వారదోర్గర్వనిర్వాహవత్పూర్వగీర్వాణధూతోర్వరోద్ధార
లోలాయ లీలాధికోలాయ కాలానలాలోలకీలాసముత్తాల ఫాలాతుదోః స్థూల
శూలాధికాఖిలభాస్వన్నఖాలీక్షతారాతిదేహాయ లక్ష్మీనృసింహాయ ధీమన్ముని
స్తోమసామస్తుతవ్యోమ భూమర్త్యభుగ్ధామసీమక్రమస్థేమ రాజత్పదాబ్జాయ
మాయావికుబ్జాయ పుత్రాత్తసన్మిత్రగోత్రాస్వశుక్రత్రగాత్రావలిచ్ఛేదకృత్క్షాత్రతీ
చిత్రబాహోరుశాతారాతిభీమాయ రామాయ చండాభ్రవేదండశుండాభదోర్దండ
కాండాసనాఖండకాండాహృతోద్దండపౌలస్త్యకంఠప్రకాండాయ కాకుత్
స్థవంశప్రకాండాయ కోపాకమానాపలేపామరక్షేపతాపారికృత్పాపరూపార
తీతాపకేలీసతృష్ణాయ కృష్ణాయ వైహాయసవ్యూహగోహారిసన్నాహబాహా
బలోత్సాహనీహారరుగ్వ్యూహదుర్లక్ష్యరక్షః పురక్షోభకర్మప్రబుద్ధాయ బుద్ధాయ
రోషాగమద్వేషభాషాతిదుర్వేషయోషావధాతోష మేషాది దుర్దోషశీలస్ఖలద్ధర్మ
సంస్థాపనోల్లాసాయ కల్క్యాహ్వయాయాప్రమేయాయ కించామితానంత
లీలాకృతాకారాయ తుభ్యం నమో దేవ తుభ్యం నమః; కలశజలధిమధ్యచంచత్సితద్వీ
పరత్నాగ్రవైకుంఠపూరుజ్జ్వలద్దివ్యసౌధాతికాంతే సభాంతే ఘకంఠం నిశాగంధ
సంఫుల్లనీలోత్పలశ్రీవిశాలాంగలావణ్యైః భ్రాజమానం నతామర్త్యదైతేయ నాగా
వతంసప్రతానస్ఫురత్పీనభాగోచితాభ్యాం సరోజధ్వజచ్ఛత్రచక్రాదిచిహ్నైః పరై
రంకితాభ్యాం ప్రభాసంపదాభ్యాం పదాభ్యాం మనోజ్ఞం మనోజ్ఞస్వరామ్నాయ
మంజీరపాళీకసత్పద్మరాగప్రకాశావృతాంసం తటిన్నూతనద్యోతధౌతాంబరాం
చత్కటీమండలాబద్ధకాంచీకలాపం సుధావర్తగంభీరసుస్నిగ్ధనాభిప్రభూతా
యతశ్వేతపద్మాభిరామం లసత్కౌస్తుభశ్యామలశ్రీతులస్యామిళద్వైజయంతీ
సమేతోరువక్షఃస్థలీకం వరానర్ఘ్యకేయూరకగ్రైవోర్మికాద్యైః పరిభ్రాజితాజాను
బాహుప్రకాండం రమాలింగనోత్కర్షరత్నాంగదాంకక్రమై రుల్లసత్కంబు
కంఠప్రదేశం శరచ్చంద్రబింబప్రసన్నస్మితాస్యం లసత్కుండలాలోక చంచ
త్కపోలం పరంపక్వబింబప్రభాపాటలోష్ఠం దరద్యోతితస్వచ్ఛదంతాంకురాలం
నవామోదినిశ్వాసవాసావిలాసం దివాజృంభితాంభోజదీర్ఘావలోకం సలీలానత
భ్రూవిలాసం సుఫాలం చలత్కుంచితానీలసత్కుంతలాంతం సముద్భాసికోటీర

చాహూత్తమాంగం సమస్తైకసౌందర్యసంపన్నిధానం మహాభోగినో భోగమధ్య
నిషణ్ణం సహైవ శ్రియా సర్వసౌభాగ్యవత్యా సుపర్ణాదిభి ర్నిత్యముక్తై రనంతై రు
పాస్యం సనందాదియోగీంద్రబృందై శ్శరణ్యం సదాసత్యసంకల్ప మీశం పురాణం
విభుం విశ్వభూతాంతరస్థం వినాన్యాశ్రయం వేదవిద్భారయిత్వా మనస్యర్చయే
ద్భక్తిమాన్యం ప్రశంసంతి సంతస్తమేనో హరం తేన తస్మై శుభం జాయతే
కిం బహూక్త్యైశ్వరస్తేన భావానువర్తీ భవాన్; పరమపురుషతత్త్వస్త్వాంన
జానాతి కశ్చిత్కథం విస్తరేణ స్తుతిం కర్తు మీశో భవిష్యత్యదంచన్ననీషః
సహస్రాస్యముఖేభ్యోఽపి పుంఖానుపుంఖాగతాశేషభాషావిశేష స్వశేషశ్చ శేషత్వ
మాపద్యతీశేషిణస్తే వచోగమ్యభావం విచార్యాసనచ్ఛత్రశయ్యాదిరూపేణ
వాచాలతా పంచరాత్రాంచితోఽనాతతై స్తర్కహార్యైః ప్రభిన్నప్రమాణైః
ప్రకారైః పరిభ్రాంతిమూలై ర్వికల్పాలవాలైః పరాభూతసంపాదితాతీతభేదై
ర్మహాశాస్త్రసిద్ధాంతవాదై రలం కింతు తాపత్రయోర్మిచ్ఛటాసంకులే శోక
మోహాదిదుష్టగ్రహాధిష్ఠితే మోహకామాదిలోభాదికావర్తజాలే మహాదుర్భ
వాంభోనిధౌ మజ్జతాం పారితైకాగతి స్త్వత్పదాంభోరుహైకాంతభక్తి ర్న
కర్మప్రసక్తిం పరస్యావిరక్తిం ఖలూత్పాదయత్యేకనిష్ఠాగరిష్ఠా హి మాయాంతి
రంతిద్వితీయ్యా మలంఘ్యాసదాస్మాభి రేషా హృషీకేశవిశ్వాతిశాయిన్ గుణౌ
పశ్య మాముల్లసత్కుంభజాతోదయారంభసంభూతవైమల్యగంభీరనీరస్ఫురత్పుం
డరీకచ్ఛదాకార సౌభాగ్యశోభావహాగర్వసర్వస్వచోరై రుదారప్రచారై ర్నతా
ఘౌఘరోగానుబంధై రితోపాంతరక్తైర్దయాసంప్రయుక్తై ర్మరుస్థానినీమంగళా
కల్పరక్షాధికారైకపుణ్యాతిదూరై రపాంగై ర్మమత్వంపితా త్వంగురుస్త్వం
సఖా త్వం సమస్తం జితంతే ముకుందప్రసన్నార్తిహంత్రే జితంతే జగన్నాథ
గోవిందవిష్ణో జితంతే శ్రియఃకాంత రంగాధిశాయిన్ జితంతే హరే వాసు
దేవాదిదేవప్రసిద్ధప్రభో పాహి మాం పాహి మాం పాహి మాం. 182

శ్లోకం. శ్రీ రంగే రుచిరా యస్య । శ్రీరంగే రుచి రాయతా
స దైవతః శరణ్యో నః । సద్దైవ త ముపాస్మహే. 183

చ. అని వినుతించినన్ సదయుఁడై మురవైరి దయామృతంబు నిం
డినకడకంటిచూపు నిగిడించి పిరించి భవద్వచఃసము
ర్చనమునఁ జాల నీదెసఁ బ్రసన్నుఁడనైతి వరంబు లెవ్వియై
నను నను వేఁడు మిత్తు ననినన్ బ్రమదంబున వారిఁ డిట్లనున్. 184

గీ. అవధరింపుము నీ విప్పు డవతరించి । నట్టియావిగ్రహంబు నే నహరహంబు
చెలిమిఁ బూజింపఁ గోరెద నిట్లు సూసఁగి । మఱుఁగులే కానతిమ్ము నీకెఱుఁగ నాకు.

క. నావుడు హరి యిట్లను నీ । భావమ్ము నెఱింగి కాదె పద్మాసన యి
ట్లావిర్భవించితిని ది । వ్యాకసథముతోన కొలువు మభిమతధంగిన్. 186

క. ఏనరుఁడు పంచకాలవి । ధానంబున నన్ను శాశ్వతముఁ బూజించున్
వానికి సొసఁగుదు నప్పుర । స్థాన మనిన నెన్నఁ డేల తక్కినపదముల్. 187

క. ఈనాళీకభవాండము । పై నావరణములమీఁదఁ బరమవ్యోమ
స్థానంబున నుండుదు నెపు । డే నప్రాకృతశరీరహితవిస్ఫురణన్. 188

సీ. దేవతిర్యఙ్నరస్థావరాత్మకభువనావలి లీలార్థమై రచింతు
నవి చేతనించుటకై సమస్తమునందు జీవరూపమున వసించియుందుఁ
గర్మంబులను లోనుగాక భూతావలిఁ బ్రసరింపఁ జేయుదు బహువిధములఁ
దదనుగ్రహార్థ మాత్మగతుండనై యుండి జ్ఞానరూపమున విజ్ఞాన మడఁతుఁ
తే. దల్లిగతి హితకారినై తనరి తిలలఁ । దైలమునుబోలె వ్యాపించి తమ్ముఁగూడి
యున్ననైనను సురలు నాయోజ యిట్టి । దని యెఱుంగరు విపులమోహాంధు లగుచు.

క. దివి నాహేంద్రస్థానము । రవిమండలమును సుధాంబురాశియు నన నే
నివసించుకందువలు మూఁ । డవుటఁ ద్రిధామాఖ్య ముఖ్య మయ్యెను నాకున్. 190

వ. తత్ప్రదేశంబులందును రాజసతామసాత్ములకు దుర్విభావ్యుండనై యుండుదు నిండి
యు లోకానుగ్రహార్థం బొక్కొక్కయెడల నావిర్భవించియు నొక్కొక్కనిభా
వంబునం దావేశించియు నొక్కొక్కతావుల జన్మప్రసంగంబు లంగీకరించియుఁ బ్రతి
కల్పంబున నవతారసహస్రంబులు గైకొందు సత్త్వయుక్తులై మదేకచిత్తులయినయుత్త
ములయెడఁ దద్గుణకర్మాభివృద్ధ్యర్థం బత్యంతరాగాసక్తుండనపోలె సకలంబు నను
సంధింతుఁ బితృపుత్రవాత్సల్యంబులనైనను మిత్రామిత్రంబుల నొదవు రాగసంగంబు
లనైనఁ బ్రాణిస్తోమంబు నామీఁదఁదలంపు గలిగి యేవిధంబున వర్తించు నావిధంబున
ననురూపంబు లైన రూపంబులు ధరియింతు నదియునుం గాక ద్వీపవర్షతీర్థాయతనంబు
లందుఁ బ్రతిగ్రామగృహంబుఁ బ్రతిపద్మంబుల దారులోహశిలామయంబు లగునర్చా
భేదంబుల నుల్లసిల్లుచు నట్టియర్చావతారంబులు స్వయంవ్యక్తదివ్యసైద్ధమానుషంబు

లనఁ జతుర్విధంబుల మెఱయు నందు శ్రీరంగ శ్రీముష్ణ శ్రీవేంకటాచల సాలగ్రామ
నైమిశ తోతాద్రి పుష్కర నారాయణాశ్రమంబు లనునీయెనిమిదిస్థలంబులం గలమ
దీయ మూర్తులుస్వయంవ్యక్తంబులు, హస్తిగిరివృషపర్వతచక్రతీర్థాదిప్రశస్తదేశంబులు
భవ ధర్మశతమఖప్రముఖదేవప్రతిష్ఠితంబులైనయవి దివ్యంబులు, భృగుతీర్థమందర క్షేత్ర
చిత్రకూటప్రభృతిపుణ్యస్థలంబులు భృగుమరీచిమతంగజమునిసిద్ధసంస్థాపితంబు లైన
యవి సైద్ధకంబులు, విశిష్టాగమోక్తప్రక్లృప్తశుభలక్షణలక్షితంబు లయి శుచిద్రవ్యరచి
తంబులయినయవి మనుష్యస్థాపితంబులై యున్నయవి మానుషంబులు వీనిలో స్వయం
వ్యక్తంబులై యున్నయవి వికృతిమయంబులైనను వానియందుఁ బ్రతిష్ఠాకతనోయా
గంబునను బూజాతిశయంబునను బింబాభిరూప్యంబునను బ్రసన్నుండనై సాన్నిధ్యంబు
వహింతు మత్పరిభావంబున నీ స్వయంవ్యక్తాదులకుఁ గ్రమంబున ద్వేతార్థ (?) పాద
యోజనమాత్ర క్షేత్రంబు పరమవిత్రంబునై యతిశయిల్లు. 191

క. శ్రీ మెఱయు నెచట సాలఁ। గ్రామశిలార్చనము గల్గుఁ గల్యాణకరం
బై మహి నచ్చోటికి మూఁ। డామడ పుణ్యప్రదేశమై విలసిల్లున్. 192

గీ. తక్కఁగలుగుగృహాళికిఁ దద్గృహంబు। పావనము విను పురిపల్లె పదియు రెండు
నొక్కటన మద్విమానము లుండెనేని। సాటి యచటు సాలగ్రామ శైలమునకు. 193

క. ఇల నెచ్చోటు మదర్చన। విలసితపూజోత్సవాదివిరహిత మగు నా
నెలవు వెలివాడఁబోలెన్। దలఁపఁ గనుఁగొనఁగ ననుచితము సుజనులకున్. 194

మ. ఇపు డేఁ జెప్పినయీస్వయంభువులయం దెల్లన్ గడున్ మేటియై
కుపితాశేషదురంతదోషచయమై కల్పాంతరస్థాయియై
యపవర్గప్రదయోజనద్వయయుతంబై భవ్యమై దివ్యమై
విపులశ్రీకరరంగధామ మమరున్ వేదాంతవిఖ్యాతమై 195

మ. నరులైనన్ సురలైన దైత్యవరులైనన్ సన్నుతద్వాదశా
క్షరమంత్రైకపరాయణత్వమున నన్ సద్భక్తి సేవించినన్
బరమైశ్వర్యసమగ్రభోగవితతిన్ బ్రాపించి సర్వోత్తర
స్థిరవైకుంఠపదంబుఁ జెందుదురు ప్రీతిన్ గర్మనిర్ముక్తులై. 196

క. పరమం బిది యొకఁ డవస్యఁ। బరవిం దజ వినుము మత్పరాయణు లెందున్
దురితములు పెక్కొనర్చియు। నరుగరు పటుఘోరనారకాధోగతులన్ 197

క. గోవధ మాదిగఁ గలనా । నావిధపాతకములను దినము మద్భక్తుల్
గావింపుచుండు రేనియు । నీవలఁ దద్దోషచయము నే హరియింతున్, 198

గీ. తుది మదీయభక్తివదలనిజను లనా । చారులైన హీనజన్ములైన
వారి నితరబుద్ధి వారక నిందించు । వార లట నికృష్టవర్ణసములు 199

మ. ధరఁ బెంపొందినమత్ప్రపన్నుల మదుక్తంబైనశాస్త్రంబు మ
త్పరమార్థం బగుమంత్రరత్నమును మత్ప్రాప్తిప్రతీకాశమై
నిరపాయం బగురంగధామమును దుర్నీతిన్ విచారించి యె
వ్వరు దూషించుచునుందు రాఖలులు జిహ్వోచ్ఛేద్యు లుద్యద్గతిన్. 200

క. మఱచియు శ్రీరంగంబున । నెఱుఁగనియజ్ఞానమూఢు లెవ్వరు గల రా
మొఱకుల కిడునశనాములఁ । దతిక్రొనిఖునకమున కొసఁగఁ దగునశనంబున్. 201

క. వారక సకలజనంబులు । శ్రీరంగంబనుచు సంస్మరింపుదు రేనిన్
వారికి నాకము లనియెదు । నారెండును ఖిలము గావె యరవిందభవా. 202

గీ. మర్త్యలోకంబునం బంబరమునందు । నొప్పు దెచ్చోట శ్రీరంగ మొప్పియుండు
నప్పుడాదిష్టునకు భక్తి నభిముఖంబు । గాఁగ నిలిచి నమస్క్రియాకారి వగుము.

వ. అని యానతిచ్చి యాశ్రితనిస్తారకుం డూరకుండెఁ దచ్ఛాసనంబున వారిజాసనుండును, నిశ్శ్రేయసనిదానం బగునద్దివ్యవిమానంబు గొని సత్యలోకసీమాంతంబున విరజానది ప్రాంతంబున విశ్వకర్మనిర్దేశంబునఁ బ్రతిష్ఠాపించి నిరంతరానురక్తదివ్యోపచారవిరాజిత పూజావిధానంబున నద్దేవుని నారాధించుచు, నారాయణనక్షత్రంబునం బగమహస్కం బున బ్రహ్మర్షిసహాయుండై మహోత్సవం బొనర్చి యవభృథానంతరంబున నింద్రాదిబృం దారకబృందపరివృతుండై, వందారుమందారం బగునానందకపాణిసందర్శనంబు గా వించి, యావేళ నుదారస్వాంతుం డగువివస్వంతునకుఁ బాంచరాత్రంబు సమంత్రం బుగా నుపదేశించె నతం డౌరసుం డనువైవస్వతమనువున కొసంగె, నాఘనుండు తనతనయుం డగునిక్ష్వాకున కలిగించె నాభూభుజుండు చతుర్భుజాని దపోవిశే షంబున మెచ్చించి కమలభవభువనసీమామందిరం బైనరంగమందిరంబు గొనివచ్చి నిర్విఘ్నంబున నిజాన్వయపరంపరాప్రాప్తం బైనయాదివ్యధామంబు రామభద్రుండు గుణసముద్రుం డగువిభీషణున కిచ్చె, నతనిచేత నది కావేరీతీరంబున ననుపంబడియె నని పారాశర్యుండు నాగదంతమునివరున కెఱిఁగించిన తెఱంగు. 204

శా. బంధుప్రాంగణకల్పపాదప ధనుఃపాండిత్యకాంతేయ ద
ర్పాంధారాతివసుంధరారమణదుష్టామాత్యనీతిక్రియా
సంధానప్రబలాంధకారపటలీసప్తాశ్వ శశ్వన్నభ
స్సింధుక్షీరపటీరనిర్మలయశఃశ్రీవాసితాశాంతరా. 205

క. పన్నగశయనవరప్రతి । పన్నగజప్రకరతురగబహుధనమణిసం
పన్నగతకలుష సుజనవి । పన్నగసుత్రామ సుజనపావననామా. 206

మాలిని. నమదవనవిలోలా నవ్యశృంగారజాలా
ప్రమదకరవిలాసా భాగ్యలక్ష్మీనివాసా
శమదమయుతభవ్యా చారువిద్వన్నిషేవ్యా
సమదరిపువిరామా చాగయామాత్యరామా. 207

గద్యము. ఇది శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసిద్ధసారస్వతవిలాసగౌరవ గౌర
నామాత్యపుత్ర సుధీవిధేయ భైరవనామధేయప్రణీతం బైన శ్రీరంగ
మహాత్మ్యం బను పురాణకథయందుఁ బ్రథమాశ్వాసము.

# శ్రీరంగమహాత్మ్యము.

## ద్వితీయాశ్వాసము.

క. శ్రీపతికల్యాణగుణా । లాపసమున్నిద్ర భద్రలక్షణవిలస
ద్రూప శశివిశదకీర్తి । వ్యాపితదిక్సీమ నాగయప్రభురామా. 208

వ. అవధరింపు మఖిలకథాకథనచాతురీజనితజనరోమహర్షణుం డగు వ్యాసశిష్యనందనుండు దివ్యబోధను లగు శౌనకాదితపోధనులకుఁ జెప్పినట్లు శ్రీరంగావతారప్రసంగంబు తెల్లంబుగా విని యుల్లం బనురాగిల్ల నాగదంతమునివర్యుండు పారాశర్యుతో మహాత్మా సత్యలోకంబున లోకపితామహునకు నిలువేల్పగు భుజంగతల్పుం డేకారణంబున నిక్ష్వాకుచేత నానీతుం డయ్యెఁ దద్వృత్తాంతం బంతయు సవిస్తరంబుగా నెఱింగింపు మనిన నాసంయమీంద్రుం డతని కిట్లనియె. 209

శా. వైకుంఠాంఘ్రిసమర్చనాకలనహేవాకుండు లోకోత్తర
శ్లోకుం డార్తజనావనోదితదయాలోకుండు ప్రత్యర్థిలుం
ఠాకుం డర్థిహితార్థదానగుణగణ్యశ్రీకుఁ డేపార ని
క్ష్వాకుం డర్కకులామృతాంబునిధిరాకాచంద్రికాలోకుఁడై. 210

వ. ఆరాజశేఖరుం డాత్మగతంబున. 211

శా. దైవవ్యాకులితాత్ములై విషయచింతామగ్నులై రోషమో
హావేశావిలచిత్తులై భవదవిద్యావృత్తులై దుర్భర
వ్యావృత్తిం బ్రసరించు మానవులభావం బింద్రియార్థంబులం
దా వైరాగ్యము పొంది మోక్షపదవీధర్మం బపేక్షించునే 212

వ. మున్న మత్పితృపితామహు లైనవైవస్వతవివస్వంతు లమితానుభావు లగుటం గమలభవలోకంబున కరిగి యురగగణార్చితుండై యురగరాజపర్యంకంబున వెలుంగు రంగమందిరసందర్శనంబు గావించి నిరర్గళభోగాపవర్గంబులం జెంది రందు మార్గంబు నాకు దుర్గమంబై యున్న దనిన నస్మత్పుత్రపౌత్రాదుల కెన్న నేల యిది గావున నానిమి

త్రంబునఁ బ్రాణిజాలం బె త్తెఱంగున ముక్తి వడయు నా తెఱంగు పొందుపడునంతకు
నసురాంతకు భజియింతు నని చింతించి యనంతతపోనిష్ఠుం డగువశిష్ఠునకంతఁ దద్వృ
త్తాంతంబంతయు నెఱింగించిన నమ్మునిసత్తముం డాస్వప్నోత్తమున కిట్లనియె. 213

క. ఈకలఁపు మేలు జనవర। నీతపమున సంభవించు నిజ మెంతయుఁ బ్ర
ఖ్యాతపురాతనమునితతి। చేతను మును వింటి వినుము చెప్పెద నీకున్. 214

చ. జగదుపకారబుద్ధి నరికాసన నీవు తపం బొనర్పఁ బ
న్నగపతిశాయి దివ్యభవనం బజుఁ డప్పుడు తాను దెచ్చి నీ
కగణితభక్తి నిచ్చె నదియాదిగ నీపురి నుండు ధర్మపా
రగు లగుయుష్మదన్వయధరావరులెల్ల భజింపఁ బెంపునన్. 215

క. అటుకొంతకాల మరుగఁగఁ। బటుశక్రమశాలి రామభద్రుఁడు గుణలం
పటుఁ డగువిభీషణున కా। దఁట నొసఁగిననిజపురమున కదిగొని చనుచున్. 216

గీ. నడుమఁ గావేరికడ దృగానందమైన। యిందుపుష్కరణీతటి నిడి కదల్ప
నలవి గాకఁగఁ గల్పాంత మందు నుండి। బ్రహ్మలోకంబునకుఁ బోవు పార్థివేంద్ర.

క. ప్రతికల్పము నీగతి నా। గతుఁ డగు దివినుండి భువికిఁ గమలోదరుఁ డా
శతధృతిదినములు దఱిగిన। నతులితనిజసత్యపదమునందు వసించున్. 218

క. కావేరీతీరస్థితు। లైవెలసినదాక్షిణాత్యులం దనిశము ల
క్ష్మీవరుఁడు రంగశయనుఁడు। దా నవలఁడు కరుణ వారితప మెట్టిదియో. 219

క. ధారుణిఁ గలనానావిధ। దారుణదురితము లొనర్చు తామసులైనన్
శ్రీరంగదివ్యదేశము। జేరఁగఁ గలిగినను ముక్తిఁ జెందుదు రధిపా. 220

క. క్రిమికీటవిహంగమృగతిమి। కమఠాదిఖగోరగములు గనుతమతిర్య
క్త్వము దొఱఁగి శాశ్వతస్థితి। యమితశ్రీరంగమందు నావాసమునన్. 221

క. హరికృపగలఘనులకుఁ గడు। నిర వగు నా నెలవు నిలువ నితరులకెల్లన్
బురహరజలజభవాధిక। సురకృతవిఘ్నముల నపటుఁ దొరరా దెపుడున్. 222

మ. వనజాతప్రియవంశభూషణ లసద్వర్ణాశ్రమాచారత
ద్ధనులై ధీధనులై ముకుందపదసక్తస్వాంతులై శాంతులై
ఘనులై సజ్జనులైనసాత్త్వికులు రంగక్షేత్రమం దెన్నఁ డెం
దును గ్రందై చరియింతు రప్పు డపుడున్ దుర్వారవిఘ్నావళుల్. 223

వ. అదిగావున. 224

ఉ. దక్షుఁడవై జగజ్జనహితంబుగ నిప్పుడు పూని శ్రీమద
ష్టాక్షరమంత్రచింతనపరాయణచిత్తుఁడవై భజింపు మ
బ్జాక్షుఁ బయఃపయోధితనయాభినయాలసచారుచంచల
ద్వీక్షణచంద్రికారుచుల వేడుకఁ జొక్కు చకోరవల్లభున్. 225

వ. అని నిజకులగురుం డగునత్యూతివరుం డుపదేశించినహర్షించి యాతని కభివందనం బొనర్చి వీడ్కొని యమ్మహీకాంతుండు సకాంతుండై కాంతారంబున కరిగి యచట నిర్ద్వంద్వుండును వశిష్ఠాశ్రమసమీపంబునఁ దనదేవి పరిచర్య లొనర్ప నిష్పరిగ్రహుండును, నిశ్చలుండును నై తపం బొనర్చునంత. 226

ఉ. తాఘనమయ్యె నెల్లెడ నిదాఘము దూరనిరస్తచైత్రిక
శ్లాఘము మార్గగాభిమతచండమయూఖనిరోధవిస్ఫుర
న్మేఘము తోయదానపరిమృష్టమహాఘము శుష్యదంబుమా
ర్గౌఘము సర్వజంతువపురుద్గతభూరినిదాఘ ముర్వరన్. 227

సీ. అతిమరుద్ధూతశాఖాన్యోన్యసంఘట్టనోద్ధాగ్నిదగ్ధదావోత్కరంబు
చండభానుప్రభాసహాసముజ్జృంభణాటోపప్రభిన్నగండోపలంబు
మృగతృష్ణికాసమున్మిషదంబుధిస్ఫురదవిరతోదన్యనానాధ్వగంబు
తప్తతోయాశయాంతర్లుఠత్పాఠీనకమఠనక్రగ్రాహసముదయంబు
విటపకోటరసంలీనవిహగకులము । సకలతాకుంజవిభ్రాంతమృగచయంబు
శాదనిర్ముక్తభూదారసైరిభంబు । నగుచు మించె నిదాఘసమాగమంబు. 228

క. ప్రాణికిఁ దను వొసఁగు జగ । త్ప్రాణపయఃపాదపములు పటుఘర్మపరి
క్షీణములై కోరె జగ । త్ప్రాణపయఃపాదపాంతరంబులఁ దమకున్. 229

క. మునికన్యార్పితజలములఁ । దను పగుతమపాదులందుఁ దరువులనీడన్
గనుపట్టి నిలిచె దినకర । ఘనతరపరితాపభీతిఁ గదలనికరణిన్. 230

ఉ. అట్టి యనేహముం గడపె నానృపకేసరి నాల్గుదిక్కులన్
బిట్టుమిడుంగురుల్ చెదర భీకరవహ్నులు మండుచుండఁగా
నెట్టనమధ్యభాగమున నిల్చి పదాగ్రము నేల నూఁది మా
ర్పట్టనిచూపు లుగ్రకరబింబముపై నిడి యూర్ధ్వబాహుఁడై 231

క. తదనంతరంబ. 282

మ. జలదాటోపవిశాల మింద్రధనురంచద్వ్యారుణీకూల ము
త్కలికాలంబకదంబసాలవనమధ్యస్ఫారసవ్యావళీ
కలనావాల ముదారకేతకపరాగవ్యాళి మూర్వీధర
స్థలనృత్యన్మదకేకిజాల మగుచగ్నాకాల మొప్పెం గడున్. 283

వ. వెండియు 284

సీ. కుంభదంభోధరస్తోమభీమాంధగంభీరగర్జావిజృంభణంబు
దృగసహ్యచటులదీధితిమత్సముద్దామసంకులజీమూతసంకరంబు
జంఝామరుద్ధతస్ఫారధారాసారనీరంధ్రితమధరణీనభంబు
రోధోనిరోధకాగాధపాథఃపూరవాహినీవర్ధితవార్ధిజలము
కర్దమస్థలసంక్రమక్రమసగర్వ। దర్దురోత్తరవికటపృథగ్విధప్ర
భూతనిర్ఘోషబధిరితాశాతటంబు। నగుచు మించె నభోనభస్యాంతరంబు 285

శా. ధారాశాంబుదబృందనిర్భరనిరోధవ్యాప్తి నాశాంతముల్
భూరిధ్వాంతమయంబులైన జనులేప్రొద్దున్ రవిం గానమిం
దా రూహించుచు నుండు రాఁగొనుట మధ్యాహ్నంబు నుద్ద్రామని
ద్రారంభంబున రాత్రిటం బగట బోధావాప్తిఁ బత్యూషమున్. 286

ఉ. ఆసమయంబునన్ విరహితావరణం బగుచోటఁ బ్రౌషప
ద్వాసనబద్ధవిస్ఫురితుఁడై బహులాశనిజాతపాతసం
త్రాసములేక భూరిజలధారల నెప్పుడు దొప్పఁదోఁగుచున్
జేసెఁ దపంబు రాజకులశేఖరుఁ డత్యుతధైర్యశాలియై 287

ఉ. అంత నిరంతరంబును దురంతసమున్నతిమంత మయ్యె హే
మంత ముదారవిస్ఫురితమంజులమౌక్తికజాలఝల్లరీ
కాంతిలసత్తుషారకణికాపరిగుంభితభిల్లభీరుసీ
మంతము దుర్ధమక్రమవివర్ధితపద్మవనాంత మెంతయున్. 288

వ. మఱియును. 289

సీ. ప్రత్యూషజృంభితప్రాలేయదుర్లక్ష్యమాణపద్మభవాండమండలంబు
పంకిలద్వ్యాసరసమయమందిరభవద్యోతఖద్యోతభానూత్కరంబు

వితతనిశీథినీవేళాసహస్ఫీతశీతరుగ్బింబవిజృంభణంబు
శీతాంశుమర్దనవ్రాతసంచితకరీషాగ్నిధూమావృతాశాంతరంబు
నగుచు నంతంత కగపడె నీహారధరణి । ధరసముద్ధూతనిబిడశీతలసమీర
ణాభిసంపాతజాతమాయాతిభీత । జంతుసంతాన మగుచు హేమంత మంత. 240

గీ. హిమముచే నంబరంబెల్ల నిమురుగొనఁగ । నుష్ణకరుఁడును గరము లొయ్యొయ్య సాఁచి
తాను ననలాంశ ధరియింపఁ బూనె ననఁగ । నెంత యనవచ్చు నింక హేమంతమహిమ.

శా. ఆహేమంతదినంబులన్ ధరణిపాలాగ్రేసరుం డద్భుతో
త్సాహాటోపమునం గళద్వయసపాథఃపూరమధ్యస్థుఁడై
యాహారంబు జలంబ గా నచలదేహస్వాంతుఁడై నిర్జర
వ్యూహంబుల్ వెఱఁగందఁగా మెఱసె నత్యుగ్రప్రకారంబునన్. 242

వ. అంత. 243

ఉ. సంతతపుష్పసౌరభసుజాతదిగంతము పాంథమర్మభి
త్కుంత ముదాత్తమత్తపికఘోషితమన్మథరాజ్యవైభవో
దంతము జంతుజాతసుఖదస్థితిమంతము దూరధూతహే
మంతము సంతతాత్రిగసమగ్రతఁ జూపె వసంత మంతటన్. 244

వ. వెండియు. 245

సీ. కలకంఠమధురవాగ్వైఖరీకారణమహితసారస్వతమంత్రవిద్య
నానావనీజాతనవయౌవనప్రదాంచితరసాయనయోగసిద్ధఘుటిక
కుసుమసాయకనిరంకుశరాజ్యసప్తాంగసన్నాహవైభవాస్థానసీమ
మందమందాగతమలయానిలాంకురవ్యాపారసులభఘంటాపథంబు
చేతనద్వంద్వసౌఖ్యసంజీవకరణి । విరహిదశమదనావేశవిషమవేళ
శిశిరమదకుంభిసంరంభసింహమూర్తి । లీల నేతెంచె మధుమాసకాల మంత. 246

గీ. పసిమిఁ బాసి ముదిరి పస రింకి పరుసనై । పఱపు మిగిలి తుదలు పగిలి తలఁకి
పండి తొడిమె లెడల వెండుచుఁ గారాకు । డుల్లెఁ దరుల రవము పెల్లు గాఁగ

క. కారాకు రాల లేఁజిగు । రీరిక లెడనడఁగి శాఖ లేకవిధంబై
పేరెలుక పడక యుండెను । భూరుహములు కొన్ని దివసములు వనవీథిన్. 248

వ. తదనంతరంబ. 249

సీ. గుమురులై నయము దూఁకొని మోసు లెదరి లేఁజిగురాకు వెట్టి కెంజిగి దలిర్చి
తొంపముల్ గొని జగజంపుగాఁ బొదలి క్రొన్నన లొత్తి మొగ్గలఁ దనరి నిగ్గు
దులకించి మొగడలు ద్రోచి లోరేకులు బిగిసి తుద ల్విచ్చి నిగిడి వచ్చు
పూవుగుత్తుల మించి పూఁపల నిండారి పిందలై యొగ కెక్కి పెరిగి పులుసు
మిగిలి కరిగట్టి కలఁగి దోరగిలఁ బాతి। యారఁబండినఫలముల నమరుగలల
ప్రేఁకదనమునఁ గొమ్మలు విఱ్ఱవీఁగి। పరగఁ దరువులు కన్నులపండు వగుచు. 250

చ. గునియుచు గుజ్జమావిసెలఁగొమ్మల నిమ్మల ప్రాలి సోఁగలేఁ
గొనలు దెమల్చి కెంజిగురుగుంపులు లంపులు మేసి క్రొవ్వి వీఁ
కను మొగరెక్కి డగ్గపడుకుత్తుకలం గొదలేనినూతన
స్వనములు పంచమశ్రుతుల జట్టిగొనం జెరలించెఁ గోవెలల్. 251

చ. మెకములక్రొత్తనెత్తురుల మించునునుంబులిగోరుబాగు సొం
పుకుఁ బసఁ జూపు వాఁడిగొనముక్కునఁ బక్వఫలంబు లొత్తి యుం
జక వెసఁ గ్రమ్ముతియ్యనిరసంబులు కుత్తుకబంటిఁ గ్రోలి రా
ట్పుకములు పోతరించి రొద చొప్పడ నెల్లెడఁ బల్కెఁ జెల్లుగన్. 252

చ. అరవిరికమ్మఁదమ్మివిరులందుల నొందును సోఁకుముట్టు న
బ్బురముగ నుబ్బు మేలివలపుల్ పసిఁగొంచుఁ జెలంగి నూఁగి లో
గుఱువులువాటి కర్ణికలఁ గొందుల వాచవు లూను తేనె ము
మ్మరముగఁ గ్రోలి యన్నుగొని మూఁగక ఝుమ్మని మ్రోసెఁ దుమ్మెదల్. 253

చ. మిలమిల మంచు మించు చలిమించుల ముద్దులనందమూను కాం
తులఁ దులఁదూఁగుక్రొమ్ముత్తెలకతూఁడు గొనం గబళించి త్రుంచి ని
చ్చలవిడి మేసి గబ్బుఁగొని సమ్మదనాదము లొప్పఁజేసి లీ
లల మలసెన్ గొలంకులకలంకుల రాజమరాళదంపతుల్. 254

సీ. తళుకుసుపాణిముత్యాలమించుల మించి మెలయుచుక్కలమేనిమెఱుఁగు దటిమి
కలికిరాయంచ ఱెక్కలరేక గిలుమాడి విరిమల్లెగుత్తులమురువు దెగడి
చదువుతొయ్యలిమేనిచాయ నల్లసమాడి వలిదమ్మిమొగడలతెలివి గెలిచి
జిగిమీఱులొగరెక్క సిరులకు నస మిచ్చి పాపరాయనివన్నె కేపుచూపి. 255

తే. పాలమున్నీటితరఁగలపసల నంచి। కొండయల్లునిమైతెల్పు కొంచపఱచి
కప్పుతిలుచుట్టుగొండపైఁ గొనలుసాఁగి। వెలఁదివెన్నెల లెల్లెడ వెల్లివిరిసె. 256

ఉ. సారపుఁదేట వెన్నెలరసంబులు మేలిమినల్లగల్వపూఁ
గోరల నించి చందనపుగుబ్బలిపైఁ జనుదెంచు గాడ్పులన్
సారెకుఁ జల్లఁజేసి మృదుచంచుపుటంబులచేఁ జకోరముల్
కోరిక నిచ్చ మచ్చికఁ జకోరిక లింపులఁ గోరగింపఁగన్. 257

ఉ. కందపుఁగొండవాత్తములకందున నేలకతీవయిండ్లలో
గొందలి రాకఁ బాన్పుల సుఖించి నితాంతరతిశ్రమంబులన్
జెందినచెంచుగుబ్బెతలచెక్కులఁ జెమ్మజవాదివాసనల్
విందులు సేయుచున్ మెలఁగె వేమఱుఁ గోమలగంధవాహముల్. 258

వ. అట్టివసంతసమయంబున నవ్వనంబున దపోనిరతిశయంబున వర్తించు నమ్మార్తాండకుల
మండను తేజోనుభావంబు భావంబులు గలంప నిలింపు లాత్మపదభ్రంశశంక సం
దఱు పురందరుపాలికిం జని యత్తెఱం గెఱింగించినఁ గించితానతముఖుండై శతముఖుం
డంతరంబున తద్వ్రతభంగంబు సేయు నుపాయంబు విచారించి పంచశరసంచలితజగద్ధీ
రతావైభవుం డగుమనోభవుం దలంచినతత్క్షణంబ. 259

సీ. కప్పారునెఱిచెంద్రుకలకొప్పు కొప్పుగాఁ బారిజాతంపుఁబూబంతి మెఱయ
రతిపదాలక్తకాంకితమైననెసలిపై నిలువుఁగస్తురిబొట్టు చెలువుమిగుల
కేయూరముద్రలు గీల్కొన్న గళమున మౌక్తికంబులకంఠమాల యమరఁ
జెదరుగంధపుఁబూఁత జెన్నొందునురమునఁ బద్మరాగం లపదక మొలయ 260

తే. సరససంభోగశృంగారసహజమహిమ । లలితయౌవనలావణ్యలక్ష్మిఁ బెనుప
ననుపమానజగన్మోహనైకమూర్తి । దర్పకుఁడు వచ్చె నింద్రునాస్థానమునకు. 261

క. వలరాజురూపరేఖా । విలసనములు దనివిసనక వీక్షించెడిచో
నిలువెల్లఁ గన్ను లగుటకు । ఫలమెల్లను గలిగె నమరపరిపాలునకున్. 262

ఉ. అప్పుడు పుష్పబాణురుచిరాకృతి దప్పక చూచి చిత్తముల్
ద్రిప్పఁగ లేక కోర్కి తతిఁదీపులఁ బ్రేమ దెలర్ప మానముల్
దప్పి చలించి ఘర్మసలిలం బెసఁగన్ బులకించి నివ్వెఱల్
గప్పి విచిత్రరూపములకైవడి నిల్చి రమర్త్యభామినుల్. 263

వ. ఇట్లు వచ్చినభావసంభవు బహువిధంబుల సంభావించి జంభారి నిజకార్యారంభం
బెఱింగించి మఱియు నారమాకుమారున కిట్లనియె. 264

చ. అసురులదివ్యబాణనిచయంబుల నెల్లఁ దృణీకరించి ద
ర్పమునఁ జరించుపోటరులు భామలకోమలహాసదృగ్విలా
సముల ధృతుల్ గలంగి వివశత్వము నొందుట విశ్వలోకదు
ర్గమ భవదీయకోరకశరంబుల బల్మిగదా మనోభవా. 265

ఉ. ఏకమనస్కులై తగుల మొందును లేక విరక్తధర్మశీ
లాకరులైనవారి నొకసంతున డెందముఁ జూచి చించి బ
ల్కాఁకలు సేయు నీకు మహిళాసహచారదృఢావివేకు ని
శ్వాసుఁ బరాభవించు టనఁగా సరసా వరకాంతకాత్మజా. 266

వ. అని యగ్గించి తత్కాలసముచితసత్కారంబుల నతనిఁ బ్రీతునిఁ గావించి వీడ్కొలిపి తత్కార్యసహాయంబుగా సురగణికానికాయంబును బంపిన నయ్యచ్చరలు వియచ్చరేంద్రుపంపునఁ గందర్పునకు ముందట నిలచి యమ్మహీపాలుండు తపం బొనర్చువనంబుఁ బ్రవేశించి యుండు. 267

సీ. కొమరారు చెంగల్వకోలఁకుల కెలఁకులఁ బూఁదేనెఁ దనివొందుపాదల మొనలఁ
బొరలెత్తుకర్పూరతరువులమఱువుల మదికింపుగలయేటిమడలకడల
విలసిల్లుశశికాంతవేదులవీదులఁ గేలి కిమ్మగు మేటిగిరులతరుల
నింపుగాఁ బండినయీడలనీడలఁ జెలువైన సురపొన్నచెట్లపట్ల 268

తే. నాను దీవలక్రేంకల నతిశయించు । పోకమ్రాఁకులజోకల వీఁక నెగడు
ఘనపరాగంబు రాగంబుఁ బెనుప నెసఁగు । మొగలితనముల మనముల ముద మెలర్ప.

క. మెలఁగుచు మధురసములజడి । కలఁగుచు లీలాభినయసముచితగతులన్
వెలుఁగుచు నవసరసోక్తులఁ । జెలఁగుచు నృపుఁ జేరి వేల్పుచేడియ లచటన్. 270

సీ. పాణిపల్లవమృదుస్పర్శఁ జూతంబుల సుకరాంఘ్రిహతుల నశోకములను
గలభాషణంబులఁ గర్ణికారంబుల వదనాసవంబుల వకుళములను
బరిరంభణంబులఁ గురువకప్రతతుల దృగ్విలాసంబులఁ దిలకములను
దరహాసకాంతిసంతతి సురపొన్నల సముదరాగంబులఁ జంపకముల 271

తే. నసమసమగీతలహరిఁ బ్రియాళములను । జారుముఖగంధముల సింధువారములను
బ్రాఘనఖరాంకురక్రీడఁ బాటలముల । నాధరంబార నందందఁ బ్రోదిచేసి. 272

సీ. అతివ చందనతిలకాంచితం బీవనం బిది యే నీమోము నిట్లు కాదె
పల్లవోల్లాసిని పడఁతి యీతరుశాఖ నీజాడ లదియును నేఁబోలు
లలితాంగి మాధవీలతిక పుష్పిణియైన నంటఁ గారాదు నీవందుఁ జనకు
వనజాక్షి కాంచనావలి కాసనే పెను జగమంతయును దద్వశంబ కాదె. 273

తే. మెలఁకి లోకోత్తరంబై సమీరణంబు దక్షిణం బాట యెఱుఁగవా తరుణి యిప్రుడు
బాల నీసొమ్ము రాజీవజాల మెల్లఁ । దలఁప మాకేల కైవర్తతతికిఁ గాక. 274

క. ధరశేఖరు లీలార్థం । బవతంసము గాఁగఁ గువలయముఁ దాల్చెఁ జెలీ
చెవి నమర సత్యవతిగా । భువి నిఁక దలఁమోపు మానెఁబో ఫణిపతికిన్. 275

వ. అని యివ్విధంబున నిచ్ఛారూపచతుర సల్లాపంబులఁ బ్రమోదంబునొంది వినోదించుచు.

క. ఓసరసిజాక్షి యిది గదు । నోసర మని యేల దవుల నోసరెదు నీ
కేసరములు వలసిన నీ । కేసరములు గూర్పు లలితకేసరములుగాన్. 277

చ. తలఁపులు నిక్క నిక్కపుముదమ్ములఁ దమ్ముల సంచలించుచున
య్యలులను లోఁగి లోఁగినుక నందెద నందెద వేల చంపు కా
వలి వలినన్న మొగ్గలనివారణ వారణయాన కోయు మిం
పలరఁగ దానఁ దేఁటి రస మానదు మానదు లేఁతపూవులన్. 278

క. ఎలమావుల వలరాయని । యాలమావుల శుకపికంబు లాఁగిన వేల్పుం
బోలమావులవిరహార్తుల । దలమా ఉలుకక * చరింపఁ దరుణీ యిచటన్. 279

సీ. ఏపారువనలక్ష్మియిమ్ములు దమ్ములు తుహినాంశునెరయకందువలు దొవలు
భ్రమరనాయకు లేలుపల్లెలు మల్లెలు కందర్పుసిరులు చెంగల్వవిరులు
నెసఁగుపూమొగ్గల యెల్లలు మొల్లలు వలపుసంపదలు చేమంతిపొదలు
తొలునెయ్యములకుఁ బోదులు విరవాదులు నవవిహారదములు నారదములు. 280

తే. వేడుకల కామెతలు కురువిందలతలు । రసిక జనముల మెచ్చులరచ్చ పచ్చ
యనుచుఁ గుసుమాపచయకేళి కంతకంత । కంతరంగములన గుతూహల మెలర్ప. 281

సీ. పదములకెంజాయఁ బఱచినిల్చినచోటఁ జిగురాకు పఱచినచెలువు నెఱపఁ
దీగకైవడిఁ గౌను సాఁగ నిక్కిన నీవి వెడజాఱ నతనాభి బెడఁగు దెలుపఁ

---

* తలమా + ఉలుకక - ఈ సంధి లాక్షణికమతవిరుద్ధము.

బరువంపువిరులపైఁ బవరించుమాఁడ్కులు మెలమెల్లనన్నరై తెలుపుచూపఁ
గేలుసాఁచిన నివ్వగిలుకతళుకాంతులు జిగిచన్నుఁగ్రేవల జీరువాఱ 282

తే. మలఁగి జఘనంబు వెనుకకు మాఁగ నిగిడి। వ్రేళ్లపై ముద్రికలమించు వెల్లిగొనఁగ
వాఁడివాలారుకొనగోళ్ల వలను మెఱసి। కోర్కెలెచరింపఁజూపులు గోప నూర్తు. 283

సీ. చెమటచిత్తడి చాలఁ జెలువొందునొసలిపైఁ గుఱుచక్రొన్నెఱులు గ్రాలు నెఱపఁ
వెడఁదకన్నులకెల్లబెడయుచూపులు వాలుఝళిపించుగతి దళతళనఁ బొలయఁ
గదలు బింకపుఁజన్నుగవ నిండుపఱపున నిఱుపేదకౌఁదీఁగ తరలఁబాఱ
ధట్టించితుదవ్రేళ్లఁ దట్టుపో వెస నుంగురములకాంతులు బిత్తరములఁ దాఁటఁ 284

తే. గతుకోచులు వెఱచు గంకణము లొరయఁ
దరలి మొలనూలు మొలఁగ నందియలు సెలఁగ
సంతసము బెంప నూర్పులు సందడింపఁ
బ్రోడ యొక్కతె కందుకక్రీడ సలిపె. 285

క. కరతలరుచి నరుణంబై। ధరఁ దననఖకాంతిచే సితంబై దృష్టి
స్ఫురణ యెడ నసితతరమై। కరమొప్పెను బంతిమూఁటిగతి నొక్కటియున్. 286

సీ. సరిలేనిబంగారుజలపోసనము వీణె మెఱుఁగుడాచనుగుబ్బమీఁద నిల్పి
తులలేని వజ్రకాంతులపెల్లు వెదచల్లఁ గొనగోళ్లతంత్రులు గూడ మీఁటి
నిగ్గులు దులకించునిడువాలుఁగన్నులు తళుకు సారెలమీఁద దడఁబడంగ
గంకణంబులు ఘులుఘుల్లున బహుతాళగతులు వాయించుసంగతులు నెఱపఁ 287

తే. గ్రమముతో మంద్రమధ్యతారకలశుద్ధ। మిశ్రసాళగములరాణ మీఱ రాగ
వితతిఁ దగుమిశ్రములు మేళవించి పాడెఁ। దెఱవ యొక్కతె సంగీతదేవి యనఁగ.

క. నిరుపమవీణావాద్య। స్వర నితరరుచంబు గదలెఁ దరుణీమంచాం
తరిశోన్నతవామపయో। ధరసందర్శనము సేయఁ దా వడఁకుగతిన్. 289

వ. మఱియును. 290

సీ. శ్రీడామయూరంబు నాడించెఁ గంకణక్వణచారుకరతాళగతుల నొకతె
కామతంత్రరహస్యగర్భోక్తు లొఱపుగాఁ గలికిరాచిలుకకుఁ గఱపె నొకతె
మఱియుచు నటియించుముద్దురాయంచకు నెఱిమందయానంబు నేర్పె నొకతె
మహనీయయౌవనోన్మాదంబు పెంపున దీగయుయ్యెలల వేడ్కఁ దూఁగె నొకతె 291

తే. ధవళశశికాంతవేదికాంతరమునందుఁ । జెలులతోఁ గూడి వలరాజుఁ గొలిచె నొకతె
లలితసహకారమాధవీలతల కెలమిఁ । బరిణయోత్సవలీలలు సలిపె నొకతె. 292

వ. ఇట్లు బృందారకసుందరీబృందంబు బహుప్రకారంబుల మదనవికారకారణంబు లగులీలావిలోలసంధిభావంబులు పచరించియుఁ గేళివిహారంబుల సంచరించియు ననమశ్శృంగారభంగివిశేషంబుల మెఱయు నారాజతపోధనుచిత్తంబుఁ జిత్తజాయత్తంబు చేయం జాలక. 293

ఉ. మేనక చిన్నవై నిలిచె మెల్లన మోమురవాంచె రంభ లో
నూనినవింత నివ్వెఱఁగు నొందెఁ దిలోత్తమ గర్వహీనయై,
దీనత నొందె నూర్వశి మదిం జలియించె ఘృతాచి యన్యకాం,
తానిచయంబులెల్ల దవుదవ్వుల నుండె భయంబు పెంపునన్. 294

వ. అట్టియెడ ముక్కంటిమగతనంబు సగంబుగాఁ జెనంగిన నెఱజోదు ప్రమోదంబున ప్రయాణసమయసముచితసన్నాహసంరంభవిజృంభితుండై బొండుమల్లెలబొమిడికంబును గొజ్జంగిమ్రాఁగియుఁ బొన్నగుబ్బెలరాగిడిల్లును మెఱయు హరినీలజాలంబులడాలు నేలునలుపునం బొలుపుమిగులు కోదమతుమ్మెదగొనయం బెక్కించి మించుగాఁ దొడిగిన యించువిల్లునం బెల్లునిగిడి పల్లవులయుల్లంబులఁ గాఁడిపాఱు కోరచూపులు గలకలికలుకలికి కనుజిలుకడాలధగధగలం బొలయు మెఱుఁగులు గుఱిగొన బసనిపసుమరసముం గొలికి పులుఁగడిగి గఱులు దీర్చి వంకలొత్తిన గ్రొత్తలై యున్న యున్మాదనమోహనవశీకరణసంతాపనాభిధానంబుల నొప్పారుసహకారసారసాశోకశిరీషకోరకప్రదరంబులు నిలిచి సవరించినకవదొనలు ధరియించి కట్టాయితంబై విరిదమ్మిబండికండ్లును బిసకాండపుటిరుసులును బొగడమొగడలచీలలును దొగలనొగలును మొగలిరేకులపలకయుఁ గలువకాఁడియుఁ గురువేరువాగంబులును సంతరించి వసంతసారథి తిన్ననై యున్నక్రొన్ననమునికోలఁ గదల్చి యదల్చినం గెరలి చెరలి కొట్టుచు మిన్నులపై బాఱుచిలుకవారువంబుల రయంబున దళతళం బొలయుదిక్కులఁ బిక్కటిల్ల వెన్నెలవెదచల్లువెల్లియుఁ గలిగి తనరుతనరథంబు రతిసమేతంబుగా నెక్కి మధుమధురసపానసంభ్రమద్భ్రమద్భ్రమరఝుంకారకాహళారావంబులు చెలంగ నుభయపార్శ్వంబులఁ గదలివచ్చుకలకంఠవీరభటపటలంబుల నంతకంతకు సంతసం బొలయ సేనాముఖంబునం గలయఁ బొలయుమలయానిలయంబుచేత నాఘ్రాతంబు లగుతరువ్రాతంబుల నెసఁగుకుసుమపరాగంబు నభోభాగంబునఁ బర్వి సర్వంబు వదలంబగునిజప్రతా

పావకస్ఫులింగజాలంబు ననుకరింప నరుంధతీపతియాశ్రమంబు సొత్తెంచి యచ్చట
రిచ్చపడియున్నయచ్చరలఁ దెలిపి కలపికొని యామహీపాలుసమీపంబునకుం జను
నప్పు డమ్మహాత్ముండు. 295

చ. ఎసఁగినబాహ్యసంచరణ మెల్లను మాన్చి మరల్చి యుద్దెసం
దుసికలనీక దిమ్మనముతోఁ బిరిగొల్పినచూపు దేవతా
విసరశిరోవతంస మగువిష్ణునిపై నిడి నిస్సవిారణ
ప్రసరణదేశదీపరుచిరస్థితి నిశ్చలయోగయుక్తుఁడై. 296

ఉ. ఉన్నతెఱంగుఁ జూచి రభసోన్నతి మిన్నదలంగ నార్చుచున్
బన్ని శుకాన్యపుష్టమధుపప్రకరామరకామినీతతిన్
మున్నిడి చందనానలసముద్ధతమందమరుత్సహాయసం
పన్నతఁ జేర్చి యందఱుఁ బ్రాపుగ నిల్చి యదల్చి బల్విడిన్. 297

మ. సరి గాందావరమొగ్గనారస మలిజ్యావల్లి సంధించి భా
సురమాణిక్యమయోర్మికారుచులు చక్షుష్కోణశోణద్యుతుల్
బెరయం జక్రనిభాకృతిం దనువు శోభిల్లన్ వడిం దీసి ని
ర్భరముష్టిన్ వెస డాసి యేసె మరుఁ డారాజన్యచూడామణిన్. 298

గీ. అట్లుపుంఖానుపుంఖంబు లగుచు నిగుడు । నతనుబాణపరంపర లానృపాలు
నిచ్చఁ దెరలింపఁజాలక విచ్చిపోయె । జగతిఁ బూవుల కది సహజంబ కాదె. 299

క. తా నసమాస్త్రుం డనియును । మానవపతి మానినీసమన్వితుఁ డనియున్
బూని మది దురభిమానము । మానక నటు పెనఁగి మరుఁడు మ్రాన్పడియుండెన్. 300

వ. అయ్యవసరంబున. 301

గీ. అడఁగె మలయానిలుండు సొంపఱె వసంతు
డలులు విభ్రాంతి నొందెఁ గోయిలలుఁ జెదర
జెదరి పెరాములు వాంచె రాచిలుకపిండుఁ
జిన్నఁబోయిరి దివిజరాజీవముఖులు. 302

వ. అంత నిష్వ్యాకులభూకాంతుం డంతర్నివృత్తహృషీకవ్యాపారుండై యుదయదరణికిరణ
నికరవికసితసరసీరుహదళశోభావిడంబకంబు లగునంబకంబు ల్లలన విచ్చి పురో
భాగంబున. 303

మ. కనియెన్ మారు జగద్విమోహనశుభాకారున్ సమారూఢయౌ
వనశృంగారు శుకాలికోకిలపరీవారున్ లలాటారజో
కనభూరిక్రతుభంజనస్ఫురదహంకారున్ సముద్ధూతచే
తనసంకల్పఫలావతారు విరహస్త్రీప్రాణిసంహారునిన్. 304

క. కని నిర్వికారగతి న । మ్మనుజవరాగ్రేసరుండు మరునకు మరు
ద్వనితల కతిథిసపర్యా । ఘనసత్కారము లొనర్చి కడువినయమునన్. 305

క. సంతసమె కుసుమశర వ । సంత సముల్లాసమే కుశలమే దివిజ
కాంతాజనంబ త్రిభువన । సంతాపహరప్రచార సౌఖ్యమె పవనా. 306

చ. అని మధురోక్తు లొప్పఁ దమ కందఱకున్ బ్రియ మాచరించు న
మ్మనుజవరేణ్యు ధైర్యగరిమంబునకున్ వెఱఁగంది యొండొరుం
గనుఁగొని సమ్మదంబు మతికంపము విన్నదనంబు లజ్జయున్
బెనఁగొన నంతరంగమునఁ బిమ్మిటి గొంచు రహస్యభావలన్. 307

క. ఈతగు లీతెగు వీతెలి । వీతాలిమి యీవిరక్తి యెటు గంటిమె యీ
భూతలపతి గలఁగఁడు మన । చేతల వ్రతసిద్ధి యుల్లసిలుఁగా కింకన్. 308

వ. అని యగ్గించి రంతఁ గంతుం డమ్మహీకాంతున కిట్లనియె. 309

ఉ. నీవు తపస్వి వౌదు ధరణీవర యింద్రియముల్ వశంబు నీ
కావిధ నేనియుం గెలువ నెవ్వరు నోపరు మున్ను జంగమ
స్థావరముల్ మదేకవిజితంబులు నా కగపాటు లేనిభూ
తావలి గల్గెనేని యిది యంతయుఁ గ్రోధముచే హతం బగున్. 310

క. వెఱపింప వచ్చి వెఱచిన । తెఱఁగున నను గెలుతు నని మదిం బూని హరుం
డతిమతిఁ గ్రోధముచేతన్ । బతితతియై తపము విడిచి పాఱఁడె మొదలన్. 311

క. మిక్కుట మగుఁదలపుతమిం । గుక్కుటమై చనిన దేవతలనాయకునిన్
మక్కువ తగవు దలంపమి । నక్కముఁగా సనుని వెఱఁగవా లోకమునన్. 312

శా. కామక్రోధవశంబు విశ్వమును దత్కామంబు క్రోధంబు నా
జ్ఞాముద్రాధరు లబ్జనాభునకు నాసర్వేశు సేవించుటన్
భూమీశోత్తమ నీవు మత్సముఁడవే మున్నే వలోనైతి మే
లా మాటల్ గయికొందుగాక భువనాలంఘ్యాగ్రలోకోన్నతుల్. 313

వ. అని ప్రశంసించి తచ్ఛాపభయంబున నచ్చోట నిమిషమాత్రంబు నిలువ శంకించి మగిడి తనపోటువిధంబు నిష్ఫలసన్నిధానంబున నైన నిజపరాజయంబును సురరాజున కెఱింగించి యథాస్థానంబున కరిగి యంత దురంతకార్యచింతాసంతాపితస్వాంతుండై మరుద్వంతుండు. 314

మ. పటుబాహాబలదర్పితామరచమూపశ్రేణి గొల్వన్ సము
త్కటదీప్తానలవిస్ఫులింగవిసరోగ్రక్రూరధారాశత
త్రుటితగ్రావగరుద్వితాన మగునస్త్రముం బూని యు
ద్భటదానాకులగండమండలమహోదంతావళారూఢుఁడై. 315

క. అతిరయమున నాధరణీ । పతికడ కరుగుటయుఁ దనకుఁ బ్రభుసముచితస
త్కృతు లాచరింపఁ బూనిన । యతనితపస్సిద్ధిఁ గని మహారోషమునన్. 316

క. గిరిభేది వైచె నన్నర । వరుపైఁ బటుకుటిలకఠినవైరివ్రజని
ర్భరగర్భతిమిరసముదయ । హరణదినారంభహేళి నాదంభోళిన్. 317

వ. ఇట్లు ప్రయోగించినఁ బ్రపంచితదీర్ఘనిర్ఘోషభీషణంబై తనమీఁద నడరువజ్రాయుధంబు బెడిదంపుటురవడి కించుకయుఁ జంచలింపక యమ్మనుతనయుండు సకలభక్తభయత్రాణపరాయణం బగు నారాయణదేవునిచక్రంబు దలంచినతత్క్షణంబ. 318

సీ. ప్రళయమార్తాండమండలచండతరసముద్భూతభూరిప్రభాపుంజ మగుచు
ఘనసహస్రారనిర్గతమహోగ్రానలజ్వాలావలీఢదిగ్వలయ మగుచు
సహజతేజోవిశేషక్షణాంతరవ్యాప్తసర్వదివ్యాస్త్రవిస్తార మగుచుఁ
గఠిననిర్ఘాతసంఘాతభీషణఘోషనిర్భిన్నరాక్షసీగర్భ మగుచు
సకలశుకముఖ్యమునియోగిజనసమగ్ర । మహితనిగమార్థసంస్తూయమాన మగుచు
వచ్చె మానసవేగమై వనజగర్భ । దాసభయకర్శనంబు సుదర్శనంబు. 319

వ. ఇట్లు వచ్చినమహాస్త్రరాజంబుతేజంబున డాఁడాలన దళితసంరంభంబై దంభోళి పొడవడంగి పోయినఁ గని జంభారి సిగ్గుపడి బెగ్గడిల దిగ్గన కనకగర్భపాలికిం జని తద్వ్యథం బంతయుఁ జెప్పిన నప్పరమేష్ఠి యాశ్చర్యంబు నొంది వైవస్వతనందనుమనోరథమహత్త్వంబు దెలియంగోరి నిమీలితాష్టనయనారవిందుండై యానందంబున డెందంబునఁ గనువిచ్చి చూచి యాభూవరోత్తము చిత్తము శ్రీరంగశయనప్రవృత్తం బగుట యెఱింగి మెయిమెఱుంగక యుల్లంబోయి మెల్లన తెలిసి నిజస్వామి యగుశ్రీరంగధాముని సన్నిధానంబున కరిగి సురగణసమేతంబుగా సాష్టాంగప్రణామం బాచరించి

కృతాంజలియై ముఖకంజంబులు పుంజంబులుగా నూరకున్న యన్నలువపైఁ గృపా
కటాక్షంబు నిగిడించి పుండరీకాక్షుం డిట్లనియె. 320

చ. జలరుహగర్భ నీదెసఁ బ్రసన్నుఁడ నేను విషాద మేల నా
తలఁ పెఱిఁగింతు నీకు నది తప్పదు విన్ము మదీయదంచితో
జ్జ్వలశుభమూర్తితోఁ దరణివంశమహీధవరాజధానియై
వెలయునయోధ్య కేగదను విశ్రుతరంగగృహాన్వితంబుగన్. 321

సీ. అచట నిక్ష్వాకుధరాధీశ్వరుఁడు మొదలయినతత్కులజనతాధిపతులు
గొలువ మహాయుగంబులు నాల్గు పరిపూర్ణ మగుదాఁక నుండి యనంతరంబ
చోళమండలమునఁ జూడ నొప్పారుకావేరీమహానదీతీరమునను
జంద్రపుష్కరిణీలసత్పుదేశమున మన్వంతరంబులు రెండునైన నిలచి
యంత భవదీయ మగుదివసాంత మైన । నేఁగుదెంచెద నీయున్న యెడకు మగిడి
యపుడు పూజించె దీసుగతాగతంబు । లిట్లు ప్రతివాసరంబును నే నొనర్తు. 322

వ. ఈక్రమంబున భవదీయ ద్వితీయ పరార్థంబు సమాప్తం బైన నీకు ముక్తి యొసం
గెద నొక్కవిశేషంబు వినుము ప్రతిమాస మారాధనంబుచేసి యొకవాసరంబు లేక
యున్న మహాదోషంబు సంభవించుఁ బ్రాయశ్చిత్తంబును వలయు నాలుగెల లెడపడినఁ
బునఃప్రతిష్ఠాపనంబు కర్తవ్యంబు తత్పుసాదకైంకర్యాదు లాదవినం బ్రతివిధానం
బవశ్యకర్తవ్యంబని తత్పరవేను లెన్నుదు రిన్నియమంబు లిన్నియుఁ దివ్యసిద్ధమానుషార్చ
నలయందకాని భుక్తిముక్తివిధాయకం బై స్వయంవ్యక్తప్రధానం బైనశ్రీరంగంబందున
లేవు నీ వనుదినంబు నన్నుఁ బూజించెదు గాన నీకార్యం బంగికార్యం బిక్ష్వాకునకు
శ్రీరంగం బిమ్ము పొమ్మనినం దెలివొంది శతానందుం డాక్షణంబ. 323

మ. సురయక్షాసురసిద్ధసాధ్యభుజగస్తోమంబు గొల్వ న్మనీ
శ్వరవేదస్తుతివాదముల్ సెలఁగ దార్క్ష్యస్కంధపీఠంబునన్
బరఁగన్ రంగనికేతనం బిడి మహీపాలుండు నిత్యవ్రత
స్థిరుఁడై యున్నతపోవనంబునకుఁ దెచ్చెన్ దివ్యమార్గంబునన్. 324

క. కొనివచ్చి యమ్మహీశ్వరుఁ । డనురక్తి నొనర్చు బహువిధార్చనములు వై
కొనియిచ్చె రంగధామము । ఘనరుచిధగధగితదిక్సుఖస్తోమంబున్. 325

మ. అటు శ్రీరంగమహావిమానము నిజైకాయత్త మైనన్ సము
త్కటహర్షంబునఁ దాని మోచుకొని యిక్ష్వాకుండు సామంతులున్

భటులున్ మంత్రులు దన్నుదర్గ్యాన శుభప్రాప్తిన్ బ్రవేశించె ది
క్తటచంచద్ధ్వజతోరణం బగునయోధ్యాపట్టణోత్తంసమున్. 326

క. ఆపురమున కుత్తరమగు । గోపురమున కెట్టయెదుటఁ గ్రోశార్ధమునం
దీపితసరయూతటమున । ద్వీపవతీద్వితయమధ్యదేశమునఁ దగన్. 327

మ. సముఖూమిన్ బరమోత్సవంబునఁ బ్రతిష్ఠాపించె శ్రీరంగమున్
కమనీయావృతవారికేళికదళీఖర్జూరవాటంగమున్
విమలార్ఘప్రతివాక్యవిశ్రుతవనీవిశ్రాంతసారంగమున్
సముఖావార్యవిలోకితాభినవమోతుశ్రీనటీరంగమున్. 328

సీ. పదపడి యద్దివ్యభవనంబుచుట్టును గోటలు నట్టిళ్లు గోపురములుఁ
బటుకవాటంబులుఁ బందిళ్లు నరుగులుఁ గాంచనమంటపములుగా నొనర్చి
పూజనాపరు లగుభూసురోత్తములకు బహుపరిచారికాప్రకరమునకు
విష్ణుధర్మరహస్యవిదు లయినఘనులకు జాబాలిమునికిఁ గశ్యపవశిష్ఠ
వామదేవాదు లగువారివారి కుచిత । మైన నెలవులు రచియించి యందు నిలిపి
తదనుమతిశాస్త్రచోదితోత్సవము లెల్ల । వివిధవిధవాన్వితముగఁ గావించె వారిశ. 329

వ. విశేషించి ఫాల్గుణమాసంబునఁ బూర్వఫల్గుని నక్షత్రంబునఁ బుత్రపౌత్రసహితుండై
యవభృథసహితం బగుమహోత్సవం బొనర్చి నిర్విఘ్నంబునఁ బ్రతివర్షంబును జరుగు
చుండు నంత నయ్యిక్ష్వాకువంశపారంపర్యంబున. 330

క. శశిమరుదశనదిశాకరి । దశనశరచ్ఛరదశారదాశరధరరా
ట్పృథుపలివిశదయశోనిధి । దశరథుఁ డుదయించె నమితదమనోరథుఁడై 331

శా. ఆరాజేంద్రుఁడు పుత్రలాభనిరతుండై యశ్వమేధంబు పెం
పారం జేయఁగఁ దన్మహోత్సవదిదృక్షాయత్తులై వచ్చి రా
పారావారవసుంధరాతలమునన్ బ్రఖ్యాతులై సంతతో
దారైశ్వర్యసమగ్రు లైననృపు లుద్యత్సైన్యసంయుక్తులై 332

గీ. వసుధలోన ధర్మవర్మ సురుచిరవి । ఖ్యాతి నెసఁగు చోళభూతలేశుఁ
డజతనూజవిరచితానందవిధ వాభి । రాముఁ డైనరంగధాముఁ జూచి. 333

క. ఆదేవుదివ్యమూర్తి । శ్రీఁ దనచిత్తమునఁ గదియఁ జేర్చి నితాంతా
మోదామృతమునఁ బులకలు । జాదుకొనం జూడ్కి దివియఁజాలక మదిలోన్. 334

మ. అతులం బైనతపోవిశేషమున నీయజ్ఞాత్ము నిక్ష్వాకుఁడీ
గతి మెచ్చించి విరించిమందిరతురంగం బైనరంగంబు నా
ర్జితశక్తిం గొనివచ్చె నిచ్చటికిఁ జారిత్ర మహావైష్ణవ
వ్రతవిస్ఫారతఁ బూని మత్పురికిఁ రాఁ బ్రార్థింతు నిర్దేవునిన్. 335

చ. అని తలపోయుచున్ దశరథాధిపుయాగము సుప్రయోగమై
యొనరినదాఁక నయ్యెడన యుండి యతండు దువిం బ్రియంబునన్
ఘనముగఁ జేయుసత్కృతులు గైకొని క్రమ్మఱ నాత్మపట్టణం
బున కరుదెంచి నిర్భరతపోనియమోద్యమచిత్తవృత్తుఁడై. 336

గీ. ఇందుపుష్కరిణీతటి కేఁగి యచటఁ । దపము గైకొన నానృపోత్తమునిఁ జూచి
తత్సమీపంబునందు నితాంతనియతిఁ । బాయకున్న మునీశ్వరప్రకర మెలమి. 337

క. ఓనరనాథోత్తమ నీ । మానసమున నేమికోర్కి మసలినఁదపముం
బూనెద వది చెప్పఁగఁదగు । నేనియు నెఱిఁగింపు మనిన నృపుఁ డిట్లనియెన్. 338

చ. హరి నతిభక్తిఁ గొల్చి యజుఁ డాదియుగంబునఁ గన్నరంగము
దిగము పయోజమిత్రకులదీపకుఁ డమ్మనుపుత్రుఁ డిట్లు చె
చ్చెరఁ గొని వచ్చె నాత్మపురిసీమకు నట్లు తదాలయంబు మ
త్పురి కిటనీఁద నేను గొనిపోవుటకై తప మాచరించెదన్. 339

వ. ఏను లోకహితార్థంబుగా నీయర్థంబు సమర్థింపం బూనితి మీచేత ననుజ్ఞాతుండన
కదా యనిన నమ్మహాత్ము లతని కిట్లనిరి. 340

క. ఏలా ప్రయాస మవనీ । పాలక నీతలఁపు మున్న ఫలియించిన దా
కీ లెఱిఁగి శీఘ్రమింకం । జాలింపు తపస్వివేషసంచారంబుల్. 341

వ. అది యెట్లనిన. 342

ఉ. ఉన్నది యీప్రదేశమున నుత్తరదిక్కునఁ గ్రోశమాత్ర ధా
త్రిన్నృప మీపురాతనపురీస్థల మప్పురనాథుఁ గాదె రా
ద్రోన్నతి మున్ను పుష్పశరు నక్కడఁగించినలీల నీతుఁడో
త్పన్నకృశానుకీలముల భస్మము సేసె హరుం డుదగ్రుఁడై. 343

గీ. ఆపురప్రాంతమునఁ గల దగ్నికల్పుఁ । డైనదాల్భ్యమునీశ్వరు నాశ్రమంబు
నచటికొకనాడు మేము కార్యాభిలాష । నరిగి సుఖగోష్ఠిమై మున్న యవసరమున.

చ. హరి చనుదెంచి వాల్మ్యముని యస్మదపేతముగాఁగ భక్తిసు
స్థిరమతిఁ జేయుపూజనలు చేకొని సారదయాసుధారస
స్ఫురితకటాక్షవీక్షణరుచుల్ పొలయంగ మముఁ జూచి మేదురా
దరమధురస్వరంబు జలదస్వనభంగిఁ జెలంగ నిట్లనున్. 345

ఉ. తాపసులార మీయభిమతంబు బొడఁగూర్పుటకై కవేరక
న్యాపులినస్థలంబున నిశాధిపపుష్కరిణీతటిన్ జగ
ద్రూపితరంగమందిరముతోఁ జనుదెంచి వసింతు నేగ మీ
లోపల నెంచఁబోక మదిలోఁ జలియింపక యుండుఁ డీయెడన్. 346

వ. ఎట్లనిన. 347

ఉ. లోకభయంకరున్ దశగళుం బరిమార్చుట కేను రామభ
ద్రాకృతి నర్యమాన్వయమునందు జనించి యయోధ్యలోనఁ బు
ణ్యాకర మైనరంగనిలయంబు విభీషణు కిత్తు నాబుధ
శ్లోకుఁడు దేర మీరు ననుఁ జూచెద రీడ ననంతకీర్తికిన్. 348

వ. అని యానతిచ్చి యప్పరమేశ్వరుం డరుగఁ దోడన కూడి నేను మును మార్తాండమండలపర్యంతంబును గొలిచి చని మరలివచ్చునెడ భవద్వంశకర్త యగువికర్తనుండు మమ్ముఁ గనుఁగొని యిట్లనియె. 349

సీ. మున్ను పద్మజలోకమున రంగశాయి నే నర్చించి మద్వంశు లైననృపులు
దేవ నీపదకంజాతసేవ సేయఁగ నుండవలయు నీ వని మ్రొక్కి వరముగాఁగ
గోరిన గరుణఁ గన్గొని యయోధ్యాపురిఁ గావేరిదరిఁ జిరకాల మేను
వసియించి ప్రీతి భవత్కులీనులచేతఁ బూజఁ గైకొనియెద భూరిదారు
ణౌఘకలివేళ గతిశూన్య మైనప్రాణి । తతికి సులభుఁడ నయ్యెద ధర్మరహితు
లైననాస్తికు లెపుడు క్రందై చరింతు । రపుడు దుర్లభ మగునస్మదాశ్రయంబు. 350

వ. అని యానతిచ్చెఁ గావున శ్రేయోభిలాషంబు లగువారికిఁ గావేరీతీరంబునఁ జోళవంశసంభవుం డైనధర్మవర్మోపదేశంబున నవశ్యంబును శ్రీరంగనాయకుండు వేంచేయు నది తప్పదని చెప్పిన లోకబాంధవుభాషణంబులఁ బరితోషంబు నిగుడ మగిడి వచ్చి యప్పటనున్నవార మచ్యుతుండును దాశరథియై యవతరించినాఁ డచిరకాలంబునన యస్మన్మనోరథంబు సిద్ధించు రఘునాథదయాభూషణుం డగువిభీషణుం డెప్పు

డిచ్చుటకే రంగధామంబు దెచ్చి నప్పుడ నీ కొఱంగించెద మంత వాఁడ భవద్రాజ
ధాని యగునీచోళపురంబునన యుండి మహీపాలనంబు సేయుము పొమ్మనిన సమ్మదం
బిద్ది యని యమ్మానవేశ్వరుం డరిగె ననంతరంబ. 351

సీ. అహిమాంశుకులరోహణాచలస్థలమున నలరినదివ్యరత్నాంకురంబు
జానకీమృదులభుజాపంజరంబున రాజిల్లి విహరించు రాజశుకము
యోగిమానసభూసురోద్యానవనములఁ గలయ వర్తించుశిఖావళంబు
నగజామృదుస్తవనవమధుద్రవములఁ జవుల నింపునఁ జొక్కుషట్పదంబు
కలితకరుణాసుధారసకలశజలధి। దశరథాధిపసుకృతసంతానఫలము
భక్తహృద్వర్తి తారకబ్రహ్మమూర్తి। రాజపరమేశ్వరుండు శ్రీరాఘవుండు. 352

క. రాముఁడు హరిమణినిభుఁ। శ్యాముఁడు శుచిధాముఁ డమరసన్నుతసుగుణో
ద్దాముఁడు రక్షితసుజన। స్తోముఁడు జనదృక్చకోరసోముఁడు మఱియున్ 353

సీ. ఎవ్వనిసుగుణంబు లీశానుముఖ్యులు చెలఁగి కైవారంబు చేయుచుందు
రెవ్వనికరుణచే నెసఁగుధన్యులకు నాకల్పాంత మగు నిర్వికారపదము
ఎవ్వనిఁ గొలుచువా రిచ్ఛసేయరు కల్పతరుకామధేనుచింతామణులను
ఎవ్వనికడకంటి కెలుపు వచ్చినమాత్ర బ్రహ్మాదిదివిజులు పగులుచుందు
రెందు నెవ్వనిచరణారవిందరజము। పెంపు గౌతమసంయమి పెండ్లిసెద్ద
యతఁడు జగదేకచాపదీక్షాగ్రగురువు। రామభద్రుండు లోకాభిరామమూర్తి. 354

వ. అమ్మహాధనుర్ధరవరేణ్యుండు. 355

సీ. కన్నెకయ్యమునందె ఘటితనాకపురీకవాటకఁ దాటకఁ గీటణంచె
మాలుకూఁకటివాఁడె లీలఁ గౌశికయాగభంజనోత్సాహు సుబాహుఁ జంపెఁ
దల మొగగట్టున శక్తి దేవదైత్యదుస్తరము ధూర్జటిధనుర్వరము విఱిచె
నలవోక దొరసి హేలాజితాఖిలనృపస్తోము భార్గవరాము దూలఁదోలె
దండకావనమార్గసంతతనిరోధు। రచితసుజనాపరాధు విరాధు నతిక
దళితసకలామరునిఁ జతుర్దశసహస్ర। దితిజముఖరుని ఖరుని వధించెఁ గడిమి. 356

క. అచలితశరణాగతశరమ్ము। గోచితలీలావిమోహితోర్వీతనయా
లోచనహృదయుని సదయుని। నీమఱ మారీచుఁ గడపె నేలం గూలన్. 357

క. బంధురశరహతిఁ జేసెఁ గ । బంధుని బహుదుర్గశైలబంధుని గృతని
ర్బంధునిఁ బృథుతరకఠిన । స్కంధునిఁ బ్రావీణ్యవిప్రసంగంధునిఁ గలనన్. 358

చ. పరిహరుఁ గాఁగ నేలె నిరపాయచరిత్రుని శత్రుకానన
స్ఫురదురువీతిహోత్రుని సముజ్జ్వలమేరుసమానగాత్రునిన్
బరమపవిత్రు సన్మునిసుపర్వతతిస్తుతిపాత్రునిన్ మనో
హరఫలలీలమున్ గబళితాంబుజమిత్రుని వాయుపుత్రునిన్. 359

శా. లీలం దార్కొని యేసె నుగ్రరణకేళిన్ వాలి వాలిన్ ప్రభా
హేళిన్ హేమసరోజమాలి నరివాహిన్యాటవీకీలి న
స్తాలవ్యాళకరాళవాలపరిబద్ధస్థూలపౌలస్త్యకం
కాళిన్ బూజితశూలి నప్రతిమబాహాసత్వశాలిం బడన్. 360

క. కిష్కింధాపురి నిలిపెను । బుష్కరహితతనయుఁ సునయు భూనుతవినయున్
నిష్కారణరిపుజీవుని । నిష్కలిభావున్ బ్రతాపనిధి సుగ్రీవున్. 361

మహాస్రగ్ధర. బలిమిం గట్టించె నత్యుద్భటభిదురధురాపాతభీతావనీభృ
త్కులసంరక్షావినిద్రున్ గుపితజలచరక్రూరసంఘట్టనోద్య
జ్జలనిర్ఘోషాధిరౌద్రున్ జనితమణిసుధాచంద్రలక్ష్మీసుభద్రున్
బ్రళయాంతస్సుప్తవిశ్వంభరభరితకృపాప్రాప్తభద్రున్ సముద్రున్. 362

మ. హతుఁ గావించె సపుత్రమిత్రముగ దీప్తాస్త్రంబులన్ గాంచన
క్షితిభృద్ధన్వితధరాధరోద్ధరణశక్తిప్రౌఢదోర్దండసం
గతభాస్వద్ఘనచంద్రహాసనిశితోగ్రక్రూరధారాసమా
హతభీతప్రపలాయితాదితిసుతేంద్రాద్రిరావణున్ రావణున్ 363

వ. ఇట్లనన్యసాధ్యంబు లగుమహానుభావప్రతాపతేజోవిశేషాదిగుణంబుల నఖిలజగన్ను
తుం డైనదశరథసుతుండు సమస్తసామ్రాజ్యభోగంబుల ననురాగిల్లుచు, శశ్వదైశ్వ
ర్యం బవార్యంబుగా నశ్వమేధయాగం బుపక్రమించి, భూచక్రంబున ననక్రవిక్రమశ
శాధన్యు లగురాజన్యులఁ దన్మహోత్సవంబునకు రప్పించుచు ధర్మరక్షావనీవరుఁ బిలిపిం
చిన నతండును నిఖిలదేశాగతానేకభూపాలావలోకనజాతకౌతూహలాయితశాతోద
రీచరణమణినూపురఝుళంఝుళధ్వనితగోపురం బగునయోధ్యాపురంబుఁ బ్రవేశించి
యారఘునందనచరణారవిందసందర్శనంబునఁ గృతార్థీకృతజన్ముండై తన్మఖంబు పరి
పూర్ణం బగునంతకు సంతసమందుండి పదరి నిజపురంబునకుం జని యంత నిక్కడ. 364

క. వితతవసంతగుణావలిఁ । జొర పగుడెల నినుఁడు మీనమున నున్నతఱిన్
సితసప్తమి శనిరోహిణి । నతిశుభలగ్నమున వాసరాగమవేళన్. 365

చ. హితుఁ డగువవిభీషణున కిచ్చె దశాననవైరి లీల స
న్నుతి నఖిలార్చనోపకరణంబులతో బహుచిత్రశిల్పక
ప్రతతులతో మహీసురతపస్విసమాజముతో మహోత్సవ
స్తుతమణిహేమవస్తుతతితో శుభసీమము రంగధామమున్. 366

ఉ. ఇచ్చిన భక్తి సంభ్రమము లిచ్చఁ దలిర్పఁ బ్రదక్షిణంబు మ
న్వచ్చి నమస్కరించి జతనంబున మస్తమునన్ వహించి పెం
పచ్చుపడంగ రాక్షసబలావళితో నిజపట్టణంబుకై
చెచ్చెర నేఁగి యేఁగి యభిజిత్సుముహూర్తము చేరున త్తఱిన్. 367

సీ. అను వైనతామరపాంసుజప్పరముల సలరి క్రీడించు రాయంచకవలు
రాజిల్లుకల్వపూగాజుటోవరులలోఁ దవిలిపాయనిచక్రద్వంద్వములును
వావిరిలే నాఁచుదీవపందిరులలోఁ దనుపొందుజలచరదంపతులును
జెంగల్వదెలతరంగడోలికలలో మేలమాడెడుచక్రమిథునములును
దరులఁ బండినసహకారతరులఁ బ్రేమ । గోరి విహరించుమదకేకిశారికలును
గలిగి పథికుల కింపులు గడలుకొలుపు । విమలతరపుణ్యవారిఁ గావేరిఁ జేరి. 368

క. విలసితవనలక్ష్మీకర । కలితనవస్ఫటికముకురగతి నతిరుచిర
స్థలమున మలయానిలమృదు । చలితతరంగానుమేయసలిలం బగుచున్.

క. ఏపారుచంద్రపుష్కరి । ణీపరిసరభూమి రంగనిలయము మిడియె నా
లోపల నస్కోశనృపతి । తాపసులును వచ్చి రతిముదంబున నటకున్. 369

గీ. వచ్చి దైత్యవంశవరునకు సూచితస । త్కృతు లొనర్చి భక్తి యతిశయింప
రంగశాయిచరణరాజీవపూజనం । బాచరించి ప్రముదితాత్ము లయిరి. 370

వ. అంత ననంతగుణగరిష్ఠుం డగు దానవజ్యేష్ఠుం డాసరోవరంబునం గరంబు నియమంబునఁ దత్కాలకరణీయంబు లాచరించి సమంచితోపచారపూర్వకంబుగా సావధానంబున శ్రీరంగరాజపూజావిధానంబు దీర్చి సప్రదక్షిణప్రణామం బాచరించి వేదశాస్త్రపురాణోక్తంబు లగుశ్రీవైష్ణవసూక్తంబుల నభినుతించి గమనోన్ముఖుం డైన యాతనికిఁ గృతాంజలియై యున్నరేంద్రుం డిట్లనియె. 371

క. అకుటిలమానససుజన । ప్రకటితసౌజన్యజన్యపాటితవిమత
ప్రకర మముఁ గూర్చి యిచ్చట । నొకకొన్నిదినంబు లెలమి నుండఁగఁదలతున్.

ఉ. నావుడు నాతఁడెల్లి మనునందన యీఫణిరాజశాయికిన్
శ్రీ వెలయంగ నుత్సవము చేసినయట్టిదినంబు గావునన్
భూవర మత్పురంబునకుఁ బోఁదలతున్ వెస నన్న నాదశ
గ్రీవుసగర్భుతోడ నృపకేసరి యిట్లను నెమ్మిఁ గ్రమ్మఱన్. 373

మ. విమలంబై తనుపొందునీయుభయకావేరీసరిన్మధ్య మీ
రమణీయోన్నతసైకతస్థలము లీరాజీవషండంబు లీ
ధరిమారాంచత్తరుసాంద్రచంద్రసరసీప్రాంతంబు లత్యంతహృ
ద్యము లిచ్చోటన చేయు ముత్సవము దైత్యవ్రాతచూడామణీ. 374

గీ. అనిన నట్లకాక యని నిల్చె నచ్చోట । దానవేశ్వరుండు తత్క్షణంబ
తగుపదార్థములు ముదంబున సమకట్టె । ధర్మవర్త్మధరణిధవవరుండు. 375

శా. నిర్మింపించె ననల్పశిల్పరచనల్ నేత్రాభిరామంబుగా
ధర్మద్వారకవాటవేదిచయకుంభస్తంభకుంభద్ద్యుతుల్
ఘర్మాంశుప్రభ గప్పి దిక్కుల వెలుంగన్ బూపసూపాన్నస
ర్పిర్మద్వాజ్యంబుపయఃపయస్యఫలగుప్తిస్ఫీతశాకావళుల్. 376

శా. భూనాథాగ్రణి యొక్కచోట నలఘుస్ఫూర్తిన్ రచింపించెఁ దా
నానాదేశసమాగతద్విజమహీనాథార్యశూద్రాదిసం
స్థానాస్థానంబులుగా మఠావళులఁ బ్రాసాదంబులన్ దంతిశా
లానీకాయతనంబులన్ విపణిరథ్యామంటపశ్రేణులన్. 377

క. ఈభంగి ననమసంప । ద్వైభవసామగ్రి నభినవంబుగ నిచ్ఛా
లాభసముత్సుకుఁ డగు నా । భూభుజుఁ డొనరింప దైత్యపుంగవుఁ డెలమిన్. 378

గీ. సహ్యకన్యాతటావాససంయమీంద్ర । సమితితో విధిశిష్యపంచకముతోడ
సమ్మహారాజవరునితో సావధాన । బుద్ధియై యాగమోక్తప్రసిద్ధవిధిని. 379

చ. వెలు వగుచంద్రపుష్కరిణిచేరువఁ జారువనాంతవీధి నిం
పులు దుది నింపు మేలిగురుపొన్నలక్రింద సువర్ణమంటప

స్థలమున నిందుకాంతఘటితం బగు వేదికమీఁద నున్నతో
జ్జ్వలమణిపీఠికన్ మృదుభుజంగమరాజవిశాలశయ్యపైన్. 380

క. ఉత్సవ మొనర్చె నాశ్రిత । వత్సలునకు నఖిలభువనవందితునకు శ్రీ
వత్సప్రశస్తకౌస్తుభ । వత్సస్థలునకుఁ గరేణువరవరదునకున్. 381

సీ. అగరుధూపముల మిన్నగల వాసన కెక్క జడివట్టి కుసుమవర్షములు గురియ
భేరిమృదంగశంఖారావముల మించి చారణస్తోత్రనిస్వనము లెసఁగ
ముక్తాతపత్రదీప్తులు మీఱి ఖేచరీకరచలచ్చామరకాంతు లోలయ
ధ్వజరణత్కింకిణీతాళసంగతి నింపు దనరుచచ్చరలనృత్యములు మెఱయ
ననిశకర్పూరతైలధారాతిదీప్త । దీపమాలిక లానతదివిజమకుట
పద్మరాగాంతరంబులఁ బ్రతిఫలింప । మాసరము లయ్యె నుత్సవవాసరములు. 382

ఉ. సమ్మదలీల నిట్లు దివసంబులు తొమ్మిది చెల్లినన్ బ్రభా
తమ్మునఁ బూర్ణచంద్రతిథిఁ దత్పదసంశ్రయులై విరక్తులై
నెమ్మిఁ జరించువైష్ణవమునిప్రకరంబులతో దశాస్యుతేఁ
దమ్ముఁడు వేడ్కమై నవభృథం బొనరించె సముచితక్రియన్. 383

వ. ఇట్లతం డొనర్చు సముచితసత్కారంబులఁ బరితోషితుండై విభీషణుం డర్థమాస
వ్రతంబునఁ దత్పుణ్యక్షేత్రంబున వసియించి మఱునాఁ డరుణోదయసమయంబున
గమనోన్ముఖుండై యద్దివ్యవిమానరత్నంబు నావహింపం బూని తరలింపనోపక
యఖండమదభరాఖండలప్రచండవేదండశుండాకాండమండితంబు లగుబాహుదండం
బులు బెండుపడఁ బెనంగి యొండొండ నిట్టూర్పు లెగయఁ దగఁదొట్టి నెట్టుకొనిన
వగలఁ బొగులుచు నిలాతలంబునఁ బడి పొగల నతనిపైఁ గరుణాతరంగితం బగునపాం
గంబు నిగుడ శ్రీరంగనాయకుం డిట్లని యానతిచ్చె. 384

మ. పరమాహ్లాదన మీకవేరతనయాపర్యంత మీచంద్రపు
ష్కరిణీవారి సుధానుకారి జనలోకస్తుత్యుఁ డీధారుణీ
శ్వరుఁ డస్మత్పదభక్తు లీమును లుదంచత్పుణ్యు లిట్లౌట నా
కిర వీతావు వసింతు నీయెడన పొమ్మా వింక నీలంకకున్ 385

క. విను మితిహాసం బొక్కటి । దనుజాధిప వింధ్యధరనికటమునన్
మును ఫేనిలమహానదుఁ । లొనరఁగ నొక్కెడన గూడి యున్నట్టితఱిన్. 386

క. విశ్వావసుఁ డను గంధ । ర్వేశ్వరుఁ డచ్చోటి కలిమి కేతెంచి మదిన్
విశ్వాస మొదవ మ్రొక్కుచు । నశ్వద్గతి దక్షిణంబు చనినం బిదపన్. 387

గీ. మ్రొక్కె నితఁడు దనకు మ్రొక్కె నీతఁడు దన । కనుచు నీసువానికై కడంగి
తమకు మొదవ నదులు తమలోన వాదించె । ఘనస్వనంబు మింటఁ గడలుకొనఁగ. 388

చ. అతఁడును దక్షిణాబ్ధికి రయంబున నేఁగి భుజంగతల్పసం
గతు నను నన్యదివ్యపదు గానవిశేషములన్ భజించియున్
వ్రతముగఁ బౌష్యమాసమున వాసము తత్తటిఁ జేసి భానుఁ డూ
ర్జితగతి నుత్తరాయణము చెందినఁ గ్రమ్మఱి యేఁగుదెంచుచున్. 389

క. ఆనతుఁ డగుటయు నానదు । లీనతి నీ వాదరించు టెవ్వరి కనినన్
భూనుతమహిమాధిక మీ । లో నెవ్వరు దాని కని పలుకుచుం జనియెన్. 390

ఉ. ఆతతి నమ్మహానదుల కయ్యెఁ బరస్పరగౌరవాల్పతా
హేతుక మైనవాద మది యెల్లఁ గ్రమంబునఁ శాంతిఁ బొందె నే
రీతిని జక్కఁగాక ముదిరెం బగడంబు గదుం గవేరసం
జాతకు నంబుజోదరులసత్పదపంకరుహప్రసూతకున్. 391

ఉ. ఈగున నచ్చలం బొదవ నీగతి నిద్ధయు నా దొనర్చి ప
ద్మాసనుపాలికిం జని మహాత్మసమస్తసరిద్వరేణ్యపు
ణ్యాసమలీల మాయిరువురం దరయన్ ఘన మెవ్వ రన్న నా
వాకి వియత్తరంగిణి కవశ్యముఁ జొప్పడు నంచుఁ జెప్పినన్. 392

క. తొల్లిటివడి చెడి సంభ్రమ । మెల్లను పెస నడఁగి కంత మెడపడి రంతుల్
చెల్లక యుబ్బరివంతలు । పెల్లై కావేరి దైన్యపీడిత యగుచున్. 393

ఉ. బాహ్యాచరంబు గానిశుచిభావమునన్ మదవస్తురాశిసం
వాహ్యధరప్రచారుఁ డగువానిగుఱించి సమస్తనిమ్నగా
సహ్యతపఃక్రియల్ సెఱపి జహ్నుసుతాధికతాభిలాష నా
సహ్యవసుంధరాధరవిశాలతటంబునఁ బెక్కువర్షముల్. 394

క. సరివారిలోన భంగము । పొరసిన సుడిమై గలంక పొడమినఁ గెలనం
బరు లుండిన ధనజీవన । మొరులకు భోఁతీక మెలఁగు టుచితము గాదే. 395

క. ఈపగిదిఁ జరింపఁగ వా । ణీపతి చనుదెంచి సురధునీపాథ్యం బీ
సూపుదు గొను మధికత్వము । నాపని గా వొసఁగ వికచనాళీకముఖీ. 396

చ. అని చనినం గవేరునిప్రియాత్మజ మత్ప్రతిబింబ మొక్కఁడో
ననువుగ నిల్పి భక్తి నెలపార భజించిన మెచ్చి యిచ్చెదం
గొనుము వరంబు నీ కనినఁ గోమలి గోరెఁ ద్వదీయపాదసం
జననఘనప్రతాప యగుజాహ్నవి మీఱుమహోమహత్త్వమున్. 397

క. కోరినఁ గంగానది కా । గౌరవ మస్మత్ప్రసక్తిఁ గలిగెఁ దదాధి
క్యారూఢియు మద్భక్తియు । వారితముం గలుగనున్న వశమే పొందన్. 398

వ. కావున నీకు గంగాధిక్యంబు గల్గునట్లుగా భవదుభయప్రవాహమధ్యంబున మధ్యం
దిన దినకరప్రభాసుందరం బగురంగమందిరంబునఁ దిరంబుగా వసించెద నని ప్రతిజ్ఞ
చేసితినట్లగుట నీప్రదేశనివాసం బవశ్యకర్తవ్యం బని యానతిచ్చినఁ దచ్చరణారవిం
దంబులకు నభివందనం బాచరించి ముకుళీకృతకరాంబుజుండై యారావణానుజుండు,

గీ. ఇందిరాధీశ నీతలం పిట్టిదేని । నిత్యసేవకవృత్తిమై నిన్నుఁ గొలిచి
యేను నిచ్చోటనుండెదఁ గాని విడువఁ । జాల భవదీయపాదాంబుజములపొందు. 400

ఉ. నావుడు నిట్లనున్ దనుజనాయకుతో హరి కర్మభూమి మ
ర్త్యావలి నుద్ధరించుటకునై యిటు నీయవతార మొందితిన్
గావున నిక్కడన్ నిలువఁ గార్యము గద్దటు గాన నెంతయున్
నీవు వసింప నేల రజనీచర పొమ్ము భవత్పురంబునన్. 401

గీ. అచట రాఘవకరుణాకటాక్షలబ్ధ । మహితనిరపాయదనుజసామ్రాజ్యసుఖము
లారవీందుతారకముగా ననుభవించి । మించెదవు మోక్షపదవి నామీఁద ననిన. 402

చ. మది యురియాడ నాతఁడు రమావరు కిట్లను నే నశేషసం
పదలును గాంచి ముక్తి దనుఁ బ్రార్థనఁ జేయఁ దదర్హమై శుభా
స్పద మగురందమందిరము భానుకులాధిపుఁ డిచ్చె నివ్వ నే
నది దిగనాడి యేగతి నహీనభవాంబుధి నిస్తరించెదన్ 403

సీ. అనిన నప్పరమేశుఁ డతనితో విన్ము విభీషణ మోక్షాభిలాషులైన
వారును ఘనభోగవాంఛాపరాయణు లగువారు గల రెవ్వ రట్టిపురుషు

లందఱు నస్మదాజ్ఞానుపాలనము సేయుదురు యాగవ్రతానూనదాన
ముఖబహుశుభకర్మములు నాకుఁ బ్రియముగాఁ గావింపుదురు నీవు నావిధమున
ధర్మ మెడలక మత్పరతంత్రవృత్తి। దగిలి రాజ్య మొనర్పుము తలఁపు నన్ను
నేను నిన్ను నుపేక్షింప నేఁగుదేర। వలవ దెన్నఁడు నీవు నీవారు నిటకు. 404

వ. మఱియు నొక్క విశేషంబు వినుమెల్లకాలంబును బట్టణాభిముఖుండనై వీక్షింపుచుండుదు పంచజనులు పాపకర్ములగుటఁ జేసి నీవల ననుగ్రహంబు సేయుచు నన్నభిలషించి దూరదేశాగతు లయినవారలకుఁ బరమపదప్రాప్తియు మనోరథంబులు నిత్తు, నీద్వీపంబు పుణ్యభూమి యగుటం జేసి యచ్చోట నుండి సంస్మరింపు మత్యంత సుకృతంబు సంభవించు నెక్కుడేటఁ బుణ్యదినంబులందు మత్సందర్శనంబున కతిరహస్యంబుగాఁ గామరూపంబు గైకొని రమ్ము పొమ్మని మఱియు నిట్లనియె. 405

గీ. ధర్మములును సకలకర్మఫలంబులు। పరిహరించి శరణుఁ జొరుము నన్ను
నదియె నీకు మోక్షపదపరప్రాప్తికి। నతిరహస్య మైనయట్టిమతము. 406

చ. అని హరి పల్కినన్ వినతుఁడై మఱి యొం దన నోడి లంకకుం
జనియె విభీషణుండు మునిసంఘముతో నిట ధర్మవర్మయున్
వినుతవిశిష్టపూజనలు వేడుకఁ జేయుచు నుండె భక్తహృ
ద్వనజవిహర్తకున్ భవనివారణకర్తకు రంగభర్తకున్. 407

క. అది యాదిగఁ గావేరీ। నదిఁ జెలువగు పులినతలమునన్ హరికినిజా
స్పదమగు శ్రీరంగం బు। న్నది భజదపవర్గసాధనంబై నేఁడున్. 408

వ. అని చెప్పి యప్పరాశరతనయుండు సవినయుం డగు నాగదంతమునీశ్వరుతో నిట్లను నీప్రకారంబున భువనరక్షణపరాయణుం డగు నారాయణుండు నిజావతారప్రసంగంబు సాంగంబుగా నుపన్యసించి వెండియు సుబోధుఁ గనుంగొని. 409

మ. త్రిజగత్పావనతీర్థసారములు శక్తిశ్రీనిజాకారముల్
భజదిచ్ఛాఫలదప్రచారములు శుంభన్మంగళాకారముల్
కుజనవ్రాతవిదూరముల్ మధురనిర్ఘోషాదిగంభీరముల్
విజితాఘౌఘవికారముల్ దలఁపఁ గావేరీపయఃపూరముల్. 410

క. నీ వింపు మిగుల నీనది । గావింపుము నియతిసమవగాహాదివిధుల్
సేవింపు మెపుడు నను మది । భావింపుము రంగశయనుఁ బంకజనయనున్. 411

తరల. అనుచు నీగతి భక్తవత్సలుఁ డైనయాహరి కర్ణమో
హనసుధామధురోక్తులం దగ నానతిచ్చినఁ బ్రీతుఁడై
మునిజనోత్తముఁ డాసుబోధుఁడు పూని తద్వచనక్రమం
బునఁ జరించుచు నుండె దోషవిముక్తసాత్త్వికవర్తనన్. 412

ఉ. ఈకథ విన్న వ్రాసినఁ బఠించిన నాయురనామయత్వముల్
చేకుఱు వేదవిత్త్వరిపుజిత్వధనిత్వసుఖిత్వముల్ దిరం
బై కలుగున్ మహీసురనృపార్యజఘన్యజకోటి కున్నతుల్
పైకొను వంధ్య పుత్త్రుఁ గనుఁ బాయు ననేకభవార్జితాఘముల్. 413

వ. అని యివ్విధంబున బ్రసంగవశంబునఁ గావేరీమహత్త్వం బుపదేశించె వేదవ్యాసమునీంద్రుండు చంద్రపుష్కరిణీప్రభావంబు దెలుపుతలంపున నాగదంతసంయమి కిట్లనియె. 414

చ. అనుపమదివ్యబోధమహిమాధికుఁ డైనసనత్కుమారస
న్ముని మును చంద్రపుష్కరిణిపొంత దపం బొనరించెఁ బైపయిన్
ఘనమగునంతరాయములు గైకొన కెంతయు శాంతచిత్తుఁడై
యనిలము గ్రోలుచున్ బటుశిఖానలపంచకమధ్యమంబునన్. 415

క. అతనితీవ్రతపస్స్థితి । చేతస్తాపం బొనర్పఁ జింతాకులుఁడై
ధాతకడ కమరనికరస । మేతుండై చని సురేంద్రుఁ డిట్లని పలికెన్. 416

మ. ఘనతేజుండు సనత్కుమారుఁడు మహోగ్రస్ఫూర్తి నుర్విం దపం
బొనరన్ సల్పెడు నిప్పు డైనతని యుద్యోగంబు వారింతుఁ బొ
మ్మనుచున్ బన్నినవిఘ్నముల్ చనియె వహ్ని నీ వుపేక్షించి ని
ల్చిన నేకక్షణమాత్ర లోకములు భస్మీభూతముల్ సేయుఁడే 417

క. కావున నింద్రపదంబా । నావల నొం డెద్దియైననగుఁ దదభీష్టం
బీవేళఁ దడయ కొసఁగి ని । రావిలముగఁ జేయు జగము లరవిందభవా. 418

వ. నేము నిన్ను శరణుఁ జొచ్చినార మెయ్యది కర్తవ్యం బది యానతిమ్మని యాఖండలుం డూరకుండె ననంతరంబ తత్సభాంతరంబునను నుమాకాంతుం డేతెంచి శతముఖప్ర

లందఱు నస్మదాజ్ఞానుపాలనము సేయుదురు యాగవ్రతానూనదాన
ముఖబహుశుభకర్మములు నాకుఁ బ్రియముగాఁ గావింపుదురు నీవు నావిధమున
ధర్మ మెడలక మత్పరతంత్రవృత్తి। దగిలి రాజ్య మొనర్పుము తలఁపు నన్ను
నేను నిన్ను నుపేక్షింప నేఁగుదేర। వలవ దెన్నఁడు నీవు నీవారు నిటకు. 404

వ. మఱియు నొక్కవిశేషంబు వినుమెల్లకాలంబును బట్టణాభిముఖుండనై వీక్షింపుచుండుదు పంచజనులు పాపకర్ము లగుటఁ జేసి నీవల ననుగ్రహంబు సేయుచు నన్నభిలషించి దూరదేశాగతు లయినవారలకుఁ బరమపదప్రాప్తియు మనోరథంబులు నిత్తు, నీద్వీపంబు పుణ్యభూమి యగుటం జేసి యచ్చోటనె యుండి సంస్మరింపు మత్యంతసుకృతంబు సంభవించు నొక్కొక్కయేటఁ బుణ్యదినంబులందు మత్సందర్శనంబున కతిరహస్యంబుగాఁ గామరూపంబు గైకొని రమ్ము పొమ్మని మఱియు నిట్లనియె. 405

గీ. ధర్మములును సకలకర్మఫలంబులు। పరిహరించి శరణుఁ జొరుము నన్ను
నదియె నీకు మోక్షపదపరప్రాప్తికి। నతిరహస్య మైనయట్టిమతము. 406

చ. అని హరి పల్కినన్ వినతుఁడై మఱి యొం డన నోడి లంకకుం
జనియె విభీషణుండు మునిసంఘముతో నిట ధర్మవర్మయున్
వినుతవిశిష్టపూజనలు వేడుకఁ జేయుచు నుండె భక్తహృ
ద్వనజవిహర్తకున్ భవనివారణకర్తకు రంగభర్తకున్. 407

క. అది యాదిగఁ గావేరీ। నదిఁ జెలువగుపులినతలమునన్ హరికినిజా
స్పదమగుశ్రీరంగం బు। న్నది భజదపవర్గసాధనంబై నేఁడున్. 408

వ. అని చెప్పి యప్పరాశరతనయుండు సవినయుం డగు నాగదంతమునీశ్వరుతో నిట్లను నీప్రకారంబున భువనరక్షణపరాయణుం డగు నారాయణుండు నిజావతారప్రసంగంబు సాంగంబుగా నుపన్యసించి వెండియు సుబోధుఁ గనుంగొని. 409

మ. త్రిజగత్పావనతీర్థసారములు శక్తిశ్రీనిజాకారముల్
భజదిచ్ఛాఫలదప్రచారములు శుంభన్మంగళాకారముల్
కుజనవ్రాతవిదూరముల్ మధురనిర్ఘోషాదిగంభీరముల్
విజితాఘౌఘవికారముల్ దలఁపఁ గావేరీపయఃపూరముల్. 410

క. నీ వింపు మిగుల నీవది । గావింపుము నియతిసమవగాహాదివిధుల్
సేవింపు మెపుడు నను మది । భావింపుము రంగశయనుఁ బంకజనయనున్. 411

తరల. అనుచు నీగతి భక్తవత్సలుఁ డైనయాహరి కర్ణమో
హనసుధామధురోక్తులం దగ నానతిచ్చినఁ బ్రీతుఁ డై
మునిజనోత్తముఁ డాసుబోధుఁడు పూని తద్వచనక్రమం
బునఁ జరించుచు నుండె దోషవిముక్తసాత్త్వికవర్తనన్. 412

ఉ. ఈకథ విన్న వ్రాసినఁ బఠించిన నాయురనామయత్వముల్
చేకుఱు వేదవిత్త్వరిపుజిత్త్వధనిత్వసుఖిత్వముల్ దిరం
బై కలుగున్ మహీసురనృపార్యజఘన్యజకోటి కున్నతుల్
వైకొను వంధ్య పుత్త్రుఁ గనుఁ బాయు ననేకభవార్జితాఘముల్. 413

వ. అని యివ్విధంబునఁ బ్రసంగవశంబునఁ గావేరీమహత్త్వం బుపదేశించి వేదవ్యాసమునీంద్రుండు చంద్రపుష్కరిణీప్రభావంబు దెలుపుతలంపున నాగదంతసంయమి కిట్లనియె. 414

చ. అనుపమదివ్యబోధ మహిమాధికుఁ డైనసనత్కుమారస
న్ముని మును చంద్రపుష్కరిణిపొంత దపం బొనరించెఁ బ్రేపయిన్
ఘన మగునంతరాయములు గైకొన కెంతయు శాంతచిత్తుఁ డై
యనిలము గ్రోలుచున్ బటుశిఖానలపంచకమధ్యమంబునన్. 415

క. అతనితీవ్రతపస్స్థితి । చేతస్తాపం బొనర్పఁ జింతాకులుఁ డై
ధాతకడ కమరనికరస । మేతుం డై చని సురేంద్రుఁ డిట్లని పలికెన్. 416

మ. ఘనతేజుండు సనత్కుమారుఁడు మహోగ్రస్ఫూర్తి నుర్విం దపం
బొనరన్ సల్పెడు నిప్పు డైనతని యుద్యోగంబు వారింతుఁ బో
మ్మనుచున్ బన్నినవిఘ్నముల్ చనియె వమ్మై నీ వుపేక్షించి ని
ల్చిన నేకక్షణమాత్ర లోకములు భస్మీభూతముల్ సేయుఁడే 417

క. కావున నింద్రపదంబా । నావల నొం డొద్దియైననగుఁ దదభీష్టం
బీవేళఁ దడయ కొసఁగి ని । రావిలముగఁ జేయు జగము లరవిందభవా. 418

వ. నేము నిన్ను శరణుఁ జొచ్చినార మెయ్యది కర్తవ్యం బది యానతిమ్మని యాఖండలుం డానతుండై నంతరంబ తత్సభాంతరంబునను సమాకాంతుం డై తెంచి శతమఖప్ర

ముఖనిఖిలబర్హిర్ముఖులఁ గనుంగొని తదాగమనప్రయోజనం బడిగి వారలు సనత్కు-
మారఘోరతపోభీరు లగుట దెలిసి జలజాసనుం గనుంగొని. 419

క. ఇది యేటికొఱకు దలఁచెద । రెయ్యది సేయంగఁ దగినకార్య మెద్ది జగంబా
పద యెట్లు వాయు ననవుడుఁ । ద్రిదశజ్యేష్ఠుండు వామదేవున కనియెన్. 420

ఉ. అరయ సనత్కుమారుఁడు యుగాంత్యమహాచలతీవ్రతేజుఁ డై
వ్వరికినిఁ దత్తపం బుడుప వచ్చునె మోక్షపదాభిలాషమై
పరఁగెడు వారిఁ డిట్టిపని పంకజనాభునిచేతి దాట వా
హరి కిది విన్నవింపు మన ముందఱయుం జను టొప్పు నిత్తఱిన్. 421

వ. అని యాతనింబ కదలి చని. 422

మ. అరవిందప్రభవుండు గన్గొనియె మధ్యస్థానసుప్తాంబుజో
దరపర్యంకభుజంగపుంగవసముద్యద్భూరిభోగాగ్రవి
స్ఫురితానేకనిగూఢదివ్యమణిసంభూతప్రభాపుంజపం
జరజాతాభ్రపదభ్రమాకలితభాస్వత్సారథున్ నీరధిన్. 423

వ. మఱియు నమ్మహార్ణవంబు సముద్గీర్ణమదదుర్నివారంబులై విస్రంభవిహారంబులఁ బరిభ్ర
మించుకుంభీకుంభీరతిమితిమింగిలకమఠకర్కటాదిజలగ్రహంబుల సమగ్రకోలాహలం
బుల నినుమడించి బ్రహ్మాండభాండోదరనిరంతరజంతుసంతాననిర్ఘోషప్రతిఘోషంబు
లై వడి నెడపడక విశ్వవిశ్వంభరాభారధురీణశేషకర్ణకుహరంబులు చెవుడుపడ నడ
రుబెడదంపుమ్రోఁతలును, దుర్వారవేగవహదిమహామారుతప్రేరితంబులై చూడ్కు-లకు
వెక్కసంబుగా నెక్కుడఁ జూచినఁ దండతండంబు లగుచు నొండొంటి నొత్తుకొని
వచ్చును త్తుంగతరంగసంఘట్టనరయంబునఁ బొడమి యెడములం గూడి దరులకుఁ దొట్టి
తెట్టువలు గట్టె నాస్తోకంబులై కౌస్తుభాకల్పునకుఁ దల్పం బగుభుజంగపుంగవు డప్పటి
కడలించినపుప్పసంపుతిప్పలచొప్పున రసాతలాభిలక్రీడానురాగకలిత నాగకన్యకా
బృందంబుపందెంబునకై యొగ్గైచిన ముక్తాఫలకందళంబునుంబోలె వియచ్చరు లచ్చె
రువుగొంద నుచ్చలితం బగుబిందుసందోహంబులును, నితరనిమ్నగాసంగంబులభంగంబు
గెంపు తనవలనఁ బండితాభావంబు భజియించియంబరంబు వదలక నిద్రాత్యాగంబునుం
బోలె ననిమిషాలోకనస్థాయియున్న మిన్నేటిఁ దేర్చుటకై నేర్పునఁ బరిరంభించిన దిగ్ఘ
బాహార్గళంబులలీల నర్థింకమంబులై క్రాలుకల్లోలంబులును, ఘూకకాలంబున నమ్మ

ధోత్పాదనసమయంబున దేవదానవవ్యూహబాహాపసవ్యసవ్యాకృష్యమాణఫణిరాజగజ్జావలయవలయితామంథరమందరపరిభ్రమణవిలులితంబు లగుపయఃపూరంబుల విభ్రమవిశేషంబుల నెందునుఁ బాయకున్నవో యనుశంక నంకురింపఁ జేయువిపులావర్తంబులును, బహువిచ్ఛేదనారంభవిజృంభితుం డగుజంభారివలనిభయంబునం బెకలివచ్చి దఱియం జొచ్చినయం దదనుధావనసందేహాకులంబులయి నిక్కి చూచుధరాధరనికరంబులశిఖరంబులఁ బోలె నత్యున్నతవిస్తారాయామరమణీయంబులై రజతమహారజతరత్నపద్మప్రముఖప్రశస్తవస్తువిశేషంబులప్రోవులదీవులును, బహుధాగర్భనిర్భరబాడబానలశిఖాకలాపంబు లక్కడక్కడఁ బిక్కటిల్లి వెలికి నిగిడినభాగునం గొనలు సాఁగి సోఁగలై సొబగు మిగిలి పొదలి పొడిగొని యంబరభాగంబునఁ బరఁగి రాగిల్లు తరుణారుణకిరణజాలంబులఁ గేలిగొనఁ జాలి యుపాంతప్రదేశంబుల నత్యుద్రంబు లగు విద్రుమలతాచయంబులును, స్వాధీనలై యభిసారికాలీల లంగీకరించినతరంగిణులకూడ నాత్మీయదక్షిణనాయకత్వం బెఱుకపడఁ దత్తదుచితసంకేతస్థలంబుల విలసించుచందంబున మందానిలస్పందమానమందారమంజరీమకరందనిష్యందబిందుసందోహశీతలసికతాతలంబులం గలవేలావనాంతరంబులఁ గ్రమ్మంబాఱిన నదీసంగమస్థానంబులును, మధ్యభాగంబున యోగనిద్రాపరాయణుం డగునారాయణుదివ్యదేహకాంతిప్రవాహయోగంబునఁ గృష్ణత్వంబు గైకొని యాపున దీపించునంతర్గతక్షీరగ్రాహినీలమణిధామంబుల నతిశ్యామంబు లగునాగంబులును, భువనద్రోహులు పాతాళబిలంబులం దాఁగి యున్నదైతేయవ్రాతంబులఁ బరిమార్ప ననువుపడుటకై క్షీరకాండంబు లొండొండ క్రోల నాఖండలుండు పుత్తెర నరుగుదెంచినబలాహకసందోహంబులుం బోలె వప్రక్రీడాలోలంబులైనవన్యశుండాలంబులుం గలిగి యపవర్గంబునుం బోలె ముక్తాస్పదంబై, యచలగహ్వరంబునుం బోలె హరినిద్రాసుఖోచితంబై, యచ్యుతకరంబునుం బోలె నారూఢచక్రంబై, యంబుదాగమనంబునుం బోలె నహీమకరభాసురంబై, యమరాద్రియుం బోలె నత్యాప్తచంద్రపాదంబై, యశ్వరత్నంబునుం బోలె నసమసుధారాజితంబై, యాహవరంగంబునుం బోలె నతిప్రభావలక్షితదివ్యకాండంబై, సురభిసమయంబునుం బోలె సుజాతసుమనోబహులంబై, రమణీనితంబంబునుం బోలె రత్నగర్భాభిరామమేఖలంబై, మెఱసి గాంభీర్యంబునకు విస్రంభస్థానంబును, మాధుర్యంబునకు ధుర్యంబును, మర్యాదకు నాదికారణంబును, నౌదార్యంబునకు నాకరంబును, నద్భుతభయానకంబులకుఁ దానకంబును, నాధిక్యంబునకు నావాసంబును, నాదితిమికమఠభూదారవిహారంబున కాధారంబును, నతిమహత్త్వంబున కాస్పదంబును, ననుపమానంబును నై పెం

పొంద డెందంబునం దనుభావంబున గొనియాడుచుఁ దీరంబు సేరి శరణాగతశరణ్యుం డగు నప్పుండరీకాక్షు నిట్లని స్తుతించె. 424

సీ. హరికి బ్రముక్తాద షడ్గుణైశ్వర్యసంపన్నునకు శాంతునకుఁ బరునకుఁ బరాత్ము
నకు నగణితతేజునకుఁ బరమేష్ఠ్యాత్మునకుఁ బరమేశ్వరునకు ననంత
నిరుపమభూత్యేకనిధికిఁ బరాపరేశునకు నచింత్యరూపునకు నాది
కర్తకు విశ్వభోక్తకు నక్షయానందమూర్తికి నిత్యతృప్తునకు నిత్య
శుద్ధునకు నీవ దేవ యీసురపతియును । హరుఁడు నేనుఁ జరాచరోత్కరము నీవ
జగము లన్నియు నీయందు సంభవించు।నీవ రక్షింపఁగా మను నీరజాక్ష. 425

గీ. సకలవేదములును సంకల్పసంస్కృతి । కారణములు నీకుఁ గాక యంత
కర్తృభోక్తలును జగన్నాథ నీవు నీ । విక్రమాధిగతము విశ్వచయము. 426

క. సదసత్పరుఁడవు సర్వ । త్రిదశశరణ్యుఁడవు వార్తికి వాంఛుఁడ వె
య్యది విబుధదృశ్య మగుపథ । మది యుష్మత్పరమధామ మంబుజనాభా. 427

వ. భవచ్చరణశరణాగతుల మమ్ము రక్షింపు మఖిలంబు నీవ యఱుంగు దని ప్రస్తుతించి కాంచనగర్భుండును నిర్భరానందంబున నమ్ముకుందున కభివందనంబు గావించి యూరకుండె నప్పుడాఖండలపరశుఁడును నాఖండలుండును బహువిధంబులఁ బ్రస్తుతించిరి యిత్తెఱంగున నందఱుఁ బ్రార్థింప వారలముందఁ బ్రసన్నుండై పారావార మధ్యంబున. 428

సీ. దివ్యవిగ్రహకాంతి దిగ్విలాసినులకుఁ గర్ణోత్పలశ్రీలు గడలుకొలుప
మహితనానాకల్పమణిదీప్తు లంబరస్థలిఁ జిత్రరచనలు సంఘటింప
నభినవాంశుకరుచు లాపగాధిపహరిద్రారాగశంక నీరధికి నింప
శంఖచక్రాంశుపుంజము జనతకౌముదీబాలాతపంబులపసలు చూప
సితవిశాలాయతేక్షణశ్రీలు కుముద । వారిరుహవికాసమునకు వన్నెనింప
కరుణ మూర్తిభవించె నిక్కరణి ననఁగ । నెలమిఁ బ్రత్యక్ష మయ్యె లక్ష్మీశ్వరుండు. 429

క. అప్పరమేశ్వరుఁ గనుఁగొని । యప్పుడు ప్రమదంబు భయము నద్భుతమును లో
ముప్పిరిగొన శ్రుతిమతములఁ । జొప్పడ నుతియించి రదితిసుతు లానతులై 430

ఉ. అవ్విబుధవ్రజంబునుతు లంబురుహోదరుఁ డాదరించి లే
నవ్వు దొలంకుమోవుల మనంబుల దుస్థితులెల్లఁ బాపి మీ

రెవ్వరు మీరు నిచ్చటికి నిప్పుడు రాఁ గత మేమి యింతలెన్
బర్వెన నవ్వ యొయ్యది సమస్తముఁ జెప్పుడు నాకు నావుడున్. 431

క. శ్రవణామృతమును మేఘా । రవగంభీరంబు నగుధరాధరుపలుకుల్
దివిజజ్యేష్ఠుఁడు విని భ । క్త్యవనతుఁడై విన్నవించెఁ బ్రాంజలి యగుచున్. 432

గీ. ఏను గమలభవుఁడ నీకంటు శశిమౌళి । హరిహయుం డితండు సురలు వీర
లింతవట్టువార మెప్రుడు నీపదములు । గోరి తలఁచి బ్రదుకువార మీశ. 433

ఉ. దేవ సనత్కుమారుఁ డతితీవ్రతపోరతి నున్నవాఁడు లో
కావలి తత్ప్రతాపమహిమార్చికి మండెను వానికోర్కి నే
మై వివరింపఁ దీర్పనిసమర్థుల మాటను భూతకోట్లకున్
నీవు శరణ్యుఁడౌటను మునిస్తుత నీ కిది విన్నవింపఁగన్. 434

క. మావచ్చుట యిటమీఁదట । దేవరచిత్తంబుకొలఁది తెల్లం బని భా
షావిభుఁడు నూరకుండిన । శ్రీవల్లభుఁ డంత దరహసితవదనుండై. 435

చ. వనజభవున్ హరున్ త్రిదశవల్లభుఁ జూచి సనత్కుమారస
న్మని దపమాచరించుపని మున్న యెఱుంగుదుఁ దన్మనోరథం
బనితరసాధ్య మట్లగుట నంతయు నే నొకజాడ దీర్చి పొ
మ్మని యొదఁగాని మీరు చనుఁడా తమవీడులకున్ ముదంబునన్. 436

గీ. పద్మసంభవ నాదృష్టిపథమునందుఁ । బడినవాఁ డెప్పుడైన నాపదఁ దొలంగి
చిరతరైశ్వర్యసుఖములఁ జెంది వెలుఁగు । నని యొ మఱి చెప్ప నేల నీయట్టివారి 437

చ. అనినఁ గృతార్థులై ప్రమదమారఁ దదీయపదారవిందవం
దన మొనరించి తద్వరశతంబులు గాంచి విశేషకాంతియా
వనకరుణావలోకమృదువాగ్విభవంబు లనేకభంగులన్
వినుతులు సేయుచున్ జనిరి విశ్వపితామహముఖ్యదేవతల్. 438

వ. అని యిట్లు కృష్ణద్వైపాయనుండు నాగదంతున కెఱింగించిన తెఱంగున 439

మ. ప్రతిభాపోదితసర్వశాస్త్రకలనాపాండిత్య సద్భావదీ
వ్రతసంకల్పితగోహిరణ్యమణిభూవస్త్రాన్నదానాభిత
ర్పితధాత్రీసురబృంద మందరమహీభృద్ధైర్య వీణాదిసం
గతసంగీతకళావిలోల బుధలోకస్తుత్యనిత్యోదయా 440

క. జరఠఫణికమఠపరివృఢ । కఠినకిరికులకుధరవిధృతఘనగిరిధరణీ
భరభరణక్షమ దక్షిణ । కరఖరకరవాల విమతగర్వవిభాళా. 441

మాలిని. రుచిరమణికలాపా రూపపుండ్రేక్షుచాపా
ప్రచురవిబుధపుణ్యా బ్రహ్మరంగాగ్రగణ్యా
విచలితరిపుచేతా విఠ్ఠలేంద్రానుజాతా
సచివకులలలామా చాగయామాత్యరామా. 442

గద్యము. ఇది శ్రీమద్భీమరాంబావరప్రసాదలబ్ధసారస్వతవిలాస గౌరనామాత్యపుత్ర
సుకవిజనమిత్ర సుధీవిధేయ భైరవనామధేయప్రణీతం బైనశ్రీరంగ
మహాత్మ్యం బను పురాణకథయందు
ద్వితీయాశ్వాసము.

# శ్రీరంగమహాత్మ్యము.

## తృతీయాశ్వాసము.

క. శ్రీమాధవపదకోమల । తామరసార్చనవిధానతత్పర సుజన
క్షేమంకరకరుణోదయ । చామీకరరుచిరధామ చాగయరామా. 448

వ. అవధరింపు మఖిలకథాకథనచాతురీజనితరోమహర్షణుం డగురోమహర్షణకుమారుండు దివ్యబోధను లగుశౌనకాదితపోధనులకుఁ జెప్పినచందంబున నిందిరాసుందరుం డరవిందభవాదిబృందారకబృందంబు ననిపి యనంతరంబ. 444

సీ. పరిణాహపరిలసత్ఫాలభాగంబున రమ్యమై యూర్ధ్వపుండ్రంబు వెలుఁగ
నలినాక్షమాలికాకలితవక్షంబున ధవళయజ్ఞోపవీతములు మెఱయ
ముఖ్యరత్నాంకితముద్రాభిరామహస్తముల నూతనపవిత్రములు దనర
సింహసంహననతాశ్రీకిని బైకొఁపు గాఁగ నుద్గమనీయకం బెలర్పఁ 445

తే. కోమలోత్పలదళకాంతి కొమరుమిగులు । మేను గృపతోడఁ జెఱువవ్వు మెఱయఁజూపు
నుదయశైలోపరిస్థలి నల్లసిల్లు । జలజబాంధవు మిగులు తేజమును గలిగి. 446

మ. హరిలీలం బ్రణవాత్మకుం డగుటఁ దా సధ్యాపకుండై ఖగే
శ్వరచక్రాబ్జసరోజనందకగదాశార్ఙ్గాఖ్యకంబుల్ మనో
హరభాస్వద్ఘటకాకృతుల్ మెఱయ శిష్యస్తోమమై విస్ఫుట
స్వరవర్ణక్రమవేదపాఠనిరతిన్ సద్భక్తి సేతేరఁగన్. 447

క. వారలఁ జదివించుచు నిజ । చారుతరద్యుతులు సఖిలజగములకు ముదం
బారోహించుచు ద్రుహిణకు । మారుఁడు తప మున్నయాశ్రమమునకు నరిగెన్. 448

వ. అప్పు డనన్యసాధారణంబు లగు నారాయణప్రభుగుణగణంబులచేత వశీకృతంబు లైన సకలవేదశాస్త్రంబులు త దాకారంబులు ధరియించి యనుసరించె. సనకసనందనాది ప్రసిద్ధసిద్ధమునిసాధ్యవిద్యాధరకిన్నరకింపురుషాదులు సంతతికులంబున సంతోషితులై గొలిచి చనిరి. తదీయసామగానపరిపోషితంబులై మృగంబులు ఖగంబులుతోడన

తగిలిపోయె నివ్విధంబున నప్రమేయప్రభావభాసురుండై తనయున్నయెడకు వచ్చు
నాకపటభూసురు దవ్వుదవ్వులం గని ప్రత్యుత్థానంబు చేసి కృతాంజలియై కంజభ
వనందనుం డంతర్గతంబున. 449

క. ఈవేష మీశుభాకృతి । యీవిశ్వవ్యాప్తతేజ మీసత్కరుణా
భావము నదృష్టపూర్వము । లీవిప్రుఁడు మనుజమాత్రుఁడే తలపోయన్. 450

ఉ. ఈవటువుల్ సరోరుహనికేతుఁ లందఱుఁ గృష్ణసారచ
ర్మావృతనిర్మలాంఘ్రులును లంచితకుంచితనీలమూర్ధజుల్
పావనభావు లుజ్జ్వలితపావకతేజు లనూనలక్షణ
శ్రీవిలసత్త్రయీపఠనశీలు రనాహతశేముషీనిధుల్. 451

వ. ఇమ్మహామహుం డేమినిమిత్తంబున వచ్చుచున్నవాఁడకో యని వితర్కించుచు విస్మ
య స్తిమితలోచనుండై చూచుచున్నయమ్మునికుంజరుం జేరం జని నిజసమాగమంబునఁ
దన్నుఁ గృతార్థుని గాఁ దలంచు నతనికోడ నాకమలాకళత్రుండు. 452

క. ఓయతివర నీ వెవ్వఁడ । వీయెడ నిట్లుండ నీకు నే లనిన మహా
త్మా యే సనత్కుమారుఁడ । పాయక యిన్నెలవునం దపం బొనరింతున్. 453

ఉ. భూవిబుధాగ్రగణ్య కృతపుణ్యవిచిత్రము నీచరిత్ర మే
తావున నుండి వచ్చి తెచటన్ వసియింపుదు రెట్లు గూడె ని
న్నీవటుసంచయంబు జనయిత్రియుఁ దండ్రియు నెవ్వ రిప్డు నీ
భావగతార్థ మెయ్యది కృపామతి నా కెఱుఁగంగఁ జెప్పవే. 454

క. నీపుణ్యదర్శనంబునఁ । దాపము లడఁగెం ఫలించెఁ దదభిమతంబుల్
ప్రాపించె నెవ్వ రీవీ । రూపున విహరించె దాహరుఁడవో హరివో. 455

క. అనవుడు నమ్మునిపుంగవుఁ । గనుఁగొని యంతఃస్మితప్రకాశితముఖుఁడై
ఘనవచతురవచనరచనలఁ । దనతెఱఁగు మెఱుంగి ధరణీధరుఁ డిట్లనియెన్. 456

సీ. ఇందుండి వచ్చితి నిప్పుడే ననరాదు సకలలోకైకసంచారిఁ గాన
నిది యాది నెల వని యేర్పరింపఁగఁబోల దెందుఁ జూచిన వసియింతుఁ గాన
రూపించి తల్లిదండ్రులఁ జూపి చెప్పఁగా లేదు నా కెవ్వరు లేరు గాన
వీరు బంధువు లని వివరింపఁగూడదు సర్వభూతములకు సముఁడఁ గాన

వటువు లిట్టట్టుగతిఁ జేరి వచ్చి రనఁగఁ । బొందుగాదు నిమిత్తసంభూతు లగుచుఁ
జిత్తగత మైనకార్యంబు చేతలందు । నెఱుఁగఁదగుఁ గాక మాటల నేమిచెప్ప. 457

గీ. హరుఁడఁ గా నేను నముచిసంహరుఁడఁ గాను । యతివరేణ్య యథేచ్ఛావిహారపరత
వఱలు నొకపురుషుఁ డని నన్ వటువులెల్ల । శిష్యులై భక్తిశుశ్రూష సేయఁ గందు.

సీ. నిగమజాతంబు నే నిల్పఁబట్టిన నిల్చు నగములు నా చెప్పినట్లు చేయుఁ
బుడమి నాముందటఁ బోరాదు దర్పింప శ్రీ వహింతు నపూర్వసింహ మనఁగఁ
బటుపరాక్రమముల బ్రహ్మ మీఱుదు వాదు లెదిరిన ఖండింతు మదము లడఁగ
శైశవంబునన యజ్ఞవ్యాహుతుల్ దీర్తుఁ బ్రజ్ఞమై శేషరూపము భజింతు
మును మహర్షులు సర్వజ్ఞమూర్తి యనుచు । వినతులుగ నిష్పరిగ్రహవృత్తి నుందు
వివిధదుష్కర్మరతులు గర్వించిరేని । నిగ్రహింపుదు సుకృతంబు నిలుపుకొఱకు 459

ఆ. ఇవి మదీయగుణము లివ్విధము నీచేత । దెలుపఁగఁబడినపిదప నేమి గలదు
నీకు నది యటుండె నిన్నొక్కమాట నే । నడుగవచ్చితి విను మట్టిప్రశ్న. 460

చ. ఎడపక సర్వవస్తువుల కెయ్యది కార్యము వాచ్య మెయ్య దె
వ్వఁడును మనుష్యసంహతికి భూతచయంబున కెద్ది చక్షు వె
య్యెడ నొక టయ్యుఁ బెక్కయిన దేమి ఘనాశ్రయముల్ ఘనంబులై
యడఁకెడు నెద్ది యల్పతర మయ్యును వ్యాపక మెద్ది యారయన్. 461

క. ఎయ్యవి సదసత్తులు పర । మెయ్యది దానికిఁ దలంప నెద్ది యజాతం
బయ్యును బహుప్రజాతం । బయ్యెసఁగుచునుండు భూసురాగ్రణి చెపుమా. 462

వ. అనిన నయ్యుత్తమద్విజునకు నజానికొడు కిట్లనియె. 463

మ. మఱి నే నిన్నొకవిప్రమాత్రుఁ డని నమ్మంజాల యుష్మత్సమ
ప్రతిభుల్ శిష్యులు నిట్టిచందము దలంపన్ మాదృశానుగ్రహాం
చితబుద్ధిన్ వసుధావతీర్ణుఁ డగులక్ష్మీభర్త వీమూర్తి సు
స్థితియుం దేజము నన్నవారలకు నేదీ యట్లు గాకుండినన్. 464

క. నీ వడిగినప్రశ్నములకు । భావం బిది యని యెఱింగి ప్రత్యుత్తర మీ
నా కశమె ఘనతరప్ర । జ్ఞావంతుల కైన నది యశక్యం బనినన్. 465

వ. సకలవేదాంతరహస్యవేదివగు నీవు దక్కఁ దక్కినవార లిట్టి ప్రశ్నలు గావింప వానికిఁ దగిన యుత్తరంబులు చెప్ప నసమర్థులుగావున నాదెసం గలుగు కరుణా గుణంబేర్పడ నెంతయు నీవుదెలుపు మని ప్రార్థించిన నమ్మహానుభావుం డిట్లనియె. 466

సీ. ఎల్లవర్ణములకు నెప్పుడు గార్యంబు ధర్మంబు మఱి సుకృతంబుఁ బాయ
రనిశంబు దివ్యశక్త్యావిష్టుఁ డగుపద్మబంధుండు చక్షువు ప్రాణితతికిఁ
దగ నేకమయ్యుఁ బ్రధానంబు కార్యరూపమునఁ జూడఁగ బహుత్వమ భజించు
నాధారహీనమై యధికమైనది పరబ్రహ్మ మల్పం బనల్పంబు వ్యాపి
పరఁగ సదసత్తు లనఁగ నక్షరము క్షరము । నన్య మీరెంటికిని బరమాత్మ తలఁప
భవముఁ బొందక యుండియు బహువిధముల । జనన మొందుచునుండు నీశ్వరుఁడు వత్స.

క. చెప్పితి సంక్షేపంబున । నిప్పటిప్రశ్నోత్తరంబు లెయ్యవి యింకన్
జెప్పవలయు నీ కనుటయు । నప్పరమవరేణ్యుతోడ నజుఁ డిట్లనియెన్. 468

సీ. ధర్మ మెట్లది సూనృతం బెద్ది దివ్యశక్త్యావేశ మ ట్లేకమైనవస్తు
వరయ నేరీతిఁ బెక్కగు నిరాధారత బ్రహ్మంబు కెద్ది యల్పత్వఘనత
లొక్కటి యెట్లు నెం దొగిఁ బ్రసన్నబ్రహ్మ మక్షరక్షరముల కన్య మగుచు
నెట్లు చెప్పితి పుట్టు వెన్నఁ డెఱుంగని యీశ్వరుం డెట్లుదయించుచుండు
మాటిమాటికి నింతయు మర్మంబు । సంశయము నొందఁజేసె నీశంక లెల్ల
దీర్ప నర్హుండ వీవ సుధీవరేణ్య । యనినఁ దెలిపెద విను మని యతఁడు వలికె. 469

క. నిగమములు భూతసమితికిఁ । దగుగతి యగుటం దదితరక్రియ పరమం
బగుధర్మ మనిరి హింసలఁ । దగులనిసత్యంబు సూనృతం బనఁ బరఁగున్. 470

గీ. విష్ణుశక్త్యభివిష్టమైవిశ్వజగము । నొగిఁ బ్రవర్తించుఁ గావున్న నుడిఁగి మడుఁగు
నాత్మ దనుఁ బాసిపోయిన యట్టికుణప । మడరి చేష్టింపఁజాలనియవ్విధమున. 471

మ. పరమవ్యోమపదంబునం దవిరతోత్పన్నామితానందభా
స్వరలీలన్ బరమాత్ముఁ డుండుఁ దనయాజ్ఞం బద్మగర్భాండముల్
పరివర్తింపఁగ నప్పరేశ్వరుని శుంభచ్ఛక్త్యవష్టంభవి
స్ఫురణం బెంపు వహింప వాయుహుతభుక్పూషాద్యసంచారముల్. 472

క. ఏవస్తువు లక్షూర్జిత । మై వీక్షణగోచరంబు లగు మునివర నీ
వావస్తువుల నెఱుంగుము । శ్రీవిష్ణునిదివ్యశక్తిజృంభితములు గాన్. 473

వ. మొదట నొక్కటయైనఘటత్వపటత్వాదిజాతికి సజాతీయంబు లుద్ధాకృతివైషమ్యం బున బహుత్వంబు బహుత్వంబు యుక్తంబైనకరణి నేకంబైనవస్తువునకుఁ గార్యకా రణభావంబున ననేకంబు సిద్ధించుట విరుద్ధంబుగాదు. సర్వంబునకుఁ బరబ్రహ్మ మా యాధారంబుగాఁ దదాధారం బసంభవం బగుట నది నిరాధారం బని చెప్పితి నట్టిబ్రహ్మంబునకు సంకోచవికాసంబునం జేసి యల్పత్వబహుత్వంబులు ప్రపన్నం బగు మఱి సర్వసామాన్యయుక్తంబునను విశ్వజాతీయదర్శనంబునను అనిర్దేశ్యవిశేషత్వంబు నను గల్యాణానంతసంశ్రయంబునను జేసి పరమాత్మ నసత్తుకంటెఁ బరం బని యెఱుంగు నది బ్రహ్మాదిపరిణామంబులం దాత్మయై తదన్యత్వంబున నవశ్యజాయమానుండయ్యును బరమపురుషుండు స్వేచ్ఛావిర్భూతుం డగుట నతనికి జన్మవశ్యత్వంబు లేమి నజాయ మానుండై ప్రకాశించు నజాయమానో బహుధావిజాయతే యని వేదంబులు ప్రో యుచుండు నిప్పటిప్రశ్నల కివి యుత్తరంబు లనిన నాసర్వలోకోత్తరునకు నత్తపస్వి వరుం డిట్లనియె. 474

గీ. విబుధకులవరేణ్య వేదాంతనిష్ఠితం । బగుమ వేద్య మైనయట్టియర్థ
మాదరంబు మిగుల నానతి యిచ్చితి । సరసఫణితి విగతసంశయముగ. 475

క. భూరివిషయగ్రహంబున । పారాశాంధఃప్రపూరభరితము నగుసం
సారాబ్ధినిమగ్నుఁడనై । తీరముఁ జేరంగలేక తిరుగుడువడుమున్. 476

సీ. ప్రతిభవంబునను గర్భస్థితివేళఁ బుట్టెడువేళ వార్ధకం బడరునపుడు
మరణావసరమున మఱి పుత్రమిత్రకళత్రార్థభూగృహలాభమునను
నిష్టనాశమున ననిష్టపరిప్రాప్తి నవమానమున సాధ్వసాగమమున
నాధ్యాత్మికంబుల నాధిదైవికముల నాధిభౌతికములు నవిరతంబు
పొందుదుఃఖపరంపరఁ బొంది యుండి । తల్లడిల్లుచు నజ్ఞానతమముచేతఁ
దెరలి సన్మార్గ మిది యని తెలివిలేక । విసుగునా కేదిగతి చెప్పవే మహాత్మ. 477

వ. అనిన నయ్యతిశ్రేష్ఠునకుఁ బరమేష్ఠిగురుం డిట్లనియె. 478

క. మానసమును నేత్రగతం । బౌనా నజ్ఞానతిమిర మంతయుఁ బాయున్
మానవకోటి కనూన । జ్ఞానాంజనకరణిచేత సంయమిముఖ్యా. 479

క. జ్ఞానము శుకసిద్ధులకు ని । దానము మఱి దానఁ దక్కఁ దక్కినవానిన్
భూనుత యవి సిద్ధింపవు । గానఁ బరిజ్ఞానశాలి గను సకలంబున్. 480

క. నీ చింతయు వియతాత్ముఁడ । వై విమలజ్ఞానపదము నధిరోహణముగ
గావింపు నిస్తరించెద । వా వెరవున దుఃఖకలిత మగుభవజలధిన్. 481

వ. ఆత్మేతరంబులందలి యాత్మజ్ఞానంబు సంసారసాలంబునకు మూలంబు పరమాత్మపరిజ్ఞానం బనుకుఠారంబున నది మొదలిటఁ దునిమినయోగి నిర్వాణంబు నొందు బరిజ్ఞానం బక్షయం బగుసత్యంబు తద్రథం బఖిలంబును మృషాత్మకం బని యెఱుంగవలయు ననిన నా ధీరునకు సనత్కుమారుం డిట్లనియె. 482

గీ. బ్రహ్మసుజ్ఞాననిరతిఁ దపంబుఁ బూని । ము న్నశించిన వృత్తిపై నున్నవాఁడు
[illegible]తంబు సనాథమై చెలువు మిగిలెఁ । జిరదయామూర్తి వైన నీచేత నేఁడు. 483

వ. అని కొనియాడిన నవ్విప్రుండు సంతోషాంతరంగుఁడై చనియె. 484

సీ. తాతలతాత నెత్తమ్మిసెయ్యపుఁబట్టి వేలుపుపెద్ద వావెలఁదిమగఁడు
తపసులమొనగాఁడు తపములజట్టికాఁ డెల్లవిద్యలనెఱనెఱుఁగుజాణ
ముక్కంటిసారథి ముల్లోకములఁ జేత నంటక చేయువిన్ననువుకాఁడు
పంచాళిరాయంచఁ బఱపియాడెడురౌతు కైలాటకపుమునిఁ గన్నతండ్రి
జగతి నేరికిఁ దనవ్రాలు మిగులరాని । బిరుదులేకరి నేర్పులఁ బరఁగు ప్రోడ
నాల్గుమొగములదేవుఁ డున్నతి దలిర్ప । నచటికే తెంచుటయు వినయమునఁ బ్రొక్కి

ఉత్సాహ. ఆసనత్కుమారుఁ డనియె నఖిలలోకనాథ భూ
మీసురేంద్రుఁ డొకఁడు తెంపు మిగుల శిష్యసహితుఁడై
నాసమీపమునకు వచ్చి నాకు బ్రహ్మవిద్య సం
తోస మెసఁగఁ జెప్పి చనియెఁ దోన నేను పఱచితిన్. 486

క. ఆనిర్మలాత్ముఁ డెవ్వం । డానతియీవలయు ననిన నల్లన నగి సు
జ్ఞాను లగుమునులు వినఁ దన । సూనునకుం గరుణఁ దమ్మిచూ లిట్లనియెన్. 487

సీ. ఏదేవుఁ డాదరం బెసఁగ నిన్నధ్యాత్మవిద్యావిశేషసంవేదిఁ జేసె
వేదయానిధికటాక్షసుధామృతమునఁ గంటి వీ విపు దధికప్రియంబు
లెవ్వనివిభవాంశ మించుకేనియుఁ గనఁజాల రత్యంతవిజ్ఞానులైన
నేశుభాకారుఁ డహీంద్రపర్యంకంబునం దొప్పు శ్రీరంగమందిరమున
నట్టినారాయణప్రభు వమ్మహాత్ముఁ । డతనిదివ్యాయుధములు శిష్యవ్రజంబు
భూతదుర్గతుఁ డైనయప్పుణ్యమూర్తి । గానవయ్యె భవద్భాగ్యగరిమఁ జేసి 488

ఉ. బ్రహ్మకు నాజగద్గురునిఁ గన్గొనఁ గల్గదు నీవు రంగగే
హమ్మున నంతదాఁక నియతాత్ముఁడవై పరమాత్మచింతఁ గా
ర్యమ్మున నుండు మెల్లప్రుడు నాశశిపుష్కరిణీతటంబునం
దిమ్మహి దీనిపెంపు వచియింపఁగ శక్యమె యెట్టివానికిన్. 489

క. పరమంబై సకలజగ । త్పరిపావనమై సమస్తభద్రాకరమై
దురితనిరాసక మగు పు । ష్కరిణీతీర్థంబు తీర్థసారం బెందున్. 490

గీ. అమలమతులై జితేంద్రియు లైనవార । లీజలస్నానపానాదు లెలమిఁ జేసి
యిందు విహరించుచుందురు రెల్లనాడు । మహితపరమాత్మభక్తిసమగ్రులగుచు 491

క. సుమహిత పుష్కరిణీతీ । ర్థమునఁ గృతస్నానుఁడై జితంతే యనుమం
త్రమునన్ హరిఁ దలఁచునతఁ డఘ । సమితిఁ దొఱఁగి పోయి పొందు సాయుజ్యంబున్.

వ. మఱియు నిచ్చట నొనర్చు దానవ్రతాదు లత్యల్పంబులైన నధికంబు లగుఁ జిత్రసము
ద్దేశంబునఁ జేయునవి యక్షయంబులై యొసంగు వేదంబునఁ బాదమాత్రం బైనఁ బఠిం
చిన సర్వాధ్యయనఫలంబు నొందు శుక్లపక్షంబునఁ బూర్వదివసంబున భార్యాసహి
తుండై యుపవసించి పంచమియందుఁ గృతస్నానుండై ఘృతప్లుతంబు లైనతిలలును
గుణప్రస్థపరిమాణంబులఁ బరిపూర్ణంబులైన ఘృతపాత్రత్రయంబును దిలపాత్రత్రయం
బును నొకసువర్ణంబును నుత్తమవర్ణుల కొసంగిన నతండు పుత్రవంతుండును బహ్వాయు
ష్మంతుండునగు నొండేని కేవలతిలదానం బైనను ఘృతదానంబైనను సుశాస్త్రు లగు
వారికిఁ గర్తవ్యంబు నిష్కమాత్రంబు సువర్ణప్రదానంబు రోగనిర్ముక్తి నిదానంబు. 493

ఉ. వారని రాజయక్ష్మఁ గలవాఁడు తనంతియు హేమపుత్రికం
గోర రచించి పుష్కరిణిఁ గ్రుంకి నభోదయతౌగకాత్మ వి
ద్యారతుఁ డైనవిప్రునకు దానము సేసి పునర్నిమజ్జనం
బారఁగఁ దీర్చి తక్షణత రామయదుఃఖముఁ బాయుఁ బుణ్యుఁడై. 494

గీ. అచట గోదాన మొనరించునతఁడు గోవు । తనువునను నెన్ని రోమము లొనరు నన్ని
యబ్దశతములు త్రిదశసౌఖ్యముల నొందు । నిందునసమానలక్ష్మిఁ బెంపొందు మఱియు.

క. కడునిష్ఠ నబ్దమాత్రం । బుడుగక నక్షత్రమాత్రయోగంబుల నా
వ్వఁడు తీర్థ మాడు నిందతఁ । డడరఁగ బహుళాశ్వమేధ మగుఫల మందున్. 496

గీ. పర్వతిథు లందులోన నాప్లవ మొనర్చు । వారిఁ బతితపాతకంబుల నపనయించు
జన్మనక్షత్రమునఁ గృతస్నానుఁ డైన । మనుజపతి యేలు నఖిలభూమండలంబు. 497

సీ. సితపక్షపంచమిఁ గృతకుదిస్నానుఁడై యొగి మూఁడుదివసంబు లుపవసించి
యుదకపారణఁ జేసి పదపడి మఱి దివసత్రితయంబు త్రిసంధ్యలందు
నంభోవగాహనం బాచరించుచు హవిష్యాశియు భూశయనాభిరతుఁడు
నై యుండు నేనరుఁ డట్టిపుణ్యాత్ముఁ డతిశీఘ్రమున నపస్మృతిఁ దొలంగు
నెలమి నై మాసమాత్ర మీకోలఁదితీర్థ । మాడువారల మును చెందినట్టిగొల్ల
కుష్ఠకాలరుజాదిదుష్కోటి యడఁగు । సలిలములలోన లవణరాసులను బోలె. 498

క. గురుతల్పగశిశుఘాతక । హరినిందాపరకృతఘ్ననాస్తికమదిరా
నిరతపతితాదులకు నీ । సరసీస్నానమునఁ బాపచయశాంతి యగున్. 499

క. నిరవధికదురితకరులకు । హరికీర్తన మొకటి తక్క నఘనివృత్తికిన్
మఱి లేదుపాయ మీపు । ష్కరిణీయును దత్సమంబ గా నెన్నఁదగున్. 500

వ. ఇమ్మహాతీర్థతటకుక్షి విధాతృపరికల్పితు లగుపుష్కరపుష్కరాక్షకుముదకాలసుప్రతీపు లనువారలు క్రమంబునఁ బూర్వాదిచతుర్దిశలను మధ్యప్రదేశంబునను వసింతురు. మొదలఁ దదీయప్రార్థనం బొనర్చి పిదప నవగాహాదికృత్యంబు లాచరించునది. సర్వపర్వంబుల శర్వరీవిభుం డిందుఁ గ్రుంకుపెట్టుట నిందుపుష్కరిణీనామం బీసరోవరంబునకు భువనప్రసిద్ధంబుగా నయ్యె నీవు సరసిఁ గృతస్నానుండై శ్రీరంగధామంబునకరిగి యచట సుఖంబున నుండు మిట్టియుగ్రతపంబున లోకంబులు సముద్విగ్నంబులు సేయవలదు దీర్ఘవాసంబున నీతీరునంజేసి కృతార్థుండ వయ్యెద వని చెప్పి యప్పద్మసంభవుం డరిగె సనత్కుమారుండును దదుక్తప్రకారంబునఁ బ్రవర్తించుచుండె. 501

ఉ. ఏనరుఁ డీకథాపఠన మెప్పుడు సేయు నతండు పాపసం
తానముఁ బాసి శాశ్వతపదంబు చనుం బితృదత్త మక్షయ
శ్రీ నొసరించు నత్తఱి వసింప నృపాదులు సార్వభౌమతా
మానధనాఢ్యతాసుఖసమున్నతులన్ విలసింతు రెంతయున్. 502

క. అని చెప్పి యప్పరాశర । తనయుఁడు పెండియును నాగదంతునితోడన్
మునిముఖ్య ముక్తికర మగు । వినుతపురావృత్త మొకటి విను మని పలికెన్. 503

చ. ఒదవఁగ లోభయుక్తమతి నొక్కఁ డఘవ్యయుఁ డధ్వనీనులన్
జదియఁగ మోఁది వారిధనజాలముఁ జాలుపుగా హరించుచున్
బెదరక యివ్విధంబు నిజజీవికగా మనుచుండు నట్టి బ
ల్లిదుఁ డగువానిచే సమసె లెక్కకు మిక్కిలిగా ద్విజావళుల్. 504

క. ఇటు బహుముఖముల మతి యా । కుటిలాత్ముఁడు తెరువుగొట్టి కొని యొకనా డు
ద్భటభంగి నున్నతటి న । చ్చట గా భూదేవుఁ డొకఁడు చనుచున్ వానిన్ 505

మ. కనియెం గర్కశమేచకాంగు నతిరక్తక్రూరవిస్ఫారలో
చను నుత్కృష్టకరాళబర్బరకచశ్మశ్రున్ వినీలాంబరున్
ఘనసంజాంతరితున్ గతాగతజనాకారప్రతీక్షాపరున్
హననోత్సాహుఁ గరాగ్రలోహలవయోన్యద్యస్కరున్ దస్కరున్. 506

క. పొడగని యడరెడుభయమున । నడుగులు దడఁబడఁగ హృదయ మదరఁగ బెదవుల్
దనుపుచు నడఁకుచు వడవడ । వడఁకెడునవ్విప్రుఁ జూచి వాఁ డుద్వృత్తిన్. 507

చ. సుడిపడ బిట్టదల్చి యెటు సొచ్చెద వెక్కడఁ బోవవచ్చు లోఁ
బడితివి గాకటంచు సిగఁబట్టి వెసం బడ నీడ్చి త్రోవ సం
బడమునకైన నప్పు డొక పైకము నాతనిచేత లేమి యే
ర్పడఁ బరికించి మాఁచి మదిఁ బైకొనిపర్వెడు నాగ్రహంబునన్ 508

క. తల్లడపడ నడరుటయుఁ గడుఁ । గలఁగి మహీసురుఁడు వాని గనుఁగొని నన్నున్
బొలియింప నీకు నయ్యెడు । ఫల మెట్టిది రిక్తహస్తుఁ బాఱుని ననదున్. 509

గీ. ప్రాణములు గాఁచి రక్షింపు మనిన నతనిఁ । జూచి చోరనిరర్గళస్థూలకాయ
భూసురాధమ యిటనుండి పోవుచున్న । వాఁడ వది చెప్పుమా వినవలయు ననిన. 510

క. అనవుడు దీనాననుఁడై । తనువు సెమర్పంగ గద్గదస్వరమున ని
ట్లను వసుధామరముఖ్యుఁడు । తను నెటుఁ జననీక యేఁచుతస్కరుతోడన్. 511

మ. వసుధామండలికిం బ్రదక్షిణముగా వర్తించులోకప్రశ
స్తసరిత్తీర్థవనాచలప్రకరముల్ దర్శించుచున్ వచ్చి చం
ద్రసరస్స్నానము రంగరాట్పదసపర్యాకృత్యముల్ భక్తిపెం
పెసఁగం జేసి మదీయదేశమునకై యేఁగెదన్ దస్కరా 512

వ. అని చెప్పినప్పు డప్పాతకప్రచారుం డగణ్యపుణ్యప్రభావుం డగుభూదేవుని తోడి సంభాషణవిశేషంబునం జేసి యాతుణంబ విశుద్ధమానసుండై పరహింసాత్మకం బగునిజవ్యాపారంబుఁ జాలించి సవినయంబుగాఁ గరంబులు మొగిచి యమ్మహీసురున కిట్లనియె. 513

మ. సుమనఃశ్రేష్ఠ శశాంకపుష్కరిణి యెచ్చో టుర్వి నాతీర్థరా
జము నేచక్కి భుజంగశాయికి నివాసం బైన శ్రీరంగ మన్
విమలక్షేత్ర మతీతపాపనిరతిన్ వేఁగించు మాబోఁట్లకున్
గమనీయస్థితి గోచరించెడిని నిక్కం బింతయుం జెప్పవే. 514

క. నీ వధికపుణ్యపురుఁడవు। గావున నిత్తెఱఁగు దెల్పి కడుఁబ్రియమున నీ
పావలయము నెడకు నరుగుము। భూవినుతచరిత్ర యేనుఁ బోయెద నెమ్మిన్. 515

గీ. అనిన నమ్మాటలకు ముద మలరి మరణ। చింతదప్పి యకంపితచిత్తుఁ డగుచు
విప్రుఁ డత్యుగ్రకర్మప్రవృత్తు శూద్రు। ననునయించుచు నల్లన నతని కనియె. 516

సీ. మానవోత్తమ నీ వనూనసౌమ్యాకృతి స్ఫురణఁ జూపట్టె దిప్పుడు మదాత్మ
నీయం దతిప్రియాన్విత మయ్యె నీవును నాయెడఁ గడుఁబ్రసన్నత వహింపు
మడిగితి నీవు యథార్థంబు నేనును జెప్పెద నది విను చిత్తగించి
జగదభిరక్షితం బగుశేషశయనంబు శ్రీరంగశబ్దప్రసిద్ధిఁ దనరు
నందు శయనించు నెలమి శ్రీహరి కదియ। పరిసరంబునఁ జంద్రపుష్కరిణి మెఱయు
నట్టితీర్థావగాహనం బాచరించి। శుద్ధు లగుదురు ఘనపాపబద్ధులైన. 517

క. ఇది మార్గ మిందుఁ జన ను। న్నది ముందట నర్థరాజనంబునఁ జాలన్
మెదిగిన తెరువున నరుగుము। ముద మొదవ నిరంతరాయముగ శీఘ్రమునన్ 518

క. అని చెప్పి యతని వీడ్కొని। పునరుజ్జీవితుఁడ నైతిఁ బొమ్మని పలుమా
ఱును మరలి మరలి చూచుచుఁ। జనియెన్ వడి విప్రుఁ డాత్మజనపదమునకున్. 519

వ. తదనంతరంబ యాచోరుఁ డంతరంగంబున నంతంత కొదవుసంతాపంబున నొక్కింత సేపు నివ్వెఱ నొంది తన్నుఁ జెందినదోషంబులు మత్సంభాషణ విశేషంబున నిరవశేషంబు లగుటయుఁ బుణ్యాచరణపరిణతుండై దురితచరితంబుఁ దొలంగి యానదీకూలంబునఁ గొంతకాలంబు సుజనానుకూలంబుగాఁ బ్రవర్తించి సంచితాఘంబుల నిర్వర్తించి యుదంచితప్రబోధుండై ప్రవరుండు చెప్పినచొప్పునఁ బుష్కరిణీతీర్థయాత్రా

పరాయణుండై యల్లనల్లనఁ దదంతికంబుఁ జేరునంత నాయుఃపరిక్షీణుం డైన నతండు
కృతాంతగోచరుం డయ్యె నప్పు డాలోకనభయంకరు లగు కాలకింకరులు తర్జనగర్జన
భైరవం బైనరవంబున గదిరి యాభీలంబు లగు కాలపాశంబులఁ గట్టి కట్టలుక నిగుడ
మగుడఁ దాడనాది పీడనం బొనర్ప నద్భుతయాతనాపరిభూతుండై యాక్రోశించె
నయ్యవసరంబున. 520

శా. ఆతీర్థంబునకుం జతుర్దిశల రక్షార్థంబుగా ద్విత్రిగ
వ్యూతిక్షేత్రమునం జరించుకృతపుణ్యుల్ దుష్టశిక్షావిని
ష్ఠాతుల్ దండధరుల్ ఘనాకృతులు విష్వక్సేనవాక్ప్రోదితుల్
భూతేశుల్ పటుదివ్యశక్తియుతు లంభోజాప్తతేజోధికుల్. 521

క. గజవదనాదులు గాంచిరి । నిజరక్షితసీమఁ గాలనిర్మితభృత్య
ప్రజకృతబహువిధబాధల । గిజిగిజి యగుకూద్రభక్తుఁ గిలితదేహున్. 522

వ. ఇట్లు గనుంగొని గుబ్బనం బ్రబ్బునిబ్బరంపురోషంబునఁ జటులసటాసముత్పాటనపటు
తరాగ్రహోదగ్రరంహంబు లగుసింహంబులతెఱంగునఁ బ్రతోదచోదనోద్దీపితకోపా
టోపబంధురంబు లగుసింధురంబులచందంబున నకాండదండాఘాతజాతప్రతిమాభీలంబు
లగుశార్దూలంబులపోలిక వాలాకర్షప్రభూతామర్షకరాళంబు లగుకాలవ్యాళంబుల
విధంబునఁ బ్రళయపవనప్రేరణప్రవర్ధమానంబు లగుపావకజ్వాలావితానంబులయచ్చు
వెరిగి యుదయమార్తాండమండలమరీచోష్ణంబు లగుదృక్కోణంబుల నదరులు చెదర
వికటభ్రుకుటీకుటిలంబు లగునిటలంబుల ఘర్మంబులు గ్రమ్మ, నతికఠోరక్రకచనిశిత
దశనసంఘర్షణచ్ఛటచ్ఛటాత్కారఘోరంబుగా దురహంకారసముద్భటు లగుశమ
నభటులం బొదివి మద మడంపం దొడంగి రప్పు డమోఘనిర్ఘాతనిష్ఠురంబు లగుముష్టి
ఘట్టనంబుల వికంకటంబు లగుకటంబులు పగిలి జల్లునం బెల్లుదొరగు నెత్తుటం జొత్తిల్లి
పిప్పిటిగొని బమ్మరించువారును, జలవర్షపాషాణపాతప్రకారంబులఁ గరోటికర్పరం
బులు చిద్రుపలై విశీర్ణంబు లగుకర్ణరంధ్రంబుల మెదడుగ్రమ్మిన రిమ్మగొని సొమ్మ
సిలువారును, అక్షీణకఫోణిప్రహారంబుల క్రోడభాగంబులు తండసిలి గుండె లవిసి
బక్కెముకలు నెట్టుమోవఁబడి బిట్టుమూల్గువారును, బటుకఠినజాను ఘట్టనంబుల నుత్తా
లంబు లగుకంకాలంబులు విఱిగి యొఱఁగి పొరలుచు మొర లిడువారును, బ్రకటపార్ష్ణి
ఘాతంబులఁ బ్రచండంబు లగుపిచండంబులు పగిలి దిగులు చొచ్చి కళ్వళపడి క్రేళ్ళు
వారును, మహాయసముసల పరిఘపట్టిసానుశాసనంబులం బరశుఘాతంబులఁ గలకలం

బులై యసువులు పెకల వికలచిత్తులై యద్దెస దద్దరిలువారును, నుదారగదాప్రహార
ణంబులఁ జరణంబులు కంఠంబులు కరంబులు శిరంబు లవలగ్నంబులు భగ్నంబు లైన
నుద్విగ్నులగు వారునై బీరంబులు దక్కి బీఱువోయి మాఱు మొగంబు లిడి మానంబు
లెడలి పంద్రిలి పికాపికలై బెదరి చీకాకువడి దవ్వులఁ దొలంగి నవ్వులకు భాజనంబై
పఱచి రయ్యవసరంబున. 523

మ. తమవెంటం బడి తోలువిష్ణుభటబృందంబుఁ విలోకించి డెం
దములం గొందల మందుచుఁ శమనదూతవ్రాతముల్ దీనవా
క్యములం బల్కుచు మీర లెవ్వ రని వక్కాణింక సాలించి యు
ద్విమలాత్ముల్ మఱి వారితోడ ననిరావిర్భూతకారుణ్యులై 524

క. వలదు వల దింకఁ బరువిడ । నిలునిలుఁ డోదూతలార నెఱిఁ జిత్తములన్
కలఁగక మాకభివందన । మెలమి నొనర్పుఁడు శుభంబు లెసఁగెడు మీకున్ 525

గీ. అనిన నెట్టకేల కాభయం బొకకొంత । యుడిఁగి నెమ్మనంబు లుమ్మలింప
నంతనంత నిల్చి రంతకకింకరు । లంతవారితోడ ననిరి వారు. 526

శా. ఈతీర్థంబున కేము రక్షకులమై యేప్రొద్దు వర్తింతు మా
భూతేశుం డిది గారణంబుగ మముం బుట్టించినాఁ డస్మదా
జ్ఞాతుల్ గాక సురాసురాహినరరక్షఃపక్షియక్షాది సం
ఘాతంబుల్ దమయంత నిచ్చటఁ జొరంగా నేర వత్యుద్ధతిన్. 527

ఉ. చల్లనితావు లెందు నెదచల్లఁగ మవ్వపుఁబూవుమొగ్గచా
లల్లన విప్పుచున్ గిసలయావళి శ్రీ వెలయంగఁ దెల్పుచున్
మెల్లనె జంతుజాల మెలమిం బొదలం బరిపాటిమైఁ బ్రవ
ర్తిల్లును గాని గాలి తనతీవ్రత నూపఁగ నోడు నీయెడన్. 528

క. ఆలోకబాంధవుండును । నాలోకము నెఱపుఁగాని యవనీజలతా
జాలాదులఁ దన వేఁడిమిఁ । దూలింపఁగ వెఱచు వ్రేళ్లతోడుత నయినన్. 529

క. తపనశశు లుష్ణశైత్య । వ్యపగతకిరణప్రసారులై వెలుఁగుట నీ
విపులక్షేత్రమున దిన । క్షప లివి యనుభేదబుద్ధి సమకొన దెపుడున్. 530

వ. ఇచ్చటి జనులు నిరామయులు నిర్ద్వంద్వులునై చరింతురు శకుంత సంతతులు నట్ల
ప్రవర్తిల్లు నెల్ల వృక్షంబులు నిరాబంధంబులై సకలకాల సంపూర్ణప్రసవఫల భరితం

బులై యొప్పఁ దిర్యగ్జంతువులును బుద్ధిమంతంబులై యుల్లసిల్లుఁ గ్రూరసర్పంబు లైన
నీప్రదేశప్రవేశమాత్రంబున నతిశాంతంబు లగు నివి దేవదేవుం డగు పుండరీకాక్షుని
దివ్యతేజోనుభావపరిపాలితంబులై మెఱయుచుండు నట్టిభుజంగశాయికి నపరాంతం
బు లగు (?) శ్రీరంగంబు మీకుఁ గన్నుగోచరంబు గాదకో యని వెండియు. 531

ఉ. హీనమనస్కులార యిది యెంతయు మీ కెఱుంగంగలేక యి
చ్చో నఘజీవుఁ డైనపురుషుం బరమక్రియ జేరి నొంపఁగాఁ
జూచినవార లిందుఁ జొరఁబోలునె మీకు నుదారవైష్ణవ
జ్ఞానసమగ్రులై పరఁగుసంయమికోటికిఁ గాక యెమ్మెయిన్. 532

క. ఈతనిపై నీచేసిన । చేతలు దలఁపంగ మమ్ముఁ జేయుట యస్మ
చ్చేతః పరితాపకుఁడై । యేతెఱఁగున బ్రదుక నేర్చు నింద్రుండైనన్. 533

ఉ. ఎవ్వరు మీరు మీకు నట నేలిక యెవ్వఁడు మూఢబుద్ధులై
క్రొవ్వున నీప్రదేశమునకుం బఱతెంచినకార్య మేమి మా
కివ్విధ మెల్లఁ జెప్పుఁ డని యీకుణకోటము లెత్తఁ జేయుచున్
నెవ్వగఁ బల్కె నవ్వనజనేత్రునిదాసుల కోసరించుచున్. 534

వ. అసమవర్తిభృత్యు లిట్లనిరి. 535

మ. సకలప్రాణిచయాంతకారియు మహాశాభర్తయున్ బుణ్యపా
తకనిర్ణేతయు నైనదండధరు నుద్దం దత్సమాదేశభా
రకవృత్తిం జరియించుచుండుదుము దుర్వారక్రియాప్రౌఢి నె
న్నొకచో నైనను మమ్ముఁ గీడ్వఱప నన్యుల్ చాల రివ్వారలున్. £36

గీ. సర్వభూతాత్ముఁ డైనవిశ్వప్రభుండు । దృఢముగాఁ దన్మనోవృత్తిఁ దలిసి కాద
ధర్మగా జని యాకృతాంతుని నిలిపెఁ । గడఁగి ప్రాణ్యంతకరణాధికారిగాఁగ. 537

క. స్వకృతశుభాశుభకర్మ । ప్రకరామితబంధనములఁ బరిబద్ధములై
సకలచరాచరచయములు । నొకయప్పుడు నతనిశాసన మొందుచు నుండున్ 538

క. కాలము గ్రసించు సర్వము । కాలము ప్రాణుల నశింపఁగాఁ జేయుఁ దుదిన్
గాలవశం బగు నింతయుఁ । గాలము దా నన్యవశము గాదు తలంపన్. 539

వ. కాలాత్మకుండును గాలచక్రప్రవర్తకుండును నగు విష్ణుదేవుం డట్టి కాలతత్త్వంబుఁ జెందిన
యప్పురుషాధమునిఁ గాలుని సమీపంబున నొందించుటకై నే మిందఱ మిందు వచ్చి
తిమి మా చందంబు వినుండు. 540

మ. కలుషాకారులకెల్ల నేను భయదాకారంబునం దోచి వి
హ్వలురై బిట్టొరలంగ మార్గమున నత్యంతంబు బాధింతు మే
వలనం బాపములేనివారలకు శశ్వత్సౌమ్యరూపక్రియన్
తెలుపొందం బొడచూపి త్రోవ నెలమిన్ సేవింతు మిష్టస్థితిన్. 541

చ. అనిశము నీ డొనర్చినదురంతమహాఘము లెన్నఁ డేనియున్
వినినవి గావు గోవులును విప్రులు నీకతి నాత్మచేతఁ జ
చ్చినవి యసంఖ్య లీఖలుఁడు సేసిన దుష్కృత మింత యంతనం
జన దటుగాన వీని జముసన్నిధికిన్ గొనిపోవఁగాఁ దగున్. 542

క. అనిహతమహిమ వెసంగిన । దినకరసంభవునియాజ్ఞ ధృతి నెవ్వఁడు నై
కొన కవితథంబు సేయఁగ । మొనయుము మనుజుల కనయమును జేటొదవున్. 543

గీ. అప్పురేతాధిపుని యాజ్ఞ నతిదురాత్ముఁ । డైనయీతనిఁ గొనిపోవునట్టియేము
భగ్నకార్యులమై పరిభవము నొంది । యున్నవారము మీచేత నుక్కు దక్కి. 544

క. అలఘుసుకృతాత్ము లుండెడి । నెల విది దగ్జుఁడు వీఁడు నిలుపంజన దీ
లలితస్థలమునఁ గావునఁ । దలఁకొని మీ కడ్డగింపఁ దగ దితనికినై. 545

క. దేవాదిచతుర్విధభూ । తావళికిని మీఁద గతి కృతాంతుఁడ కాఁడే
యావైవస్వతు నెదిరికి ; రావలయును గాదె సుకృతరతులకునైనన్. 546

వ. అనినదరహాసంబు సేసి వాసుదేవపారిషదు లాధర్మరాజానుజీవుల కిట్లనిరి. 547

క. కాలహతమైనచేతన । జాలము నియమింపఁ గర్త జముఁ డనుపలుకుల్
పోలునవి కర్మఫలములు । వాలాయం బనుభవించువారలత్రోవల్. 548

క. అనలము నిజసంగతినల । కనకాదులకందఁ జెఱచుగతి నీనెలవుం
దనుఁ జేర నఘము లడఁచును । దనుజారిసమీపసీమఁ దగ లక యునికిన్. 549

శా. శ్రీవిష్ణుం బురుషోత్తమున్ వికచరాజీవాక్షు లక్ష్మీవిలా
సావిర్భూతరసాత్మ నేఘనులు సమ్యగ్భక్తిసంయుక్తులై
సేవింపం గనుచుండు రట్టిపురుషశ్రేష్ఠుల్ వినిర్ముక్తక
ర్మావష్టంభులు వారిసత్ప్రథ మగమ్యం బెందు నెవ్వారికిన్ 550

క. ఇచ్చోట నుండు భూతస । ముచ్చయము ప్రవేశమాత్రమునఁ గనుసుకృతం
బెచ్చోట నెన్ని జన్మము । లచ్చుగ వసియించినైన నలవియె పొందన్. 551

సీ. అట్టిపుణ్యాత్ముల కత్యంతసుఖం బై మానితశ్రీరంగమందిరమున
ఫణిరాజమృదుభోగపర్యంకతలమునఁ బద్మాసమేతుఁడై ప్రమదలీల
శయనించి యున్నాఁడు సర్వేశ్వరుఁడు సర్వభూతహృద్దేశవిస్ఫురితమూర్తి
భక్తానువర్తి యప్పరమేశుఁ డొక్కఁడు పరకాలచక్రప్రవర్తకుండు.
యముని నుర్వికి నియమించినట్టిదేవు । నకును బ్రాణపదంబ యీనదితటంబు
కాలసంస్పర్శలేశంబు గలుగ దిచట । నెట్లువచ్చితి రట్లు పొం డింక మీరు. 552

క. కాలునిదండధరత్వము । కాలోపహతాత్ములందుఁ గావున మీరల్
బోలినగతి వారలఁ బలు । గావింపుఁడు జముఁడు శాస్త గాఁ డీమొదలన్. 553

క. విలయసమయమునఁ గలజడి । నలజడిఁ బడి భువననివహ మడఁగినఁ బురుషుల్
జలశాయినిలయ మగునీ । లలితక్షేత్రము నిరాకులతఁ బొలుపారున్ 554

గీ. సర్వశక్తిమయము జగతి శ్రీరంగంబు । సర్వతీర్థమయము చంద్రసరసి
సర్వపుణ్యమయము చర్చింప నీకావు । సర్వవేదమయుఁడు శార్ఙ్గపాణి. 555

వ. ఈశూద్రుం డతిపాపకర్ముం డయ్యు నీపుణ్యప్రదేశంబున నుండి సమాధియోగంబునం జేసి శుద్ధాంతస్సుం డయ్యె నిది గా దని బలిమిం బట్టికొనిపోవ మీవశంబు గాదు పనిలేని దురభిమానంబునఁ బొరలక మఱలి పొం డనిన నొం డన వెఱచి యాశమన దూత లాపని విడిచి పఱచి రనంతరంబ. 556

సీ. నిర్మలుండును సత్వనిధియును శుద్ధాంతరంగుండు నగుశూద్రపుంగవుండు
పాప సమృద్ధుఁ డైన వెలవసు మిఁక నంచు భూతేశ్వరులు గరంబులఁ గరంబు
నతులతదీయకాయస్పర్శ గావించి రతఁడును భక్తిమైఁ బ్రణతి సేసి
పుష్కరిణీతీర్థమునఁ జేరి తనివోవ నం దవగాహన మాచరించి
తత్తటంబున సురశపోవృత్తి నున్న । సన్మునీంద్రుల దర్శించి సమ్మదమున
వందనము చేసి తానును వారిఁ గూడి । యర్థి శ్రీరంగభవనంబు కరిగి యందు. 557

సీ. శరదిందుమండలస్వచ్ఛాహిపర్యంకభాసుర నపసవ్యపార్శ్వశాయి
దక్షిణబాహూపధానపీతాంబరోజ్జ్వలకటివిన్యస్తసవ్యహస్తు
వైజయంతీలసద్వక్షు నాకుంచితోత్థానితపాదపద్మాసమేతు
యోగనిద్రాముద్రితోద్భాసిలోచనజలజాతుఁ బశ్చిమాశాశిరస్క
నపమమణిమయమకుటకల్పావతంసు । హారకేయూరకంకణోదారసార
సనతులాకోటిముఖ్యభూషణవిశేషు । కలితు శ్రీరంగవిభు నాసఁ గాంచి బ్రొక్కె.

క. అతని నురుభక్తివినయా । యతు నానందాశ్రుపూర్ణనయనుఁ ముకుళీ
కృతకరు విష్వక్సేనుం । డతికృప నాభూతగణుల కనుచరుఁ జేసెన్. 559

మ. ఇటు వైవస్వతకింకరావలియు భూతేశప్రహారస్ఫుట
స్ఫుటితాంగంబుల నెత్తురొల్కఁ జరణంబుల్ దొట్రిలం గంపము
త్కటమై పర్వఁగ నూరుపుల్ పయిపయిన్ గ్రమ్మన్ భయభ్రాంతి మి
క్కుటమై మాపుల దోఁప నెక్కుమొగి నాక్రోశించుచుం దీనులై. 560

చ. ఇనతనుజాతుముందటికిఁ నేఁగి సగద్గదవాక్యవృత్తి ని
ట్లనిరి కృతాంత మున్నెపుడు నస్ఖలితస్థితి నిజ్జగంబులం
జను భవదాజ్ఞ విష్ణుభటసంఘముచే నిదె నేఁడు సర్వమున్
జెనుపడె నేఁడు నేము పరిభూతుల మైతిమి వారిచే నదెన్. 561

వ. అవ్విధం బవధరింపుము. 562

ఉ. నేము భవన్నియోగసరణిం జరియించుచు నొక్కశూద్రు ను
ద్దామనికామపాతకవిధానపరాయణుఁ గాలగోచరున్
బామరు నిందుఁ దెచ్చుటకుఁ బట్టఁ గడంగెడు నంతలోన ద
త్సీమకుఁ గావలై మెలఁగుధీరులు భూభయంకరాకృతుల్ 563

శా. భూతేశాహ్వయు లుగ్రదండధరు లంభోదప్రతేజుల్ సము
ద్ధూతస్వేదలలాటభాగవికటభ్రూభీషణుల్ మమ్ము ని
ర్ఘాతక్రూరకరాంఘ్రిజానుహతులం గావించినం దోలి నే
మాతుచ్ఛం బిగ వాడి వచ్చితిమి నీ కాద్యంతముం జెప్పఁగాన్. 564

క. అనుపలుకులు దనచెవులకు । ననయంబు నసహ్య మగుచు ననలమునఁ గొ
బ్బున నే పోసినవిధమున । కనలి పరేతప్రభుండు కటకటపడుచున్. 565

శా. ఏమేమీ మది నింతయున్ భయము లేకివ్వారలో మూఢులై
యామీఁదం దనుపాటెఱుంగక మదీయాజ్ఞానిరోధక్రియా
సామర్థ్యంబు భజించినారు త్రిజగత్సంజాతభూతావళిన్
సేమింపం దలఁతో హరింపఁ బ్రభువు లేర్నేఁ దక్క నెవ్వారలున్ 566

వ. అని యుత్కంఠవడి చింతించి యంతకుం డంతకమున్న సన్నుతాచారభూషణుం
డగుగణిభీషణుచేత నానీతం బైనశ్రీరంగంబునఁ దదీయనికటంబునఁ గావేరీతటంబున

నఖిలదురితహరణసమర్థం బగుపుష్కరిణీతీర్థంబును నతివిచిత్రం బగు నాపుణ్య క్షేత్రంబు మహత్త్వంబును దద్దివ్యవిమానశయనుం డగుపుండరీకాక్షుమూర్తివిశేషం బును దనమనోగోచరంబు లైన వాచరితాభినందనుండై యాభూతేశ్వరులు తీర్థరక్ష కు లగుటయు శూద్రుండు తదనుచరుం డగుట యునికియుం దెలిసి నిజకింకరులం గని వారితో నిట్లనియె. 567

క. నిక్కముగ నామనంబున । నక్కడివృత్తాంత మెల్ల నధిగత మయ్యెక్
దక్కక వినిపించెద మీ । రక్కథ దత్తావధానులై వినుఁ డనుచున్. 568

సీ. శ్రీరఘురాముఁ డాశ్రితవజ్రపంజరుం డఖిలకంటకుని దశాస్యుఁ దునిమి
యురువైభవమున నయోధ్యాపురికి వచ్చి యచట సుగ్రీవాదు లైన హితుల
నుచితసంభావన లొనరించుతఱి నతిప్రియకారి యైనవిభీషణునకు
నాత్మకులీనకృపారాధితంబును దనకంటె నుత్కృష్టతరము నైన
రంగధామంబు సదయాంతరంగుఁ డగుచు
నొసఁగుటయు వాఁడు దాని గొంచు నసమహర్ష
మెసఁగ నిజపట్టణమునకై యేఁగుచుండ
మార్గవశమునఁ గావేరి డగ్గఱుటయు 569

వ. అపుడు మధ్యాహ్నసమయం బగుట నతండు తత్ప్రదేశంబున తద్దివ్యమందిరంబు నిలిపి దేవతార్చనార్థంబు పుష్పోపహరణంబునకై వనంబున కరిగి యచట బరమత పోనిష్ఠులఁ గని సంభాషించి వారిచేత సంభావితుండై తత్సమేతంబుగా నేతెంచి శ్రీరంగరాజపూజావిధానంబు దీర్చుటయు ననంతరంబ గమనోన్ముఖుండై యద్దశము ఖానుజుం డుద్దామతేజోభిరామం బగురంగధామంబు వహింపంబూని తరలింపలేక శోకాకులుం డగుటయు నాదనుజపుంగవుం గరుణాతరంగితంబు లగునపాంగంబుల నిరీక్షించి లక్ష్మీశ్వరుం డతనిపై లక్ష్యం బుడిపి యాశశాంకపంకజాప్తంబుగా నిరాతం కం బగులంకాధిపత్యంబున కనిపి యసమానసంతానందుండై యుండుటయు నది కారణంబుగాఁ దత్సమీపం బఖిలపాపంబుల లోపంబు సేయనోపుటయుఁ జెప్పి దండధరుండు వెండియు వారల కిట్లనియె. 570

క. మీకగమె విష్ణుభూతే । శావజ్ఞయుఁ దత్పరిగ్రహనిపీడనముల్
గావింప వారితోడం । బోవం బనిలేదు కలిగెఁ బోయినఫలముల్. 571

క. అన్నిలవునఁ గలభూతము । లన్నియు నజ్ఞానపాత మన్నియు సుఖసం
పన్నములు శక్తిమంతము । లన్నియు నాత్మాభిమతవిహారోన్నతముల్. 572

గీ. సకలజగదేకవిభుఁ డైనచక్రపాణి । కాసరిత్కూలమతిహృద్య మగునివాస
ముచటు రక్షింప ధాతసంరచితు లైన । వారు భూతేశు లమితు లవార్యబలులు. 573

మ. క్రమయోగంబున నెన్నఁ గాఁబడుకళాకాష్ఠాదులం జేర్చు కా
లముచే భూతచయంబు లెల్ల నవలీలం సంక్షయం బందు నా
కమలాక్షప్రియధామ మై మెఱయురంగక్షేత్రమం దెప్పుడున్
బ్రమదం బార వసించుప్రాణుల హరింపం జాల దాకాలమున్. 574

వ. దేహసంగ్రహంబునకుఁ దత్త్యాగంబునకుఁ గర్మంబు కారణం బట్టి కర్మఫలం బట్టి శిక్షించుకారణంబు నాయది గాని మహానుభావులం గేవలంబు నియమింపుసామర్థ్యంబు నాకు లేదు వారలకెల్ల సర్వభూతేశ్వరుం డగునప్పరమేశ్వరుండు నియామకుండు గావున జీవేచ్ఛ గలదేని మీ రందుఁ బోవలవ దనిన నిజస్వామి యగువైవస్వతుపలుకు లాకర్ణించి కింకరు లహంకారం బుడిఁగి తదాదేశంబున నాదేశంబునకు దవ్వులఁ గొలఁగి పోదు రని చెప్పి యప్పారాశర్యుండు నాగదంతమునీశ్వరున కిట్లనియె. 575

క. ఈకథఁ జదివినవారును । జేకొని వినువారు విజితజీవత్వరులై
నాకాదిపదసుఖస్థితిఁ । గైకొందురు చనరు జమునికడ కేకనాఁడున్. 576

ఉ. నావుడు నాగదంతమునినాథుఁడు సాత్యవతేయుతో మునీం
ద్రా వనజాతవైరి యనురాగమునం బ్రతిపర్వమున్ జగ
త్పావని యైనపుష్కరిణిఁ దా నవగాహము సేయు నంటి వీ
వావిధుఁ డేమికార్యమునకై యటు సేయుచు నుండు చెప్పుమా. 577

చ. అనినఁ బరాశరాత్మభవుఁ డానతితో విను మున్న దక్షునం
దనలఁ దుషారరోచి ప్రమదం బెసఁగంగ వివాహమై
మనమున వారి నందఱ సమంబుగఁ జూడక రోహిణీసతిన్
ఘనబహుమానపూర్వకము గాఁ బనిసేయుచు నుండు నెప్పుడున్. 578

క. దానికి నశ్విన్యాదు ల । నూనవ్యథఁ జెంది తండ్రికొద్దకుఁ జని దీ
నాననలై పతిచేఁ దమ । కైనపరాభవముఁ జెప్ప నాతఁడు గినుకన్. 579

శా. ఆరాజుం బిలిపించి యిట్లనియె నీ వన్యాయసంచారివై
తారానీకములెల్ల నీవలనినాథప్రాప్తి తుల్యంబుగాఁ
బ్రారంభింపక దుర్వివేకసరణిన్ బాటింపుచున్నాఁడ వీ
దౌరాత్మ్యంబుఁ దలంప మేలగునె చంద్రా రోహిణీవల్లభా. 580

క. ఇదిమొద లందఱియెడఁ బ్రియ। మొదవఁగ సమభావవృత్తి నుండుట గదు మే
లదిగాక తప్పి తిరిగినఁ। దుదిఁ గనియెదు గాక పాపము దురితఫలంబున్. 581

క. అని దక్షుఁడు తనతనయల। ననునయములఁ దనిపి కినుక ననుప సుధాంశుం
డును జని ముందటితెఱఁగున। తనప్రియయును దాను సమ్మదంబున నుండెన్.

మత్తకోకిల. ఆతెఱంగున కాత్మలన్ వగ పగ్గలింపఁగ వెండియున్
తాతపాలికి నేఁగి వారలు తద్విధం బెఱిఁగింప న
బ్జాతసంభవపుత్రుఁ డప్పుడు చంద్రునిం బిలిపించి ధ
ర్మేతరంబు భవచ్చరిత్ర మిదేల మానవు చెలువై. 582

వ. ఇంక నిటమీఁద నీవర్తమానం బిట్టి దయ్యె నేనియుం గొఱఁగాదు తప్ప దేఁ జాటి
చెప్పితి నెప్పగిదినైనను బుద్ధిమంతుండవై యుండుమని యుల్లసంబు లాడి వీడు
కొలిపిన గ్రమ్మఱ వచ్చి మామమాటలు గీటులఁ బుచ్చి యచ్చంద్రుండు సాంద్రాను
రాగంబున రోహిణీసంభోగలంపటుండై యుండె మఱియును పెక్కుమారులు
దక్షుండు ఋక్షాధిపతి నివ్విధంబున బోధించి తత్కుటిలప్రచారంబు వారింపంజాలక
చాల రోషించి యాతనిం గనుంగొని. 583

క. దోషాకర పలుమఱు మ। ద్భాషలు గైకొనక చపలభావంబున ను
ద్వేషించితి గావునఁ ద। ద్దోషంబునఁ జెందు యక్ష్మదుర్దశ నిన్నున్. 584

చ. అని శపియించె నంత హరిణాంకుఁడు తత్పటురోగముగ్రమై
తనతనువందుఁ బొందఁ బ్రభ దప్పి కృశించి వినష్టబుద్ధియై
ఘనభయవిహ్వలుం డగుచుఁ గ్రక్కున నక్కడఁ బాసి భూతలం
బునఁ గడువాసి నుల్లసిలుపుష్కరిణీతటిఁ జేర సన్మతిన్. 585

మ. నిజశాపావధిఁ గోరి తద్విమలపానీయంబులం గ్రుంకి స
ద్ద్విజగద్భారితపంబు పంచదశవర్షంబుల్ ధృతిన్ సల్పి నీ

రజనాథుఁ బరివత్సరంబు లట నారాధించె భాస్వత్కర
గ్రజకించిద్వికసద్దళాంచితతరస్వచ్ఛాంబుజాతంబులన్. 586

వ. అంత. 587

క. తద్విధచిత్రపూజనముల । హృద్యవ్రజం బలర లోకహితమతి సాధ్వా
పద్విఘటనకరుఁ డగుచును । జద్విష్ణుఁ డతికరుణ నతనిసన్నిధి నిల్చెన్ 588

ఉ. అప్పుడు కైరవప్రియుఁ డుదంచితసమ్మదవార్ధివీచులన్
దెప్పలఁదేలుచెమ్మనము ద్రిప్పఁగఁజాలక నేత్రపర్వమై
యొప్పెడునప్పురాణపురుషోత్తముదివ్యతనూవిలాసమున్
దప్పకచూచుచున్ బహువిధంబులఁ బ్రస్తుతిచేసె నమ్రుఁడై 589

క. ఆసంస్తవంబు హృదయో । ల్లాసం బొనరింప మెచ్చి లక్ష్మీశ్వరుఁ డా
కాసారము దగ్గఱి యన్న । తాసారము దొరఁగఁ బలికె నాతనితోడన్. 590

క. కువలయహిత భవదుదిత । స్తవమునఁ దుష్టుఁడ నైతి నీవు దలఁచెడి కార్యం
బవలంబితఫలసిద్ధులఁ । దనరించెను నస్మదీయదర్శనలబ్ధిన్. 591

చ. అనుటయుఁ జంద్రుఁ డిట్లను గుణాంబుధివిష్ణుఁ బురాణపూరుషున్
నిను నఖిలేశు యజ్ఞమయునిం బొడఁగంటి మదీయ మైనజీ
వనము కృతార్థ మయ్యె నభివాంఛితముల్ సమకూరెఁ బైపయిన్
మునుపుగఁ బొందునాపదలు మున్నె తొలంగె విహంగవాహనా. 592

చ. అమృతమయంబు లైనకిరణావళులన్ బచరించి యోషధీ
సమితులఁ బ్రోవు మంచుఁ బటుశక్తిఁ గృపామతి నిచ్చి నన్ను నా
క్రమమున నీవు నిల్పితివి కైటభమర్దన నిల్చెదన్మహ
త్త్వము దిగ దక్షశాపజనితక్షయపీడయు నిప్డు నాదెసన్. 593

క. దక్షాగ్రహజాతమహో । గ్రక్షయమునకు క్షయంబు గావింపంగా
దక్షులొరు లేరి యిఁక నలి । నేక్షణ నీ వొకఁడు దక్క నీవిశ్వమునన్. 594

సీ. అనుటయుఁ బుండరీకాక్షుఁ డాతనితోడ నిట్లనుఁ గైరవహిత మదీయ
దర్శనామృతవారిధారాభిషిక్తులై రేనియుఁ బాపాత్ము లైనవార
లతిశుద్ధతను లౌదు రనిన నిన్నెన్నఁగానేల నా కెంతయు హితుఁడ వీవు
గావున క్షయరోగవ్యథఁ బెడఁబాసి పోషింపు మోషధీపుంజములను

తే. యీస్తవద్వయంబు లోకశ్రోత్రోత్సవంబుఁ | జేయుచుండెడిఁ గల్యాణదాయి యగుచుఁ
దపము నీపొందు సేసినదానఁ జంద్ర | పుష్కరిణి నాఁగ వెలయు నీపుణ్యసరసి. 595

గీ. పురుషులందుఁ బుణ్యపురుషుండు సతులలో | నబ్ధితనయ నదులయందు గంగ
యవ్విధమున వెలయు నవ్విధమునఁ దీర్థ | రాజి నీసరోవరం మెఱయు. 596

వ. అనిన నప్పద్మలోచనునకు సుధారోచి యిట్లనియె.

చ. జిగిఁ దళుకొత్తు క్రొత్తవికసించిన తెల్లనితమ్మిరేకులం
దెగడెడికన్నులున్ నగవుదేరెడిచూపులుఁ గుండలద్యుతి
స్థగితములై మెఱుం గెసఁగు చక్కనిచెక్కులుఁ బల్లవారుణం
బగునధరంబుఁ గల్గుధవదాస్యవిలాసము నిల్పు నామదిన్. 597

క. ఆచొప్పున నమదీయుని | లోచనములు చూచుఁగాక లోలత నెపుడున్.
నీచారుమూర్తి ననవుడు | నా చంద్రునితోడ దనుజహరుఁ డిట్లనియెన్. 598

గీ. అఖిలదోషరహితులై నిర్మలజ్ఞాన | వంతు లైనయట్టివారికైనఁ
గాని గోచరంబు గాదు నానిజమూర్తి | కూడ దట్టిపలుకు కుముదమిత్ర. 599

మ. అనినం జంద్రుఁడు వల్కె నట్లయిన నత్యల్పాల్పసత్కర్మబో
ధనులై త్రిమ్మరులోకు లెప్పగిది నాగ్రత్రాణధుర్యున్ రమా
ననపద్మార్క్యము నిన్ను వాక్యగతి సందర్శించి ధన్యాత్ములై
ఘనతం బొందుదు రట్టిపొందు వెలయంగా నిల్పు మిచ్చోటికిన్. 600

క. నావుడు నాయదుపతి కను | నావిభుఁ డిది పొసఁగు నిచటియనఘులుఁ గానం
గావలతురు నను నిరతప | దావాసుల కలవి గా దుదారులకైనన్. 601

వ. ఇటమీఁద నింక లంకాధిపతి యగువిభీషణుకతంబున నీసరితీరంబున నెల్లవారికిఁ
బ్రత్యక్షుండనై యుండెద నది కారణంబుగా ధారుణీవలయంబు నిరుపద్రవంబై సకల
భద్రాశ్రమంబై మెఱయు నప్పు డెపు డిప్పరిసరంబున మదీయదివ్యధామంబు నిలిపి
నిజపురంబున కరుగునది కారణంబుగా ధారుణీవలయంబు రంగమందిరంబైన భుజంగ
భోగతల్పంబున ననల్పభోగంబునఁ గల్పాంతపర్యంతంబు లోకానుగ్రహార్థంబుగా వసి
యించెద నావేళ నీవు నన్ను దర్శించెద వింక బ్రతిపర్వంబును బుష్కరిణీతీర్థసే
వార్థం బిచటి కేతెమ్ము పొమ్ము నీనిండువెన్నెల యఖిలజగత్పావనం బయ్యెడు మని
యాదేవదేవుం డంతర్ధానంబు నొందెఁ జంద్రుండును దద్వచనప్రకారంబ బాసరో

వ భజనాపరాయణుండై యున్నవాఁ డని చెప్పి యపారాశర్యుండు మఱియు
నాగదంతున కిట్లనియె. 602

క. పదియోజనములు నైదుం । దదర్ధమును నందునగము తగుపఱపై యుం
పొదవుఁ గృతాదియుగంబున । సదమలసలిలములఁ జంద్రసరసియు బెడఁగై. 603

క. అంతట గలియుగమున నం । తంతకుఁ బ్రతిదినము నల్ప మగున స్తనగ
ప్రాంతముఁ జేర్చినయర్చి । ష్మంతునికిరణోత్కరప్రసారముకరణిన్. 604

గీ. కలఁక యింత లేక కడుచల్లనై నల్పు । లోలయుఁ జంద్రసరసి సలిలపూర
మనఘ కలియుగాంత మగువేళ దుర్గంధ । యుక్తమై కలంగియుండు నపుడు. 605

సీ. మండలాధిపులకు మరణ మెప్పుడు గల్గు నపుడు రక్తచ్ఛాయ నగ్గలించు
మాన కెన్నఁడు రాజ్యహాని పాటిలు నాఁడు నెఱయంగఁ బసరువన్నియ వహించు
నఖిలప్రజాసంక్షయంబగు నేవేళ నాతటి క్రిమిమయం బగుచు నుండుఁ
జొప్పడు వేళ విక్షోభ మేసమయమం దయ్యెడ ఫేనంబులై కలంగుఁ
బేర్చు నాకాలమున ననావృష్టిదోష । మట్టిపట్టునఁ జావ్వన వట్టిపోవు
నింకఁ బెక్కన్న నేల యీయిందుసరసిఁ । దోచువిపరీతములు విపత్సూచకములు.

మ. నృపులం బోరక భావికాలమున శాంతిం జెందుచో దుగ్ధస
చ్ఛవియున్ విప్రులు సౌఖ్యమందు నెడలన్ జంద్రోపలచ్ఛాయయున్
భువి నిండన్ ఘనవృష్టి గల్గుతఱి నద్భుతోర్మిజాలంబునై
సువిశేషస్థితిఁ దత్సరోవరము పొల్చున్ మంగళావాసియై. 607

గీ. ఎన్న ముప్పదిరెండుయోజనములంత । మేరయై యొప్పుదేశవిస్తారమెల్లఁ
గాలవశమునఁ బొడవతి కలియుగాంత । వేళ నత్యల్ప మయ్యెడి విప్రవర్య. 608

వ. సకలభూతక్షయకరంబుగా నాయుగంబున నఖిలవర్ణంబులకు నుపప్లవం బగ్గలం
బయ్యెడు నప్పు డాప్రదేశంబు నిర్మనుష్యం బగుట దేవతాసంచారంబ కాని
యొండు లేకుండుట ననాచారులు నన్యాయకారులు నామ్నాయదూషకులు సార్వజన
భయంకరులు నల్పాయువులునై యెల్లవారును బరమకల్యాణకారకు లగువారినామో
చ్చారణంబు విన్నంతన విద్వేషించుచుఁ దమః ప్రవర్తకుం డగురుద్రుండు తమకు
దైవంబుగా నుపాసించెద రమ్మహాదేవుండు జగద్విమోహార్థంబుగాఁ దాను దైవం
బని కల్పించినతామసశాస్త్రంబు లెల్లెడలం జెల్లుబడియై ప్రవర్తిల్లెడు నాసమయంబు

నందు వాసుదేవపరాయణు లగునమ్మహాత్ము లైనవైష్ణవులు తమ నిరాసం బాచరించి
యచ్యుతపదంబు నొందుదురు. 609

సీ. సాత్వికంబులు రాజసములు తామసములు నన మూఁడువిధముల నవనిఁ బరగు
శాస్త్రంబు లందు విశ్వప్రభు సర్వాత్ము హరిఁ జెప్పునవి సాత్వికాహ్వయములు
జలజగర్భుని సరస్వతి హవ్యవాహనుఁ బ్రణుతించునట్టివి రాజసములు
ప్రకటితమత్ప్రవర్తకు సమారాధుఁ గీర్తనసేయునవియెల్లఁ దామసములు
వానిఁ గొనియాడి తుదఁ దైవంబు గాఁగఁ
గొలిచి సంపన్ను లగుచుఁ గోర్కులు ఫలించి
బలియులై సాత్వికుల బాధపఱచి నగుచు
నెపల విడుతురు హరిసేవ యెల్లవారు. 610

క. హరిహరుల సమముసేసిన । హరుఁడే పరతత్వ మనినయాశాస్త్రములన్
ధర సత్యమనిన దుర్గతి । దొరకును హరిసమము పలుక దోసము గాదే. 611

క. ఈపగిదిఁ గలియుగంబున । నేపారునుపద్రవంబు లెల్లను భద్రం
బై పరగుచంద్రపుష్కరి । ణీపరిసర మంద లేవు నెటి నుకనాడున్. 612

క. జగదుద్భవపరిపాలన । విగమంబులు లీలగాఁగ వెలసినహరికిన్
బగి నుపసంహృతి నవు డిం । పగునప్పాను గల్గుఁగలిసమాగము మున్నెన్. 613

ఉ. మేదినిపై విభీషణునిమిత్తమునం గరుణామయాత్ముఁడై
యాదట రంగమందిరమునందు భుజంగమరాజశాయి ప
ద్మోదయుతుం డజస్రమును దా వసియించుటఁ జేసి కాలదో
షముల నేయుపద్రవము నందవు నాసరసీసరిత్స్థలుల్. 614

క. అని మఱియు నప్పరాశర । తనయుఁడు సునయుఁ డగునాగదంతునితో ని
ట్లను మునిజనములచే మును । వినఁబడుకథ యొకటి నీకు వినిపింతుఁ దగన్. 615

గీ. ఏల నీచోళమండలమెల్ల నేలు । రాజకోపంబుకతన ధరాజనంబు
వనరి వసియింపఁ బండ్రెండువత్సరములు । పెచ్చుపెరుగ ననావృష్టిపీడనంబు. 616

సీ. కడుఁబేర్చి మిటమిటఁ గాయుకట్టెండచే భువనముల్ పొగపొగఁ బొక్కి పడియు
వేఁడియై బిసబిస విసరుగాడ్పులఁ బ్రాణికోటులెల్లఁ దటతటఁ దాఁకఁ దొణఁగ

నొండెడ ధగధగ మండుకార్చిచ్చులఁ బెనుగిరుల్ పెటపెటఁ బ్రేలఁదొచ్చెఁ
బంకమై జవజవ నింకుఁ గాదంబుల మకరాళి మలమల మాఁడిపోయె
కొండ చొరకుండఁ గడు నేచి యురులఁగొనుచు । వఱలు కాంతారపక్షులు వఱ్లువోయె
నట్టనడువేసవులను గాల్పడలుగాక । జరగునేఱులు నిర్జలస్థలము లయ్యె. 617

శా. తృష్ణోత్తప్తాదికవేగతాపరిగతాసుప్రాణిశల్యావళీ
భిత్తాకీర్ణమహార్ణవాంతికమహీభృత్కందరారణ్యకు
వ్యత్యస్తోయాశయతీరచైత్యమరుదేవాగారరథ్యాదులన్
నృత్తం బాడుచు మృత్యుదేవత సమున్మేషించె హేలాగతిన్. 618

క. ఆవేళ మునులు సిద్ధులు । కావేరీతీర్థమంద కాపుండెడి భూ
తావలికి నచటు శరణం । బై వెలసెను రంగవిభుసమాశ్రయమహిమన్. 619

ఉ. ఆగతిఁ గొంతకాలము సమంచితభక్తిఁ జనంగ నానదీ
వేగము నాఁడునాఁటి కతివేగము దొంకిలినం దటస్థు లు
ద్వేగము నొంది యుండఁ బెను దిక్కుగు వేఁడిన మాకునుం దను
త్యాగము గాంగ్య మంచు విగతాన్యదిశావిజగీష నున్నెడన్. 620

ఉ. అత్తఱిఁ గల్గఁ గన్గొని మహాబలవంతులు తీర్థరక్షకుల్
చిత్తములన్ గృపారసము చిప్పిల వారలఁ గావఁ బూని యు
ద్వృత్తిమెయిం బయోధరతతిన్ రభసంబున నాక్రమించి యు
వృత్తునఁ దద్ఘసోదరము లెల్లను జిల్లులువోవఁ బుచ్చినన్. 621

ఉ. పన్నవు మేఘముల్ గగనపాళిక వాలికఁ గ్రొమ్మెఱుంగు లు
త్పన్నముగావు లేవు మహిత స్తనితధ్వను లిట్టిచిత్ర మే
మెన్నఁడుఁ జూడ మంచు జనులెల్లఁ బ్రమోదకుతూహలంబులన్
జెన్నువహింపఁ బెల్లుగురిసెన్ జలధారలు ధారుణీస్థలిన్. 622

క. తోరములై కరటికరా । కారములై సకలదిశలఁ గడుఁదొఱఁగుతఁదా
సారమున నబ్బి పఱచెను । వారక కావేరినీరు వారిధిఁ బొదువన్. 623

వ. అమ్మహానదీజలపానంబునఁ బ్రాణిసంతానంబు సంతాపరహితంబై సుఖంబుండె నంత
నారాజకృతం బైనబ్రహ్మహత్య పిశాచిస్వరూపంబుఁ గైకొని తత్తోయంబెల్ల నెక్క—

తోయంబునఁ గ్రోలినతత్క్షణంబ కావేరి వారిహీనయై మునుదటిచందంబున నున్నఁ దన్నిమిత్తం బన్వేషించుచు వచ్చి పురోభాగంబున. 624

మహాస్రగ్ధర. కని రాభూతేశు లత్యుత్కటశకటముఖాకప్రతీకాశకేశిన్
జనితోదన్యాపతాపశ్లథమలినవసృజ్గాత్రమాంసాస్రగంధిన్
ఘనకావేరీజలౌఘగ్రసనవివృతవక్త్రస్ఫురద్భూరిదంష్ట్రా
శనిసంఘృష్టప్రభూతజ్వలదనశ్శిఖాజాలశాచిన్ పిశాచిన్. 625

క. కని కనలు నిగుడ నురువడిఁ । జనుకుటిలభ్రుకుటితలవిశంకటభయదా
ననులగువారల దవ్వులఁ । గనుఁగొని మది బెగడి మేను గజగజ వడఁకన్. 626

ఉ. ఆసలిలప్రవాహమున కడ్డము నిల్చియు వక్త్రగహ్వరం
బోసరిలంగఁ జేసికొని యొయ్యఁ దొలంగఁ బిశాచి యప్పు డో
ఓసి దురాత్మురాల యిపు డోడకు మేడకుఁ బోయెదంచుఁ జి
త్రాసులు విష్ణుదాసులు కరంబు రయంబునఁ బట్టఁ డాసినన్. 627

క. అగతి యొఱంగి యది గడు । వేగంబున బరువుఁ బాఱి వెనుకొని చన నీ
కాఁగి యదలించి యెవ్వతె । వేగతి వచ్చితివి వెఱవ కిచటికి ననినన్. 628

సీ. ఆపుణ్యపరులతో నప్పిశాచిక యను నేను బాపంబులకల్ల నెక్కుఁ
డగుదాన నను జంపఁదగదు మదుత్పత్తివిధ మెఱింగించెద వినుఁడు మీర
లీజనపద మేలు రాజు సోముకనాముఁ డపరాధివే లోకఁడవలనుండ
నేపాపమును లేక యితరమహీసురుఁ దేరి చంపించె శ్రోత్రియుని వినతు
నప్పు డాతనిసచివులం దాప్తులందుఁ । జారులందును జనపదాస్పదులయందుఁ
దద్బహిర్దేశజనులందుఁ దలఁప నొక్కఁ । డైన నిది గూడఁ దని విడనాడరైరి. 629

క. ఎదురెదుర నొకఁడు దురితము । వదలక కావింపఁ జూచి వారంపనివా
రోదవినఁ దత్పాపఫలా । స్పదు లగుదురు సమధికాగబలములకోలఁద్రిన్. 630

వ. కావున నీదేశంబంతయుఁ బాపదూషితం బగుట ననావృష్టిదోషంబు సంభవించె
నారాజకృతం బైనబ్రహ్మహత్యాస్వరూపిణి యైననాచేతఁ జరాచరాత్మకం బైనజగం
బిట్టియుపద్రవంబు నొందె నేను తటాకసరోవరాదులం గలవారిపూరంబు నిరవశేషం
బుగాఁ గ్రోలితి నతిక్రూరదర్శను లగువీ రెవ్వ రింతవారును మదంతంబు గావింప

నసమర్థులీనిరర్థకప్రయాసం బేల యని పల్కి. యప్పిశాచి పరువుపెట్టినం గట్టలుకం
దట్టించి యాడిట్టు లిట్లనిరి. 631

ఉ. సార మెఱుంగ నేరక పిశాచమ నీచమనీష లోకసా
ధారణదృష్టిఁ జూచెద వుదారతరం బగు నీప్రదేశ మీ
చేరువ సంచరింపను వసింపను శక్యమె నీకు నీవునన్
వారక వచ్చితేనియు నవశ్యము నాశముఁ బొంద దీవె యెడన్. 632

మ. శ్రుతి నీవక్కటి దివ్యదేశ మమితశ్రీవిష్ణుభూతేశర
శ్రుత మీపుణ్యనదీప్రవాహము జగత్సేవ్యంబు భవ్యంబు సం
స్మృతిమాత్రాఘనివారణంబు మహితశ్రీరంగధామాంతికా
గత మారూఢసమస్తతీర్థమయ మగ్ర్యం బాపగాకోటికిన్. 633

గీ. ఎట్టిపాపులైన నీజలంబులు మేన। సోఁకినంతమాత్ర శుద్ధు లగుదు
రితరంబుపానపూతమై జగము నీ। వలన ముక్తిఁ బొంది వెలయుచుండు. 634

క. కావున నెవ్వరి తెరువునఁ। బోవక వేగంబ వెడలి పొమ్మటు గాకే
తావున నున్న వధింపక। పోవిడుచుము నిన్నుఁ బాపపుంజము వగుటన్. 635

వ. అని పలికి రప్పుడా బ్రహ్మహత్య తద్దేశంబున సద్యోనాశంబు నొందె నవ్విష్ణుభూతేశ్వ
రులు తమతమనిలయంబులకుం జనిరి తదనంతరంబ జగత్సృష్టికారణం బైనమహావృష్టి
గురిసె కఱవు దీఱె యెల్లవారు తమతమనెలవుల సుఖంబుండిరి. యీయుపాఖ్యానంబున
నిఖిలపాపహరణం బగు నిహపరసుఖదం బని చెప్పి యప్పారాశర్యుండు నాగదంత
మునివరున కిట్లనియె. 636

క. ఈకథ వినియెడిమనుజు ల। నేకమహాపాతకంబు లెడలియ ముక్తి
శ్రీకాంతు లగుదు రట్టిది। నీ కొకకథ యోగివర్య నే నెఱిఁగింతున్. 637

మ. ఒకగంధర్వుఁడు చిత్రసేనుఁ డనువాఁ డుద్దామదర్పోదయా
ధికుఁ డస్వప్నవరేణ్యమిత్రుఁ డుడువీథిం దోడిగంధర్వగా
యకులం దానును బాడుకొంచు నట రంగాభ్యర్ణముం జేరి కొం
జక యాపైఁ దటుకంగా వెసం జనియెఁ దచ్ఛాయాసముల్లంఘియై. 638

గీ. వానితోడ నేఁగువారు తచ్ఛాయ న। తిక్రమింపరామి దలిసి నిలిచి
రంతతీర్థరక్షు లాదుర్మదాంధుని। సాగిపోవనీక సంభ్రమమున. 639

క. కడకాలఁ బట్టి కడు నురు । వడి బిఱబిఱ ద్రిప్పి వైవ వననిధి కవలం
బడియె రఘునాథుశరహతి । సుడిఁబడి మారీచరాక్షసుఁడు పడినగతిన్. 640

వ. అప్పు డతనితోడఁ గూడివచ్చినగంధర్వు లావిధంబెల్లఁ జెల్లంబుగాఁ గనుంగొని బెదరి మగిడి నిజాధిపతి యగుచిత్రసేనుండు తేజోహీనుండై పడినయెడకుం జని యచట నచేతనుండై యున్న యతనిఁ బ్రబోధించిన. 641

గీ. తెలిసి నలుదిక్కులను జూచి ధృతిఁ గలంగి । యిక్కడెక్కడ నన్నవ్వ రివ్విధంబు
చేసి రని పల్కు నాచిత్రసేనుతోడ । వారుఁ జెప్పిరి తద్విపత్కారణంబు. 642

క. చెప్పిన విని బెగడుచు మదిఁ । గప్పినమోహమున మీఁదు గానక పోదం
డిప్పగిది నుండ నే లని । యప్పాటుం దరుగఁజూచె ననుచరయుతుఁడై. 643

వ. ఇట్లు చన మొక్కలిరిచి ఱెక్కలువిఱిఁగినపులుగులంబోలె నాయాసంబున కగయలేక చీకాకుపడి యార్తుం డగుచు మత్తుకైవడి పుడమిం బడి పొరలి యాక్రోశించుచు. 644

మ. అకటా యే నతిమూఢభావమున నీయత్యంతసంతాపహే
తుకకర్మం బొనరించినాఁడ నిఁక నీదోషం బశేషంబు నా
రక యెబ్భంగిఁ దొలంగు దీనికి విచారం బెట్టి యన్యాయకా
రికి నేలోకమునందు నాపదలు వర్తిల్లుఁ దురంతంబులై. 645

వ. అని యొక్కింత చింతించి మఱియును.

మ. దివి మీముందట వచ్చునన్నిటు జపిర్ద్వీపంబునం దేవదా
నవమర్త్యులలోన నెవ్వరొకొ ప్రాణత్రాణనిష్ణాతులై
యవిచారంబున వైచి రాజసుల నింద్రాఖర్వరోషాగ్ని ను
ద్దవిడిన్ వేలిచి తత్ఫలంబున హవిర్భాగంబు భాగించెదన్. 646

క. అది గాక వానిఁ జెప్పిన । నొదవెడు భద్రంబు మీకు నుద్దీపితమై
యిది యటు పోనిం డిపుడు । న్నది యిఁక నొకసంశయంబు నామదిలోనన్. 647

ఉ. అప్పుడు మీకు నాకును వియద్గమనంబు సమంబ యిట్టిచో
నిప్పుడు నాకు నొక్కనికి నిత్తెఱఁగై మఱి మీగతిక్రమం
బెప్పటియట్ల యున్కి యిటు లెట్లది గావున పక్షపాత మీ
చొప్పునఁ గానవచ్చెఁ గడుఁజోద్యము గాదె తలంచి చూచినన్. 648

క. అని తనపడుటకు మనమునఁ । గనలొందఁగ నదరి పల్కు గంధర్వవిభున్
గనుఁగొని గగనస్థితు లగు । ననుచరు లిట్లనిరి మఱియు నాతనితోడన్. 649

గీ. మాను మాను మిట్టిమాట లెవ్వరిదెసఁ । గీడు గలుగ దొకనికిల్బిషంబు
లొకని నేల పొందు నూరక నిజకర్మ । ఫలము తనకుఁ బొరయవలయుఁ గాక. 650

క. అమృతాశనమనుజపశు । ప్రముఖం బగుసకలజంతుపటలంబునకున్
దమలోనితారతమ్యము । క్రమమున నిజకర్మఫలము గాదే తలఁపన్. 651

వ. నీవు తామసంబున దివ్యధామచ్ఛాయాసముల్లంఘనం బాచరించినపాపంబున నీయా
పదఁ దెచ్చుకొంటివి యిమ్మది మహాపాతకం బని యతిక్రమింప ననికిం జేసి మాకు గగ
నగతిక్రమం బవక్రమంబై యున్న దిత్తఱి నీచిత్తంబు క్రోధాయత్తంబు గానీక దో
షనివృత్తి యగునుపాయంబుఁ జేయు మట్లైన నతిపవిత్రుం డయ్యెదు గానినాఁడు
దుర్జనునకు సుగతియుంబోలె నీ కాకాశగమనంబు సిద్ధింపదు భవత్పతనకారులగు వా
రల నే మెఱుంగ నేర మీమేరకు నంతరిక్షాదిభూతంబులు సాక్షి వాని నడిగి చూడు
మింక నీవృత్తాంతం బంతయు బలాంతకునకుఁ జెప్పంబోయెద మిపుడు నీవడిగినచక్ర-
టికి నక్రద్వీపసముద్రంబు లెడసి యంతరంబులై యున్న వింతదూరంబు పాదప్రచా
రంబునఁ జన ననేకవర్షశతంబులనైన నశక్యం బదియునుగాక యుదగ్రగ్రాహంబు
లగునంబుధులు దురవగాహంబులు లిట్లొట దురితనివృత్తి గల్గునంతనీవింద యుండు
మఖిలంబు భద్రం బయ్యెడు మని వార లరిగి రనంతరంబ. 652

క. తలఁకొనినశోకభయమున । నలమరుగుచుఁ జిత్రసేనుఁ డతికరుణము గాఁ
బలుమఱు విలపించె నెగుల్ । దలఁగునుపాయములు గొన్ని తలపోసి ధృతిన్. 653

క. శంభుని వాశ్రితరక్షా । రంభుని ఫణిరాజకటకరాజితభుజదో
స్తంభుని నపహృతదానవ । దంభుని నిట్లని నుతించెఁ దత్పరమతియై. 654

గద్యము. జయ జయ జలజభవముఖనిఖిలసురనికరమకుటతటఘటితమణిరుచిరుచిరచరణయు
గళ, గళవిచరదవిరళగరళకబళ, బలవదఘనివహవాణపటలవిఘటనచటులదివస
కరకమలదమృతకరణమధురమధురసభరితశశికుసుమ, సుమహితశుచివిభవవిలయ
రహిత, హితవివిధవిహారణకుతుకచరణఖచరమిథునశతసతతపరిచితవితతశిఖరమణి
కిరణకలితసకలకకుబంతతిమిరభరకుధరజశరణధరనిలయ, లయసమయవివృత
వికటనిటలతటనయనపుటనటదనలకణ, కణకబలితసకలభువన, వనధిదలయావల

యుతధరణీధరవహనసహన ఫణిభరపరివృఢదృఢవలయవిలసదురుభుజపరిఘపరిచి
తకనకధరపృథులధనురుచితమదనదహనవిశిఖముఖ శిఖిహుతదితిజనిగదితనిగమశతను
తనిజనిరుపమనిరవధికగుణవిసర, సరసిజవిపులతరనయనపరనసనకృతవనిదహనగ
గనమయతనుమహిత, హితజనభవనఫలితసురనగనగదుహితృవదనకమలసమదమధు
కర, కరటిందళనదరవిసరబిసరజతభుజగవదసురసరిదమృతకరదరవాసిత, సితక
మలరుహతుహినగనిభశుభ్రరుచిమదవసన, ఘనభుజబలపరమరిపుపరిషదతనుజ
యవితతధనురతినిబిడనిహతిముదిత, దితిజనృభుజగజవసనసనకశుకముఖమునిజన
హృదయకమలసదనవరదసమవననిరత, నిరతిశయశయకలితలలితహరిప్రసుప్రథుకతి
నకుదపహసితగిరిజశిఖరవరవృషభగమన, మనసిజమదధవళదహనజలదసమయముఖ
రఖరవచనమరధిగమమహితహిమ, హిమకరహుతవహాదినయనవినయనతకరిలపనవి
పులకటకవిగళితమదసలిలవిచలదతిపులినదముదితమృదునటదురుపదకటకఫణిఫణ
మణిరుగరుణిత హరిదుదగదరవికచనఖకమల పరిమళపరిమిళితమురుసరిదతులసలిల
కణగణకలితబలకచభరరుచినిచయ ఖచితగగనగతిరహితమహితనిపతితమసుమలిన
చలితమతిదయావశమశరణభువభవ పాహి మాం పాహి మాం. 655

వ. అని సన్నుతించినఁ బ్రసన్నుండై విపన్నగాశని యగుపన్నగాభరణుం డతనిపైఁ
కృపాతరంగితం బగునపాంగంబు నిగిడించి నీతలం పెయ్యది చెప్పు మనిన నప్పశు
పతికి నందండ వందనం బాచరించి కృతాంజలియై యాచిత్రసేనుండు తనవృత్తాంతం
బంతయు విన్నవించినఁ దత్పతనకారుల నిరూపించి విరూపాక్షుం డాక్షణంబున నిజ
కింకరగణంబుల రణంబునకు నాజ్ఞాపించిన. 656

శా. బాహాకంపితహేతిదీప్తులు వియద్భాగంబు గప్పన్ సము
త్సాహోదంచితసింహనాదముల దిక్చక్రంబు ఘోషిల్లఁగా
సాహంకారభయంకరాకృతులతో సాటోపధనోద్రగ్రస
న్నాహం బద్భుత మావహింప వెడలెన్ మాహేశభూతావళుల్. 657

శా. పంచద్వాహనకేకిపింఛరుచుల లాశామండలం బెల్లఁ జి
త్రించెన్ రోహణశృంగరాజములభాతిన్ రత్నకోటీరముల్
మించెన్ బాణశరాదిసాధనము లోలిం బూని దర్పంబునన్
గ్రౌంచారాతియు బల్విడిన్ వెడలె సంగ్రామక్రియాలోలతన్. 658

వ. ఇట్లరిగి సకలదురితలతాలవిత్రం బగు శ్రీరంగక్షేత్రంబుఁ బ్రవేశించి యందు నిర్గళోప
సర్గకరవారి యగు కావేరిం జేరి యాభూతజాతంబు నానాముఖంబులఁ దజ్జలంబు చలం
బునఁ గ్రోలం దొడంగిన. 659

సీ. అంత నిర్మగ్నంబు లైనమహీధరప్రతతిశృంగంబులు బయలుపడియె
నీరఁ దేలెడితీరభూరుహప్రసవంబు లంతరితములనఁ దూఁగాడఁదొడఁగె
నవ్యంబు లైననిమ్నప్రదేశంబులు రయమేది నప్రమతరంబు లయ్యె
బాడవు లై పొలుపారుపులినస్థలంబులు క్రందుగా నందంద కానవచ్చె
నదరు మాడ్కిఁ జిక్కసం బైనపఱపు। తెల్లముగఁ దోనఁ జావ్వనఁ దీసిపోయె
నల్పజలజంతునికరంబు లచట నచట। నదరె శైవాలపఙ్క్తులు నాతఁగంబ. 660

గీ. అంతఁ దత్తీర్థసంరక్షణార్థ మచట। మెలఁగు శ్రీవిష్ణుభూతేశు లలఘుమతులు
మున్న దరులకు మిగిలి యుప్పొంగి పాఱు। నమ్మహానది యల్పంబు నగుటఁ జూచి.

క. సగభసగతిఁ దత్కారణ। మరయుచు నటపోయి బాడబానలశిఖలం
బొరినడుకుజలధిగవమునఁ। బఁగెడుసుకప్రోఁత వినిరి పడనుటికంకన్. 662

చ. విని యిది యేమికొ యనుచు విస్మితులై చని యమ్మహోత్తరం
గిణియుభయప్రతీరములఁ గిక్కిఱియంబడి యానతాస్యులై
ఘనరసపూరముల్ బహుముఖంబులఁ గ్రోలెడివారి నక్రని
స్వనబధిరీకృతాశులఁ బిశాచగణంబుల ఘోరమూర్తులన్. 668

చ. కని కడునల్గి బిట్టదిరి కన్నుల దట్టపుకెంపు పర్వఁ ద
ర్జనములు గర్జనంబులు విశంకటభంగిఁ జెలంగఁ దాఁకి క
న్గొనిఁ బరిఘాసిచక్రశరఖడ్గగదాముసలాదిఘోరసా
ధనముల బిట్టునొంపఁ గడు దల్లడమందుచుఁ బాఱి రందఱున్. 664

క. వారలతోడన తేరలి కు। మారుఁడును బఱచె నీక్రమంబున భయమున్
గూరిన వచ్చెడికనపరి। వారము నీక్షించి వృషభవాహనుఁ డాత్మన్. 665

గీ. సంభ్రమించుచు వీరి నీబాడఁ బఱపి। నట్టిబలియుండు నెవ్వఁడో యనఁ దదంతి
కమున కేతెంచి వినతుఁడై క్రౌంచభేది। చెప్పెఁ దా రేఁగి వితేఁగి వచ్చినతెఱంగు.

వ. అంత నంతయు విని యుమాకాంతుం డఖిలభూతజాతం బాకర్షింప బలవంతులతోడి
విరోధంబు గాదని పల్కి యోగంధర్వునిం జూచి నీ వేంద్రైనను బొందైనకందుక
కరుగ మని యంతర్ధానంబున నుండఁ దదనంతరంబ నిజమిత్రుం డగుచిత్రకేసుండు

గరుడకేతనచ్ఛాయాలంఘనం బాచరించి ఖేచరత్వంబు చెడి పుడమిం బడి యాడలుము
నికి తదనుచరులవలనఁ దెలిసి యాశతమన్యుండు ధృతమన్యుండు నయ్యె నయ్యెడ.

క. లోచనసహస్రశోభిత । రోచులు మెయి నిండ నామరుత్పాలుఁడు లో
కోచితరోషానలశి । ఖాచయములు వెలిఁ దలిర్చులాగున నుండెన్. 668

వ. అంత. 669

గీ. దంతిమేషమహిషదానవమకరసా । రంగతురగశార్దూలముల నెక్కి
కులిశశక్తిదండఘోరాసిపాశతో । మరగదాత్రిశూలధరులు నగుచు. 670

ఉ. ఆహవకౌతుకులై వెడలి రప్పుడు దిక్పతులు న్గదేవసం
దోహము లాత్మచిహ్నములతో వివిధాయుధపఙ్క్తులతో నట
ద్వాహనకోటితో. సుభటవర్గముతో వెస నిర్గమించి ర
వ్యాహతసింహనాదముల నంబరభాగము పూరటిల్లఁగాన్. 671

క. అగ్నివిజృంభణము తమతమ । కైదువలమెఱుంగు లెల్లకడలం బర్వన్
గాఁదనరెఁ దఱచు మెఱుపుల । తోఁ దివిఁ బర్విన యుగాంతతోయదము లనన్. 672

ఉ. ఆయెడ వాయువుల్ పరుసనై వెస వీచె నినుండు వేఁడిమై
గాయఁ దొడంగె భీకరముగాఁ బెనుమంటలు వెల్లడిక్కులన్
వాయుసఖుండుఁ గప్పెఁ బటువారిదపఙ్క్తులు మిన్ను ఘూర్ణిలన్
మ్రోయుచు భోరునం గురిసె ముంపుగ శోణితధార లెల్లెడన్. 673

క. చదలం గనలుచు మదమునఁ । బొదలెడిసురవరులు విష్ణుభూతేశులు దా
రిదియేటి దనుచు నచ్చెరు । వొదవఁగ వీక్షించుచుండ నుద్ధతవృత్తిన్. 674

క. సురగణవిభుపనుపునఁ గడు । నురువడిఁ జండానిలంబు లొక్కట విసరన్
బురిఁగొని వైష్ణవవాయువు । లరుదారఁగఁ జేర్చి వాని నన్నిటిఁ దోలెన్. 675

క. ఆగ్నేయాలోలకున । జ్వాలాజాలములఁ గప్పి చను నాయక్షిన్
గాలుపుచు వైష్ణవానల । మాలోకభయదనిష్ఠురాకృతి మెఱెఁగెన్. 676

వ. అట్టియెడ సమరసముత్సాహదోహలంబులై సురసందోహంబు లుదగ్రమండలాగ్రకర
ఘపట్టసప్రాసపాశముఖ ప్రహరణబాణపాణులై మఱియుం దఱిమి నిజప్రతాపాత
పాహతారికుమూదుం డగుకుముదుం డనుదత్ క్షేత్రరక్షకుండు కింక రెట్టింప హాటకాంక
రులం పంపిన వానిలింపసైన్యంబులపైఁ గవిసి నిశితపవినిష్ఠురంబు లగుశరంబుల నరం
బులు గాఁడ నేసియుఁ బ్రళయానలకరాళంబు లగుకరవాలంబులఁ గంఠనాళంబులు

దోఃప్రేపియుఁ గాలోరగాభీలంబు లగుశూలంబుల ఘాలంబుల నొంచియు నుదంచిత
ప్రభాపిహితవియత్తలంబు లగునత్తళంబులఁ గత్తళంబులఁ జించియుఁ గరంబు భయంక
రంబు లగుముద్గరంబుల శిరంబులు నొంచియుఁ బ్రచండంబు లగు గదాదండంబులఁ
బిచండంబులఁ బగిల్చియు గనకపుంఖమండితశిఖండజాలంబు లగుభిండివాలమ్ముల సా
డించియుఁ దఱుముగాటమ్ముగను నొహటించి విముక్తరణపాండిత్యు లగు నాదిత్యులు
విస్మృతహంకృత్తు లగుమరుత్తులు విగళితగంధర్వు లగుగంధర్వులు విఘూర్ణితాక్షు లగు
యక్షులు విరతకృతవేదవాసాధ్యు లగుసాధ్యులును వికంపితాసువు లగువసువులును నై
రివ్విధంబున నిజబలంబులు దక్కి నలుదిక్కులకుం బఱచిన సురపతి తా నొక్క
రుండ చిక్కి మిక్కుటం బగుశోకాటోపంబున. 677

శా. శుంభత్క్రోధమునన్ దిశల్ పగుల నక్షుద్రజ్వలజ్జ్వాలికా
సంభూతస్ఫుటవిస్ఫురద్విస్ఫురుస్ఫారతరస్ఫులింగవ్రజం
బంభోవాహపదంబు గప్పికొన జంభారాతి పైవేసెన్ రణా
రంభోజ్జృంభిత మైనవైష్ణవధటవ్రాతంబుపై వజ్రమున్. 678

క. ఆరీతి భూతదయాదం । బై రయమున వచ్చువజ్ర మగులితబలదు
ర్వారుఁ డగుకుముదుఁ డచ్చెరు । వారఁగ దాకేలఁ బట్టె ననుచరు లార్వన్ 679

ఉ. అత్తఱి సర్వపర్వతచయాతతపక్షవిభేదనక్రియా
హేతుకమై తనర్చునిజహేతి విఘాతితమై యరాతికిం
జేతికి నగ్గమాటఁ గని సిగ్గతి శక్రుఁడు వాఱె దైత్యజి
ద్దూతలు వెంటవెంటఁ బడి తోలుచుఁ గేరిఁగొనంగ మానియై 680

చ. హరిహయుఁ డాదిగాఁ గలసురావలి నాగతిఁ గెల్చి విష్ణుకిం
కరులు జయోత్సవం బెసఁగఁ గ్రమ్మతి వచ్చిరి దన్మహోగ్రసం
గరఘనఘోష మచ్చట సుఖస్థితి నున్నమహాత్ము లాలకిం
పరు పరమాత్మచింతనముఁ బాయక యన్యమెఱుంగకుండుటన్. 681

వ. అంత నక్కడఁ బరాభవజాతమన్యుం డైవచ్ఛలితమన్యుదైన్యుం బాలోకించి లోక
పితామహుం డతని డాయం జని 682

క. ఎవ్వరిచే నీపెనుపమున । నివ్విధి వాలిల్లెఁ జెప్పు మేర్పడ ననినన్
దవ్వగఁ జిత్తం బెరియఁగ । నవ్వనరుహగర్భుతోడ నతఁ డిట్లనియెన్. 683

క. ఏ మని చెప్పెదు లోకపి । తామహ మత్సరము మానధనమును బాసెం
దామరసాత్మునిదూతల । చే ముల్లోకములు గెలిసేయుచు నక్కట. 684

వ. అనినఁ జతుర్ముఖుండు శతమన్యున కిట్లనియె. 685

చ. మెఱసినమృత్యుదేవతకు మత్యువు లైనముకుందదాసులన్
తరలకమాయకొంటరయఁ దాఁ గొఱవిం దల గ్రోఁకుకొంట యి
ట్లొలిఁగియు వజ్ర మంది యిది యేటికి నైదితి వారిబిఁదగు
తెఱఁగున నైన నాపదలు దెచ్చుఁగదా బలవద్విరోధముల్. 686

క. అనిమిష విను నీకులిశం । బనఁగా నిది యెంత మాకు కాస్త్రవరంబై
నను హరునిపాశుపతమై । నను వమ్మగు విష్ణుభూతనాథులచేతన్. 687

గీ. కాలచక్రమైన గరుడధ్వజునిచేతి । చక్రమైన వారిఁ జేరఁ గంత
దలఁగునట్టిమహిమ గలమహాత్ములతోడ । వైర మగుట నేమి గారణంబు 688

క. అనినపితామహుపలుకులు । విని యనిమిషనాయకుండు వినమితముఖుఁడై
మును తన సిగ్గున దమ్ముం । గనుగొనుటయు నతనితలఁపు గనిగంధర్వుల్. 689

వ. ఆచతుర్ముఖున కభిముఖులై కరపుటంబులు నిటలతటంబునఁ గదియించి యిట్లనియె. 690

సీ. అవధరింపుము పంకజాసన సురరాజు చెలిమికాఁ డగుచిత్రసేనుఁ డనెడి
గంధర్వనాథుఁడు కాదంబరీపానమత్తుఁడై సోలుచు మధురఫణితిఁ
బాడుచు నాకాశపథమున నరుగుచో రుచిరమచ్ఛాయాస్వరూప మైన
శ్రీరంగధామంబుఁ జెచ్చెర లంఘించె బలసి యాతని వెంటఁ గొలిచివచ్చు
నేము దాని దాఁటరామి మున్నెఱుఁగుట గడచిపోక నిలుకఁబడితి మంత
కింక మీఱ విష్ణుకింకరు లాతని నొసిచి పాఱవైచి రుర్విఁ గూల 691

క. అటు వ్రేసిన జలధులకడ । పటు ముక్కును మోముఁ జదియఁబడి గగనమునం
బటుగతిఁ జనుసామర్థ్యము । మటుమాయము నొంది దీనమానసుఁ డగుచున్. 692

లయగ్రాహి
సింధురనిశాటమదసింధుఘటజన్ము సురసింధుకనకాంబురుహగంధవిచలత్ప్వ
ప్పంధయవితీర్ణసితబంధురజటాపటలబంధవిలసత్కుముదబంధుఁ బ్రమదాస
మ్మంధలలితాంగు ననుసంధితజగత్కుశలుఁ గంధరచనీలతరకంధరు ముదాగ
స్కంధవృషవాహనుఁ గబంధమథనప్రియుఁ జలంధరహరుం గొల్చె నతఁడంధకవిరోధిన్

క. ఆతనిదెసఁ బ్రీతుండై । శీతాంశుధరుండు పనుపఁ జెచ్చెరఁ జని త
త్పూతములు విష్ణుదాసుల । చేతం బరిభూతి నొంది చేడ్పడి రంతన్ 694

చ. హితుఁ డగు చిత్రసేనునకు నిట్టివిధంబున వచ్చినట్టి దు
స్థితి విని యల్కమై నమరసేనల నెల్లను గూర్చి యాశత
క్రతుఁడు ముకుందకింకరనికాయముపైఁ జని పోరి వారిచే
హతబలులై నిలింపులు భయంబున కన్కనిఁ బాఱిపోయినన్. 695

క. ధట్టించి నిలిచి వజ్రము । కట్టలుకం బూని వైవఁ గైకొన కది చే
పట్టుకొని కుముదుఁడును నతఁ । డిట్టాలం బనుచుఁ జెప్ప నెడ నచ్చటికిన్. 696

వ. మున్ను చిత్రసేనునిచేతను బరిభూతం బగు రాజశేఖరుం డరుదెంచిన విరించి యత్యా
దరంబున నమ్మహాదేవుతో నీవేమికార్యంబున కిచ్చటికి వచ్చితని నచ్చతురాననుం
గనుంగొని. 697

క. క్షితిచిత్రసేనపతనము । నతనికి నై తనబలంబు నని కనుపుటయున్
ధృతిచెడివాఁగలు హరిభట । తతిచే నొచ్చినవిధంబు తడయక చెప్పెన్. 698

క. చెప్పిన విని గంధర్వుం । డొప్పని పనిసేసెఁ దెలివి నూనకనీవున్
దప్పితివి బుద్ధిసురపతి । చెప్పెడి దేమున్న దిట్టిసెగ్గము నొందెన్. 699

చ. అని జలజాసనుండు దివిజాధిపుఁ గన్గొని దైవకృత్య మె
వ్వనికి నతిక్రమించి చనవచ్చునె పుణ్యపరుల్ శుభంబులన్
ఘనదురితాత్ము లాపదలు గైకొనుచుండుదు రట్టికర్మముల్
దనకశమే యొనర్పఁగ విధాతృనియోగమె కాక సర్వమున్. 700

క. జీవులు శుభాశుభస్థితు । లేవిశ్వాత్మకుఁ డెయుంగ నెల్లపుడు నా
దేవునిశక్తివిహీనం । బై వెసఁ జరియించునే తృణాగ్రంబైనన్. 701

ఉ. ఆపరమేశ్వరుం డరయ నాగమవేద్యుఁడు వేదచోదితం
బై పెనుపొందుధర్మ మఖిలాశ్రయ మాసరణిం జరించువా
రాపదఁ జెంద కెందు సుఖ మందుదు రక్షభవర్తులై తదా
క్షేప మొనర్చునీచులు నశింతురు దుస్తరవారకాగ్నులన్. 702

గీ. అది పరమాత్మసంకల్ప మైనయట్టి । ధర్మమార్గంబు దప్పి గంధర్వవిభుఁడు
చక్రిదివ్యాలయచ్ఛాయ నాక్రమించి । కనియెఁ దత్పాపమున నిట్టికష్టదశలు. 703

వ. అనినఁ బాకశాసనుండు జలజాసనుఁ గనుంగొని. 704

క. తోయజభవహరిభవన । చ్ఛాయాలంఘనము సేయ సమకొను పాపం
బే యది తుది నెఱపాయును । పాయం జెలియఁగఁ దేటపఱపుము నాకున్. 705

సీ. నావుడు నజుఁడును దేవేంద్ర వినుము చెప్పెదఁ బరప్రత్యక్షభేదములును
ద్వివిధమై దానువర్తించు భూతావలి యందు స్వచ్ఛాయ ప్రత్యక్ష మనఁగ
నమరు నాయాతపయం బైనవారల కది దనుకబోయినరీతిఁ దోచునొండెఁ
బొడగానఁగా రాక పోవు నీజాడ నది విను స్వచ్ఛాయ యదృష్ట మనఁగ
భువిఁ బరచ్ఛాయఁ దా జ్యోత్స్నయును గనియు । సంబు నన రెండువిధములు జరగుచుండుఁ
జిన్నవాఁ డట్టిపొడలను బెద్దవారి । నీడ దాటింపుచుం జనఁ గూడ దెపుడు. 706

క. గురుసముచితశయ్యాసన । వరవాద్యప్రముఖగేహవర్గము జనుఁడై
చరణమున నాక్రమించిన । నరుఁ డరుగు ననేకఘోరనారకములకున్. 707

వ. సకలధర్మంబులందును సాత్త్వికంబు పరమధర్మం బని యవలంబించి చరియించు నిర్మలాత్ములు మనోవాక్కాయకర్మంబులఁ బరాత్ము లగు నెల్లవారికి గురువు లట్టి పుణ్యపురుషులయందు సదాసన్నిహితుండై యుండుఁ గావునఁ దచ్ఛాయఁ ద్రొక్క-చను దుష్కృతచిత్తులకు నిష్కృతి గలుగనేరదని చెప్పి యప్పితామహుండు వెండియు నిట్లనియె. 708

గీ. దుష్టలోకాత్ములగువారుఁ గుంటివారు । నంఘ్రిహీనులు గల రెవ్వ రట్టివారు
గతభవంబున శ్రీహరిప్రతిమనీడ । లంఘనము చేసి చనినపాపులు శక్ర. 709

చ. నిగిడినవిష్ణుమందిరమునీడయు విష్ణునినీడయట్ల దా
టఁగఁదగ దట్టిపాపము జడత్వము పై నొనరించు దుర్జనుల్
తెగి యమబాధలం బడి తుదిన్ ధరపై జనియించి పంగులై
వగలఁ గృశించుచుండుదు రవారితఘోరరుజాదిపీడలన్. 710

గీ. తత్ప్రదక్షిణ మొనరించుతఱి నరుండు । తడఁగి తచ్ఛాయ మూఁడుభాగములు చేసి
యందుఁ బూర్వాంశమునఁ జను టర్హ మిట్లు । గాక తక్కిన యది దోషకారి యంద్రు.

క. వనజోదరుశుభగుణములఁ । గొనకొని కీర్తింప గేలిఁగొనుచు నవజ్ఞం
జనుజనులు బధిరులై మహి । జనియింతు రనేకజన్మజన్మములందున్. 712

క. హరిబింబమైనఁ దత్పరి । కరమైన ధ్వజంబునైనఁ గని మ్రొక్క కవా
దరబుద్ధి గడచి చను నా । పురుషులు జాత్యంధు లగుచుఁ బుట్టుదు రుర్విన్. 713

క. హరినగరి కప్రదక్షిణ । సరణిం జనుదుర్వివేకి సంచితపుణ్య
స్ఫురణం బెడఁబాసి సంప । ద్విరహితుఁడై పిదప నరకవితతులఁ గూలున్. 714

క. ద్వారమునఁ జనక విష్ణున । గారము మతియొకదు వెంటఁగాఁ జొచ్చుదురా
చారమునఁ జేసి నరులు శు । దారంబగు పుణ్యవితతి దలఁగ సురేంద్రా. 715

క. ఈగతి మెలఁగక దుర్మదుఁ । డై గంధర్వుఁడు విపద్దశాపులఁ దయ్యెన్
వేగపడి విష్ణుదాసుల । తోఁ గరకరి నొంది యశము దొలఁగితి వీవున్. 716

వ. అని పలికి వారిజాసనుం డూరకున్న నాశతమన్యుండు లజ్జావనతముఖుండై యిట్లనియె.

క. చతురానన నా కంతయు । హితుఁ డాగంధర్వుఁ డెగ్గులెన్నక కరుణా
మతిఁ జెప్పుము నాకొఱకై । యతనికిఁ గల్మషనివృత్తి యగు తెఱఁగింకన్. 718

చ. అనినఁ బితామహుండు దివిజాధిపుఁ గన్గొని యిట్టిపాప మే
యనువునఁ దీఱు నేర్చును సమర్చనవందనసంస్తవాదులన్
దను భజియింప నావికచతామరసేక్షణుఁ డాసమాశ్రిత
వననిరతుండు శ్రీహరి ధ్రువంబుగ మాన్పెడిఁ దాన యాతనిన్. 719

క. అని చెప్పి యబ్జగర్భుఁడు । చనియె న్నిజధామమునకు శంభుఁడుఁ బోయెన్
వినుతమణిశృంగసంగత । ఘనపటలవిలాసమునకుఁ గైలాసమునకున్. 720

చ. హరిహయుఁ డంత నిష్టసఖుఁడై పెనుపొందెను జిత్రసేనుఁ డం
బరగతిపాటవం బెడలి పడ్డ ప్రదేశము సేఁగి వానికిన్
సరసిజసూతివాక్యములనందము పొందుపడంగఁ జెప్పి తా
నరిగె నిజాగమోత్సుకసుధాశనకోటికి వేల్పువీటికిన్. 721

వ. ఆగంధర్వరాజును నిజవ్యతిక్రమంబునకు నిర్వేదించి యచ్చోటు వాసి కాశ్యపనామ
ధేయుండగు మునీశ్వరుం బొడఁగని యభివందనం బాచరించి వినయావనమితమస్త
కుండై హస్తంబులు మొగిచి యిట్లనియె. 722

క. దురితానలకీలావలి । నెఱిఁ జెడి నా కేదికృత్య మెయ్యది వాచ్యం
బిరవుగ నేమిట సౌఖ్యముఁ । బొందుదు నెఱిఁగింపవే తపోధనముఖ్యా. 723

వ. అనిన నయ్యతివరుండు గంధర్వవరున కిట్లనియె. 724

మ. పరమేశున్ బురుషోత్తమున్ బరుఁ గృపాపాథోధి నారాయణున్
హరిఁ జిత్తంబున నిల్పి నిత్యము ప్రణామాభ్యర్చనాదిక్రియా

పరతం గార్యము దీర్పు మట్లయినఁ బాపశ్రేణిఁ బోఁదోలి త
త్పరమస్థానముఁ బొందెదెంతయును గోప్యం బే నెఱింగించితిన్. 720

క. నావుడు నప్పరమేశ్వరు । దేవెరవున నెఱుఁగఁబోలు దేచందము వాఁ
డేవంకనుండు ననుటయు । నావాచంయమివరేణ్యుఁ డతనికి ననియెన్. 721

క. అతివిమలం బగుమానస । గతులను సుకృతప్రసక్తి గలకర్మములన్
వితతప్రసన్నభావులఁ । జతురుఁడవై యెఱిఁగ దీవు సర్వాత్ము హరిన్. 722

క. కలఁ డఖిలనాయకుం డగు । జలజాయి సమస్తభూతచయములలోనన్
వెలుపటిసకలావస్థలఁ । గలకాలము పూర్ణుఁ డై జగన్నివహములన్. 723

క. అనుటయు నాగంధర్వుఁడు । మునివర్యుని విష్ణుఁ డఖిలభూతావలియం
దును బాయకుండు నేనియుఁ । గనరామి యదేమి యనినఁ గాశ్యపుఁ డనియెన్. 724

సీ. గంధర్వనాథ జగత్ప్రపంచంబునఁ గలవస్తుతతి తన్నుఁ గదిసియున్న
నైన పురోగతం బైన భాగమకారఁగనవచ్చునే లోన వెనుకదెసయు
నది గాన నీమాడ్కి నఖిలభూతాత్ముఁడై తనరునవ్విభుఁ గానఁ దరము గాదు
బాహ్యాంతరంబు లప్రతిహతంబై ప్రవర్తించు పరిజ్ఞానదృష్టి గాని
యట్టి సుజ్ఞానమునకు మాటగుచు దేహి । గర్మబంధంబు నిగుడుఁ దద్ఘననిరోధ
మురిదిఁ బోఁజేసి నిజహృత్పయోజమధ్య।గతునిఁ బరమాత్ముఁ గనువాఁడ కనెడివాఁడు.

చ. అరుగుము నీవు దుస్తరమహోఘనివారిణి యైనచంద్రపు
ష్కరిణికి నందు భక్తి నవగాహ మొనర్పుము దాన నీ కగున్
బరమశుచిత్వ మంత భవబంధవిమోచనుఁ బద్మలోచనున్
హరిఁ బరమాత్ముఁ గాంచెద వుదంచితధాముని రంగధామునిన్. 726

క. ఆదేవుని నాశ్రితర । క్షాదక్షునిఁ గొలిచి తత్ప్రసాదంబున నీ
ఖేదంబుఁ బాసి చనియెదు । మోదంబున నిజనివాసమున కుడువీధిన్. 727

క. అని యెఱిఁగించిన వినయం । బెనయఁగ గంధర్వుఁ డమ్మునీంద్రున కభివం
దన మాచరించి వీడ్కొని । చని గంధర్వుఁడు విరక్తిసంపన్నుం డై. 728

మ. పరమోత్క్రాంత నకుంఠితస్థితిపురోభాగంబునం గాంచెఁ బు
ష్కరిణీతీర్థము నాత్మతత్పరభజద్గంధర్వగీర్వాణకి
న్నరసంపాదితకామితార్థము ననూనస్ఫారనీరేజకే
సరనిర్యన్మకరందతుందిలపయోజాతోర్మికాసారమున్. 729

వ. కని విస్మయంబు నొంది నిజస్మరణమాత్రగళితకలికలుషకజ్జలంబు లగుతజ్జలంబుల మజ్జనం బాచరించి విశుద్ధశరీరుండై క వేరకన్యకాతీరసహకారకోరక మోదమేదురమలయమారుతావతారరజతగరుడకేతనాభిరామం బగుశ్రీరంగధామంబుఁ జేరి యచ్చట నభంగసంగతప్రసంగంబున నారమామనోహరుచిత్తంబు ప్రసన్నతాయత్తంబు సేయం బూని మొదల నాదసముద్భవంబులై మంద్రమధ్యమతారభేదంబులఁ దమవలన నేకవింశద్విధంబులైన శ్రుతులకు నాధారంబులై మయూరాదిరుతంబులచేత సంకేతింబగుషడ్జాది సప్తస్వరంబులపరస్పరమేళనంబున నభిరామం బగుగ్రామత్రయంబు నవలంబించి మతంగతుంబురునారదకోహలాదితంబు లగుమతంబుల ననేకప్రకారంబులైనమూర్ఛనల నింపుగడలొత్తుచతురుత్తరాశీతితానంబుల ననూనంబులై సంపూర్ణషాడబసమేతంబు లగుపంచదశజాత్యవయవంబులఁ బరిశీలించి స్థాయిసంచారిప్రముఖులగుచతుర్వర్ణంబులు నాశ్రయంబుగా నెన్నఁబడినప్రసన్నాదిప్రభృతికాలంకారంబులు పదుమూఁడును బరిస్ఫురింపఁ గంపితస్ఫురితాహతాందోళితంబులు లోనుగాఁ గలసప్తగమకంబులు మెఱయ నష్టాదశజాతిప్రభూతంబులై శుద్ధ భిన్న గౌళ దేసరి సాధారణోపరాగ సంజ్ఞలఁ బ్రసిద్ధంబులైనశుద్ధరాగంబులును ముప్పదియాఱును రాగాంగంబు లిరువదియును భాషాంగంబులు నలువదియేడును నుపాంగంబులు ముప్పదియొక్కటి క్రియాంగంబులు మూఁడును గాఁ బదిదెఱంగుల నూటముప్పదియే డగు రాగంబులు వేళావిభాగంబులతో నాలాపంబు సేసి సమతాళపదక్రమబంధురంబు లగునాసింధురవరదు బిరుదాంకితంబులైనప్రబంధంబులు పాడఁ దొడంగె నపుడు కర్ణామృతాయమానం బగుగంధర్వరాగంబు నాకర్ణించి. 780

సీ. నెలవులం బులు రాలఁ జెవులొగ్గి మృగములు తరలక మేపులు దలఁగి నిలిచె
గగనవీథులఁ బాఱుఖగము లుపాంతభూజములపై వాలి నిశ్చలత నొందె
మంజులపారిసాదమణికుట్టిమంబులు గరఁగి నీరై జాలుగట్టి పాఱె
దరులతాపఙ్క్తులు మరలఁ బ్రాయము వచ్చి చిగురు గెమ్మోసులఁ జెలువుమిగులె
ననటిజనులెల్ల నితరకార్యములు దక్కి । సంతతానందపరవశస్వాంతు లగుచుఁ
జిత్రరూపులకై వడిఁ జేష్టలుడిఁగి । యున్నవా రున్నచోటనె యుండి రపుడు. 781

మ. కరుణాంభోనిధి రంగనాయకులు దద్గంధర్వగాంధర్వవై
ఖరిచిత్తంబున కౌతుకంబు నెఱయంగా సుప్రసన్నాస్యుఁడై
సరసోదారకటాక్షవీక్షణసుధాసారప్రసారంబునన్
బరితాపం బడఁగించి వారి కొసఁగెన్ భవ్యోర్జితైశ్వర్యమున్. 782

మ. అతిమోదంబున నప్పు డుజ్జ్వలవిమానారూఢుఁడై యుజ్జ్వల
ద్యుతులన్ మించి తనుప్రభల్ దెసల నిండం బర్వ గంధర్వులం
బ్రతిమప్రౌఢి ననేకభంగుల నుతింపన్ జిత్రసేనుండు దే
రతమై నేఁగె నిజాలయంబున కపూర్వశ్రీసముల్లాసియై. 733

వ. తదనంతరంబ. 734

క. వితతశ్రీమహిమలఁ దన । ప్రతి యగు సఖుఁ జూచి దేవపతి యతిప్ర
స్థితుఁ డయ్యె నతనిసంగతి । నతఁడును సుఖముండెఁ ద్రిదివమున ననురక్తిన్. 735

క. ఈకథ వినునరుఁ డఘముల । సోఁకక యధికారనిరతి సుశ్రీకుఁడు శుభముల్
గైకొనుచు నుండు నిచ్చట । శ్రీకరగంధర్వపథముఁ జెందుదు రచటన్. 736

వ. అని పారాశర్యుండు నాగదంతమునివర్యునకు నెఱింగించిన తెఱంగు. 737

శా. ధాటీసంభ్రమజృంభమాణనిజసౌధవ్యూహబాహాధను
ర్జ్యాటంకారవిశంకటధ్వనివిశేషధ్వస్తనిస్తంద్రక
ర్ణాటోద్దీర్ణబలార్ణవాప్రభటితుకంగారోహణోదారలీ
లాటోపాస్యతనూజ చాగప్రభు రామామాత్యచూడామణీ. 738

క. నిరుపమశుభగుణనిధినుత । వరభుజబలమహితహితవిపక్షనిరతా
చరణరణదివ్యరాహుత । బిరుదపదోన్నతవితానబృందాధయనా. 739

మాలిని. సుకవిశుకరసాలా సూనృతాలోలశీలా
వికచకమలనేత్రా విద్వదంభోజమిత్రా
ప్రకటితనిజశౌర్యా ధర్మకోలేంద్రధైర్యా
సకలసుగుణధామా చాగయామాత్యరామా. 740

గద్యము. ఇది శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసారస్వతవిలాసగౌరనామాత్యపుత్త్రసుధీ
విధేయ భైరవనామధేయప్రణీతం బైన శ్రీరంగమహాత్మ్యం బను పురాణకథయందుఁ
దృతీయాశ్వాసము.

# శ్రీరంగమహత్త్వము.

## చతుర్థాశ్వాసము.

క. శ్రీరంగరాజసేవా । పారంగత కర్ణఖచరపతికశిపునమం
దారసురధేనువితరణ । చారుగుణాకరసుధామ చాగయరామా. 741

వ. అవధరింపు మఖిలకథాకథనచాతురీజనితరోమహర్షణుం డగురోమహర్షణకుమారుండు దివ్యబోధను లగుశౌనకాదితపోధనులకుఁ జెప్పిన తెఱంగునఁ బుష్కరిణీతీర్థసామర్థ్యం బాకర్ణించి సుధీవిధేయుం డగుసాత్యకతేయునకు నధికతపోధనవంతుం డగు నాగదంతుం డిట్లనియె. 742

సీ. అతిచిత్ర మగునీయుపాఖ్యాన మనఘాత్మ వింటి నీవలన భూవిదిత మైన
చంద్రపుష్కరిణీప్రశస్తియు నంచితక్షేత్రానుభావంబు చిత్తగతము
లయ్యెను వేదవేదాంగపురాణేతిహాసాదిసకలవిద్యాప్రపంచ
కల్పనంబున నీవ కర్త వీరూపున నవతార మైననారాయణుఁడవు
గాన నిగమార్థనిర్ణయగతుల నీవ । యెఱుఁగు దితరేఁగడివారికి నెల్లమేటి
వానలిమ్ము కృపామతి నచట మఱియు । సుమహితము లైనపుణ్యతీర్థముల తెఱఁగు.

క. అనుటయుఁ గృష్ణద్వైపా । యనుఁ డాసంయమివరేణ్యు నాదరమునఁ గ
న్గొనిఁ జెప్పె మఱియు నయ్యెడ । జనవినుతార్థంబు లైనసత్తీర్థంబుల్. 744

చ. అన విని శౌనకాదిమును లందఱు డెందములందు సమ్మతం
బెనయఁగ సూతపుత్రునకు నిట్లని రట్టి విచిత్రసత్కథల్
విను మిటు మున్ను మా వినవేడుక యయ్యెను శక్తిపౌత్త్రుఁ డా
తని కెఱిఁగించినట్టిసముదంచితతీర్థము లాఱుఁ జెప్పుమా. 745

వ. అనినమునీంద్రబృందంబునకు సూతనందనుం డిట్లనియె. 746

క. ఇప్పుడు నను మీ రడిగిన । చొప్పున మున్నఖిలతాపసులు గూడి ప్రియం
బొప్పారఁ దన్ను నడిగిన । నాపుణ్యాత్ములకు బాదరాయణుఁ డెలమిన్. 747

క. వినిపించె నట్లు తగ న । మ్మునివరునకుఁ జెప్పఁదొడఁగె మున్న సమతపో
ధనుఁ డైనభరద్వాజుఁడు । తనశిష్యులు గొలువఁ దీర్థతత్పరమతియై. 748

సీ. తపసియుఁ జని కంచి దర్శించెఁ గేదార మాడె గంగాద్వార మధిగమించె
సింహాచలంబు వీక్షించెఁ గురుక్షేత్ర మరిగెఁ బుష్కరముల ననుసరించె
కాశికాపురి నవగాహంబు సేసెఁ బ్రయాగంబునందు గయావటంబు
గరిసె గోదావరిఁ గాంచెఁ గృష్ణానది । భజియించె శ్రీరంగభర్తఁ గొలిచె.
సన్నుతించె నహోబలస్వామిఁ బ్రణుతి । సేసె శ్రీవేంకటాచలవాసి నెలమి
నర్చ గావించె హస్తిశైలాధిపతిని । దీర్చెఁ బూజ జగన్నాథదేవునకును. 749

క. ఈవిధిఁ గని యతియును ధర । నీవలయమునందు మహిమ నెగడినబహుతీ
ర్థావలి ననుక్రమంబున । సేవించుచు వచ్చి వచ్చి చిత్తం బలరన్. 750

క. అతఁడు గనుఁగొనియెఁ గ్రీడా । గతవితతోదన్యవన్యకరమదధారా
ప్లుత మైనసరసిచెంతను । నతిముద మందంగఁ జేయునారామంబున్. 751

వ. కని డాయం జని. 752

సీ. కర్ణామృతంబుగాఁ గమలాక్షునవతారకథలు వర్ణించుశుకవ్రజంబు
సామంబు లంచితస్వరముగా మునికుమారులఁ జదివించు కోకిలకులంబు
హరిఁ బాడుకిన్నరవరులకు నాలాపవిధము లాసించెడిమధుకరములు
నమరవిలాసినీసముదయంబుకు లాస్యగతు లోజఁ గఱపుశిఖావళములు
శ్రీమనోహరశుభదివ్యనామవితతి । విశదముగఁ బల్కుచును బల్కు విహగచయము
చూతపున్నాగవకుళఖర్జూరముఖ్య । తరుకదంబంబు గల్గుతత్తటములందు. 753

క. ఘనుల నసమానతేజో । ధనుల సమీక్షించెఁ దత్తనుభూమిసుధా
శనుల నిరంతరహరిచిం । తనుల సనాతనుల మునులఁ దద్దయుఁ బ్రీతిన్. 754

క. సందర్శించుచుఁ జని కని । యం దదనంతరము సుజనహృద్వనహారిణిన్
నిందాచరణమహీరుహ । చందనమందాంధకరణి శశిపుష్కరిణిన్. 755

ఉ. అందవగాహనాదివిధు లర్థి నొనర్చి భజించె దేవతా
బృందలసత్కిరీటవలభీబలభిన్మణిమాలికాంకితా
మందనఖేందుబింబరుచిమత్పదపీఠుఁ గృపానిరూఢు నా
నందసమగ్రసజ్జనమనఃప్రియదాయకు రంగనాయకున్. 756

క. ఆదేవునసమవైభవ । మాదివ్యతనూవిలాస మాసౌభాగ్యం
బాదరహాసవిలోకన । మాదరమునఁ జూచి విస్మయాన్వితుఁ డగుచున్. 757

గీ. కొంతతడవుండి వెడలి తదంతికమునఁ । దనగురుం డైనవాల్మీకిమునివరేణ్యుఁ
డున్నవాఁ డని చని ముందు మొదవ నచటి । తాపసులచేఁ దదాశ్రమస్థలము దెలిసి.

వ. అథ భరద్వాజమునివరుం డచ్చోటఁ గరిగి హరిధ్యానానందలీలాసమున్మీలి యగు
వాల్మీకి నవలోకించి కృతాభివందనుండై తదాదరంబు వడసి యమ్మహాత్మున కిట్లనియె.

చ. వెలసినపుణ్యతీర్థములు వేడ్కఁ జరించుచు వచ్చి యీశుభ
స్థలి ననుపమప్రభావవిదితం బగుపుష్కరిణిం గృపాసుధా
జలనిధి యైనరంగవిభుఁ జాయమతిన్ భజియించు నిందు నీ
రలవడ నున్కి నిక్కముగ నారసి కంటి భవత్పదాబ్జముల్. 760

క. వినఁబడియెఁ బెక్కుచిత్రము । లనఘా కనుఁగొంటిఁ గొన్ని యాశ్చర్యము లీ
ఘనదివ్యదేశవరమున । కెన యగుతీర్థములఁ జూడ నే నెయ్యెడలన్. 761

వ. అనిన విలసత్తపోవిభవుం డగువల్మీకభవుం డుదారతేజుం డగుభరద్వాజున కిట్లనియె.

ఉ. భూనుతసత్యధర్మగుణభూషణుఁ డైనవిభీషణుండు దా
నీనదిఁ జేర్చ నన్నఁ డిడె నీహరిధామము నాఁటనుండియున్
యే నిట నున్నవాఁడ మఱి యేమియు నొల్లక నిత్యకృత్యమై
పూని ముకుందవందనము పుష్కరిణీభజనంబు సేయుచున్. 763

ఉ. ఆయతరంగమందిరశయాను భుజంగమతల్పు యోగని
ద్రాయుతు నిందిరారమణు దైత్యవిభేదిఁ బురాణపూరుషున్
బాయక నిల్పుటన్ విమలభావము నొందిననా మనంబులో
నీయెడఁ గల్గుచిత్రము లనేకము లచ్చుగఁ దోఁచు నిచ్చలున్. 764

క. అనిన భరద్వాజుఁడు గురుఁ । గనుఁగొని మున్నిచట నున్నకాలంబున నీ
కనినవిశేషములన్నియు । వినిపింపుము నాకు భువనవినుతచరిత్రా. 765

సీ. నావుడు నమ్మౌనినాథుఁడు నిజశిష్యుఁ గనుఁగొని పలికె లోకప్రసిద్ధి
నెగడునీపుష్కరిణీసమీపంబున సుప్రసిద్ధమునియోగివరుల భక్తి
ననిశంబు సేవింపఁ దనరుతీర్థము లాఱు కడిమి తత్సలిలావగాహ మెలమిఁ
గావించి రేనియు గోవిప్రహంతలు గురుదారగమనోత్సుకులు సువర్ణ
చోరకులు కల్లుఁద్రావెడివారు మఱియు । బహువిధము లయినదుస్తరపాతకములు
చేసినట్టిదుశ్శీలురు చిరవిశుద్ధిఁ । జెంది శుద్ధాత్ములై ప్రకాశింతు రెలమి 766

వ. ఇట్టిమహాత్మ్యంబు గలిగినరంగధామంబునకుఁ జెంగట ద్విత్రిగవ్యూతిమాత్రప్రదేశస్థితం
బగు నశ్వత్థవకుళాంమ్రజంబూకబిల్వతీర్థంబులం దతివిచిత్రంబు లగుపురావృత్తంబులు
గలవవి నీ కెఱింగించెద దత్తావధానుండవై యాకర్ణింపుము. 767

మ. సతతానేకమునీంద్రసేవితము సత్స్వర్థాఖ్యతీర్థంబునం
దతిపుణ్యాధికసద్వివేకఖని సత్యజ్ఞానసంపన్నని
ర్గతకామాదివికారమమాధవి యనంగా నొక్కతెన్వంగి స
న్మతి సేసెం దప మంబుమధ్యమున సమ్యగ్వర్జితాహారియై. 768

క. ఈనెతి బహుకాలము చనఁ । గా నొకనాఁ డంబరమునఁ గావుఁడు కావుం
డే నొచ్చితిఁ జచ్చితి నను । దీనాలాపంబు లుప్పతిలెఁ గడుఁ దఱిచై. 769

గీ. అమ్మహాక్రందనము విని యాత్మఁ గరుణ । దనుక వెఱవకు వెఱవకు మనుచు వదన
వనరుహం బెత్తి యాతన్వి కనియె మింట । కాలభటపీడితాంగ నంగన నొకర్తు. 770

క. అలలనయుఁ దద్వనము । లాలించె దయాళు వైనయప్పుణ్యవతిన్
బోలఁగఁ గనుఁగొని వెండియు । వాలోచన క్రిందుఁగాఁగ నాక్రోశించెన్ 771

క. ఈవిధమున భయపరవశ । యై వడఁకుచుఁ గరుణ పుట్టి యాక్రందనమున్
గావించు దానితో స । ద్భావం బొనరంగ నాతపస్విని పలికెన్. 772

క. ఓకామిని నీ వెవ్వతె । వేకతమున వీరిచేత నీవందమునన్
భీకరబాధలఁ బొల్పడి । సైకొని వేదనల బెండుపడఁగా వలసెన్. 773

మ. అకటా చిత్తములం దొకింతయును సౌమ్యత్వంబుఁ బాటింప కే
టికి నీయింతినిఁ బట్టి నిర్దయతఁ బీడింపంగ మున్నెట్టివా
రికినైనం బ్రభవించునే నుగుణలాక్షిం జెంది కాయంగ వా
రిక కాటించువిచార మిజ్జగము నిర్దాక్షిణ్య మయ్యెంగదే. 774

క. కాకరితఁ గృపామతివై । ప్రోవుముజగదీశ సకలభూతానుమహా
గోకుంద సుఖావహ స । ద్భావసమ ముకుంద నమ్మ నమ్మెద నీవున్. 775

వ. అని పలికి ధర్మవత్సల యగునమ్మాధవి నెమ్మనంబున నుమ్మలించుచు నూరకున్న నానము
వర్తికింకరులు ధర్మాగ్రహితంబును గంభీరభావబంధురంబును నగుతద్వాక్యంబు లాక
ర్ణించి యాతపస్విని నిఖిలధర్మవిదుషిగా నెఱింగి ముదితహృదయులై సాదరంబున
నాబ్రహ్మవాదిని కిట్లనిరి. 776

గీ. ఓతపస్విని సుకృతసంయుతచరిత్ర । వినుము కడునార్త యగుదీనిఁ గనికరంబు
దొలఁగి యేమివ్విధమున నత్యుగ్రభంగిఁ । గారిసంబులఁ బెట్టెడికారణంబు. 777

సీ. స్థావరజంగమాత్మక మైనభువనంబు లన్నియుఁ బరమాత్మఁ డాత్మవశము
గావించి మఱిసర్వకార్యంబులందుఁ దద్భావస్థుఁడై వానిఁ బ్రత్యహంబు

చేష్టింపఁ జేయున శేషశుభాశుభాచరణంబులకు దాన సాక్షియగుచుఁ
గర్మానురూపముల్ గా సుఖదుఃఖముల్ పరువడి ననుభవింపంగఁ బంపు. 778

తే. నట్టిసర్వేశ్వరునియాజ్ఞ నఖిలభూత । తతుల శాసింపఁ బ్రభుఁ డైనదండధరుని
శాసనంబున లోకసంచయమునందుఁ । దిరుగుచుందుము నేము తత్కింకరులము. 779

క. పలుమఱు నిది యొనరింపని । కలుషంబులు లేవు పాపకరులకు బైఁ బైఁ
దల మగు బాధలు పుణ్యా । త్ముల కతిసౌఖ్యము నొనర్పుదుము మే మెపుడున్. 780

వ. అని శమనదూతలు చెప్పిన నప్పుణ్యవతి వారల కిట్లనియె. 781

ఉ. తప్పదు మీరు పల్కినవిధం బఖిలంబును భూతకోటి కి
చ్చొప్పు సనాతనంబు విధిచోదితమై క్రియ యెట్టివారికిన్
ద్రిప్పవశంబె యైనను మదీయసమీపముఁ జేరఁ గాన నే
నిప్పుడు దీనికైన నెగు లేగతినైనను మాన్పఁగాఁ దగున్. 782

క. కావున నీసతి సుగతికి । నేవిధమునఁ బోవు నెద్దియే నొనరింతున్
నావుడు మితభాషిణి యగు । నావిమలచరిత్రతోడ నని రాదూతల్. 783

గీ. సకలకర్త యయినశార్ఙ్గిశాసన మెవ్వఁ । డతకరింపఁ జూచు నట్టిజనుఁడు
తన్మహోగ్రచక్రధారానలజ్వాల । లందు మిడుతఁబోలె మ్రందిపోవు. 784

చ. అనవుడు వారితోడ ననఘాత్మక మాధవి యిట్లనుం బ్రియం
బనువచనంబ నిక్క మగు నట్టిద నిర్మలపుణ్య మించుకై
నను నొనరింపదే నిపుడు నాసుకృతం బొకయింత యిచ్చెదన్
జెనకక దీని బ్రోలిడిచి చిత్తములోఁ గల యార్తిఁ బాపుఁడీ. 785

చ. పొడమినయార్తిమై శరణుఁ బొందినవారికృపాగుణంబు చొ
ప్పడ నభయంబు లిచ్చి వెలయం దనప్రాణము లిచ్చియైన నె
వ్వఁడు సవరించు నప్పురుషవర్యుఁడు పుణ్యుఁడు తద్విధంబు చొ
ప్పడక యుపేక్ష సేయు జడభావులు పొందుదు రుగ్రదుఃఖముల్. 786

క. ధారుణిఁ ద్రిభువనపూజిత । మీరమ్యక్షేత్రరాజ మిచ్చోటఁ బ్రియం
బార వసియించుప్రాణులు । తోరపుదురితములఁ బాయుదురు నిమిషమునన్. 787

క. అవిరళవిచిత్రమహిమల । భువిఁ బ్రస్తుతి కెక్కఁ దీర్థముల నన్నిటికిన్
ఠవణింపఁగ నధికంబై । ప్రవిమలతీర్థంబు పరమపావనలీలన్. 788

గీ. అట్టియీపావనక్షేత్రమందు నియతి । నావసించినయట్టిపుణ్యంబులోన
నీలతాంగికి నిచ్చితి నేకదివస । సంచితం బైనసుకృతప్రపంచఫలము. 788

వ. అని పలుకు నంత నంతకము న్నంతకకింకరులచేత నాభీలంబు లగుకాలపాశంబులఁ గట్టువడిఁ మొఱవెట్టు చున్నయన్నాతిబంధనిర్బంధనం బెడలి జలధరనిరోధం బెడలి భాసిల్లు సుధాకరుకళయునుంబోలెఁ జాల నొప్పారె నప్పు డతిదగ్గమం బగుతన్మార్గంబు మందారమంజరీమకరందబిందుకుంజలంబు లగుమందానిలంబు పెల్లునఁ జల్లనై తనువుకుఁ దనుపాసంగ మొదలం గదిసి యదలించుచు భయంకరాకారు లైనకింకరులు సంతోషకారులై వారందఱు ప్రసన్నహృదయులై నిపాద్దంబుఁ బాటించి సముచితమధురభాషణంబుల సంతోషం బొనరించుచు ననుసరించి రనేక విధప్రయోగంబులు దివ్యభోగంబులై యనురాగంబు సంపాదింపఁ బటుప్రహారలక్షిత క్షతప్రాయంబు నగుతత్కాయంబు విగతవ్రణనికాయంబై యగణ్యలావణ్యరసభావ రాజితంబై తేజితం బగుశంబరారాతిచేతికరవాలంబులీలఁ బొలుపు దీపించె నివ్విధంబున నసమానపుణ్యోదయభాసమానయగుమానిని తన్నడ నెడఁ బొడఁగని సిద్ధముని నిచయంబు లుచితవచనంబుల సంభావింప నమితవైభవంబున వైవస్వతసభాభవనం బున కరిగి యందు. 789

క. కనుఁగొనియె నప్పురంధ్రి । జనమణి కృతజంతువివిధచయసంచయమునుఁ
వినుతాచారప్రమునుఁ । ఘనకల్మషదమును మహితగమునుఁ శమునుఁ. 790

క. ఆసమవర్తియు నత్తతి । నాసుదతికిఁ దండ్రిఁబోల ననుమోదకరుం
డై సముపచారపూర్వము । గా సమ్మతిఁ బలికె మధురగంభీరోక్తిన్. 791

సీ. నెలఁత యీభవమున నీచేసినట్టి ధర్మంబు లే దొకలేశమాత్రమైన
విను మిట్టక్రిందటఁ జనినపండ్రెండవజన్మంబునందు నీసదనమునకు
హరభక్తుఁ డగుసిద్ధవరుఁ డొకఁ డేతెంచి యుండె సౌఖ్యంబున నొక్కరాత్రి
తత్సన్నిధానజాతప్రభావమున నీ కటుగల్గె సాధుసమాగమంబు
తన్నిదానోచితసుకృతత్వమున రంగ । సీమ నశ్వత్థతీర్థవాసయును బ్రహ్మ
వాదియును నైనమాధవి సాదరమున । నొసఁగె నొకదిన మచటఁ దా నున్నఫలము.

క. చెందినఁ దత్పుణ్యము నని । గందరుణీ యుండు మింకఁ గల్పతతు మా
నందాఁక బ్రహ్మలోకము । నందవ్య యదివ్యసుఖసమన్వితవగుచున్. 793

చ. అని తమమందు వీడ్కొలుప నారమణీమణి సమ్మదంబుతో
మ్మనమున నిండ నద్భుతమహాద్యుతిమండలయుక్తమైనదై
తనమణిమాలికావిలసితం బగుదివ్యవిమాన మెక్కి యెం
పెనయుచుఁ గ బ్రహ్మలోకమున కేఁగె సురల్ వెఱఁగంది చూడఁగన్ 794

క. మాధవియును నిచట ననిశ । సాధారణ మైనతపము సలుపుచుఁ గరుణాం
భోధిఁ గమలాధిపతి నా । రాధించి తదీయచిరపదస్థితి నొందెన్. 795

వ. ఇట్లఖిలభువనవిశ్రుతం బైనయాక్షేత్రతీర్థంబునఁ గృతస్నానుండవై దేవర్షిపితృతర్పణంబు
లొనర్చు మీయితిహాసంబు వినువారికి దురితనిరాసంబును బుణ్యలోకశాశ్వతనివాసం
బును సిద్ధించు నని పలికి వాల్మీకమునీంద్రుండు వెండియు నేమి వినవలయు నని
యడిగిన నమ్మహాత్మునకు భరద్వాజుం డిట్లనియె. 796

క. ఘనదురితభయాకరమై । చనునీక్షేత్రతీర్థమాహాత్మ్యం బిం
కను విన వేడుక యయ్యెడి । మునివర నా కెఱుఁగఁ జెప్పుము కృపామతివై

వ. అనిన నత్తపస్వివరేణ్యుం డతని కిట్లనియె 797

గీ. వినుము వెండియు నొకపురావృత్త మనఘ । మును గణ్వుండు నా నొప్పుమునివరుండు
భక్తి నిండార శ్రీరంగపతి భజించు । కౌతుకంబునఁ దలిర్ప నక్కడికి నడచి 798

శా. ఆలోలామలచారుకోమలతరంగాహంస్యమానోల్లస
త్కూలానోకహపుంజమంజులమనోగుచ్ఛావళీసుప్తమ
త్తాళివ్రాతఁ గవేరజాతఁ గని యం దర్థిన్ గృతస్నానుఁడై
యాలోకించె ననంతరంబ మునిభావాసాంగమున్ రంగమున్. 799

వ. కని తదభ్యంతరంబు ప్రవేశించి యందు.

క. శరదమలకమలలోచను । దరదళితసరోజధాము ధామశ్యామున్
వరహాసవికసితాననుఁ । గరుణానిధి శేషశాయిఁ గామితదాయిన్ 800

క. సందర్శించి ప్రణామము । లందంద యొనర్చి తనుఁ గృతార్థునిఁ గాఁగం
డెందంబునఁ దలఁచుచు న । మ్మందిరము వినిర్గమించి మది ముదము మొదవన్. 801

సీ. సజలధారాధరశ్యామకోమలగాత్రుఁ బ్రత్యూషధవళాబ్జపత్రనేత్రు
గమనీయకురువిందమణికుండలోద్భాసు మధురాధరోల్లసన్మందహాసు
రత్నహారాంకితోరస్స్థలపరిణాహు దివ్యాంగదోజ్జ్వలదీర్ఘబాహుఁ
గటిస్ఫురత్పీతకౌశేయపరిధానుఁ బరిపూర్ణయౌవనభ్రాజమాను

ధీరు నఖిలైకమోహనాకారు సార్థ । సస్మితద్యుతివిభ్రమానుచరసమేతుఁ
గాంతుఁ గాంతాసమన్వితుఁ గనియె సుకృ । దివ్యపురుషునిఁ గావేరితీరమునను.

మ. కని శ్రీరంగమునన్ భుజంగమసురంగద్భోగశయ్యాతలం
బునఁ దా నప్పుడు మాచునట్టిహరి యొప్పం దేజమున్ మూర్తిచా
ప్పూను శృంగారవిలాసభంగులు సొంపంబుల్ వెలుఁగ నమ్మహా
త్ముని యొండొక్కటఁ గానఁగాఁబడిన మద్భూతాద్భుతస్వాంతుఁడై. 803

క. ఇటుఁ జూచితి విడలితి మతి । యిటుజన కదవచ్చి కంటి నీలోనన తా
నెటనుండి వచ్చెనో కో యి । చ్చటి కప్పగమేటుఁ దనుచు సంశయమతియై. 804

గీ. కదియఁబోయి నిజముగా విలోకించెదఁ । గాక యనుచుఁ గౌతుకమునఁ జేరి
పరగుఁ దత్ప్రభావపరిమోహితాత్ముఁడై । యెఱుఁగలేక మతియు గతియుఁ జూచి.

క. కాఁ డితఁడు రంగవిభుఁ డను । వేఁడిమి మతియట్టివాఁడు వేఱొకఁ డనుచున్
లేఁ డను నిత్తెఱఁగున నవు । గాఁ డని భావింపఁ గొలఁదిగాక జడుండై. 806

శా. ఆందోళించుచు నివ్విధిన్ మునిఁగి చింతాక్రాంతుఁడై నిల్చినన్
మందస్మేరముఖారవిందుఁ డగుచున్ లక్ష్మీశ్వరుం డాశిప
స్వం దేవోమహితుం గృపాసహితుఁడై వీక్షించి ధారాధరా
మందధ్వానగభీరవాక్యముల సన్మానంబుగా నిట్లనున్. 807

గీ. ఏమి చింతించుచున్నాఁడ వోమునీంద్ర । నీమనంబున నది మాకు నిజముఁ జెప్పఁ
బొసఁగు నేనియుఁ జెప్పుము పొసఁగకున్న । నుండగా నిమ్ము నీయందు నున్నపగిది.

వ. అని యాదేవుండు పలికినఁ జెవుల నమృతంబులు చిలికినచందంబున నమందా
నందంబు నొందినయమ్మునుందున వందంగ నభివందనం బాచరించి కృతాంజలియై
యమ్మునికుంజరుం డిట్లనియె. 809

చ. అనుపమభోగితల్పగతు నంచితహాసవికస్వరాననున్
నిను నఖిలేశు నిప్పు డిటు నెమ్మిఁ గనుంగొన వచ్చి యింతలో
నన యిచటన్ బ్రియానుగసవాధు నుదారవిహారశీలుఁ జ
య్యనఁ గని యీతఁ డెవ్వఁడొకో యంచు మనంబునఁ జింత నొందితిన్. 810

ఉ. నీవె యతండ వౌదువని నిర్ణయబుద్ధి జనించె నాకుఁ బ
ద్మాకర యిప్పు డిందుఁ గడుధన్యుఁడ నైతి కృతార్థ మయ్యె నా

జీవిత మీఘతంబు వెలసెన్ నిమ సర్వగు వేదవేద్య నా
స్తావనళోలు దేవమయు నచ్చట నిచ్చటఁ జూడఁగల్గుటన్. 811

ఉ. నావుడు నంబుజాక్షుఁ డిటు నవ్వుఁ దలిర్పఁగ నమ్మునీంద్రుతో
నీవిమలప్రదేశ మతిహృద్యము నాకు సుధాసమంబు సం
భావన మైనయీవనియుఁ బ్రాణపదం బది గావునన్ సుఖ
శ్రీ విలసిల్ల నీతటి వసించితి మంగళరంగశాయినై. 812

ఉ. ఇచ్చటుదక్కఁ దక్కొకెడ లెవ్వియు నామదికిన్ రుచింపమిం
బొచ్చెము లేక యీతటినిపొంత వనాంతములందుఁ జాలఁగ
న్నిచ్చలు నమ్ముకుందునల నిచ్చలాక్షియు నేను నిచ్చలున్
మెచ్చికమైఁ జరింతుము సముంచితసౌఖ్యవిహారలీలలన్. 813

వ. అని చెప్పి యప్పద్మవాసినీసహచరుం డనుచరసహితుండై యల్లనల్లన చనిముందట సముదవిలాసభవనం బగువనంబుఁ జొచ్చి యందర విరులమధుకలంబు పరువంబులై కదలి తరువం గ్రొందమినతరువుగురువం బ్లనవ మురువుఁ గాపుపురువకంబులపొదువులను, దరుణారుణశ్రీకంబులై సైకంబు లగుకేసరంబులయానీకంబుల నఖిలలోకవిలోకనంబులకు నుత్సేకంబు సెఱపునశోకంబులశోకంబులను, వికసనావసరంబుల నలివిసరంబులకు సుసరంబులై రసంబులకు మాసరంబు లగుకేసరంబుల నతిభాసురంబు లగుపరిసరీలను శోపంబుల విరహుల కోపం బుద్రికొనుకుసుమచాపంబు నోడు నాటోపంబునకు నను రూపం బగుకలికాకలాపంబున దీపించు నీపంబులసమీపంబులను, వలరాజుకోలవు మేడలజాడ లలితంబులై ప్రోడలఁ గ్రీడలకేసరించుచు నీడలక్రీడలగుసారంబు లగు నమృతపూరంబుల చవి నిరసించునిగారపంబులతోరంబు లగునారికేళంబులచేరువులను, నాగలతాయోగంబులఁ బొదలి దళాభోగంబుల పరాగంబు లడర నుద్యోగంబుల భోగులకు ననురాగంబు లొసఁగుపూగంబులదెస భాగంబు లగుసుజాతంబు లగుకలికా జాతంబులకు నికేతనంబులై కాముకవారికంబులచేతంబు లుత్కళికాసమేతంబుగాఁ జేయు పారిజాతంబుల యీతిలాతలను సరసాలవాలంబులై హరినీలంబులఁ బోలుఫల జాలంబుల విశాలంబు లగుజంబూసాలంబుల మూలంబులను, వనదేవతాకేళికందుకంబు లనం గేళికందుకంబులపొందున సుగంధకబిందుఫలకంబుల పొందునఁ బొల్చు తిందుకంబులకందువలను, బసిఁడిబొమ్మలచెలువంబుగలకొమ్మల కస్తూరిచెమ్మలు గలకుచమ్ముల తమ్ములవెసివాసనల తెమ్మలగుఫలమ్ముల వీఁగుకొమ్మలు గలనిమ్మలయిమ్ములను, శుభాకారం

బులు గలకీరంబుల విహారంబులకు నిహారంబులగు సహకారంబుల కనతిదూరంబులను, వలపుల వెంటలయి యలరుతేనియ తేటలాని చెలంగు తేంటిజోటులపాటలంబు లీనమి సర్యాటలం గొనియాటలకుం దగి తుంటవిల్తునాటకశాల లన పికవిహారంబులన బాటలై యభినవారుణప్రభాపాటలంబు లగుపాటలంబులచాటులను, గనకసముజ్జ్వలంబు లగుదలంబుల నెసంగి దలంబు లగుపరిమళంబు లగుఫలంబున వనకదళికులంబునకు బలంబుల నొసంగు కంటకిఫలంబులసవిధంబులను, అంగజానిషంగంబు లన సురంగంబు లగుకుసుమకుడుంగంబులం బరిమళానుషంగంబులై యతిరాగరసోత్తరంబులు గాం జెలంగుభృంగంబులకుం గ్రీడారంగంబులసంగతి నలికంబులం దిలకంబులం గలకంబుకంఠుల యలికంబుల తేటిసలకంబుల భోలుచునలకంబులకు నలవునలయలకులంబు లగుతిలకంబుల కెలంకులను, విటజనంబులమనంబుల ఘనంబు లగుమానధనంబు లనుదినంబును గొనబడుచు మరునిపరిజనంబులకు నావటంబు లగుకటంబులకు నంగటులగు జరగు వలపులం దగిలిమరిగి తిరుగు తెలివల మొఱంగి సరగున సురిగి తారుగం బ్రియులకు వెరగు లగుసురగుల పొరుగులను, సొంపు దింపక నిత్తగియు విరుల పెంపుకలిమి చంపక మాన దనితలంపక పొలయుమధుపదంపతులకు మనఃకంపంబు లగుచంపకంబుల, శ్రీమంతు లనుకళాపంతుల వింతలీల లనువలవంతలం దగిలింప వలవంతు లగునింతులచే బంతులకువంతులు వడినసేమంతులపొంతలను, సజ్జకంబు లగువలపుల నిజ్జగంబుల వాసించుచుం గ్రొజ్జగురుమిగులు గొజ్జంగలపజ్జలను, రతితంత్రవేదులవిశేషంబులకుం బ్రోదులై మలయజామోదు లగువిరవాదులును, విరవాదుల పొదలవీధులం జల్లతెమ్మెరల నల్లలవాడుపూరెల్లులం దూంగు తేంటి పిల్లలకుం బల్లవులు కొల్ల లొసంగుచు నెల్లలకు మొల్లలకల్లుల మొల్లంబు లలర మెలంగుచు ననమువిలాసాభిరామ యగు నారామకు నారామసీమంతతరుసంతానంబు నంతంతం జూపుచు నయ్యాప్రదేశంబుల. 814

క. కురువిందరదన తల్పిరియ । సరవిం దలంబ్రోంగు తేంటిజవరాలికి ముం
దర వింటని పరువందిన । కురువిందలం జూపె నొక్క కురువిందతుకన్. 815

క. మాకందము కడు నిదిర । మ్మా కందము దాయంబోయి మంజీరులకున్
మాకందంగ వెఱగవిసిన। మాకందము మగువ మధురమాకంద మిదెన్. 816

క. వారము లగునతనుని పరి । వారములకు నెలవు లగుచు వాలెడి సమ్య
గ్వారము వారము దనకై । వారము లానరింప సింధువారము లతివా. 817

క. దవనము వనలక్ష్మివినో। దవనము సదవనము విరహతాపాంధులకున్
భువనము లలరంగ మెలంగెడి । వనమున కపూర్వజన్మభవనము తన్వీ. 818

క. శుకముఖరుచి గలతపసాం । శుకముల పెటె మెఱయు నంగజానిశితశరాం
శుకములన మెఱయునవశిం । శుకములఁ గనుఁగొనుము రాజశుకమృదువాణీ. 819

క. కాకలిమై మధుకరప్రభు । కాకలి చరియించు నీలశాగ్రంబున నీ
కాకలివిరుతేటికి మనః । కాకలికపు చంపకముల కరుగదు సుబలా. 820

క. కలవాణి ప్రేంఖణము ప్రోఁ । కల వాసంతికలఁ గోయఁగా నిక్కడు నీ
కలవాటుగాదు ప్రాఁకం । కలవా చెలువారువానికదకొమ్మలకున్. 821

వ. అనుచు నీచందంబులవిహారంబులు డెందంబున కానందంబు నొందింప నయ్యాదిమ
దంపతులు చరియించు సమయంబున. 822

సీ. పరువైనకంకేళివిరులశాఖలఁ బ్రీలి తొంగఁగుప్పుప్పొడిధూళిఁ దూలఁదోలి
మాధవీకుసుమాలి మకరందములఁ గ్రోలి భ్రమరించుమత్తాలిరవము చేలి
ప్రియులతో గతికేళిఁ బెనఁగి యింపుల సోలి యలయుపాలము నోలి దెలుపఁజాలి
కొనియాడఁ దగు మేలికొలఁకులపై వ్రాలి వీచిపంక్తుల గ్రాలి పేర్కఁ దేలి
కలితపరిపాకభరశాలికలమశాలి । కలశసందోహములఁ దూలి గగనపాలి
మెలఁగ విరహాతురుల పాలి మేటిజాలి । చందనపుఁగొండఁ బుట్టిన చల్లగాలి 823

ఉ. ఆనుమ గాలిసోకునఁ బ్రియంబెసఁగన్ బులకాంకురావళుల్
మేనుల నల్లసిల్లుమధుమేదురకంజాలమంజరీచర
ధ్వానితచంచరీకలలవాకలనాదనవీనగానముల్
వీనుల విందు సేయ నరవిందనివాసినియున్ ముకుందుఁడున్. 824

సీ. నిక్కువంబై నిక్కు మక్కువఁ బ్రియురాండ్ర నిక్కుకలకు దాయ్చు జక్కవలను
నంచితలీలమై నాగలు వడియు రాయంచలఁ గ్రీడించు నంచగములఁ
దమ్ముల నిమ్ములఁ గ్రమ్ముతేనెలు గ్రోలి ఝుమ్మఝుమ్మని మ్రోయుతుమ్మెదలను
గ్రాలుఁగంటుల నిడువాలుకన్నులడాలు సేలుఁ లీలల వాలువాలుఁగులను
జలువవలపుల నలరుల గెలువఁజాలు । చెలువ మసఁగినకన్నె చెంగలువవిరుల
మహితమై పూర్ణిమాచంద్రమండలంబు । కరణిఁ జెన్నారు చంద్రపువ్వుకరిణిఁ గలసి.

క. సారసమంచితకోమల । సారసవాకాంకురములు చవిగొను మనుచున్
సారముగా విహరించెదు । సారసములఁ జూడు చకితసారంగాక్షీ. 826

క. చిత్తములు గలఁగ విరహుల । మొత్తముల గదల్చి వేయు మొనవయు మరువకున్
గ్రొత్తమ్మి లైనతమ్ముల । నెత్తములై మెఱయుఁ దేఁటినికరముఁ గంటే. 827

క. తోయజదళలోచన తన । తోయంబులలోఁ దోయతోయము లెలమిం
గాయము దోఁచెడి సుకృతని । కాయము నీసరసి సురనికాయము కనుఁగొన్. 828

వ. అనుచు సెప్పునంబున జలకేళీకౌతుకంబున నాళీలాపతి కేలు కేలం గీలించి యాసరసిఁ
దఱియం దొచ్చుసమయంబున. 829

చ. జలనిధికన్యకేఁగురులు షట్పదపంక్తులు గ్రాలఁగన్నులన్
గలువలు నవ్వుదేరఁజెమొగంబును బద్మము బాహుయుగ్మమున్.
వలికపుఁదూఁడుఁదీఁగలు ఘనస్తనకుంభయుగంబుఁ జక్రవా
కలుఁ దనలోన వీడువడి కన్నులపండు వొనర్పఁ జక్రికిన్. 830

వ. అప్పుడు. 831

సీ. ఉరువడి నెమరీదు నొకచోట నెసఁ గ్రుంకి తలచూప కొక్కంతతడ వడంగు
నడుమను మీఁద కెల్వడు నెటపైన మొనసి చీరఁగ మాఱుమొగము సేయు
మేను వంచన దాఁచి మీఁదికిఁ బదమెత్తు రాజహంసలతోడ రాయిడించు
సుడివడి కమలముల్ వడిద్రిప్పు బలమున నుదకంబు తనకు రానొత్తి తిగుచుఁ
దనరుపద్మాసనస్థుఁడై మునియుఁబోలె । నిగుడుజపమున నెక్కుడు నేర్పు మీఱ
నగరతల్పుఁడు చంద్రపుష్కరిణియందు । జలధిసుతఁ గూడి జలకేళి సల్పునపుడు 832

గీ. తడిసి యంటినజిలుఁగులోఁ దళుకుమీఱ । నిజనితంబంబుపైఁ జాడిక నిలుపుచక్రి
నేత్రమున లక్ష్మి చల్లిననీరధార । యతనిముఖపద్మమున నాళ మనఁగ నెలసె. 833

చ. సురుచిరలీల లక్ష్మి యెసఁ జాచి నభంబున మండలాకృతిన్
దిరుగుమరాళపంక్తిపయి దృష్టి నిగిడ్చిన నొప్పె ధారుణీ
ధవునకు నింపు పెం పెసఁగఁ దద్దయు దేవతనీలదండమున్
దిరముగ సంఘటించి తగఁ దెచ్చిననల్లనియొల్లెయో యనన్. 834

చ. ఉరుతరపద్మనాళముల నొండొరు ద్రోయుచు దాసి వీడ్వడన్
బోరిఁబోరి మోములన్ సలిలపూరము చిమ్ముచు నీరజంబులన్
దొరలెడుపుప్పొడుల్ సెనయఁదోయరుహంబులఁ జల్లి నవ్వుచున్
హరియును లక్ష్మియున్ జలవిహారము సల్పిరి విందుసేడ్కలన్. 835

క. ఈరీతి లోకగురు లగు । వారిరువురు నందుఁ గొంతవడి సుఖలీలన్
గూరి పదంపడి సలిలవి । హారముఁ జాలించి వెడలి రాసమయమునన్. 836

క. ఇందిరకుంతలములకును । లంకారగతిజలకణంబు లమరెం బ్రభువే
బృంద మతిపానవశమునఁ । గ్రందుగ మకరందరసము గ్రక్కుడుమాడ్కిన్. 837

ఉ. పెన్నతివేణిఁ గ్రొన్ననలపెంపున సొంపునటించుపాపటం
జిన్నిమెఱుంగుముత్యముల చెన్నున నిద్దపుఁజన్నుదోయిపైఁ
బన్నసపచ్చకప్పుఁ బుజన్నసగంబులీలఁ జాల నె
ప్పెన్నతిఁ దెల్పుమీఱుజల్పబిందవు లంబుధిరాజకన్యకున్. 838

ఉ. అంతనఘ్నరత్నఖచితాభరణంబులు దివ్యవాసనా
వంతము లైనపూఁతలును వాడనిమాల్యములున్ సువర్ణస
త్కాంతిఁ దలిర్చుచేలములు గైకొని యొప్పిరి విష్ణుఁడున్ రమా
కాంతయు నిత్యమంగళజగన్నుతవేషవిశేషలీలలన్. 839

ఉ. అత్తఱి నచ్చటం గలమహామును లందఱు గాంచి విస్మయా
యత్తమనస్కులై ప్రమద మారఁగ నొండొరుతోడ సద్గుణో
దాత్తచరిత్రుఁ డైనయితఁ డాయ నెవ్వఁడో కాక సర్వలో
కోత్తరుఁ డైనరంగవిభుఁడో యను గాంచి యెఱుంగ మీఘనున్. 840

క. అని తలపోయఁగ జలజా । సనజనకుం డపుడు వాని సన్నిధిఁ జనియెన్
గనకాచలశృంగముగతి । ఘన మగునశ్వత్థతరువు గలతీర్థముకై. 841

ఉ. ఆమహనీయభూజమున కర్థి ననుత్తములు సమ్మునీంద్రులున్
నేమముతోడ నొప్పెసఁగ నించినపూజలకృత్తిఁ జామమున్
దామరసాక్షుఁ డిందిరయుఁ దానును దోఁ జనుదెంచుపూర్వపుం
స్తోమముఁ దన్మహాహహమున్ జొచ్చె మునుల్ వెఱంగంది చూడఁగన్. 842

వ. ఇట్లంగీకరించినట్టి తరురాజంబునం దారంగమంగళుం డంతర్ధానంబు నొందిన నాదేవునిఁ
గానక పరిదేవనంబు సేయుచు నితాంతసంతప్తమానసులై కణ్వాదులు బహువత్స
రంబు లాహారంబు పరిహరించి యున్నయెడఁ బాయకున్నంత ననంతరంబ యంతరిక్షం
బున నొక్కవాక్యం బిట్లని వినంబడియె. 843

ఉ. మానుమ ఖేదనంబు బుధమాన్యచరిత్ర పవిత్రపావనం
బై నుతికెక్కు నీవలదళాహ్వయతీర్థజలావగాహనం
బూనిన వేడ్కసేయుజనుఁ డొక్కటి మిక్కిలి యైనపాపసం
తానము పాసి పొందుదు మనోజ్ఞసుఖప్రదమవ్యయస్థితిన్. 844

వ. విను మఖిలపురుషార్థప్రధానసమర్థం బగునీతీర్థంబునందు ధేనుదానంబు సేయుమాన వుఁడు దురితనిరాకరిష్ణుండై విష్ణులోకంబు నొందు నన్నదానం బపవర్గసుఖనిదానంబు తిలదానం బేకవింశతికులోద్ధరణంబు సువర్ణదానం బుత్తమవర్ణహత్యానివృత్తిహేతుభూతంబ యేకరాత్రోపవాసం బపస్మృతినిరాసంబు గావున నీ విచ్చట మదర్చనంబు గావించి రంగమందిరంబున నన్ను సందర్శింపు మట్లయిన నత్యుద్రంబు లగుభద్రంబు లొందెద వని యానతిచ్చి యూరకుండిన కణ్వుం డప్పుండరీకాక్షుశాసనంబున బ్రహ్మోపాసనాపరాయణుండై చిరకాలంబుండె నని చెప్పి వెండియు వాల్మీకిమునీంద్రుండు భరద్వాజున కిట్లనియె. 845

గీ. అనఘ వినుము కేసరాహ్వయవిఖ్యాతి । నొకరుతీర్థ మచట నొకటి గలదు
కోరి విన్నఁ జేరుకొన్న విలోకింపఁ । గను దలంగు నఖిలకల్మషములు 846

క. నిరుపమనితాంతమహిమం । బరఁగెడితత్తీర్థమున సమంచితనిష్ఠా
నిరతుఁడు కాశ్యపుఁ డనియెడు । ధరణీసురవరుఁడు మున్ను తప మొనరింపన్. 847

చ. అరినరపాలదుర్దమమహోగ్రగజకేసరి కాశికాపురీ
శ్వరుఁడు సుకీర్తి నాఁ బరఁగువాఁ డొకనాఁ డట నేఁగుదెంచి చ
చ్చెర బహురోగపీడలఁ గృశించి నశించెడియాత్మసేనఁ ద
త్పరమపవిత్రతీర్థసవిధంబునఁ గావఁగఁబూని సమ్మతిన్. 848

క. ఆవిధమునఁ జతురంగబ । లావృతుఁడై వచ్చి తనకు నభివందనముం
గావించి యున్న యావసు । ధావరునకు నత్తపస్వి తా నిట్లనియెన్. 849

ఉ. ఎయ్యెడనుండి వచ్చితి విట కెవ్వఁడ వీవు భవన్మనోరథం
బెయ్యది చెప్పు మిప్పు డెడ యిందును నందును బోల దర్థిఁ దాఁ
బెయ్యదియైనఁ గైకొని రయంబున నే నొనరింతు నీపయిన్
నెయ్యము మించె నాకు ధరణీవర నావుడు నమ్మునీంద్రుతోన్. 850

క. అతనికి నిట్లనుఁ గాశీ । పతి యగుసుబలాత్మభవుఁడఁ బరమసుకీర్తిన్
నుతపుణ్యతీర్థసేవా । వ్రతనిష్ఠానిరతి నిటకు వచ్చితి ననుడున్. 851

చ. మునివరుఁ డిట్లనుం బరమపుణ్యయుతుండగుదు మున్ను నేను నీ
జననిని నాన్నపాలునకు సౌఖ్యమె రాజ్యముతోడొసఁగ్ప కీ
ర్తనుపమసర్వభోగముల నందక యాఁగలిఁ గందమూలభో
జనములఁ గుందు తాపసులబాధల నొంటిఁ జరింప నేటికిన్. 852

చ. అనిన సుకీర్తి యిట్లను సదాత్తగుణోజ్జ్వల నీయనుగ్రహం
బునఁ గుశలంబు మాసుబలభూపతికిన్ భవదీయపాదకం
దనమును జేసి యేను గసుధన్యుఁడ నైతి మదీప్సితంబు లె
ల్లను ఫలియించె నీకృపఁ దలంపఁగఁ జోద్యములెవ్వి యీయెడన్. 853

క. నానాటికి నాసేనలు । నానారోగముల చేత నవసి కృశింపం
గా నది మాన్పుకొఱకై । యీనదిచేరువను వారి నెల్లను గొనుచున్. 854

క. చనుదెంచి మీతపోవన । మున కలజడి యొదవు ననెడుబుద్ధిని బాహ్యం
బున వాని నునిచి వచ్చితి । మునివర నీచరణకమలములు దర్శింపన్. 855

గీ. అనిన నమ్మునీంద్రుఁ డవనీశ నీబుద్ధిబలము నెఱయ నఖిలబలములకును
హితముగా నొనర్చి తీ వది కడులెస్స । చెప్పు మింక నేమిసేయవలయు. 856

చ. అనుటయు సమ్మదం బొదవ నానృపుఁ డిట్లను నీపదాబ్జముల్
గనుఁగొనఁ గల్గినప్పుడ తలంగె మదీయబలామయవ్యథల్
పెనఁగుదురాశఁ గట్టువడి భీకరసంసృతిసాగరంబునన్
మునిఁగెడువాడ నేది గతి ముందట నట్టిహితంబు చెప్పవే. 857

వ. అనిన నానృపోత్తమున కాతపోధనసత్తముం డిట్లనియె. 858

క. శ్రీవిభుని భక్తవత్సలు । గోవిందుని విశ్వలోకగురు నతిభక్తిన్
సేవింపనిమూఢాత్ములు । భూరరసంసారముక్తిఁ బొందంగలరే. 859

క. కావున నప్పరమేశ్వరుఁ । బావనమతిఁ బూజసేసి పడయుము ముక్తిన్
శ్రీవనితాసంగమసం । భావితనిరవధికసౌఖ్యపరిణతి నధిపా. 860

గీ అనినఁ బరమయోగిజనులకు నైనను । దలఁపులోన నిలుపఁదరము గాని
యట్టిదేవుఁ జంచలాత్ముఁడ నైన నేఁ । గొలుచు టెట్లు భయము గెలుచు టెట్లు. 861

సీ. నావుడు నన్నరనాథుతో సంయమిశ్రేష్ఠుఁ డిట్లను నీవు చెప్పినట్లు
యెంతటివారికి నెఱుఁగ శక్యము గాక దీపించుబ్రహ్మస్వరూపి యగుచు
వెలసినయమ్మహావిష్ణుఁ డేకాగ్రభావమునఁ దన్ను భజించువారిఁ బ్రోవ
వలసి సత్కరుణనై వాసుదేవాదికమూర్తులు దాల్చి యంబుజభవాది
సురలు నరులును సన్మునివరులు గొలువఁ । బరఁగు తద్దివ్యభవ్యరూపంబులందు
నీమనం బెందు నిశ్చలనియతి నిలిచె । నది భజింపుము సిద్ధించు నభిమతములు. 862

వ. అదియునుం గాక. 863

గీ. దారుధాతుశిలానిర్మితంబు లైన । యట్టిహరిబింబములను ధరాధినాథ
దివ్యదేశంబు లెఱుఁగు మద్దేవుఁ డందు । నిత్యసన్నిహితాత్ముఁడై నిలుచుఁగాన. 864

మ. గురులీలన్ విరజోపకంఠమున వైకుంఠంబునన్ దివ్యభా
సురభోగంబుల నిందిరాసహితుఁడై శోభిల్లు నేభంగిఁ దా
హరియాభంగిన తత్కావేరతనయాభ్యర్ణంబునన్ మంగళా
కరరంగన్మణిధామముఖ్యముగ సౌఖ్యశ్రీలఁ జెన్నారెడిన్. 865

క. చను మచ్చోటికి ననుటయు । ననుమోద మెలర్ప నృపతి యమ్మునిపతికిన్.
వినయమున మ్రొక్కి నాతో । ననఘా చనుదేర వలయు నచటికి నీవున్. 866

వ. అని ప్రార్థించినయప్పార్థివుపలుకు లాకర్ణించి మేదురప్రభావభాసురుం డగు నమ్ముని
జనాగ్రేసరుండు. 867

శా. ఛత్రంబుం జలపూర్ణపాత్రము నుదంచద్వేత్రముం బూని స
చ్ఛాత్రశ్రేణి మఘుప్రసూనాగసరణుల్ చర్చింపుచున్ నోడ రా
గాత్రస్ఫూర్తులు దిక్కులం బరఁగ రంగస్వామి దర్శింప నా
ధాత్రీనాయకుముందటం జనియె నుద్యత్కౌతుకోల్లాసియై. 868

క. పటుగతి నమ్మునిపిఱుఁదం । జటులగజద్విరదతురగసంకులసేనా
పటలావృతుఁ డయి చనియెం । బటుహర్షవు లెసఁగ భూమిపతియుం బ్రీతిన్. 869

వ. ఇట్లేఁగునఁ జని తన్మార్గంబున నపవర్గదానసమర్థం బగుజంబూతీర్థంబు గదిసి రప్పు
డప్పరమతపోధనుండు మహీధవున కిట్లనియె. 870

క. ఈతీర్థము బహుదురిత । వ్రాతతమఃపటలపటులవనజవనహిత
ద్యోతము జంబూకసమా । ఖ్యాతము శుభసలిలదేవఖాతము భూపా. 871

క. పంబినశాఖాశిఖరక । దంబముచే నంబుధరపథం బొరయుచు లో
కంబులు పొగడఁగ నిట నొక । జంబూతరు వమరు నమరసంపూజితమై. 872

ఉ. దేవవిభుండు మున్ను గడు తెంపున వృత్రునిఁ జంపి బ్రహ్మహ
త్యావృజినంబుచే నిజపదస్థితిఁ బాసి వినష్టతేజుఁడై
యేవిధ మింక నీదురిత మీగుదు నంచుఁ బ్రతప్తచిత్తుఁడై
వావిరి బిట్టు త్రిమ్మరియె వార్థిపరీతవసుంధరాస్థలిన్. 873

క. మిగిలినపాపభయంబునఁ । బొగులుచు నయ్యింద్రుఁ డెందుఁ బోయిననైనన్
జగతీశ బ్రహ్మహత్యయు । నిగిడెన్ వెనువెంటఁ దోడునీడయుఁ బోలెన్. 874

వ. అది గనుంగొని తల్లడ మడఁచి పాకశాసనుండు వారిజాసనుసమ్ముఖంబున కేఁగి ప్రణమిల్లి తనతెఱంగెల్లఁ జెప్ప నప్పితామహుం డతని కిట్లనియె. 875

చ. పరము ననంతు నచ్యుతు నపారకృపామృతపూరసింధు సిం
ధురవరదున్ బ్రఫుల్లనవతోయజలోచను నాశ్రయింపు త
త్పరిచితదివ్యదేశములు పావనతీర్థములున్ దదీయసం
స్మరశుభనామకీర్తనము దుస్తరపాపనిదాఘమేఘముల్. 876

వ. అని యుపదేశించిన వాసవుండు వారిజాసనుశాసనంబునఁ దీర్థోపాసనం బొనరించుచు విశాలపుష్కరం బగుపుష్కరంబున నెనిమిదివత్సరంబులు నపారమహిమోదారం బగు గంగాద్వారంబునఁ బదివత్సరంబు లుపవసించి భువనమాన్య యగుకళిందకన్యయం దఖిలమునిక్షేత్రంబు లగుతీర్థంబు లాడి యగణ్యపుణ్యాలవాలం బగుసాలగ్రామశైలంబున నారాయణు నారాధించి మఱి తీఁతికావిశాలి యగుకాశియందుఁ గృత్తివాసు నుపాసించి సరస్వతీకూలంబున సరస్వతిసమర్చనం బొనర్చి యేపగిదిం దనపాపంబుఁ బాపికొననోపక యమ్మహేంద్రుండు చంద్రపుష్కరిణికి వచ్చి యచ్చటం ద్రయోవింశతివత్సరంబులు గడపె దదనంతరంబ. 877

మ. జంబూదుంబరబిల్వతిత్రికకదళీసౌవీరభల్లాతకీ
జంబీరామ్రకపిత్థతిందుకసలేశాశోభితం బైనయా
జంబూకాహ్వయతీర్థరాజమున కాజంభారి యేతెంచి భ
క్తిం బూజించె సరోజలోచనుఁ ద్రిలోకీపావనశ్లోకనున్. 878

క. ఆగతిఁ గొండొకకాలము । సాగఁగ హరిహయుఁ డొనర్చుసమ్యక్పూజా
రాగంబు కెంతయును నను । రాగంబునఁ బొంది పత్రరథవాహనుఁడున్. 879

ఉ. తెల్లనికమ్మురేకులగతిన్ జిగి మించువెడందకన్నులున్
జల్లనిసత్కృపారసముఁ జల్లెడుచూపులు లేఁతనవ్వు రం
జిల్లెడు నెమ్మొగంబు విలసిల్లెడు నల్లనికల్వపూవుతో
నల్లసమాడు మైపసయు నొప్పి నిజాకృతిఁ జూపి నిల్చినన్. 880

ఉ. పెన్నిధిఁ గన్నపేదగతిఁ బేర్చినయుబ్బున నబ్బలారి పైఁ
గన్నులవిప్పులెల్ల విరి గాఁ దదుదారవపుర్విలాససం

పన్నతఁ జూచి క్రమ్మెక్కి బహుభంగుల సన్నుతు లాచరించినన్
బన్నగతల్పుఁ డిట్లనుఁ గృపామతి మేఘగభీరభాషలన్ 881

క. బలశాసన నీ వనిశము । చలిపెనుపూజనలఁ గడుఁ బ్రసన్నుఁడ నైతిన్
గొలుతుఁగ నొకవర మిచ్చెద । వలసినయది వేఁడు మనిన వాసవుఁ డనియెన్. 882

గీ. పెంపుఁ దేజంబుఁ బొలివోయి పెద్దకాల । మలయుచున్నాఁడ నీబ్రహ్మహత్యచేతఁ
గరుణ దలకొన నీపాతకములఁ బాపి । నన్ను రక్షింపు మేర్పడ నలిననయన. 883

క. అని విన్నవించుటయు న । ద్దనుజాంతకుఁ డతనిఁ జూచి తడయక నీ వీ
ఘనతీర్థజలనిమజ్జన । మొనరింపుము దురితముక్తి నొందెదు దానన్. 884

క. వారక భువి నేపారిన । వారిం గ్రుంకిడుదు రెట్టివా రఘచరితల్
వారించి నాకడం జను । వారై పొందుదురు తుది నవారితసుఖముల్. 885

వ. అని యానతిచ్చి యాచతుర్భుజుండు నిజధామంబున కరిగిన సుత్రాముండు నతిపవి
త్రంబు లగునత్తీర్థోదకంబులఁ గ్రుంకి పాపపంకంబు నపనయించి సముచితతేజోవి
రాజమానుండై శ్రీరంగరాజచరణరాజీవసందర్శనాభినందనం బొనరించి తనచ్చి నెం
పున నిలింపానీకంబు గొల్వ నాకంబునకుం జని యఖర్వవైభవంబునఁ బూర్వప్రకా
రంబున నుండె నని చెప్పి యక్కాశ్యపమునీంద్రుండు వెండియు నిట్లనియె. 886

సీ. భూనాథ నీవు నీపుణ్యతీర్థంబున నవగాహనము సేయ నఘము లడఁగు
మున్ను సిద్ధులు మునిముఖ్యులు నిచ్చోట నిలచి రాగద్వేషములఁ దొలఁగి
యాధ్యాత్మవిద్యాపరాయణులై కాంచి రాత్మాభిలషితంబు లైనగతుల
రాజ్యవిచ్యుతుఁ డైనరాజు మజ్జన మిందుఁ గావించి మూఁడులోకములు నేలెఁ
గోరి యీవారిలోపలఁ గ్రుంకువెట్టి । వనిత సత్పుత్రుఁ గను మూఁడుదినము లుపవ
సించి త్రిషవణస్నానంబు సేయునతఁడు । సప్తజన్మాఘవితతిఁ దత్క్షణము పాయు. 887

క. నేమమున నిజ్జలంబుల । లో మజ్జన మాడుమనుజలోకమునకు నా
నామయములు నవయుఁ దృణ । స్తోమము శిఖిశిఖలఁ గాలుచొప్పున ననఘా. 888

క. కావునఁ బనుపుము నీసై । న్యావలి నీవిమలవారి నవగాహనముం
గావింపఁ దత్ఫలంబున । భూవల్లభ సకలరోగములు పెడఁబాయున్. 889

వ. అని చెప్పినఁ దన బలంబుల నమృతప్రాయంబు లగునత్తోయంబుల నవగాహనంబు సే
యించె నంత నిరంతరవ్యాధిబాధానిరోధంబుఁ బాసి భాసిల్లిన సైన్యంబున సంతసిల్లి

భూవల్లభుండు కశ్యపసమేతంబుగాఁ గృతస్నానుండై యచ్చటుం గదలి చెచ్చెర
నాప్రతీర్థంబునకుం జని యమ్మునికిం జరునను మతంబున. 890

క. సేనాసమేతముగ న । మ్మానవపతి తన్ని యోగమజ్జన మెలమిం
దా నాచరించి యఘములు । వో నొక్క నితాంత తేజమున వెలుఁగొందెన్. 891

క. అత్తటి నట విడిసినన్నృప । సత్తముసైన్యములచేతఁ జాలఁగ మెఱసెన్
దత్తీర్థపరిసరమ్ము వి । యత్తల ముడుగణముచేత నమరెడుకరణిన్. 892

క. ఆవెలవున గతకల్మషు । లై సొగడినసన్మునీంద్రు లాకశ్యపునిం
గానఁ జనుదెంచి సముచిత । నానావిధపూజనము లొనర్చిరి ప్రీతిన్ 893

చ. అనలసమానతేజుఁ డగునమ్మునిముఖ్యుఁడు వారినందఱం
గనుఁగొని యాదరించి యనఘవ్రతపారగులార యీతటం
బనుపమదివ్యగంధరుచిరాత్తతపుష్పఫలోపహారమె
పెనుపుగఁ దోఁచె నాకు వినుతింపరె యిట్టివిచిత్ర మెంతయున్ 894

గీ. అనిన నత్తపస్వులందెల్లఁ బెద్దయై । యనుపమానతేజుఁడు దనర్చు
భార్గవుం డనంగఁ బరఁగుసంయమిచంద్రుఁ । డమ్మునీంద్రుతోడ ననియె నెలమి. 895

చ. కల దితిహాస మొక్కటి కాశ్యప నీ కెఱిఁగింతు నంతయున్
దెలియఁగ మున్ను సజ్జనవిధేయుఁడు పుష్కరనామధేయుఁ డు
జ్జ్వలగుణశాలి విప్రకులవర్యుఁ డొకండు సమస్తధారుణీ
తలమునఁ బొల్చుతీర్థములు తాఁ గనుఁగొంచుఁ జరించు సమ్మతిన్. 896

క. ఆతఁడు త్రిభువననుత మగు । నీతీర్థముమహిమ విని నిరీక్షించెడిసం
ప్రీతి న్నియతాహారుం । డై తడయక వచ్చునప్పు డమ్మార్గమునన్ 897

చ. పిడుగులఁ బోలుకోఱలును బెల్లునఁ జల్లినవిస్ఫులింగముల్
వెడలెడుచూపులున్ మెఱయు విప్పననోరును గ్రాలుజిహ్వయున్
బెడిదపుగర్జితంబు గలపెబ్బులిరూపుపిశాచి వచ్చి పైఁ
బడె సతతప్రవర్తితశుభవ్రతభాసురు నమ్మహీసురున్ 898

క. వెక్కసమున నాఘాతముఁ । జిక్కక విడు విడువు మనుచుఁ జెచ్చెర దానిన్
ద్రుక్కక యదలిచి విప్రుఁడు । చక్కన విడిపించుకొని పిశాచికి ననియెన్. 899

చ. అతులతపఃప్రభావవిజితాఖిలకల్మషచిత్తు నుత్తమ
వ్రతనిరతాత్ము విప్రకులవర్యుని నన్ను నకారణంబ యీ

గతి నిటు చంపఁబూనితివి కష్టపిశాచమ దుష్టబుద్ధివై
యితరునిఁబోలె నీహృదయ మెంతయుఁ గ్రూరము వో తలంపఁగన్. 900

క. వావుడుఁ బిశాచి యిట్లను । నేవెంటం దప్పు లే దొకింతయు నాయం
దీవిధి ననుఁ బుట్టించిన । దైవమునకుఁ దప్పు గాని ధర్మప్రవణా. 901

వ. అనిన బ్రాహ్మణుం డిట్లనియె. 902

గీ. సకలభూతములకు సాక్షియై వర్తించు । దైవమునకు నేమితప్పు చెప్ప
వరుసఁ గీడు మేలు పొరయంగ నిజకృత । కర్మఫలము తనకుఁ గర్త గాక. 903

వ. అనిన నప్పిశాచి యిట్లనియె. 904

చ. తెలియవు నీవు తత్త్వగతి తెల్లము గాఁగఁ జరాచరంబునం
గలిగినయీశ్వరుం డొకఁడ కర్తయు భోక్తయుఁ గాక కల్గ దే
వ్వఁడును దద్వియుక్త మగువస్తువు గావున మేలు గీడునుం
దలకొన భూతరాసుల కొనర్పఁగ శక్యమె కర్మకోటిచేన్. 905

గీ. కర్మఫలము లందుకర్తయు భోక్తయు శ్రుతులుఁ జాఁటు నీశ్వరుండు కర్త
యయ్యె నేని తత్క్రియాశక్తి యతనికి । నొదవు గాన నీదురుక్తు లుడుఁగు. 906

వ. అనిన నగి యాతని కిట్లనియె. 907

క. ఆరయ నీవిశ్వమునకుఁ । బ్రేరకుఁ డీశ్వరుఁడ తద్వ్యపేతం బగుచున్
బూరియు నేని చలింపఁగ । నేర దతం డొకఁడ కర్త నిఖిలంబునకున్. 908

వ. అని యివ్విధంబున మఱియును గొండొకసేపు వివాదంబు సేసి యమ్మేదినీసురుం డిట్లను నిచ్చోటి కనతిదూరంబున నాశ్రమతీర్థంబు చెలువొందు నందు మహాముని బృందంబు గ్రందుకొనియుండు వారిముందట మనమందటలు చెప్పి నీవ గెలిచిన నన్ను భక్షింపు మేన గెలిచిన నిన్ను వధియించెద నని ప్రతిన గావించె నదియును సమ్మతించి యాట్లాడంబడి తత్తీర్థవాసులసకాశంబునకుం జనిన మానవానుగతయైనపిశాచిం జూచి యచ్చెరువొంది రప్పు డిరువురుఁ దదభివందనం బాచరించి నిటలతటంబున నంజలిపుటంబులు వొందించి నిలిచి రందు మహీసురుం డిట్లనియె.

సీ. వినుఁడు సన్మునులు నాపిన్నపం బే నొకధరణీసురుఁడ నీధాత్రిమీఁదఁ
గలపుణ్యతీర్థముల్ క్రమమున నాడుచు నిటకు నేతెంచుచో నిప్పిశాచి
త్రోవఁ బెబ్బులిరూపుతో నుండి పట్టినఁ బట్టిక నేఁ దన్నుఁ బదరుటయును
దప్పు నాయది కాదు దైవంబు దనియుఁ దా నొగి శుభాశుభముల నొందుచోట

హేతు వగుఁ గర్మమంటి నే నివ్విధమున । వరుస నవుఁ గా దనంగ వివాద మెసఁగె
బూని గెల్చినవానిచే హీనవాది । చచ్చు ననుచు మాలోన నిశ్చయము చేసి. 910

క. ఇరువురమును మీసన్నిధి । కరుదెంచితి మిందు యుక్త మగు నదియని మీ
రరసి తగఁ జెప్పఁ డనుటయు । మరి పలికెఁ బిశాచి మునిసమాజముతోడన్. 911

ఉ. ఏ నొకకర్తృయోగమున నిట్టిపిశాచపుజన్మ మొందితిన్
గాని మదీయబుద్ధిబలగౌరవ మేమియుఁ దప్ప దవ్విధం
బైనను జాతియుక్త మగునట్టిక్రియాగతి నీతిఁ దొంటిమై
రా నిటఁ బట్టితిన్ జయపరాజయముల్ వివరింపుఁ డేర్పడన్. 912

వ. అనిన నయ్యుభయమతంబులందుఁ బూర్వపక్షసిద్ధాంతంబుల నేర్పఱుప నేర్పరులు
గాక తమలో వితర్కించు మునులకోలాహలం బగ్గలం బయ్యె నయ్యెడ. 913

సీ. పుండరీకాక్షుఁ డంభోధరశ్యాముఁ డాజానుబాహుండు విశాలవక్షుఁ
డలినీలకుటిలకుంతలుఁ డంచితస్మితలలితకపోలమండలుఁ డనేక
హారకుండలకంకణాంగదమణిముద్రికాదిభూషణభూషితాంగుఁ డమల
పీతాంబరుఁ డనల్పబింబఫలాధరుం డతులితచిరమనోహరవిలాసుఁ
డసమతేజోవిరాజితుఁ డఖిలభువన । మోహనాకారకల్యాణమూర్తి యొక్క
పురుషసింహంబు ముగురు నల్గురు నిజోప । మానవేషులు తన్ను సమ్మతి భజింప

సీ. చెమటచిత్తడిఁ జాల జగిసించుమృగనాభిబొట్టుతో నలకలు పొత్తుసేయఁ
దిగఁగలువాలారు తెలికన్నుదమ్ముల సుడియుచూపులు వింతసొలపు దేర
జిగి ధగద్ధగ యను మొగడపన్నులమీఁద జిలుగుపయ్యెద కొంగు జీరువార
ముత్యాలకమ్మలఁ బుసిఁడించు వెన్నెలతళుకులు చెక్కుటద్దములఁ బొలయ
నందననటనలు పచరించునలసగతులఁ । బసిఁడియందెలు మ్రోయ నివ్వసుధ మెలఁగు
నిందిరాదేవి యన నొప్పునింతి యొకతె । యల్లనల్లన తనతోడ నరుగుదేర. 915

మ. మునుబృందావనవీధి గోపవనితల్ మోదంబు సంధిల్లఁగా
వినుతించం జను దేరఁ గేళిగతులన్ వేడ్కన్ వినోదించుకృ
ష్ణునిచందంబునఁ దద్వనాంతరసరస్సోమాభిరామాబ్జసం
జనితామోదసుగంధగంధవహసంచారానుషక్తాత్ముఁడై. 916

క. ఏలాలవంగలతికా । జాలాలింగితకదంబసముదయసుమనో
హేలామదకలకిన్నర । బాలాసంగీతరవము ప్రమదం బెసఁగన్. 917

క. లీలాగతి విహరించుచు । నాలాగున నమ్మునీంద్రు లందఱు రోదగా
సోలి వితర్కించురవం । బాలించి తదంతికమున కరుదెంచుటయున్. 918

చ. అతులితదివ్యతేజుఁ డగునమ్మహితాత్మునిఁ గాంచి సంయమి
ప్రతతి ముదంబు సంభ్రమము పైకొన దిగ్గన లేచి కోమలా
యతకరవిస్తరంబునఁ బ్రియంబున నుంచి సుఖోపవిష్టులై
యతనిముఖేందుచంద్రికల నాత్మదృగుత్పలరాజి రాజిలన్. 919

గీ. అనఘ నీ వెవ్వ రధికన్యయనుబోని । యీవధూమణి మతి యెవ్వ రిట్లు నిన్నుఁ
బోలె సేవించునీపుణ్యపురుషు లెవ్వ । రిటకు వచ్చినకారణం బేమి యొక్కొ. 920

చ. అనవుడు వారితోడ దరహాస మెలర్పఁగ నమ్ముకుందుఁ డి
ట్లను వినుఁ డీప్రదేశమున నర్థిఁ జరించెడినట్టివాఁడ ని
వ్వనరుహనేత్ర నాహృదయవల్లభ నే నిట వేఁటవచ్చి వీ
పెనురొద వార్ధిఘోషమునఁ బేర్చుటయున్ విని యేఁగుదెంచితిన్. 921

క. మిమ్ముఁ బొందఁగంటి శుభములు । సమకొనియె మనోరథంబు సఫలం బయ్యెన్
సుమహితసాధుసమాగమ । మమితశ్రేయఃపరంపరావహము గదా. 922

వ. అనిన గంభీరభావబంధురంబులును మధురంబులు నగుతదీయవచస్సుధాపాథోనిధి
వీచులం దేలి యమ్మునివర్యు లాశ్చర్యంబున నప్రతీపలావణ్యరూపతారుణ్యతేజోవిరాజ
మానశుభలక్షణోదారం బగుతదాకారంబు డెందంబుల కమందానందంబు నొందింప
నందంద చూచి తమలో నిట్లనిరి. 923

మ. దరదిందీవరదామధాముఁ డగునీతారుణ్యతేజోధికుం
డరయం బన్నగరాజతల్పుఁ డగు హేమాభాంగి యీపల్లవా
ధరి పద్మాలయ వీరు సిద్ధపురుషుల్ దా నట్లు గాకున్న ని
ద్ధర నెవ్వారికిఁ గల్గు నిట్టిభువనోదాత్తప్రభావోన్నతుల్. 924

చ. అని కొనియాడ నమ్మునుల కప్పురుషోత్తముఁ డిట్లనుం దపో
ధనవరులార మీర లిటు తర్కమొనర్చుట యేమి కారణం
బెనయు విరోధముల్ దొఱఁగి యేకమనస్కులు గాక కూడి వ
చ్చినకత మేమి నా కెఱుఁగఁ జెప్పఁగఁబోలినఁ జెప్పుఁ డేర్పడన్. 925

సీ. అనిన నప్పుండరీకాక్షున కాతపోధనులు వారలవివాదముల తెఱఁగు
సకలంబుఁ జెప్పి యాజయపరాజయముల నేమతంబుల నిర్ణయింప లేక

సందేహమునఁ బొంది చర్చించుచున్నార విప్రదేశంబున నిట్లు గూడి
యనఘాత్మ సకలలోకానన్యసామాన్యభవ్యలక్షణసముద్భాసితుఁడవు
ప్రవిమలజ్ఞానమును బుద్ధిబలము నీకు ; నమరు నాకారసమములై యట్లు గాన
నొండుదలఁప నగణ్య మొకింత లేదు । నీవ యర్హుఁడ వింతయు నిశ్చయింప. 926

క. అనిన నమ్మునిబృందంబునకు నందకహస్తుం డిట్లనియె. 927

క. విను విప్రేంద్రుఁడును బలియును । వినుతప్రజ్ఞావిశేషవిదు లిరువురు ప
లికిన పలుకులు గావునఁ గాఁ । జన దఖిలపురాణశాస్త్రసమ్మత మగుటన్. 928

సీ. అఖిలరూపములఁ గర్మానుభూతశరీరధారులగా నాది తా సృజించి
వానియం దుండి సర్వప్రవర్తకుఁ డయ్యు నప్పరోరుహదళశ్యముఁ దరయఁ
గర్మప్రసక్తుండు గాక విశ్వమునకు సాక్షియై యేపారి సంతతమును
సచ్చిదానందభాస్వద్రూపియై యొప్పుపరమాత్మ మతి కర్మబంధుఁ డగుచుఁ
బుణ్యపాపము లొనరించి పూని జీవుఁ । డోలి మేలును గీడును నొందుచుండు
నిట్లు గాకుండెనేనియు నెసఁగు సకల । మైనశాస్త్రంబులకును వైయర్థ్యశక్తి. 929

వ. కావున నీవివాదంబు ప్రాగల్భ్యం బగుట నిక్కం బగుట యుం బొక్కనికి జెప్పఁ
జొప్పడ దిప్పాటియు విప్రుండును సుఖం బగునిశ్శ్రేయసపదంబు నొందెద రని
చెప్పిన నప్పరమతపోధనసందోహంబు సందేహంబుఁ బాసి యాజగన్నివాసు నందఱు
నన్నిచందంబులఁ గొనియాడి పదంపడి. 930

ఉ. సమ్మదమార భూసురుఁ డిలాచిని గన్గొని మాను మీనిమి
త్తమ్మున నీయుదాత్తగుణధాముని దర్శనముల్ సహోనలా
పమ్ములు గల్గె సందియము మాని సుఖించెద రింక నీశరీ
రమ్ములకోడ మీరు సమరత్వముఁ జెంది యనేక కాలముల్. 931

మ. అని సంభావన చేసి రంతఁ బ్రమదం బారంగ నయ్యుద్ధటుం
డవి తత్తీర్థమునన్ మునింగి మును లాశ్చర్యంబునం బొంది క
న్గొన దివ్యాకృతులం దనర్చి దివిజాల్ గొల్వంగ నాకంబుకై
ఘనతేజం బెసఁగంగ నేఁగెను సురేంద్రవ్యోమయానంబులన్. 932

ఉ. అప్పు డనంతశల్యుఁడు నిజానుచరుల్ గొలువన్ వనంబులో
నెప్పటి యట్ల కేలిగతు లింపు వరింప దలంప నాత్మలం

దప్పనితద్వియోగపరితాపము పైఁపఁగలేక వారు నా
చొప్పున నేఁగి రచ్చటిబుధుల్ ప్రమదం బెసఁగంగ సంగడిన్. 933

క. ఆలోన వారిచిత్తము । లాలోకింపం దలంచి యవ్యాపినములో
నాలోకగోచరుఁడు గా । కాలోకగురుండు చనియె ననుచరయుతుఁడై. 934

క. అమ్మునివరులును ద్రిభువన । సమ్మోహన మగుతదీయచతురాకృతిఁ దా
రిమ్ములఁ గనుఁగొనలేమికి । నమ్మలికము నెమ్మనముల నుప్పతిలంగన్. 935

సీ. రాచిలుకలజోక రంతులు గాఁగఁ జరించుతేమావులక్రేవలందుఁ
బరిపరిగతుల షట్పదములు ఝుంకరించుప్రవ్వాయనెలఁదీవపొదలతుదల
మగకోవెలలు పంచమస్వరంబున నింపు పుట్టించుమరుగులపొదరులందుఁ
గవకవపలుకుజక్కవకవ లిమ్ములఁ గ్రీడించుకొలఁకులకెలఁకులందుఁ
గలయ మెలఁగుచుఁ బలుమాఱుఁ బిలిచి పిలిచి । చాలఁ గెల్లందుఁ బరికించి చూచిచూచి
యలఁతఁ దలకొన మనముల నలసియలసి । కానలేరైరి యెబ్భంగిఁ గనులసేత్రు. 936

క. ఆహారనిద్ర లెఱుఁగక । యాహారిసందర్శనోత్సవాకులమతిఁ ద
ద్వాహినిపాంత నశాద్వృత । దేహవ్యాపారు లగుచుఁ ద్రిమ్మరుచుండన్. 937

వ. కొండొకకాలంబు చన నొక్కనాఁడు నభోమండలంబున నొక్కవాక్యం బిట్లని
వినంబడియె. 938

ఉ. తాపసులార మీకుఁ బరితాపము లేటికి లోకరక్షణ
వ్యాపితబుద్ధి రంగనిలయంబునఁ బన్నగశాయి నైనల
క్ష్మీపతి నేను సన్మతి భజింపుఁడు నన్నచటన్ సమస్తవాం
ఛాపరిపూర్తి మీ కొదవుఁ జయ్యన నయ్యెడ కేఁగుఁ డందఱున్. 939

క. అనువాక్యము కర్ణరసా । యన మగుటయు నమ్మునీంద్రు లతిహర్షమునన్
జని కాంచి బహువిధంబుల । వినుతించిరి రంగధాము విబుధలలామున్. 940

ఉ. అపరమేశ్వరుండును దయామృతపూరతరంగితంబు లౌ
చూపుల సత్తపోధనులఁ జూచి సముజ్జ్వలదంతపఙ్క్తికౌ
ద్దీపితకాంతు లాస్యహిమదీధితిఁ బ్రోవఁ బయోదనిస్వనా
టోపగభీరభాషలఁ గడుం బ్రియ మారఁగ వారి కిట్లనున్. 941

క. భావమున నొందుదలఁపులు । పోవిడిచి మదేకబుద్ధిఁ బూజలు ప్రీతిన్
గావింపుఁడు నా కనిశము । కైవల్యపదంబు మీకుఁ గలిగెడు దానన్. 942

వ. అని యానతిచ్చిన నమందానందంబు నొంది యమ్మునిబృందంబు ముకుందున కభివందనంబు లందంద కావించి మరల వచ్చి యచ్చట నిచ్చలు చతుర్భుజునిఁ ద్రికాలంబు నర్చింపుచుండిరి తత్ప్రసవగంధాక్షతాదు లివియని చెప్పిన నప్పుణ్యతీర్థంబునఁ బార్థివపుంగవుండు చతురంగబలసహితుండై యవగాహనం బొనర్చి తనర్చిన తేజోబలవిశేషంబుల రాజిల్లునిజసైన్యసంతానంబుఁ జూచి సంతసిల్లి యాస్యపద్మంబు వికసింపఁ గాశ్యపమునీంద్రున కిట్లనియె. 943

క. నీకరుణాలోకనమునఁ । జేకుఱె సౌఖ్యము మదీయసేనల కిచటన్
నా కొనరింపఁగ వలసిన । యాకృత్యము లెవ్వి యనిన నమ్మౌని పలికెన్. 944

క. గోదానంబు కుటుంబికి । నోదనమాత్రంబు దివ్యయోగీంద్రునకున్
వేదవు భూమి సువర్ణము । నాదీక్షితునకు నృపాల యర్హం బొసఁగన్. 945

క. దానము సేయఁగ నర్హము । గానఁ బ్రతిగ్రహ మొనర్పఁ గా దట్టియెడన్
భూనాథున కిటు సేయుమి । యానృపుఁ డరుగున్ సగాత్రుఁడై దుర్గతికిన్. 946

గీ. ద్రవ్యదేశకాలపాత్రంబు లొడగూడి । నపుడు సేయుదాన మక్షయంబు
దాన నడఁగిపోవు దాతకుఁ గోటిజ । న్మార్జితంబు లైనయఘము లనఘ. 947

క. ఈయనినవన్ని సేయం । దీమొద సమకూరియున్న విప్రడోధాణీ
నాయక తద్దానము లెడ । సేయక కావింపు మనినఁ జిత్తం బలరన్. 948

సీ. భాసురమణిమయప్రాసాదపంక్తులఁ దరళపతాకావితానములను
గాంచనస్తంభసంగతమంటపంబుల విమలచంద్రోపలవేదికలను
బహువస్తుసంపన్నపణ్యమార్గంబుల మహనీయతోరణమాలికలను
నమృతోపమానంబు లగుజలాశయముల రామంబు లైనయారామములను
శాలివనముల సరససస్సాలవితతిఁ । జాల నొప్పారుకోటలఁ జప్పరములఁ
దవిలి భూలోకసారమై తనరునగ్ర । హార మొకటిని దనపేర నారచించి. 949

క. అలఘుతపస్వులు నుత్తమ । కులజులు నాచారపరులు గురుశుశ్రూషా
కలితులు నానాధ్వరక । ర్తలు విద్యావిదులు నైనధాత్రీసురులన్. 950

గీ. మూఁడువేల నేర్చి మొదవుల వారికి । నైవేయునేసి యొసఁగి వెలయు రత్న
భూషణాంబరములఁ బొలుపారుకన్యల । నా సదాసికాన్వితముగ నిచ్చి. 951

వ. ఒక్కశుభముహూర్తంబునఁ గార్తస్వరోపకరణరమ్యంబు లగుహర్మ్యంబుల నా
యాప్రదేశంబుల నతిథిజనంబులకు మనంబు లలర నభిమతపదార్థసంపన్నంబు లగున

న్నంబులను శీతలఘనసారప్రముఖనిఖిలసురభిద్రవ్యసంవాసితానేకపానీయపరిపూర్ణ
కలశంబులం గలిగి యహిమకరనికరంబులకుం దొరవయిన మిగుల నిగారించువలి
పందిరులను గల్పించి కల్పోక్తవిధానంబునం బూసంగించి యచ్చటం గదలి ముక్తిసీ
మంతినీసీమంతముక్తాఫలధామం బగురంగధామంబున కరిగె నయ్యవసరమున. 952

ఉ. జ్ఞానవిధూతకల్మషులు శాశ్వతధర్మవిదగ్ధు లచ్యుత
ధ్యానపరాయణుల్ ఘనదయాకలితుల్ సకలక్రియానుసం
ధానవిశారదుల్ పరహితవ్రతచిత్తు లుదాత్తదివ్యతే
జోనిధు లార్యసన్నుతవిశుద్ధచరిత్రులు తత్పదస్థితుల్. 953

క. తనకు నెదు రరుగుదెంచినఁ । గని సంభ్రమవినయకౌతుకంబులు మది నె
క్కొన మ్రొక్కి విమలమణిగణ । కనకాదు లుపాయనములుగా నిచ్చి తగన్. 954

క. ఆనరపాలుఁడు వారల । చే నుచితప్రియవచోవిశేషంబుల స
న్మానితుఁడై యట కడచి ప్ర । ధానపురోహితసమన్వితముగా నెలమిన్. 955

వ. అని పురోభాగంబునఁ బరమభాగవతసేవ్యం బగుతద్దివ్యనగరంబుపట్టునకుఁ జుట్టును
గావలి యైయున్న పన్నగేంద్రునిఫణామండలంబు పరిపాటిం బాటిల నొరయుచుమేటి
కొమ్మల నుదారం బగుప్రాకారంబునను నలంకారంబై ధగద్ధగాయమానంబు లగుమయూ
ఖప్రతానంబుల నహర్పతికిరణంబులకు నెదుర్పదుమణులు దీపించినం బోలుప్రదీపించు
తలుపులం దనరి నిశితకులిశనిపాతంబునకుం దప్పి యొప్పుమేరుపర్వతంబునుంబోలె
సర్వోన్నతంబై విలాసాంజనరేఖారంజితంబు లగునగరలక్ష్మీకటాక్షంబులచందంబున
లోకానందకారణం బగు కువలయతోరణంబుల నభిరామంబై మలయపవనసంచలితం
బులై యందంచితంబు లగుకాంచనకింకిణీగణఝణాత్కారంబులఁ బతంగతురంగంబుల
కలన ఫల్గువల్గనవల్గుశిక్షావిశేషంబుల నలవరింపంజాలి చాల నూతనంబు లగుకేతనం
బులం బొలిచి మహేంద్రనీలమణికీలితంబు లగుజాలకాంతరంబుల నిరంతరంబును వె
డలి కడలుకొను కాలాగరుధూమస్తోమంబు లంబరంబున నంబుదాగమనసముత్కంఠితంబు
లైన రుచిరరుచివిజితతాపింఛంబు లగుపింఛంబుల విప్పియాడుక్రీడామయూరంబు
లకు సుకరంబు లగుమణిశిఖరంబుల మెఱసి శుద్ధశుభ్రచంద్రోపలవిమలచంద్రశా
లాంతరపరిస్ఫురన్నటనవిలాసవిలాసినీచరణరచితమణినూపురరవం బై నిజవిభవవిజితగోపు
రం బగు గోపురవరంబుఁ బ్రవేశించి. 956

క. ప్రతిహారానుమతంబున । నతిముదమున నాన్నృపాలుఁ డతులాదరణ
త్రితయము నోలి ప్రదక్షిణ । గతి నవనతపూర్వకంబుగాఁ జొచ్చి యటన్. 957

గీ. దొరల మంత్రుల హితుల బంధులను గూడి । యష్టదిక్కులఁ గుముదాదు లైనతీక్ష్ణ
రక్షకులకును మఱి చతుర్ద్వారపాల । సమితికిని మ్రొక్కి యాభ్యంతరమున కరిగి.

క. స్ఫురితకనకకషణసుషమా । ప్రతిమానమనోజ్ఞపీతపరిధాను విభా
జితబాలభానుఁ ద్రిభువన । వితతేంధనచిత్రభాను విష్వక్సేనున్. 959

చ. కనుఁగొని భక్తిపూర్వకముగాఁ బినయానతుఁడై తదీయశా
సనమున విష్ణుపారిషదసత్తము లాదర మొప్పఁ దన్నుఁ దో
డ్కొని చనఁ జొచ్చె దివ్యమణికుట్టిమకుడ్యకవాటవేదికా
వినుతవిటంకసంజనితవిస్ఫుటధామము రంగధామమున్. 960

వ. ఇట్లు ప్రవేశించి ముందటఁ గుందచందనచంద్రికాపాండురం బగుకుండలిరాజపర్యంకంబునఁ బవ్వళించి సముంచితమణిశిఖరవిరాజితరాజతాచలసంగతిఁ గనుపట్టునీలమేఘంబుచందంబున నందంబై కెందమ్మిఱేకులసిరుల గఱవంపుఁ జెన్నునను వన్నెయొసంగు కెంజాయలఁ బాలఁ రంజిల్లుచుఁ జక్రచామరతామరసకులిశపద్మ(?)ఝషచాపకలశాదిరేఖలం గలతలంబుల మెఱసి మెఱుంగుఁజొక్కులచందంబునను నూరుపు నెఱపునఖమణిగమణీయంబులై నమదమరేంద్రబృందముందారమాలికాపరిమళపరంపరావాసితంబులై వాసవధనుర్లీలావిలాసంబునను వాసిమిగిలి వివిధమణివ్యతివ్యతికరమంజులంబు లగుమంజీరంబులఁ బొలుపుమీఱి శుకసనకాదియోగీంద్రధ్యానగమ్యంబులై రమ్యంబు లగుచరణంబులును, వృత్తానుపూర్వంబులు నపూర్వసౌభాగ్యయోగ్యంబులై నిగనిగ నిగుడుభంగి నెపలుకొనుచిఱుతొడలును, క్రొత్తమెఱుంగుముత్తంబులు చిత్తగింపం(?)బొగరెత్తిన నునుఁబస నెసంగునసితకదళికాకాండంబు ననుకారం బగునూరువులును, నవకర్ణికారకుసుమసుషమావిశేషంబు నభినయించునభినవపీతపరిధానపరివృతంబై కనత్కనకకింకిణీకలితలలితమేఖలావలయం బగునితంబంబును, మిన్నేటిబోటి యగునేటిసుడివఁబున శోభిల్లునాభిసరోవరంబునఁ దిరం బగువెలిదమ్మిఁబోని ముఖసరోజసౌరభంబు గ్రోలఁ జాగితేఁటితెగ బాగున నభిరామం బగురోమావళిం దనరి,వళిత్రయసుందరంబై కరతలగ్రహణసాధ్యం బగుమధ్యంబును, సగసళ్ళృంగారలీలావిలాససముల్లాసిని యగువనజవాసినికి నప్రయత్నగత్నదర్పణం బనఁ బ్రశస్తం బగుకౌస్తుభంబునకు నుచితస్థలంబై సంతానలతాంతసంతానదంతురితాంతరతరుణతులసీదళదామసుభికంబై కుంకుమకర్పూరగర్భ

సారసుగంధిగంధసారానులేపితంబై శ్రీవత్సలక్షణోపలక్షితంబు లగువక్షఃపరిణాహం
బును, సముజ్జ్వలవజ్రకంకణాంగదభద్రముద్రికాశోభితంబులై కటికిరీట పార్శ్వవిన్య
స్తంబు లగుహస్తంబులును, సారానురాగసాగరకన్యకాకరకంకణపదాంకితంబై జిగి
దొలంకుశంఖంబుపొంకంబునకు బింకంబు దలకొలుపుచు సప్రయత్నరత్నగ్రైవేయక
బంధుర మగుకంధరంబును, దళతళఁ బొలయుతళుకులు గలతళుకులం దాపించినదీ
పించుకెంపులఁ జెంపారుమండలంబు లోలయగండమండలంబులును, బరిపక్వబింబ
శోభాసౌభాగ్యంబు నతికరించుమధురాధరంబును, సుధారసంబునఁ బదనుగొని తల
లెత్తుముత్యంపుమొలకలపొలుపునఁ దెలుపెసఁగుదశనకాంతులు గలసి వెలయువెలనవ్వు
వెన్నెలలఁ జెలువుమిగిలి సతతప్రసన్నతాసదనం బగువదనచంద్రబింబంబును, సము
న్మీలితనీలతిలకుసుమసముల్లాసంబు నుల్లసించుచు సురభినిశ్వాసమారుతంబున దిశలు వా
సించునాసికయును, వాసరావసరసముల్లసితసితారవిందదళవిశాలంబులై తొంగలిఱె
ప్పలకప్పున నొప్పారి కరుణారసపాత్రంబు లగునేత్రంబులును, నిజవిక్షేపమాత్రవిలా
ససంపాదితాశేషనిలింపమంగళం బగునానతభ్రూలతాయుగళంబును, లలితలావణ్య
రసలహరంబు లన నమరుచెమటచిత్తడిఁ గరంగుహరినీలగిరిశిఖరంబునుంబోలెఁ బద్మరాగ
ప్రభాటోపవిశంకటముకుటసంగతం బగునుత్తమాంగంబును, గలిగి యంగీకృతభక్తజనా
నుగ్రహంబగు, శ్రీరంగరాజదివ్యమంగళవిగ్రహం బాపాదమస్తకంబును విస్మయాస్మి
తనయనారవిందుండై సందర్శించుచుఁ బరమానందసుధావీచుల నూలలాడుచు హర్ష
గద్గదకంఠుం డగుచు నారాజకంఠీరవుండు, 961

సీ. బాపురే మృదుపాదపల్లవంబులయొప్పు మాయురే యూరులసోయగంబు
భళిర నితంబబింబంబుసౌందర్యంబు ఘమ్మా కృశావలగ్నమ్ముచెలువు
ఆఁ రే యొప్పారుయూరులభాగంబు చాగురే బాహులచక్కఁదనము
ఔర లేనగవారువాననాబ్జముపొల్పు నోహో కనుంగవ యొఱపుమెఱపు
మేలు మేలలకంబుల మెఱయుకప్పు। అహహ మనుపారునొసలఁ దట్టాడుతళుకు
లనుచుఁ ద్రిభువనమోహనం బగుతదీయ। మూర్తివైభవ మందంద పొగడి పొగడి.

క. అక్కజపుభక్తిఁ జాఁగిలి। మ్రొక్కి లలాటమునఁ గదియ మోడ్చినచేతుల్
నెక్కొలిపి ప్రమదలహరిం। జొక్కుచుఁ దద్దివ్యవైభవంబుఁ జూచుచునుండెన్. 963

క. అప్పుడు కరుణామృతరస। ముప్పొంగ కటాక్షదృష్టి నుర్వీవిభునిం
దప్పక కనుఁగొని మధురిమ। చిప్పిల నాసకలలోకసేవితుఁ డనియెన్. 964

గీ. పార్థివోత్తమ నీ మహాభాగవతులు । సంతతంబును మత్పదార్చనమునంద
యొనసియుండుట నత్యంతహితుఁడ వీవు। తలఁపు నీమీఁద నాకును దగిలియుండు. 965

చ. నను మది నిల్పి మున్ను నలినప్రభవుండు తపంబు సేసినన్
మనమున మెచ్చి తత్ప్రియము మొనర్పుట కీగతి రంగమందిరం
బున మణిసత్ఫణాన్వితసమున్నతపన్నగరాజశయ్యపైఁ
దనరెడు దివ్యమూర్తి నవతారము నొందితి సత్కృపామతిన్. 966

చ. వనజభవుండు భక్తి గొలువం జిరకాలము సత్యలోకమం
దొనర వసించి పుణ్యమహిమోన్నతి నొప్పనయోధ్య కొక్కచో
ప్పునఁ జనుదెంచి యందు గుణభూషణు లైనభవత్కులీను లె
ల్లను వివిధోపచారగతులన్ బరిపూజ లొనర్ప నుండితిన్ 967

ఉ. ఆగతి నందు నాలుగుమహాయుగముల్ చనునంతఁ బాపదీ
క్షాగురుఁ డాశ్రితావనవిశారదుఁ డద్భుతబాహువిక్రమో
ద్యోగుఁడు జానకీదృగసితోత్పలచంద్రుఁడు రామచంద్రుఁ డా
భాగవతాగ్రగణ్యుఁ డనఁ బ్రస్తుతికెక్కిన దానవేంద్రునిన్. 968

క. నిజచరణకమలసంతత । భజనపరాయణునిఁ బరమపావనచరితున్
సుజనప్రియుని విభీషణు । రజనీచరవంశజలధిరాకాచంద్రున్. 969

గీ. ఆదరించి తనకుఁ బ్రాణంబుకంటె విశేష మైనయావిచిత్రభవన
మిచ్చి యనుప నాతఁ డెలమిమై లంకకుఁ జనుచు నిచట నున్నసమయమునను. 970

మ. అమృతప్రాయము లైనతోయముల లోకానందమున్ జేయునీ
కమనీయాపగ నీతటద్రుమసమగ్రచ్ఛాయలన్ జాల శీ
తము లై మించినసైకతంబులను మోదం బార వీక్షించి ని
త్యము విచ్చోట వసించుకౌతుకము డెందంబందు సంధిల్లఁగన్. 971

క. అయ్యసురనాథు నొకగతిఁ । జయ్యన నొడఁబఱిచి పంచి సన్నుతఫణిరా
ట్ఛయ్యాతలమున సుఖినై । యియ్యెడ నున్నాఁడ లోకహితనిరతమతిన్. 972

క. మెచ్చితి నీభక్తికి మది । నిచ్చెద నే వేఁడు మింక నేవర మైనన్
జెచ్చెర నీమానమునఁ గృప । పిచ్చిగిలం బల్కుటయును శ్రీకాంతుండై. 973

చ. మనుజవరేణ్యుఁ డిట్లను రమావరదేవకిరీటకోటినూ
తనమణిదీప్తివిస్ఫురితతావకదివ్యపదాంబుజాతమున్

గనుగొనునట్టిభాగ్యమునకంటె విశేషవరంబు లెవ్వి నా
జననఫలత్వ మొందెఁ గలుషంబు లడంగెఁ గడంగెఁ బుణ్యముల్. 974

వ. అని పలికి యారాజపంచాననుండు పాంచరాత్రాగమప్రపంచితవిధానంబున సావధానమానసుండై యాభోగితల్పు ననల్పభవ్యదివ్యోపచారంబులఁ బూజించి పునఃపునఃప్రణామంబు లాచరించి తన్ముఖారవిందలావణ్యమధువిలోలంబు లైననిజలోచనమధుపంబుల నెట్టకేలకు మగుడఁ దిగిచికొని యనంతవైభవాభిరామం బగునారంగధామంబు వెడలి ప్రతిహారపాలకు లగుదివ్యపురుషుల ననర్ఘ్యమణిభూషణాంబరాదిసమర్పణంబుల సంతర్పితులఁ గావించి విమతవిహంగశ్యేనం బగువిష్వక్సేనునికడ కరిగి ససేనుండై తదీయపార్శ్వభాగంబులఁ గొలిచి గగనమండలంబున నాఖండలుని నీలగిరిశిఖరంబునుబోలె నుద్దామం బగుతద్ధామంబు వీక్షించి సకలసాధుజనోపాస్యం బగుకశ్యపుఁ గనుంగొని. 975

క. సన్నుతమేచకజలధర । సన్నిభరుచి గలిగి గగనచరపథమున స
ర్వోన్నతమై యొకధామం । బున్నది యది యెట్టి దనుచు నుత్సుకమతియై. 976

చ. అడిగిన నన్నరేంద్రునకు నమ్మునిపుంగవుఁ డిట్లనున్ ముదం
బడర ననంతశక్తియుతుఁడై జగదాత్మకుఁడైనచక్రి యె
ప్పుడు వసియింప నిమ్మగుచుఁ బొల్చినయిమ్మహనీయధామముం
బుడమి ఫణాగ్రభాగమునఁ బూనినశేషుని గా నెఱుంగుమీ. 977

మ. అతిరమ్యం బగుతల్పమై సతతలీలావాసమై రత్నసం
గతసింహాసనమై పరిస్ఫురితముక్తాచ్ఛత్రమై సత్ప్రభా
తతదివ్యాంశుకమై మనోహరపదత్రాణంబులై చక్రి నం
చితలీలం భజియించి కాదె కనియెన్ శేషుండు శేషత్వమున్. 978

గీ. జ్ఞానశక్తిబలాదిమైశ్వర్యవీర్య । తేజములు వొల్చు నతనికి నైజ మగుచు
బహుగుణానంత్యమునఁ గర్తృభావమునను । వెలయు నాతఁ డనంతాఖ్యఁ గలిగి యధిప.

క. లోకములు జన్మవిలయ । వ్యాకులములు పొందువేళలందును వికృతుల్
పైకొనక శాశ్వతస్థితిఁ । జేకొని యీధామ ముల్లసిల్లుచు నుండున్. 980

క. ఇది యిక్ష్వాకునృపోత్తమ । సదమలభవదీయపూర్వజసమార్జితమై
యొదవినసుకృతఫలంబున । విదితంబై నీకు గగనవీథిం దోఁచెన్. 981

క. ఈవిధమునఁ బ్రతియుగమున । భూవల్లభ వర్ణభేదములు వెలుఁగొందున్
శ్రీవిభుఁ డీధామము దా । నావేళల నట్టివర్ణమై కానఁబడున్. 982
క. పెరుగుచుఁ దఱుగుచు నుండును । నరనాయక కాలవశమునన్ దివ్యరుచి
స్ఫురితము సహీనమహిమో । త్తరమును నగునీమనోజ్ఞధామము వసుధన్. 983
సీ. ధరణీశ కలియుగోదయవేళ విపరీతరీతి నిన్నియుఁ బ్రవర్తిల్లుచుండుఁ
గల్ల నిజం బగుఁ గష్టుఁడు దుష్టుఁడై తోఁచు ననిత్యంబు నిత్య మగుచు
హేయ మహేయమై యొసఁగు ననాచార మాచారమై చెల్లు నవనిసురులు
మతి చెడి శూద్రులగతిఁ జరింతురు శూద్రు లావిప్రధర్మంబు లాచరింతు
రాలు మగని విడుచు నాచార్యు నిందించు శిష్యుఁ డఖిలదేవసేవ్యుఁడైన
హరి భజింప నొల్ల కన్యదైవంబుల నెప్పుడు కోరి కొల్తు రెల్లవారు. 984
గీ. జలజనాభున కాధారశక్తి యగుచు । దనరుశేషాఖ్య నొప్పు నీధాము మధిప
తెలియ కెప్పుడు సామాన్యదృష్టిఁ జూచు । వారు పోదురు నిరయనివాసమునకు. 985
మ. అమృతానందవిధానమై సకలకల్యాణావహంబై రమా
రమణప్రేమనివాసమై మెఱయుశ్రీరంగప్రభావంబు ని
క్కముగా నాత్మనెఱింగి కొల్చుసుజనుల్ కర్మంబులం బాసి ని
ష్క్రమణం శాశ్వతవిష్ణులోకసుఖమున్ బ్రాపింతు రుర్వీశ్వరా. 986
క. అని చెప్పిన నాకాశ్యప । మునివరుఁ గొనియాడి రాజముఖ్యుఁడు ప్రమదం
బొనరఁగఁ దద్ధామమునకు । వినతుండై యచటు వాసి వెలువడి యెదుటన్. 987
సీ. శిఖరాగ్రగతిహరిప్రఖరాశనిక్రూరనఖరాభిహతవన్యనాగకులము
శబరీపరిప్రస్థకబరీకలాపవిక్లబరీణఘనభుజంగవ్రజంబు
రహితదోషాటోపమహితరత్నప్రభావిహితబృందారకబృందసరణి
వితతసానుస్థానసతతనిర్ఝరజలప్లుతతరుప్రత్యంతభూమికులము
బహుళగైరికమయుద్యుపత్ప్రిధవరాగ । కల్పితాలీకదివసావగమనికామ
విభ్రలవార్యాహసందోహవిభ్రమంబు । యంద్రకటకంబు ధరణిధరేంద్ర మొకటి. 988
క. అన్నెలవునకు దక్షిణమున । విన్నలతో రాయుమండ వీక్షించి సము
త్పన్నకుతూహలమతియై । సన్నద్ధసమస్తసైన్యసహితుం డగుచున్. 989
శా. ఆరాజేంద్రవరుండు తత్కుధరశృంగారూఢుఁడై చేరువన్
క్షీరోదంచితనారికేళకదళీతిలాక్రముకఖర్జూర సా

మీఁగోకవనావలీకలితకావేరీప్రవాహాంతర
శ్రీగమ్యం బగురంగమందిరము వర్ధిం జేరి సద్భక్తిమై. 990

క. తనదృష్టికి నలుదిక్కులఁ । గనఁబడు దేశముల నమితకనకాంబరగో
ధనరత్నదాసదాసీ । జనముల నర్పించె శేషశాయికి నెలమి౯. 991

క. భూనాయకుఁ డద్దివ్య । స్థానము మఱిఁ బాసి పోవఁ జాలక యచట౯
దా నుండఁ దలఁచి భూనుత । మై నెగడు తదద్రిపశ్చిమాంచితసీమ౯. 992

క. సారసగరుదనిలాహత । సారససంవాసితాంబుసారం బగుకా
వేరీతీరంబునఁ దన । పేరుగ నొకపురి రచించెఁ బ్రీతి దలిర్ప౯. 993

క. ఏపట్టణమ్ము కంటెను । నాపుగవర మమరు విభ్రమాలసలలనా
నూపురరవమంజులమణి । గోపురమై విభవవిజితగోపుర మగుచు౯. 994

క. నలినజుఁ డనురసపిద్ధుం । డలవేలుపుఁగొండ శుద్ధహాటకమయమై
వెలుఁగఁ బుట మిడినపరుసునఁ । బోలు పగు నప్పురముకోట భూవినుతంబై. 995

క. కొమ్మలగడ మానికపుం । గమ్మలక్రొమ్మెఱుఁగు లడరఁగా నలవేల్పుం
గొమ్మలు మలతురు పుత్తడి । బొమ్మలఁగతి వేఱ కోటఁ బొగడఁగ నేలా. 996

చ. లలనలకేలిసంభ్రమములం దగి రాలినహారరత్నముల్
జలధరవేళఁ బెంజినుకులం జని తత్పరిఖాతలంబుల౯
వెలుఁగఁగఁ గాంచి వానిఁ గడువేడుకతో దుత సంస్తుతించి మే
నొలయఁగఁ బల్లటి౯ మూరియుచుందురు పన్నగరాజకన్యకల్. 997

సీ. తెరల వాహ్నిసవ్రాఁత దీపించుపులులకు మరి లోఁగుఁ జందురువువ్చయిష్టి
తూలాడుపడగలతుదలతాఁకున నుల్కి హరితేరిహయము లుప్పరము దాఁటు
గేళాకుళులయందుఁ గెందమ్మితూఁడులు వింతగా నజాడెక్కిరింత నంజా
రమణఁ బెంచినమయూరమ్ములు వేలుపుకన్నెలకరతాళగతుల నాడు
ననిన నందుల నినిచెప్ప నమరులైన । సవడిగ్రహరాజ మేడలసరణులను
మేటితోడవులు నిట్టట్టిపాటి వనుచు । జగములోపల మఱి వేఱ పొగడనేల. 998

క. పురసౌధశిఖరనికర । స్ఫురదురుమరకతమయూరపుంజములఁ గళా
ధరబింబమధ్యహారిణము । తరుణతృణభ్రాంతి దవ్వుదవ్వులఁ గముచు౯ 999

చ. హరిణ మటంద్రు కాదు వట మందురు భూప్రతిబింబ మంద్రు సా
గరతలపంక మంద్రు శశిశం దని యందురు లోను లంధయు౯

సరసిజవైరిమైకలి నిజంబులు గావని యప్పురంబు గో
పురశిఖరాలితో నొరయఁ బుట్టినకం దని చెప్పఁబొం దగున్. 1000

క. నీలమణిచంద్రశాలా । పాలిక లీలావిలోలబాలాలీలా
వాలాపాంగాలినటో । త్కూలాభ్రాంతరతటిల్లతాగతిఁ బొలుచున్. 1001

క. నీడలు మణిముకురంబులఁ । జూడరు పట్టణములోనిసుగుణులు సురత
క్రీడాసంభ్రమగళిత । వ్రీడాబ్జముఖీకపోలవీథులఁ దక్కన్. 1002

మ. పురిశృంగారవనంబులన్ మెఱయుచున్ బూర్ణేందుబింబాననల్
విరులం గొప్పులు దీర్ప కేణి యెలమిన్ వేడ్కన్ విసం గప్పుబం
ధురనీలప్రబలాంధకారము క్రియాందోపం భ్రమం జక్కవల్
విరహార్తిం దురపిల్లుఁ బట్టపగలున్ లీలాసరశ్శ్రేణులన్. 1003

క. సరసీరుహములు తత్పుర । వరవనితావదనవైభవము గోరి సరో
వరమధ్యమముల నెప్పుడు । చిరలీలం దపము సేయుచెలువున మెఱయున్. 1004

క. అతనుఁడు సమ్మోహనశర । మతివలకన్నులను నిలిపి యతులోద్యాన
ప్రతతుల నప్పురి నెప్పుడు । చతురత రతిఁ గూడి క్రీడ సలుపుచు నుండున్. 1005

ఉ. ఉపరిరతిప్రయాసముల నుబ్బినఘర్మజలోర్మిశీకర
వ్యపనయబుద్ధి నంగనలు వారిరుహాకరవారి నుల్లస
ద్విపులకుచద్వయీలిఖితవిస్ఫురితాగరుపత్త్రవల్లికా
స్నపన మొనర్చి కల్మషము సౌరభముం గలిగింతు రప్పురిన్. 1006

సీ. మెఱిచి పోవనితీవమెఱపులు రతికేళికలికిరాచిలుకలు పలుకనేర్చు
బంగారుప్రతిమలు ప్రాణంబు లెసఁగినచిత్రరూపంబులు చిత్తభవుని
మోహనాస్త్రంబులు ముదితలై చరియించుచంద్రరేఖలు మహీస్థలి నటించు
కల్పవల్లులు పులకడిగినముత్తెంపుకళుకులు శృంగారకళలచెలులు
కన్ను లార్చెడువేలుపుకన్య లౌఱ । తెలుపుమెత్తనివన్నెశలాకలు విలాస
సీమ లనఁ గామకేళివిచిత్రగతుల । వాసి కెక్కుదు రప్పురివారసతులు. 1007

చ. తనపగవారి లోఁగొనినతప్పునకప్పుర (?) నాథుఁ డాన్యులన్
బెనుపగకింక సంకెలలఁ బెట్టినభీతిగఁ గన్కనిం గనీ
కనముల ముట్టి గిట్టిరును నైవడి నెందు నమందబృంహిత
ధ్వనులు దలిర్ప నుప్పమదవారణముల్ జయకారణంబులై. 1008

చ. వెసఁ గదలించి పో యనిన వ్రేల్మిడిలోనన నిల్చుఁ గంధరం
బుసుమక బిట్టదల్చినను భోరన సాగరమైన దాఁటు బ
ల్వసమున దాఁగలం దఱిమి వాగె వదల్చినఁ జవ్వనం జవం
బెసఁగఁగ గాలి మీఱు భువి నెన్నిక కెక్కినఖుర్తులాణముల్. 1009

సీ. సంతతభువనప్రశస్తసంచారులు సత్కులగోత్రవిస్తారశీలు
లవనీసతీపరిగ్రహశోర్థసమర్థులు పరిచరప్రహ్లాదనిరతగుణులు
ప్రకటపదక్రమపాత్రిగల్భ్యశ్రీనిరతులు పరపక్షఖండనప్రౌఢమతులు
ఖరదూషణక్షయంకరశక్తియుక్తులు కృష్ణవర్త్మాధికకృత్యపరులు
కలితసర్వజ్ఞవిగ్రహుల్ కలిమలాప | కర్షణోదీర్ణసద్ధర్మకర్మపరులు
నగుచు శ్రీవిష్ణుమూర్తుల ననుకరించి | వెలయుచుందురు తత్పురివిప్రవరులు. 1010

ఉ. ధీరులు దోషదూరులు సుధీజనసంస్తవనీయసద్గుణో
దారు లుదారు లాహవజితప్రతివీరు లపూర్వనిత్యశ్రీం
గారులు శూరు లుజ్ఝితవికారులు వార్ధిగభీరు లంగనా
మారులు శక్తినిర్జితకుమారులు రాజకుమారు లప్పురిన్. 1011

క. ధనదులు పుణ్యజనేశులు | ననవరతశివాభినందితాత్ములు నరవా
హనులు నిధిపతు లుదారు ల | య్యును గారు కుబేరు లచట నుండెడు వైశ్యుల్.

సీ. మధుపట్పదంబులమధుపానభూములు రాజకీరంబులరచ్చపట్లు
పుంస్కోకిలంబులభోజనశాలలు మలయానిలంబులు మలయునెడలు
నవమయూరంబులనాట్యరంగంబులు మకరకేతనుసభామండపములు
కీటీజనములవిరులచప్పరములు మధులక్ష్మినైపథ్యమందిరములు
ఆవసంతునిలీలావిహారసీమ | లిట్టులం బగువలపులపుట్టినిండ్లు
చిరపరిశ్రాంతపథికసంజీవనములు | పావనము లప్పురంబున బాహ్యవనులు. 1013

చ. పరిణతగంధశాలివనపంక్తులు గంధవహానుధూతబం
ధురకణిశంబులై వెలుపు దూఁకొనఁ జాలు నిజాలవాలసుం
దరవికచారుణోత్పలవితాననవభ్రమదాలిమాలికా
సురుచిరగీతమాధురికిఁ జొక్కి తలల్ కదలించెనో యనన్. 1014

సీ. పరిపాండుకేసరపరిణాహకేసరప్రసవపరాగంబు కొసరి కొసరి
నర్తితకాసారదరవీచికాసారశీకరశీకరములఁ జెలఁగి చెలఁగి

గుణవతీఘనసారకుచలిప్తఘనసారబహుళసౌరభముల బలసి బలసి
కమనీయమణిజాలఖచితసద్గృహజాలమాలికాంతరముల మలసి మలసి
సమదకరికటతటమదసలిలపాన । ముదితకలరవమధుకరవృదులచలిత
లలితవిపరీతగరుదంచలములఁ బొదలి । మలయపవనుండు పురిలోనఁ గలయఁ బొలయు.

వ. మఱియు రిపుహృదయపుటభేదనం బగుసప్పుటభేదనం బమరావతీపురంబునుంబోలె ననిమిషానందకరంబై, యలకాపట్టణంబునుంబోలె ధనదనివాసంబై, మథురాపురంబునుంబోలె నుల్లసత్పుండరీకంబై, పుండరీకంబునుంబోలెఁ బురుషోత్తమావాసంబై, పురుషోత్తమావాసం బయ్యును వీరభద్రవిహారస్థలంబై, వీరభద్రవిహారస్థలం బయ్యును దక్షయాగమహోత్సవంబై, దక్షయాగమహోత్సవం బయ్యును సర్వమంగళాభిరామంబై, యమరు నందుసుందరులనయనంబులయందు శ్రుతిసీమాలంఘనోద్యోగంబును, పంగులయందు పదహీనతయుఁ, గరులయందు మదోద్రేకంబును, దరులయందు శాఖాచలనంబును, ప్రబంధంబులయందు వర్ణబంధంబులును, శుకశారికాదులయందు పక్షపాతంబులును, గోకులంబులయందు ధంగంబులును, భృంగంబులయందు మధుపానప్రసంగంబులును, వృద్ధదౌవారికాదులయందు దండగ్రహణంబులును దక్కఁ దక్కొండల లేక యొప్పు నందు. 1016

ఉ. భూజనదృక్చకోరపరిపూర్ణసుధాంశుఁడు కీర్తిచంద్రికా
రాజితలోకుఁ డానతధరాతలనాథకిరీటరత్ననీ
రాజితపాదపీఠుఁ డరిరాజకులాచలవజ్రపాణి పం
కేజకులాన్వయాగ్రణి సుకీర్తినరేంద్రుఁడు సమ్మదంబునన్. 1017

క. హితబంధుమిత్రసేనా । పతిసామంతప్రధానపరివారపురో
హితసహితముగ వసించెను । సతతమహీరాజ్యవిభవసౌఖ్యాన్వితుఁడై. 1018

గీ. అట్లు పెద్దకాల మం దుండి యాశ్రిత । పారిజాతు సత్కృపాసమేతుఁ
బ్రతిదినంబు గోరి భజియించె శ్రీరంగ । ధాము నింద్రనీలధామధాము. 1019

ఉ. అంత నిజాత్మజాతు దళితారినృపాలుఁ బ్రజానుపాలనా
త్యంతవిచక్షణున్ సుగుణధాముని సన్నుతనాము బంధుసా
మంతజనైకసమ్మతిని మంజులమంగళతూర్యసంగతుల్
రంతుగ ప్రేమఁ బ్రాజ్యనిజరాజ్యపదస్థుని జేసి నెమ్మదిన్. 1020

క. తగులొండు లేక మతి యా । జగతీనాథుఁడు విరక్తి సమకొన మదిఁ బ
న్నగతల్పు నిలిపి నియతిం । దగఁ దప మొనరించి తత్పదస్థితి నొందెన్. 1021

క. అని ప్రాచేతసుఁ డాదర । మెనయ భరద్వాజమునికి నెఱిఁగించిన యీ
వినుతేతిహాసపఠనం । బున నరుఁకు నుభయలోకములు పెంపొందుదుర్. 1022

వ. అని పారాశర్యుండు నాగదంతమునివర్యున కెఱింగించిన తెఱంగు. 1023

శా. చోళీచంచదురోజకుంకుమనవశ్రీదస్ఫురద్వక్షు నే
పాలీచారుకపోలచిత్రరచనాపారీణహస్తాబ్జ బం
గాళీకేళీకలాప మత్తకరిశిక్షానవ్యపాంచాల పాం
చాలీభావవికాసకృచ్చతురవాచామాధురీవైభవా. 1024

క. కమలాంక కాంతిశోభిత । కమలాకరనిభగభీర కమనీయాదర
త్కమలాయతదళలోచన । కమలాకలితాత్మసదన కమలామదనా. 1025

మాలిని. దినకరసమతేజా దీనమందారభూజా
వనధినిభగభీరా వర్ణనీయప్రచారా
వినయనయవిశాలా వేదమార్గానుకూలా
జనకులజలసోమా చాగయామాత్యరామా. 1026

గద్యము. ఇది శ్రీమత్కృష్ణమరాంబావరప్రసాదలబ్ధసిద్ధసారస్వతవిలాసగౌరవ
గౌరనామాత్యపుత్ర సుకవిజనమిత్ర సుధీవిధేయ భైరవనామధేయ
ప్రణీతం బైన శ్రీరంగమహత్త్వం బను పురాణకథయందుఁ
చతుర్థాశ్వాసము.

# శ్రీరంగమహాత్మ్యము.

## పంచమాశ్వాసము.

క. శ్రీరఘునాయకమృదుపద । వారిరుహభ్రమర బంధువత్సల వంశో
ద్ధారణసుమహిత మతివి । స్తారోరగసార్వభౌమ చాగయరామా. 1028

వ. అవధరింపు మఖిలకథాకథనచాతురీజనితరోమహర్షణుం డగు రోమహర్షణకుమా
రుండు దివ్యబోధను లగుశౌనకాదితపోధనుల కిట్లనియె. 1029

క. ఈజాడ కలితపుణ్యాస । మాజం బగునాశ్రమతీర్థమహిమ విని భర
ద్వాజుండు విపులతపోని । భ్రాజితు వాల్మీకిఁ జూచి పలికెం బ్రీతిన్. 1030

చ. ఇది యొకపాదపంబు గడు నేచినశాఖల నెల్లదిక్కులన్
బొదివి మహాతపస్విజనపూజితమై గిరిఁబోలెఁ దోఁచుచు
న్నది విలసత్ప్రసూనభరనవ్యమనోహరదివ్యవాసనా
ముదితమదాలిగాఁగఁ బరిమోహితముగ్ధకురంగబృందమై. 1031

క. శ్రుతిసుఖకరంబై మధుర । శ్రుతికలితస్వరవిశేషసువ్యక్తంబై
శ్రుతిఘోషము వినఁబడెడి । శ్రుతముగ నచ్చోట నేమిచోద్యము గలదో. 1032

క. వినిపింపుము నాకత్తెఱఁ । గని వినయం బెనయఁ దన్ను నడుగ భరద్వా
జుని ననలకల్పతేజుని । గనుగొని వాల్మీకమునిశిఖామణి పలికెన్. 1033

చ. వినుము కదంబభూజ మది విశ్రుత మయ్యెను దానిపేర న
య్యనుపమతీర్థమందుఁ బ్రియమార నిమజ్జన మాచరించున
జ్జను లఘముక్తులై పరఁగ శాశ్వతవిష్ణుపదంబునందుఁ బెం
పున వసియింతు రక్కడికిఁ బోదము రమ్మని సమ్మదంబునన్. 1034

మ. అని రూపంబు ధరించి వచ్చుహరిలీలాప్తిన్ దిగంతంబులన్
తనదేహప్రభ లుల్లసిల్లఁగ భరద్వాజాన్వితుండై రయం
బున వాల్మీకమునీశ్వరుం డరుగఁ దత్పుణ్యస్థలావాసస
న్మునివర్గం బెదు రేఁగుదెంచి పరమామోదంబు సంధిల్లఁగాన్. 1035

ఉ. దండడి ప్రొక్కి నవ్వుచు సుధామధురప్రియవాక్యచాతురిం
గొందఱఁ బల్లవప్రతిమకోమలపాణిపరిగ్రహంబునం
గొందఱి నాదరంబు సముకొల్పులసత్పరిరంభణంబులం
గొందఱ గారవించి మునికుంజరుఁ డెందఱు దన్నుఁ గొల్వఁగాన్. 1086

ఉ. అంబురుహాస్త్రబాలకిరణారుణకోమలపల్లవప్రభా
లంబముఁ జందనానిలచలత్కుసుమస్తబకప్రబుద్ధరో
లంబము నాలవాలపరిలాలితకేళివిలోలమత్తకా
దంబము నగ్రసంశ్రితపతత్రికుటుంబము నాకదంబమున్. 1037

క. డాయఁ జని ప్రొక్కి భక్తిం। బాయక పూజించి పరమపావన మగుత
చ్ఛాయాసంశీతలవిమ। లాయతసికతాతలమున నాసీనుండై. 1038

గీ. ఆరయ నివృత్తయాగచిహ్నంబు లనట। గానఁబడినఁ గౌతూహలకలితుఁ డగుచు
వారియందు వయస్తపోవైభవముల। నధికుఁ డగుగౌతమునకు నిట్లనియెఁ బ్రీతి. 1039

చ. మునివర యీప్రదేశము సమున్నతయూపచయోపశోభితం
బును బరిపూర్ణపాత్రపరిభూషితవేదివిరాజితంబునై
కనఁబడుచున్న దెన్నృపశిఖామణి సమ్మతిఁ జేసెనొక్కొ భూ
వినుతమహాధ్వరంబు లతివిశ్రుతదక్షిణ లిచ్చి యిచ్చటన్. 1040

క. అనవుడు నాగౌతముఁ డి। ట్లనియెన్ మిథిలాధినాథుఁ డైనవిదేహుం
డొనరించెఁ బెక్కుయాగము। లనఘమహామునిసమేతుఁ డై యచ్చోటన్. 1041

ఉ. నావుడుఁ బుట్టచూలి సుజనప్రియుఁ డాగౌతముఁ జూచి సుస్వరం
బై వినవచ్చుచున్నది నిరంతరమై యొకవేదఘోష మీ
తావున నిట్టిచిత్ర మెచటన్ మును నే నెఱుఁగన్ మునీంద్ర నీ
వావిధ మెల్ల నాకుఁ దెలియన్ వినిపింపు సవిస్తరంబుగాన్. 1042

క. అని యడిగినఁ బ్రాచేతస। మునివరుఁ డిట్లనియె గౌతముఁడు సకలజగ
ద్వినుతప్రభావభూసుర। వినుము పురావృత్త మొకటి వినిపింతుఁ దగన్. 1048

శా. భూనాథుల్ తనపంపు సేయఁగ జగత్పూర్ణప్రతాపోదయ
శ్రీ నొప్పారువిదేహభూమిపతి భూరిద్రవ్యదానంబులన్
దీనానాథుల కెంతయుం బ్రియము సంధిల్లన్ బ్రహ్మోగానుసం
ధానప్రౌఢిమ నీశ్వరానుమతి జన్నం బర్థిఁ గావింపఁగాన్. 1044

క. ఒకనాటిరాత్రి ఋత్విజు । కృపీకరముఁ బరిచారకులును బడలినకతనన్
సకలంబు మఱచి నిద్రా । వికలేంద్రియు లగుచు నున్నవేళం దెలుపన్. 1045

చ. అలఁగఁగ నొక్కకుక్కుర మనావృతభూరికవాట మైనత
త్సలలితయజ్ఞవాటము దెసం జనఁజొచ్చి తదంతరంబునం
గలయ ములంగి వేలిమికిఁగాఁ దగుపాత్రికలందు ముందు వా
రలకడ నుంచినట్టిపృషదాజ్యము నెమ్మదిఁ గ్రోలి వెండియున్. 1046

గీ. అచట మంత్రపూత మగుపురోడాశంబు కొంతకొంత మెసవి యంతఁ బోక
తక్కుగలపదార్థజాతము లెల్ల మూర్కొని తనిసి వెడలిపోయెఁ దనకుఁదాన 1047

క. ఆవేళ దెలిసి ఋత్విజు । లావిధమేమియును దెలియఁగ కవిశిష్టద్ర
వ్యావలిఁ గ్రతువు సమాప్తము । గా వేల్వఁ గడంగుటయును గడుచిత్రముగన్. 1048

వ. మంత్రతంత్రంబు లెవ్వియుం దోపకున్న విషణ్ణహృదయులై ఋత్విగ్జనంబు లధ్వర
క్రియాప్రబుద్ధుం డగువృద్ధకశ్యపున కత్తెఱం గెఱింగించిన నతండును భయార్తచిత్తుం
డై వారల కిట్లనియె 1049

ఉ. అంచితశేముషీవిభవ మందఱు మెచ్చఁగ మున్ను నే నొన
ర్చించిన యాగముల్ గొలఁది పెట్ట నశక్యము నాకు నిట్టి వొ
క్కించుక యైనఁ బ్రయోగవిధ మిప్పుడు దోఁప దిదేమి చెప్ప నూ
హించిన విస్మృతిం బొరసె నేర్పడ నేర్చిన యన్నివిద్యలున్. 1050

క. అనుటయు నట్లు సదస్యులఁ । గనుగొని వారదుగ బుద్ధి గలిగి ప్రయోగం
బనఁగా నెట్టిది మంత్రము । లన నెయ్యవి నే నెఱుంగ మని రీరితిన్. 1051

క. జనులై ముందఱ దోపక । తడఁబడ బుడిబుళ్లు వోవ ధరణీశ్వరుఁ డ
య్యెడ వారిఁ జూచి విూకే । చిడిముడిపా టేల వచ్చెఁ జెప్పం డనినన్. 1052

ఉ. వారు నతాస్యులై ధరణివల్లభుఁ జూచి నరేంద్ర దీనికిన్
గారణమే మెఱుంగ మధికం బగు మే లొడగూడుచోట దు
ర్వారము లైనవిఘ్నములు వచ్చు ననేకము లందు భూమిలో
వారలు రూఢిగాఁ బలుకువాక్యము దప్పదు వేయునేటికిన్. 1053

క. నావుడు భూవిభుఁ డిఁక మన । కేవిధి ప్రజ్ఞావిశేష మేపారు మఖం
బీవిధమున సంపూర్ణం । బై వెలయు నటంచు ఖిన్నుఁడై చింతింపన్. 1054

సీ. అతని కిట్లనిరి వారందఱు నీరీతి నవనీశ పరితాప మంద నేల
యేదేవునిగుఱించి యీయాగమును జేయఁ గైకొంటి వట్టిలోకైకనాథు
నాదినారాయణు నాద్యంతవిరహితు నామ్నాయసంవేద్యు యజ్ఞపురుషు
దేవదేవుని వాసుదేవుని నధికారు నచ్యుతు నఖిలభూతాంతరస్థు
నాశ్రయింపుము హృద్గతం బైనమోహ । పటలమంతయుఁ బాపు నప్పరమపురుషుఁ
డుదయభానుఁడు దిక్కులఁ బాదివికొనిన । యాంధకారంబు విరియించు నవ్విధమున

ఉ. నావుడు సంతసించి నరనాథుఁడు తానును వారిఁ గూడి స
ద్భావమునన్ బ్రపన్నపరిపాలనలోలుఁ గృపాలవాలు రా
జీవదళాక్షు నిల్పి నెఱచింతలఁ బ్రోచి నివాతదేశసం
భావితదీపభాతిఁ జలభావ మొకింతయు లేక యుండెడిన్. 1056

క. వారక తమతమ పనులకుఁ । జేరక చిత్రించినట్టి చెలువునఁ జేష్టం
గూరక పలుకం గోరక । యూరక నివ్వెఱఁగు నొంది యుండిరి సభ్యుల్. 1057

ఉ. అత్తఱి నొక్కసంయమి పరాపరతత్త్వవిచారశాలి భా
స్వత్తులితప్రభానిధి నిజప్రతిమప్రతిభావిశేషసం
పత్తిఁ దనర్చుశిష్యులు శుభస్థితిఁ గొల్వఁగఁ జొచ్చి వచ్చె ను
ద్వృత్తతపనీయదీప్తసముదగ్రకవాటము యజ్ఞవాటమున్. 1058

వ. ఇట్లు చనుదెంచి సముచితధ్యానతత్పరు లగుఋత్విజులను రాజునుం జూచి యిట్ల
నియె. 1059

శా. ఏలా విఘ్నము పొందె నీక్రతువు మీ కిట్లేటి కీతత్క్రియా
జాలం బూరక తక్క బాలిశులరో జన్నిల్పి చింతాత్ములై
కాలక్షేప మొనర్చి తారు మొదలం గైకొన్నకార్యంబు ప్ర
జ్ఞాలంకారులు గేలిఁ బుత్తురె వ్యథాధ్యానంబునన్ బుద్ధియే 1060

మ. క్రతుకర్మంబు సమాప్తి సేయుఁ డని వల్కన్ వార లావిప్రు నా
తతతేజోనిధిఁ బ్రీతిఁ గన్గొని మహాత్మా మంత్రభాగంబు మా
మతులం దోపక తత్ప్రయోగవిధిసామర్థ్యంబునన్ వ్యర్థవి
స్మృతి నొందెం గత మెద్దియో యెఱుఁగ మీచిక్కట్లు నెక్కొంటకున్. 1061

క. అని యీవిధమున వారును । వినయముతోడుతను బల్క విప్రాగ్రణి యా
మునులఁ గనుంగొని జలద । స్తనితగభీరస్వరంబు సమకొనఁ బలికెన్. 1062

ఉ. కారణ మెద్దియే నొకటి గల్గక యీమఖవిఘ్న మొందఁగా
నేరదు గావునన్ వినుము నిక్కము సర్వమయాత్ముఁడైన యం
భోరుహనాభుఁ డిమ్మసితభూరుహమందు నిరంతరంబు నం
గోరి వసించి యున్కి నెఱుఁగున్ దరితో నివి సర్వవృత్తముల్. 1063

క. పూజించి యడుగుఁ డీశయ । రాజము నిది చెప్ప మీకుఁ గ్రతువిఘ్నం బె
ట్యోజ సమకొనిన తెఱఁగు సు । ధీజనవరులార విస్మృతిం బడ నేలా. 1064

ఉ. నావుడు సంతసించి నరనాథుఁడు ఋత్విజులున్ సదస్యులున్
బావనగంధపుష్పఫలపాయసపూపగుడాజ్యముఖ్యనా
నావిధసత్వదార్థకలనంబున నర్చ లొనర్చి రిమ్ములన్
సేవకకామితార్థఫలసిద్ధ్యవలంబము నాకదంబమున్. 1065

ఉ. భాతిఁ నావు నిష్వ దతిభక్తి నొనర్చిన యర్చనంబులన్
ప్రీతుఁడ నైతి మీవలనఁ బెద్దయు విప్రవరేణ్యులార మీ
కీశతి నిష్ట మైనవర మిచ్చెద వేఁడుఁడు నావుడు న్మనః
కౌతుక మూర వారు పులకంబులు నిక్కఁగ నుద్గతాస్యులై 1066

మ. క్షితిజాతోత్తమ సర్వలోకపతి లక్ష్మీమానసోల్లాసు నా
శ్రితమందారు నుదారుఁ గౌస్తుభమణిశ్రీరంజితోరస్కు న
చ్యుతునిన్ భక్తి గుఱించి యీనృపతి విధ్యుక్తంబుగాఁ జేయుస
త్క్రతురాజంబున నేము ఋత్విజులమై కర్మం బనుష్ఠింపఁగన్. 1067

క. ఏమంత్రము నేతంత్రము । మాయతులకుఁ దెలివిపడక మానినకార్యం
బేమాయెనొ యదిగాక మ । తేమాయనొ మే మెఱుంగ మేకారణమో 1068

క. ఆవిధము దెలిసి మెఱసిన । మావిన్నదనంబు మాన్ప మంత్రనియోగ
ప్రావీణ్య మొసఁగి పూర్ణము । గావింపుము నీవు మఖ మఖండితకరుణన్. 1069

చ. అనవుడు నమ్మహోవిటపియందు వసించినరంగధాముఁ డి
ట్లను మునులార మీ రలసి యధ్వరవాటిక నుత్కవాటబం
ధన మొనరింపఁగా మఱచి నల్గడలన్ సుఖసుప్తులైనచో
శునకము తన్మఖాలయముఁ జొచ్చి నిజేచ్ఛఁ జరించి యచ్చటన్ 1070

క. హోమద్రవ్యము లన్నియు । దా మూర్కొనిపోయె దానఁ దలఁకొని వేల్వం
గా మొనసినకారణమున । నేమంత్రస్మృతియు మీకు నెసఁగక తక్కెన్. 1071

క. శుచిమద్ద్రవ్యంబుల నతి । శుచియై తద్దీక్షితుఁడు నిత్యశుచు లగుఋత్వి
జ్ఞ్చయంబుఁ గూడి చేసిన । సుచిరక్రతు వొసఁగుఁ బ్రియము శుచిపత్త్రునకున్.

వ. కావున నపవిత్రంబు లగు పాత్రానీకంబు పరిహరించి శుచిద్రవ్యంబుల నవ్యగ్రులై యాగంబు పరిపూర్ణంబుగా నొనర్పుఁడు మీకుం బూర్వప్రకారంబున సర్వమంత్రతంత్రంబులు ప్రయోగసులభంబులై దీపించెడి నీమహీపాలసత్తముండును నుత్తమగతిఁ బ్రాపింపంగలఁడని యానతిచ్చినఁ దత్ప్రసాదంబున నఖిలవిద్యలు నవగతంబైన సవనంబు నిర్విఘ్నంబులైన నిర్వర్తించి యమ్మునిసమాజంబును రాజును బరమానందంబునం బొందిరి మున్నునిజసమ్మానితుండై యభిరూపంబు నొందిసకాశంబున కేతెంచి హితోపదేశంబు చేసిన భూసురాగ్రణి యవ్వండని కుతూహలులై యిట్లనిరి. 1073

మ. పురుషవ్యాఘ్ర భవత్ప్రసాదమున మాబుద్ధుల్ ప్రసన్నంబులై
పరగెం బర్వనదుర్విమోహతనుముల్ పాసెన్ మనోవీథిలో
మరలం దోఁచె సమస్తవిద్యలును సామాన్యుండవే సర్వది
గ్భరితస్ఫూర్తిఁ దలిర్చు నీదుశుభసాంగత్యప్రభాజాలముల్. 1074

క. ఎచ్చోట నుండు వికటికిఁ । గ్రచ్చఱ నరుదెంచినట్టి కత మేమి ముఖం
బచ్చుపడ నిర్వహింపఁగ । విచ్చేసినదొరవొ దివిజవిభుఁడవొ చెపుమా 1075

వ. అనిన నయ్యుత్తమపూరుషుండు మహర్షుల కిట్లనియె. 1076

క. వసియింతు నెల్ల యెడలను । వసుధాసురులార నాకు వాలాయంబై
యొసఁగినపని లే దొకటియుఁ । బొసఁగుం జేరువయె నాకుఁ బోలినలీలన్. 1077

మ. వినుతద్రవ్యసమృద్ధి గల్గి త్రిజగద్విఖ్యాతచారిత్రులై
చనుమీయట్టిమహోత్తు లెల్లక్రియలం జాగింప సన్మాన్యత
త్తనుఁడై మించినయీవిదేహవిభుస త్రిం బంతరాయంబు నొం
దినయాచంద మెఱింగి తత్పరిసమాప్తిప్రీతి నేతెంచితిన్. 1078

గీ. క్రతువు సంపూర్ణమయ్యె భూపతికి మీకు । భద్రమయ్యెడు నేను నాభవనమునకుఁ
బోయివచ్చెద ననిన నప్పురుషసింహుఁ । బాయజాలక యమ్ముని ప్రవరులెల్ల. 1079

చ. వెనుకొని యేఁగి రప్పు డరవిందదళాక్షుఁడు వారినందఱం
దనకరుణావలోకనసుధారసధారలఁ దొప్పదోఁపుచుం
దనుభవదవ్యసారథకదంబము దిక్కులఁ బర్వ నుర్విఁ బా
వన మగునట్లసచ్చరణవారిరుహంబుల లీల మెట్టుచున్. 1080

సీ. ఆకదంబముఁ జేర నరుదెంచి తనకు నమ్మును లాచరించుపూజనలు ప్రీతిఁ
గైకొని వారితో ఘనతపోధనులార గురుతరం బగువేదఘోష మొకటి
సకలకాలంబును శ్రవణమంగళముగా నొదవుగా కని వరం బొకటి యొసఁగి
యంతర్హితుం డయ్యె నది యాదిగా మునిసేవ్యమై శ్రుతినాదభవ్య మగుచుఁ
బొలుచు నీతత్పరిదేశంబు భూరిజన్మ ; సంచితోదగ్రపాపప్రపంచనక్ర
వక్రసంచారభయదభవప్రభూత । జలధిజృంభితబాడబజ్వలన మనఁగ 1081

వ. అని గౌతమమునివరుండు చెప్పినపుణ్యతీర్థ ప్రభావంబున కలరుచుఁ బరమతత్త్వవివేకి
యగువాల్మీకి యచటఁ గదలి భరద్వాజసహితుండై మహితతపోవిరాజమానమునిసమా
జపూజితంబును ప్రసిద్ధసిద్ధచారణగీర్వాణసేవితంబును సకలకాలకుసుమఫలభరిత
తరులతాపరివృతంబును క్రోశమండలవిస్తారంబును నగుబిల్వతీర్థంబునకుం జనియె
నని చెప్పి యప్పారాశర్యవర్యుండు వెండియు నిట్లనియె. 1082

సీ. ఇంద్రుఁ డేతరువరము నెలమి నారాధించి సురరాజ్యవైభవస్ఫురణ దనరె
మైత్రేయి నాఁగ బ్రాహ్మణి యేమహీజంబు సేవించి యోగసంసిద్ధి నొందె
వాలఖిల్యాదు లేవరపాదపచ్ఛాయ నెల్లకాలము నాశ్రయించి యుండు
రజనిర్మితం బైనయాగవేదిక నేఁడు నేశాఖిక్రేవ నొప్పెసఁగి వెలయు
విబుధమానవదైతేయవితతిలోన । నెవ్వరెవ్వరి కట్టియభీష్ట మట్టి
వారలెల్లను నేధరణీరుహంబు । గొలిచి పడసిరి తమతమకోర్కు లెలమి 1083

గీ. అట్టిబిల్వంబు పేరఁ బ్రఖ్యాతమైన । యమ్మహాతీర్థరాజసామర్థ్య మెల్ల
దెలుపునితిహాస మొక్కటి గలదు వినుము । దానఁ బెడబాయుఁ బటుదురితవ్రజంబు

సీ. కలఁడు సోముఁ డనఁగ నొక్కరాజన్య వంశదీపకుఁడు దుర్వారబలుఁడు
సత్యసంధుఁడు సర్వశాస్త్రతత్త్వజ్ఞుఁడు శమదమాన్వితుఁడు సజ్జనహితుండు
జలధివేష్టితమహీచక్రేశ్వరుఁడు నిత్యధర్మశీలుఁడు మహాదానశాలి
సతతయాగక్రియోత్సాహసంపన్నుండు సకలదిగంతవిక్రాంతకీర్తి
ఘనదయానిధి యాచకకల్పతరువు । భూప్రజాలోకనోత్సుకపూర్ణచంద్రుఁ
డతిజరాదారుఁ డంభోరుహాక్షుదివ్య । చరణరాజీవయుగసమర్చనపరుండు 1085

క. విగతస్పృహుఁ డై తగ న । జ్జగతీనాయకుఁడు షష్టిసమములు కీర్తుల్
నెగడ ధర యేలి తనమెయి । నొదవినజరఁ జూచి యాత్మ నొసఁగినచింతన్. 1086

మ. జలదాకారము లింద్రజాలమహిమల్ సౌదామనీవిభ్రమం
బులు గంధర్వపురంబు లంబునిధిసంభూతోర్మికాజాలముల్
కలలో రాజ్యము లెండమావులు నటత్ఖద్యోతకీటద్యుతుల్
తలపోయంగ నసారసంసృతిసముద్యత్సౌఖ్యసంపన్నతల్. 1087

క. అది గాన విపులభోగా । స్పదశాశ్వతపుణ్యలోకసంవాసము నా
కొదవెడునట్టి ప్రయత్నము । వదలక కావింపఁగా నవశ్యము వలయున్. 1088

వ. అని వితర్కించి. 1089

చ. విమలతపఃప్రసిద్ధులును వృద్ధులు శుద్ధులు వీతరాగులున్
శమదమయుక్తులున్ సకలశాస్త్రవిధిజ్ఞులు నైనసద్విజో
త్తములను సత్పురోహితవితానము నాప్తుల బంధుమిత్రులన్
గ్రమమునఁ గూర్చి వారి కధికం బగుపూజ లొనర్చి యిట్లనున్. 1090

చ. చదివితి నెల్లవేదములు శాస్త్రములున్ బహుధర్మమర్మముల్
విదితముగాఁగ వింటి బహువిత్తము లిచ్చితి విప్రకోటికిన్
సదమలబుద్ధిఁ జేసితి ప్రశస్తమఖంబులు జీవలోకసౌ
ఖ్యదములుగా వనంబులు జలాశయముల్ కడఁ బెక్కొనర్చితిన్. 1091

క. సుకృతము లెడపక చేసియుఁ । బ్రకటితసంపదలఁ బెంపు వడసియుఁ గాఁదీ
పకుఁ డగుసుతుఁ గనుభాగ్యం । బొకటియు లే దనిన మనుజుఁ డొందునె శుభమున్.

క. నపుత్రవంతులకుఁ గల । దరయఁగ సద్గతిసుఖంబు నాపుత్రాణాం
పరలోకస్థితి యనఁగాఁ । బరఁగెడువాక్యంబు వినమె బహుశాస్త్రములన్. 1093

క. మేదినిఁ బరఁగినలౌకిక । వైదికధర్మంబు లెఱుఁగువఱతలు గడువీ
రేది గతి చెప్పఁ డింకఁ బు । త్రోదయలాభోత్సవంబు లొందనివారున్. 1094

ఉ. నావుడు వార లమ్మనుజనాయకుఁ గన్గొని పూర్వజన్మసం
భావితపాపయుక్తి ననపత్యుఁడ వైతివి నీవు దీనికిం
గా వగపేటికిం బటుశిఖావిసరోజ్జ్వలమైనవహ్నిఁ గా
ష్ఠావలిఁ బోలె గాచు నశుభాతతియంబులఁ బుణ్యకర్మముల్. 1095

వ. తొల్లి దుందుమారసగరదిలీపదశరథాదిమేదినీశులు హృషీకేశు నారాధించి తత్ప్ర
సాదంబున నసాధారణబలపరాక్రమసౌభాగ్యవినయవిధేయత్వాదిగుణగణోదారు లగు

కుమారులం గనిరి నీవును దత్ప్రకారంబునఁ గారుణ్యసింధు వగుసింధురవరదునిం
బూజింపుము రథాంగపాణి భవన్మనోరథంబు సఫలంబు సేయు నెడసేయక తత్ప్రీ
తికరం బగునధ్వరంబు గావింపు మనిన సమ్మదం బంది యమ్మహీవరుండు. 1096

క. తనతనుసన్న నృపాలురు । పనిసేయు నుదారవిభవపరిణతిదివిజాల్
గొనియాడ వేదవిద్యా । ఘను లగుభూసురులఁ గూడి క్రతు వొనరింపన్. 1097

శా. చండాంశుప్రతిమప్రతీకరుచు లాలాచక్రవాళంబునన్
నిండం బర్వఁ బ్రవాళపాటలజటానీకంబు మూలం గ్రియా
పాండిత్యప్రథమానసంయమికదంబం బర్థి సేవింప మా
కండేయుం డరుదెంచెఁ దన్మఖదిదృక్షాకౌతుకోల్లాసియై. 1098

గీ. అమ్మునీంద్రునిఁ గని వినయం బెలర్ప । నెదురు చని మ్రొక్కి తోడ్కొని యేఁగుదెంచి
యర్హపీఠంబుపై నుంచి యర్ఘ్యపాద్య । ముఖ్యసత్కారములు క్రమంబున నొనర్చి

క. ఘను లగుతదీయశిష్యుల । మనమలరఁగఁ బూజ చేసి మనుజాధీశుం
డనురాగంబున నమ్ముని । యనుమతి ఋత్విజులుఁ దాను నాసీనుండై 1100

క. క్షేమంబే మీకును శిష్య । స్తోమమునకు నీతిబాధ చొప్పడక తపో
భూమి దలిర్చెనె విఘ్నము । లేమియు నైకొనక జరగునే సత్తపముల్. 1101

చ. అనవుడు నమ్మునిప్రవరుఁ డానృపుతో భవదీయరక్షచేఁ
బనువడు మాకు సర్వమును భద్రము నీవును నీసుహృజ్జనం
బును సుఖ మున్నవారె గుణభూషణ సత్సుతలాభకాంక్ష నె
క్కొన నొనరించు నీమఖము కోరి కనుంగొన నిందు వచ్చితిన్. 1102

క. దీన భవదీప్సితార్థము । గా నేరదు పూర్వజన్మకలుషం బధికం
బై నరుఁ డొనరించెడి సుకృ । తానూనఫలాగమంబు నది పెట్టు నృపా. 1103

మ. అతివిఖ్యాతములై మహిం బరఁగుపుణ్యక్షేత్రతీర్థంబు లం
చితబుద్ధిన్ భజియింపఁ గర్మములు సంక్షీణత్వముం బొందినన్
వితతంబై భజియించుకార్యములు నిర్విఘ్నంబులౌఁ గావునన్
క్షితినాథోత్తమ తద్విధం బిపు డనుష్ఠేయంబు నీ కెమ్మెయిన్. 1104

క. నావుడు నమ్ముని గనుఁగొని । భావం బలరంగ నానృపాలుఁడు త్రిజగ
త్పావనచరిత్ర తత్తీ । ర్థావలి నా కెఱుఁగఁ జెప్పు మని వేఁడుటయున్. 1105

వ. మార్కండేయమునీంద్రుం డన్నరేంద్రున కిట్లనియె. 1106

సీ. వసియించు నెందేని వైకుంఠనాథుండు ఫణిరాజభోగతల్పంబునందు
నెందేని పరమయోగీంద్రు లేప్రొద్దును బాయకుందురు పరబ్రహ్మనిరతి
బహువిధవార్జితపాపపటలంబు లెందేని నిమిషమాత్రంబున సమసిపోవు
మెఱుఁగుఁగోఁజలకోడిమృత్యుదేవతగర్వ మడచితి వెందేని యద్భుతముగ
నట్టిశ్రీరంగమండలాభ్యంతరమున । నఖిలలోకైకపావన మైనమహిమఁ
గరము శోభిల్లుచంద్రపుష్కరిణి సుమ్ము । సకలతీర్థంబులకు నెల్లఁ జక్రవర్తి. 1107

వ. ఆతీర్థంబునకుఁ గ్రమంబున గంధవాహనవరవాహనపురహరపురందరవైశ్వానరవైవస్వత
పలాశనపాశధరదశాభాగంబుల భజదమరసాధకంబు లగుతీర్థంబులు గల వవియును,
గేసరకదంబామ్రబిల్వజంబూపలాశాశ్వత్థపున్నాగాహ్వయంబులన నంపహోనిరాసంబు
లై భాసిల్లు నందుఁ బున్నాగతీర్థంబున బ్రహ్మవర్చసోదారుం డగువర్చసుం డనుబ్రాహ్మ
ణుండు బ్రహ్మజ్ఞాననిరతుండై సంసారవిరక్తిం బొంది నిత్యానందంబు నొందె భార్గ
వకులవిస్తారుం డైనతారకుం డనుతాపసాగ్రణి కేసరతీర్థంబునఁ దపంబు సేసి భవపాశం
బులం బాసి జితారివర్గుండై వర్గగోత్రజాతుం డైనరుక్మదృష్టి భజదభీష్టఫలకదంబం
బగుకదంబంబు నుపాసించి బ్రహ్మపదప్రాప్తుం డయ్యె నఖిలలోకోపాస్యుం డగు
కాశ్యపమునీశ్వరుండు విధూతపాపధూమ్రుం డగునామ్రంబు నాశ్రయించి యమృత
త్వంబు నొందె మఱియు నేను తీర్థంబుల నిజమనోరథంబు లవికలంబులుగాఁ బడసి
రని చెప్పి యామృకండనందనుండు వెండియు నిట్లనియె. 1108

క. శ్రుతిపర్వమై మహోఘ । ప్రతతిం బాపుచు నభీష్టఫలదం బగు నీ
యితిహాస మొకటి చెప్పెద । క్షితినాయకతిలక చిత్తగింపుము ప్రీతిన్. 1109

సీ. జయధరుఁ డన నొక్కజననాయకుఁడు సుధాకరవంశ్యుఁడు ధరిత్రిఁ గలఁ డతండు
క్రూరుఁడై భూసురకోటికి నెగ్గులు గావించువారు తచ్ఛాపకోప
పావకజ్వాలలఁ బరితప్తహృదయులై విసివి యారాజ్యంబు విడిచి చనిన
శూద్రభూయిష్ఠమై శ్రుతిఘోషరహితమై భయరోగదుర్భిక్షబహుల మగుచు
నాడునాటికి రాష్ట్రంబు నాశ మొందె । కరితురంగమరథభటకాంచనాది
సంపదల సొంపు సకలంబు ముంపుఁ దప్పి । దీనదశ నొందె నజ్జగతీవిభుండు. 1110

క. వానికులశేఖరము నొక్కట । నానామయపీడఁ జాల నవసి కృతాంత
స్థానమున కరిగె రత్తఱి । నానరపతి సతులు దాను నడలుచు నుండెన్. 1111

శా. అంతం బుష్కరిణీతటంబున హరిధ్యానామృతానందిత
స్వాంతుండై వసియించియున్నగురున్ వాల్మీకి దర్శింప న
త్యంతప్రీతి దలిర్ప నేఁగుచు భరద్వాజుండు తన్మార్గినీ
కాతుం డున్నపురంబునై నరుగ మార్గం బౌట నచ్చోటికిన్. 1112

గీ. వచ్చి తనకు శిష్యవరుఁ డగుటఁ దెల్పి | హితునివలన నమ్మహీశ్వరునకుఁ
దొడరినట్టికష్టదుర్దశ లన్నియును | విని మనంబులోనఁ గనికరించి. 1113

క. తా నట చని నిజగురునకు | నానృపువర్తనముఁ జెప్పి యనుకంప మదిం
బూని ముని వానిం ద్రష్ట్రియు | లో నుండక చనినవిప్రలోకము నెల్లన్. 1114

చ. పిలువఁగఁ బంపి వారలకుఁ బ్రీతి దలిర్పఁగ నిట్లనున్ సము
జ్జ్వలమతులార మీ రలిగి వచ్చినయంతటనుండి పైపయిన్
దలకొనినట్టియాపదల దండడిఁ గుందిరి భూప్రజల్ మహీ
తలపతియున్ దురంతపరితాపనిపీడితుఁ డయ్యె నెంతయున్. 1115

క. నాలుగుపురుషార్థములకు | నాలుగువర్ణములవారి నడవడికిని భూ
పాలకుఁడు కారణము త | న్మూలంబున నెపుడు సర్వముం దలపోయున్. 1116

చ. అలుకలు దక్కి నాపలుకు లాదటఁ గైకొని సత్కృపాగుణం
బలవడ నుద్ధరింపుఁడు మహామహులార నితాంతశోకవి
హ్వలుఁ డగు మేదినీశుని దురంతము లైనయుపద్రవంబులన్
దొలఁగుటె నెమ్మనంబు దలపించుచు నున్న మహీప్రజాలికిన్. 1117

వ. అని చెప్పిన నతనివాక్యప్రబోధితులై క్రోధంబు లుడిగి ప్రసన్నచిత్తులైనభూసురోత్త
ములపశ్చాత్తాపమానసుం డగు మానవేంద్రుని గలపి వారలఁ దోడ్కొనుచు నత్త
పోధనసత్తముండు నఖిలకామితార్థదాన సమర్థం బగుబిల్వతీర్థంబున కరిగ నప్పు
డయ్యెడ నున్నమహామునిగణం బతనిరాక గని రాకాసుధాకరోదయంబు నున్నిద్రం
బగుసముద్రంబునుం బోలె నిబ్బరంబుగా నుబ్బి సముచితసత్కారంబు లాచరించి
సముచితాన్యోన్యప్రియభాషణంబులఁ బరితుష్టులై యున్న సమయంబున. 1118

చ. అనుపమదివ్యసౌరభసమంచితకోమలగంధవాహముల్
మును గొని వీచె బిల్వతరుమూలమునన్ వరపుష్పవృష్టి భో
రన గురిసెన్ బదంపడి తిరంబున మ్రోసె నశేషవాద్యని
స్వనము లనంతరంబు వినవచ్చె మనోహరనవ్యగానముల్. 1119

క. ఈరీతి నుభయసంధ్యల । నారూఢము లైనమంగళాచారము లే
వారఁ గని పుట్టఁ మాలియు । భూరమణుం డద్భుతమునఁ బొందుచు నుండెన్.

ఉ. అక్కడి కేఁగుదెంచె సముదంచితదివ్యతనుప్రభాతతుల్
దిక్కులఁ బిక్కటిల్ల నతితీవ్రతపోనియమప్రసిద్ధిఁ బెం
పెక్కినశిష్యకోటి తను నెంతయు భక్తి భజింప లోకముల్
మ్రొక్కసనత్కుమారమునిముఖ్యుఁడు తీర్థనిషేవణార్థియై. 1121

క. అప్పుడు వల్మీకభవుం । డప్పద్మజసుతుఁడు దాను నాత్మల ముదముం
జిప్పిల నాలింగనములు । చొప్పడ గావించి యుచితసత్క్రియమునన్. 1122

వ. సుఖాసీనులై యున్న యవసరంబున నవగతమనోగతవికారుం డగుసనత్కుమారు
నుపలక్షించి యాత్మయజ్ఞానకుఠారదారిత సంసారభూజుం డగు భరద్వాజుం
డిట్లనియె. 1123

ఉ. ఇచ్చటఁ బుష్పవర్షములు నింపెసలారఁగఁ బాడుపాటలున్
మెచ్చుల మ్రోయుతూర్యములు మేదురనాదములున్ మనంబులం
జెచ్చెర నద్భుతం బొదవఁ జేసి మహాత్మ యెఱుంగ మేము ము
న్నిచ్చట నిట్టిచోద్య మిది యెంతయుఁ దేటపడంగఁ జెప్పవే. 1124

సీ. నావుడుఁ బరమేష్ఠినందనుం డెలమి నిట్లను భరద్వాజుతో ననఘ మున్ను
సుత్రామసఖుఁ డైనచిత్రసేనుం డనుగంధర్వుఁ డతిశుభాకారుఁ డొకఁడు
తరుణీసమేతుఁడై తనుఁ జేరి యనుచరుల్ గొలువంగఁ దా నదీకూలమునను
గొంత మ్రొక్కొలంకులఁ గ్రీడాద్రిసానుదేశంబుల దరులఁ జలముల యందుఁ
గలయ విహరించి యొకనాఁడు గగనవీథిఁ । జనుచు శ్రీరంగమందిరచ్ఛాయ దాఁట
నది గనుంగొని కనలి సప్తార్ణవములు । గడవ వైచిరి తీర్థరక్షకులు వాని. 1125

వ. అత్తెఱంగెఱింగి తత్సఖుం డైనశతమఖుండు చతుర్ముఖాదేశంబున దత్పాపంబుఁ బా
యనుపాయం బాదేశించిన నాగంధర్వుండు సర్వంసహాచక్రంబున నేమి నీశరణ్యంబు
లగునరణ్యంబులు పాపలతాలవిత్రంబు లగుపుణ్యక్షేత్రంబులు ప్రపంచితపురుషార్థంబు
లగుతీర్థంబులు నుపాసించుచు వచ్చి వచ్చి యఖిలలోకంబులఁ బావనంబు గావించు
ప్రఫుల్లపుష్కరామోదపుష్కర యగుపుష్కరణి నవగాహనంబు సేసి శుద్ధమాన
సుండై యతిమధురగానవిద్యావిశేషంబున శేషశాయిని బరితోషితుని జేసి తత్ప్రసా
దంబున భువనసంస్తుత్యం బగుగంధర్వాధిపత్యంబుఁ బడసె నది మొదలుగా నతం

డీతీర్థంబున సితపక్షపంచమిదివసంబున సర్వకల్యాణకారణు లగునారాయణుల నా
రాధించుచుండు నేఁ డిట్టిదివసం బగుటఁ బూజాసముత్సుకంబున సపరిచ్ఛదుండై
వచ్చుచిత్రసేనుకృత్యం బిది యని యెఱింగించినఁ బరమహర్షభరితుండై భరద్వా
జుండు వెండియు నిట్లనియె. 1126

క. సితపక్షపంచమీతిథి । నితరము లగువాసరముల నీతీర్థమునన్
ధృతిఁ జేయవలయు నాద । వ్రతపూజావిధులఁ జెప్పవలయు మహాత్మా. 1127

చ. అనిన సనత్కుమారుఁడు ప్రియంబున నాతనితో విహంగవా
హనునకుఁ బ్రీతి గాఁ బ్రతిపదాదిదినంబుల నాచరింపఁగా
జనలును సువ్రతంబులుఁ బ్రశస్తజపంబులు నాదిగాఁ గల
గ్గిననియమంబు లెల్ల నెఱిఁగించుచు నందు యథాక్రమంబునన్. 1128

క. ఏకాదశేంద్రియంబులఁ । జైకొనుపాపముల నెల్లఁ బాపుచు ముక్తి
శ్రీకారణ మై వెలసిన । యేకాదశిమహిమ చంద మిట్లని చెప్పెన్. 1129

సీ. పటుఘోరపాతకపటలమహారణ్యచటులసముజ్జ్వలజ్వలనకీల
దుర్వారదారుణదుష్కృతసంఘాతమేఘసంవర్తసమీరణంబు
భూరిభీషణపాపపుంజసముత్తుంగభూమిభృచ్ఛితదంభోళిధార
దుస్సహదురితసందోహనిరంతరధ్వాంతప్రచండమార్తాండదీప్తి
క్రూరకల్మషకుంభికంఠీరవంబు । భీకరాఘౌఘపవనకుంభీనసంబు
కుటిలకిల్బిషపాథోధికుంభజాతి । భాసురం బైనశ్రీవిష్ణువాసరంబు. 1130

క. స్మృతివచ్యుతదిననిష్ఠా । శ్రితులగురుక్మాంగదాంబరీషాదులు స
న్నుతి గనిరి గాదె మును నా । శ్వతకీర్తులపరమభాగవతులందెల్లన్. 1131

వ. అట్టియేకాదశిప్రకారం బెట్టిదనిన. 1132

చ. దశమిప్రభాతవేళ నుచితం బగుకాష్ఠముఁ బూని మౌనియై
దశనవిశోధనంబు నుచితంబుగఁ జేసి కృతావగాహుఁడై
కుశలమతిం గ్రియల్ నడపి కోరి హరిం భజియించి యొక్కపూ
టశనము తా భుజించి శుచియై వనితారతిఁ దక్కి వేగినన్. 1133

క. మాఘమునఁ బుణ్యసలిల । స్నానం బొనరించి సమయసముచితనిత్య
స్నానక్రియాకలాపము । మానక కావించి నియమమానసుఁ డగుచున్. 1134

శ్లో. ఏకాదశ్యామహంకించి । దనశ్నన్ పురుషోత్తమ
భోక్ష్యేహానిపరేశ్రీమన్ । పాహిమాంశరణాగతం. 1185

వ. అని సంకల్పంబు చేసి. 1186

సీ. పరుల నిందింపక పాషండజనగోష్ఠి సలుపక యనృతభాషణము లాడ
కాగ్రహింపక శూద్రు నంటు కింటను యుండి లలనతోఁ గలయక కన్యలకును
నెగ్గు సేయక దుర్జనశ్రేణిసంగతిఁ బోక క్రయవిక్రయాదుల కనిపడక
కోర్కులు మదిఁ బుట్టకుండ నిద్రింపక యనుచితకర్మము లాచరించ
కమలమానసుఁడై యచ్యుతావతార । కథలు సద్భక్తి వినుచు భాగవతజనుల
సంగడంబునఁ గాలంబు జరుపవలయు । హరిదినంబున నుపవాసి యైనయతఁడు. 1187

వ. ఇట్లుపవసించి సముచితగోమయోపలిప్తంబును ననేకవర్ణనియమమంగళరంగవల్లికాభాసురంబును వివిధవిచిత్రవితానాభిరామంబును బ్రవాళారుణపిప్పలతోరణాలంకృతంబును బరిణద్ధవిశుద్ధఫలపనసప్రసవమంజరీమంజాలంబును గంధతైలప్రదీపితదీపరాజితంబును నగుపూజామండపంబున సముచితాసనాసీనుండై నలినమణిప్రభాపిడంబం బగునంబరంబు లాపీతాంబరునకు సమర్పించి దర్పసారకర్పూరకలితగంధసారకలితకర్దమం బాజనాగ్రమునఁ గలఁది యనల్పమణికల్పితంబు లగునాకల్పంబు లాఫణితల్పునకుఁ దొడిపి మరకతశ్యామాభిరామకోమలతులసీదళదామంబు లావైకుంఠధాముకంఠంబున నునిచి కించిద్వికసితముకుళవకుళపున్నాగకేసరమాలతీనవమాలికారచితమాలిక లావనమాలికిం దవిమి ప్రభూతపరిమళమిళితదిశాంగణంబు లగుదశాంగధూపంబు లాదశావతారునకొసంగి సారఘనసారశకలసముద్దీపితంబు లగుదీపంబు లాజగత్ప్రదీపునకు నివాళించి హయ్యంగవీనపరిపక్వంబుల నాయూపంబు లగునపూపంబులను మధురగుణసంపన్నంబు లగుపాయసాన్నంబుల నమృతకరకళామోదనంబు లగుశాల్యోదనంబులను మరిచశర్కరాసంప్రక్తితంబులై రుచిరపరిపాకంబు లగుశాకంబులను సరసరసాలవాలంబు లగుఫలజాలంబులను గృతసుధాపరితోషంబు లగుపానీయవిశేషంబులను నతిహృద్యంబు లగునైవేద్యంబు లావేదవేద్యునకు నివేదించి యప్పుండరీకాక్షునకుఁ బ్రదక్షిణప్రణామంబు లాచరించి బహువిధస్తోత్రపాఠంబులఁ బాటల నాటల వేగునంతకు జాగరంబు సేసి మఱునాడు కృతస్నానుండై కాల్యకరణీయంబులు దీర్చి యచ్యుతారాధనానంతరంబున గురువందనం బాచరించి శ్రీమదష్టాక్షరానుసంధాననిష్ఠాగరిష్ఠు లగుభాగవతశ్రేష్ఠుల నభీష్టమృష్టాన్నదానంబులఁ బరి

తుష్టి నొందించి వారికందఱకుఁ జందనమాల్యాంబరాభరణాదు లాదరంబునఁ దనకుఁ
గలకొలంది నిచ్చి నిజబంధుమిత్రసమేతంబుగాఁ బారణ యొనర్చి పునర్భోజనదివాశ
యనస్త్రీసంగమాదుల జరిగించక వ్రతసమాప్తి సేయునతండు సప్తగోత్రంబుల నుద్ధరించి
యక్షయానందపదం బగు వైష్ణవసదనంబు నొందు. 1138

గీ. విష్ణువాసరమున వినుము కళామాత్ర । మైన దశమి గలసెనేని వలవ
దుపవసింప దాన నొదవుఫలం బగ్నిఁ । దృణము గాలినట్లు త్రుంగిపోవు. 1139

ఉ. కావున నట్టివాసరము గల్గిన నాతిథి మాని బారసిం
బావనబుద్ధి మీఱి యుపవాసము జాగరణంబు దీర్చి యా
వేళనఁ బారణంబు కడువేడుకఁ జేసినధన్యుఁ డొందు నా
నావిధయజ్ఞదానకరణంబునఁ జేకుఱుపుణ్యసంపదల్. 1140

చ. ఋతువులలో వసంతము మహీధరసంతతిలో సువర్ణప
ర్వతము గ్రహంబులందు దినరాజు తరంగిణులందు గంగ గో
వితతులలో మహత్సురభి వేల్పులలో హరిఁ బోలె నుత్తమ
వ్రతములలోన జక్రధరవారము సువ్రత యొప్పు నెంతయున్. 1141

సీ. ఖలుఁడు స్వామిద్రోహి గరదుఁ డనాచారి పరదూషకుఁడు సురాపానరతుఁడు
గ్రహదాహకుఁడు సత్యరహితుఁ డన్యాంగనాసక్తుండు జీవహింసాపరుండు
గురుతల్పగుఁడు కృతఘ్నుఁడు బ్రాహ్మణద్వేషి పశుఘాతకుఁడు సాధుబాధకుండు
వ్రతవిహీనుఁడు సువర్ణస్తేయుఁడుపుత్రికాహారజీవనుండు దుష్టాన్నభోజి
వేదనిందకుండు నాదిగాఁ గలపాప । శీలు రెల్ల నితరచింత లుడిగి
హరిదినంబు వ్రతము జరిపి శుద్ధాత్ములై । పడయుఁ గాంతు రమృతపదము తుదను. 1142

క. మును దేవవ్రతుఁ డనఁగాఁ । జనుభూసురుఁ డొకఁడు యోగిజనసేవితమై
తనరెడి పుష్కరతీర్థం । బునఁ జిరకాలము వసించి పూతాత్ముండై. 1143

గీ. లీలఁ జూచి మాడలేని సంపద సుఖ । స్ఫురణఁ దలఁచి విషయనిరతిఁ గుంది
ప్రకటతేజుఁ డగుపరాశరశిష్యు మై । త్రేయమునివరేణ్యు డాయ నరిగి. 1144

చ. వినయవినమ్రుఁడై మొగము వెల్వెలఁ బాఱఁగ నున్న యాతనిం
గనుగొని యమ్మునీశ్వరుఁడు కారణ మెయ్యది నీవు దీనతన్
బొనుపడి యిట్లు దయ్యుటకు భూసురసత్తమ నాకుఁ జెప్పు నీ
మనసుకళంకు సర్వమును మాన్పెద నావుఁడు నాతఁ డిట్లనున్. 1145

చ. తొడరినశోకమోహములఁ ద్రొక్కుడులం బడి చిక్కి వైపయిం
బొడమునుమహోపతాపములఁ బొక్కుచుఁ బ్రాణులపాటుఁ జూచి తా
నడరుచునున్న దుర్భరభయాకులతన్ గృశియించు నన్ను ని
ట్లడుగఁగ నేల నిప్పుడు మహాత్మ సమస్తము నీ వెఱిఁగియున్. 1146

క. ధీరమతి నిచటి కరిగిన । వారలు మతిమాతృగర్భవాసములను రా
రారూఢముగా మోహం । బేరీతిని బాయు నాకు నెఱిఁగింపు తగన్. 1147

వ. అనిన మైత్రేయుం డిట్లనియె. 1148

సీ. నిత్యుఁ డక్షయుఁ డాత్మ నిశ్చలుఁ డవికారి సచ్చిదానందభాస్వత్స్వరూపి
తతగుణాత్మకము నిత్యము సర్వకారణమును భూతకారణమును దనర్చు
పరఁగ నీరెంటిలోపలి తారతమ్యంబు నరసి చూచిన మహదంతరంబు
ప్రకటతేజస్తమఃపటలంబులనుఁబోలె జరగు వీనికిఁ బరస్పరవిరోధ
మమల మగు నాత్మ ప్రకృతిసంగమముఁ జేసి । కర్తవకుఁడై స్వతంత్రుఁడు గాక పొందు
నమరదేహాదులందు దుఃఖమును సుఖము । గానఁ గర్తృత్వము నేఁత కార్య మనఘ.

చ. శమమును దేహశోషణము శౌచము నింద్రియనిగ్రహంబు ని
ర్మమతయు నన్నహీననియమంబును మానము వేదశాస్త్రపా
రమును విరక్తియుం గమద్రోహం బగుసత్యమునుం దపస్వరూ
పము లని చెప్పుచుందురు పల్మఱు ధర్మరహస్యకోవిదుల్. 1150

క. అట్టిశమ మనుల శ్రమము । గట్టిగఁ జేపట్టి కర్మమనులతల మొదల్
ముట్టఁ దనుమునను నఖుఁజే । పట్టఁగఁ బోలదె విముక్తి భవబంధములన్. 1151

క. కావున నుపవాసవ్రత । పావనతీర్థావగాహపరిణతమతివై
నీవు చరింపుము నాపుడు । దేవవ్రతు డత్తపస్వితిలకున కనియెన్. 1152

క. ఏనెల యేదివసంబున । నేనేమముతోడ మనుజుఁ డేదేవునకున్
గా నుపవసింపఁదగు నీ । వానతియీవలయు నాకు నత్తెఱఁగెల్లన్. 1153

వ. అని మైత్రేయుండు ధాత్రీసురసత్తమునకు వ్రతోత్తమంబు హరివాసరోపవాసవి
ధివిదితంబుగా నిప్పుడు నీకుఁ జెప్పినతెఱంగునఁ జెప్పిన సనాతనరంగితాంతరంగుం
డై యమ్మునిపుంగవు వీడ్కొని దేవవ్రతుండు తద్వ్రతాచరణంబున సుదర్శనపాణిం
బ్రీతునిం జేసి పరమయోగీంద్రగమ్యంబును సహస్రకిరణసహస్రప్రభాగమ్యంబును
నగువిష్ణులోకంబున ననేకకల్పంబులు సుఖంబుండె నని సనత్కుమారుండు నారది
యయు నిట్లనియె. 1154

చ. మఱలఁ డనంగ నొక్కనృపకుంజరుఁ డొప్పు సుద్రుమంజరీ
శశధరకుందశంఖకవిశారదశారదచంద్రచంద్రికా
విశదయశోవిశాలుఁ డరవిందహితాన్వయదీపకుండు దో
ర్బలశితకృపాణనిర్దళితదుష్టశాత్రవవీరుఁ డుర్వరన్. 1155

ఉ. ఆతఁడు ద్వాదశీవ్రతపరాయణుఁడై కమలాక్షుఁ గౌస్తుభ
ద్యోతితవక్షు నిండుమదితో భజియించుచు నొక్కనాఁడు సం
జాతకుతూహలంబున నిజప్రియబాంధవుఁడైన భానుమ
త్ఖ్యాతిఁ గనుంగొనం జనియె సుందరహేమరథాధిరూఢుఁడై. 1156

క. సమవర్తియు నానృపవరుఁ । బ్రమదంబునఁ గౌఁగిలించి బహుమానముగా
రమణీయరత్నమయపీ । ఠమునం జేసేతఁ దిగిచి దగ్గర నునిచెన్. 1157

క. అతఁడే దత్సుఖమ్మున । యాతనలకుఁ దిగుచు విహ్వలాత్మకులై త
ద్దూతలచేత దృఢగదా । ఘాతంబుల నొరయు నారకప్రకరములన్. 1158

క. కనుఁగొని భయంబు మనమునఁ । బెనఁగొన సంగములు వడఁక బెగ్గిలి దీనా
ననుఁడై తపించి సింహా । సనవిమలితయు నొంది యరుగుజననాయకునిన్. 1159

చ. కనుఁగొని కాలుఁ డిట్లను జగన్నుతపుణ్యచరిత్ర నేఁడు నీ
మనమున నిట్టిభీతి పొడముం గత మెద్దియొ కాక విస్మృతిం
దనుపుట కేమి కారణము తప్పక చెప్పుము నాకు నావుడున్.
వినయవినమ్రుఁడై నపృథివీపతి యాతనితోడ నిట్లనున్. 1160

క. నానావిధబాధలచే । మేనులు తుత్తుమురు గాఁగ మిగిలినవగలన్
మానక వాపోయెడినీ । ప్రాణుల వీక్షించి భయము నందితి ననియెన్. 1161

క. ఆనరపతి కిట్లనురవి । సూనుఁడు భూనాథ వింత చోద్యంబులు నీ
చేతఁగిరి మిట్టిది గల । దే నియతిః కేన లంఘ్యతే యన వినమే. 1162

క. దురితాత్ములకును నిర్మల । చరితులకును విపులదుఃఖసౌఖ్యము లొందన్
బరమేష్ఠికల్పితము లగు । నరకస్వర్గములు నూతనములా తలఁపన్. 1163

క. మును చేసినదురితంబుల । కనురూపము లైనతీవ్రయాతనలఁ గడున్
వనరుచు మెఱలెదు వారలఁ । గనుఁగొని నీ కేల భీతిఁ గంపింప నృపా. 1164

ఉ. నావుడు నిట్లనున్ మనుజనాయకుఁ డాసమవర్తితోడ నా
నావిధతీవ్రబాధల ననారతముం బరితాప మంది వా

పోవుచు నున్నవారు తమపూర్వభవంబున నెట్టిపాపముల్
వారిరి( జేసినారొ బలవద్వివయవ్యసనాతిసక్తులై. 1165

సీ. అనవి యిట్లన్న నమ్మహీనాథుతో నవియె వైవస్వతుం డనఘ వినుము
గురుల దేవతల భూసురులను నిందించుదుష్టాత్ములును మహాదురితమతులు
నాచారహీనులు నతినిర్దయాత్ములు( గూరకర్ములు( గృతఘ్నులును ఖలులు
బరసతీకుచకుంభపరిరంభనిరతులు విష్ణుమంగళకథావిముఖమతులు
నైనపాపాత్మకులు వీర లట్లు గాన । వెమ్మువన్నారు నరకాగ్నివిపులశిఖల(
గరుణ భావించి నాకును గాచి పంప । రాదు విధికల్పితంబు నిరాకరించి. 1166

వ. అనిన కృతాంతునకు నమ్మహీకాంతు( డిట్లనియె. 1167

గీ. సకలజంతుసమితిసుకృతదుష్కృతములు । నీ వెఱుంగు దేని నేనొనర్చు
నట్టిపుణ్య మెద్దియేనను గల్గిన । నంతవట్టు నాకు నానతిమ్ము. 1168

చ. అనుడు( బరేతనాథు( డహిమాంశుకులోద్భవు( డైనయావిభుం
గనుంగొని నీచరిత్రము జగన్నుతిమంతము సర్వలోకపా
వనభవదీయకీర్తిసురవాహిని నీవు సమస్తపుణ్యవ
ర్తనులకు నెల్ల మేటివి కరస్థము లారయ( బుణ్యలోకముల్. 1169

చ. వ్రతములలో( బ్రశస్తము ధ్రువంబుగ మానవనాథ ద్వాదశీ
వ్రత మది నీవు నిష్ఠ నొకవత్సర మర్థి( జరించినాడ వూ
ర్జితత మగునమ్మహత్వమున( జేసి భవద్భవసంచితాఘసం
తతి లయ మొందె( దత్ఫలమితం బది యెంతని చెప్పవచ్చునే. 1170

చ. అనిన నృపాలు( డిట్లనియె నగ్రజ యీనరకాగ్నులందు వే
దన( బడువీర లిందఱు ముదంబున సద్గతి కేగునట్లుగా
నెనయ మదీయపుణ్యమును నిచ్చెద నేనొకకొంత నీవు చె
ప్పినగతి నంతవట్టు గనిపింపుము నావుడు ధర్ము( డిట్లనున్. 1171

ఉ. భానుకులావతంస యొకపారణ నీవుపవాస ముండ(గా
నైనఫలంబు వీరికి దయామతి నిచ్చిన( దీవ్రయాతనల్
మాని ప్రమోదసంభరితమానసులై మఱి నీవు గన్గొనం
గా నమరేంద్రలోకమున( గ్రందుగ నేగెద రిప్పు డందఱున్. 1172

వ. అనిన హర్షించి యారాజర్షివరేణ్యుం డగణ్యం బగునేకద్వాదశీవ్రతపుణ్యఫలం బాని
రయనివాసుల కొసంగినతత్క్షణంబ. 1178

శా. చంచత్కాంచనముల్ చెలంగ సురకాంతాహారత్నముల్ లీలమై
కుంచెల్ వేడుకఁ సిద్ధచారణవరుల్ గొల్వంగ దివ్యప్రభా
కాంచత్కాంచనకింకిణీగణవిమానారూఢులై తేజముల్
మించం బోయిరి వారలున్ త్రిదివకేళీలోలచేతస్కులై. 1174

వ. అప్పుడమ్మునికారుణ్యభావంబునకు భావం బలర నతని సంభావించి యావైవస్వతుం డిట్లనియె. 1175

ఉ. కంటె నరేశ దైవతశిఖామణియై నిజభక్తకోటిన
ట్టింటినిదానమై త్రిజగదీశ్వరుఁ డైనసరోజనాభు లో
నంటినభక్తి గొల్చినసమంచితపుణ్యఫలంబు పెంపు ని
ష్కంటకమోక్షమార్గ మని చాటుఁ గదా హరిసేవ వేదముల్. 1176

క. తొలఁగవు భవతాపములకుఁ । బలఁగవు పరదైవతముల భజియింపఁగ వా
చలఁగవు భోగవితతికి । మలఁగవు హరి నీవు వేయుమాటలు నేలా. 1177

గీ. అని హితోపదేశ మొనరించి సఖ్యంబు । వెలయ నాదరించి వీడుకొల్ప
మగిడి వచ్చి కోశలమండలాధీశుండు । నిజపురంబునందు నెమ్మి నుండె. 1178

సీ. అతిభక్తి హరిదినవ్రత మాచరించిన దురితముల్ దవ్వులఁ దూలిపోవు
సకలపుణ్యంబులు సమకూరు నాయువు పెంపొందు కలిమి సంపదలు మిగుల
విజయంబు సిద్ధించు విద్యలు చేకూరు నైశ్వర్య మంతంత కతిశయిల్లు
సంతాన మందుఁ దేజము మీఱు నారోగ్య మెసఁగుఁ గీర్తులు దిశలెల్ల నిండు
నమరులకు నైనదుర్లభ మగుచు వెలయు । నట్టివైష్ణవకులమునఁ బుట్టఁగలుగు
విమలవైరాగ్య మంతయు విస్తరిల్లు । నొవర నచ్యుతపదమున నుండుఁ దుదిని. 1179

వ. అని చెప్పిన సనత్కుమారుండు సగరుం డగుభరద్వాజుచేతఁ బూజితుండై యథేచ్ఛం జనియె జలధరధరాధీశుండును బ్రాచేతసప్రబోధితుండై తద్వ్రతం బాచరించిన సకలవిపద్విముక్తుండును బరిపూర్ణమనోరథుండును నై విగతోపద్రవంబును వితతభద్రంబును నగునిజచక్రం బవక్రవిక్రమంబున బరిపాలింపుచు బలపరాక్రమోదారులగుకుమారుల నూర్వురం బడసి తత్పుత్రపౌత్రసమేతంబుగాఁ బెద్దగాలంబు సంతానానందభరితుండై యుండి యొక్కనాఁడు. 1180

మ. అతులస్యందనగంధవారణతురంగానీకముల్ సత్పురో
హితసామంతసుతాప్తవర్గము ప్రియం బేపారఁ దస్గొల్చి రా

వితతైశ్వర్యసమేతమై నిగుడ నుర్వీనాథుఁ డేఁగెన్ విరా
జితరంగేశపదారవిందయుగళీసేవాసముల్లాసియై. 1181

క. ఈజాడ నరిగి త్రిభువన । పూజిత మగుబిల్వతీర్థమున వెలమి భర
ద్వాజాదిశిష్యయుతుఁడై । రాజిల్లెడుఘనతపోధికు వాల్మీకిన్. 1182

చ. కని వినయంబు సంభ్రమముఁ గౌతుకమున్ మది నెక్కొనంగ బ్రెమ
క్కొనఁ గడు గారవించి మునికేసరి యర్ఘ్యసుధారలేఖనిం
దనుఁ గదియంగ నుంచి యుచితం బగుపూజ లొనర్చి సేమమే
మనుజవరేణ్య నీకును గుమారులకున్ సుహృదాప్తకోటికిన్. 1183

వ. అని కుశలప్రశ్నంబు గావించె నప్పు డాపార్థివోత్తముండు. 1184

సీ. కమనీయతీర్థావగాహనస్నాతులై సంతసపడుమహాసంయములును
సదమలభూరుహచ్ఛాయల హరికథల్ రాణింపఁ జెప్పుపౌరాణికులును
సలలితసైకతస్థలముల హరిపూజ గావించుపరమభాగవతవరులు
స్ఫటికోపలములందుఁ బ్రణవమంత్రాభ్యాసరతచిత్తు లగుపరివ్రాజకులును
భయదదుర్భవఘనవనిదాఘప్రతప్త । జంతుచాతకజలధరసము లగుచు
నఖిలలోకైకపావనమై తనర్చు । బిల్వతీర్థంబుఁ జూచి సంప్రీతి నొందె. 1185

శా. స్నానం బం దొనరించి నిత్యవిధు లోజం దీర్చి యచ్చోటి స
న్మౌనిశ్రేణికి భక్తి మ్రొక్కి పిదపన్ వా రందఱుం దోడ రా
భూనాథుం డటఁ బోయి కాంచె మణివిస్ఫూర్జన్మహాగోపురా
గ్రీనానాధ్వజతుంగమున్ గుహరమాయాభంగమున్ రంగమున్. 1186

చ. కనుగొని డాసి యచ్చట నకల్మషబుద్ధులు నిత్యసిద్ధులున్
జననుతసౌమ్యమూర్తులును సన్మణిభూషణనవ్యమాల్యచం
దనఘనతాభిరాములును దామరసాక్షసమర్చనక్రియా
జనితసముత్సుకాత్ములును శాంతులునై విలసిల్లుపుణ్యులన్. 1187

గీ. రత్నభూషణాంబరమ్ములు ప్రత్యగ్ర । భూరివస్తుతతులఁ బూజసేసి
వందనం బొనర్చి వారిసంగతి రంగ । మందిరంబుఁ జొచ్చె మనుజవిభుఁడు. 1188

శా. సేవించెన్ జగదేకబంధుఁ గరుణాసింధున్ సమున్నిద్రరా
జీవాక్షున్ గమలాఘనస్తనయుగశ్రీఖండసంవాసిత

శ్రీవత్సాంకితవక్షు నీలమణిస్నిగ్ధాంగు రంగేశ్వరున్
భావాతీతు మహానుభావు ఫణిరాట్పర్యంకసంశోభితున్. 1189

గీ. పిదప నద్దేవుపరిచారబృందమునకుఁ । గోలఁది యుపరానిధనములు వెలయనొసఁగి
యతులవిజ్ఞానసంపన్ను లైనయట్టి । సంయమీంద్రులుఁ దాను నాచక్కి వెడలి.

మ. ధరణీనాథుఁడు గాంచెఁ దత్ప్రకటకోద్యత్పక్షు శుంభద్దివా
కరబింబస్ఫురితాస్యుఁ దీవ్రనఖసంఘాతున్ బృహద్వక్షు భా
సురు నాత్మప్రమదప్రభూతవిహగస్తోమావృతున్ నిమ్నగాం
తరవంచత్పులినాసనస్థుని శకుంతశ్రేష్ఠు దా నొక్కరున్. 1191

క. కమలాక్ష రంగనాయక । కమలావల్లభ సమస్తకారణ పురుషో
త్తమ యనుచు మాటిమాటికిఁ । బ్రమదాశ్రువు లుప్పతిల్లఁ బలికెడువానిన్. 1192

క. కని విస్మయంబు మనమున । దనుకం గను లెప్ప లిడక తనఁ జూచు నృపా
లునితోడఁ బక్షిపుంగవుఁ । డనియెన్ ఘనమై గభీరమగువాక్యములన్. 1193

గీ. ఎవ్వఁడవు నీవు నీకులం బెద్ది నీకు । జనకుఁ డెవ్వఁడు బహుసైన్యసమితితోడ
నిటకు వచ్చినకారణం బేది చెప్పు । మనిన నాఖగముఖ్యున కనియె నృపతి. 1194

ఉత్సాహ. అనఘ సోమవంశతిలకుఁ డైనతీర్థధనుని నం
దనుఁడ జయధరుండ ననఁగఁ దనరువాఁడ లోకపా
వనవిచిత్రమహిమ గలుగువాఁడ నెసఁగుపుష్కరం
బనఁ దీర్థమాడ వచ్చి భోగిరాజతల్పునిన్. 1195

క. శ్రీరంగభర్తఁ గరుణాం । భోరాశి భజించి మఱి సేవుమ నిచటన్
బ్రారబ్ధకర్మఫలమున । భూరిజ్ఞాననిధి నిన్నుఁ బొడగనఁ గంటిన్. 1196

ఉ. వారనిదప్పిఁ దట్టుపడువానికిఁ జల్లనినీరు నాఁకటం
గూలి కృశించుదీనునకుఁ గోరినయన్నముఁ జాలలేమిచే
నారట మందుపేదకుఁ మహానిధియున్ సమకూరినట్లు వి
ద్యాగతి నన్ను వాకొదవెఁ దావకసంగతి పక్షిపుంగవా. 1197

క. వితతభవానలకీలా । ప్రతతి ననారతముఁ జాలఁ బరితప్తుఁడ నే
కృతిమాలి యున్న నాకే । గతి నిత్యసుఖావహంబు గలుగు మహాత్మా. 1198

వ. అనినఁ దద్వచనంబులకు సంతసించి శకుంతవల్లభుం డిట్లనియె. 1199

గీ. మున్ను మునులు శౌనకముఖ్యులు నిగమాబ్ధి । తలఁపుఁ గవ్వములను దఱచిఁ దఱచి
తనరఁ దెచ్చినట్టితత్త్వామృతంబు నీ । కే నుపన్యసింతు మానవేంద్ర. 1200

చ. అవిరళకర్మపాశనిచయంబులచేఁ బ్రతిబద్ధుఁడై భవా
ర్ణవమున మున్గుచున్ భయము నందెడుకష్టపుదేహికిన్ నృప
ప్రవరముకుందపాదయుగపంకజసంస్మరణంబు దక్క నె
య్యవియును సముద్ధరింప నసమర్థము లన్ని దురుక్తు లేటికిన్. 1201

క. కనుమూసి తెఱచినంతన । మునుకొని కాలంబు భూతముల ప్రాణంబుల్
గొనుఁ గాన మోక్షయత్నం । బనఘా తడయక యొనర్ప నగుఁ బ్రాజ్ఞులకున్. 1202

క. క్రీడారతుఁడై పిన్నట । నాఁడెఱుఁగఁడు యౌవనంబునం గాముఁడై
యాడుకొను ముదిమి నామయ । పీడలఁ బడి చిక్కి మొఱలువెట్టుచు నుండున్.

వ. కావున. 1204

క. తాఁకువడి యింద్రియంబులు । పోఁడిమి చెడిపోని నాఁడు పుణ్యము సేయన్
లేఁడేని వాని కొదవునె । మూఁడేండ్లను లేనిబుద్ధి ముప్పదియేండ్లన్. 1205

క. ఒక్కఁడ నఖిలజగంబుల । నొక్కఁడను విరక్తి సునిచి యొగిఁ దులదూఁగన్
మిక్కిలి శక్తివిరక్తుఁడ । తక్కకములు నూపె నద్భుతంబుగ నధిపా. 1206

క. కలితసరసాన్నలలనా । కలనాదని నాదమధుర గానంబులపై
పలుదెసలఁ బాఱుమనసుకుఁ । గలుగునె వైరాగ్య మెంతకాలముకైనన్ 1207

క. పుట్టును జావును నెస నివి । కట్టిఁడివైరాగ్యమునకుఁ గనుమఱువై యి
ట్టట్టు చలింపనియఘముల । పట్టువఁగఁ బాలుఁ దీర్థభజనంబు నృపా 1208

మ. నరనాథోత్తమ పుణ్యతీర్థములలోనం బెద్ద యాచంద్రపు
ష్కరిణీతీర్థము దివ్యదేశముల శస్తం బైన శ్రీరంగ మా
హరికిన్ నిత్యనివాసమై యునికి నట్లౌటన్ బ్రియం బార నీ
సరిదభ్యర్ణమునన్ వసించితి మనస్తాపాపనోదార్థినై 1209

క. సకలకలికాలకల్మష । నికరనిరాకరణమహిమ నెగడి మునీంద్ర
ప్రకటిత మగునితిహాసం । బొకటి గలదు చిత్తగింపు ముర్వీనాథా. 1210

సీ. మును ప్రభాకరుఁ డనుముని గర్గగోత్రసంజాతుండు గలఁడు ప్రశాంతచిత్తుఁ
డవిరతబ్రహ్మచర్యాన్వితుఁడును సమప్రతిభావిశేషసంపన్నుఁ డతఁడు
పలుతపశ్శక్తిమై పరమాయు వేపారఁ బడసి విశ్వంభరాభార మెల్లఁ
గలయఁ జరించుచుఁ గలకాలమెల్లను వినుతవేదాభ్యాస మొనరఁ జేసి
ప్రాతమొప్ప దానిఁ బఠియింప శక్తుండు । నాకవిపులపాకకలితుఁ డగుచు
చిన్నఁబోయి యాత్మఁ జింతించి తపమున । నిజము నూరథంబు నెఱపఁ బూని 1211

క. నాలుగుదెసల నుదగ్ర । జ్వాలాభీలంబు లైనవహ్నులనడుమన్
గాలియు తన కశనము గాఁ । గ్రోలుచు బదియేండ్లు నడచెఁ గొంచక మతియున్. 1212

క. కొంచెపుటూర్పును బుచ్చక । పంచాబ్దంబులు చరించి పాదాంగుష్ఠం
బించుక ధరపై నూఁది య । చంచలుఁడై తపము మూఁడుసమములు సలిపెన్. 1213

ఉ. ఆమెడ వేదముల్ కడుభయంబునఁ బొందుచుఁ బెక్కువిఘ్నముల్
సాయక చేసినం బరలఁ బారక వానిఁ దృణీకరించి య
న్యాయతయోగశక్తి న్వ్యవసాయంబుఁ దిరంబుగఁ జేసిన చిత్రరూ
పో యనఁగా శిలాప్రతిమయో యన నుండె నతండు ధీరతన్. 1214

ఉ. వానిమహాతపోజనితవహ్ని భయంకరలీలఁ బేర్చె ది
గ్భానధమున్ సముజ్జ్వలితభూరితరార్చులఁ గాల్పఁ జొచ్చినన్
మానసముల్ గలంగి శతమన్యుని ముందిడికొంచుఁ బద్మజుం
గానఁగ నేఁగి నిర్జరనికాయము లోలిఁ గృతప్రణాములై 1215

త. అవధరింపుము లోకనాథ ప్రభాకరుండను భూసుర
ప్రవరుఁ డిప్పు డొకండు తీవ్రతపం బొనర్చుచునున్న వా
డవిరళం బగుతత్తపఃప్రభవాగ్నికీలల వేఁడిమిన్
భువనముల్ పరితాపవేదనఁ బొంది యున్నవి గావునన్. 1216

క. ఏపగిదినైన నింక నీ । యాపద మాన్పుము మనుచుఁ బ్రార్థించినవా
ణీపతి వారలను దానును । నాపరమతపస్వికడకు నరుదెంచి తగన్. 1217

క. భూదేవకులోత్తమ నీ । మేదురతపమునకుఁ జాల మెచ్చితి నిదె నీ
కేది ప్రియ మడుగు మనుటయు । నాదివిజశ్రేష్ఠుతోడ నతఁ డిట్లనియెన్. 1218

క. ఎడపక వేదము లన్నియుఁ । గడముట్టం జదువుకాంక్షఁ గమలాసనయీ
బెడిద మగుతపము సేయం । గడఁగితి నటువంటివరము గరుణింపు తగన్. 1219

వ. అనినఁ బరమేష్ఠి భూసురశ్రేష్ఠున కిట్లనియె. 1220

చ. అతులతపంబు భూతనివహంబున కుద్భటఘోరపాతక
ప్రతతి నడంపఁగాఁ దగు నుపాయ మభీష్టఫలప్రదాయకం
బతిశయసౌఖ్యమూల మటు లౌటఁ జిరాయువు భూరికీర్తియున్
వితతతపోబలంబునను విశ్వపితామహ నాకుఁ గల్గెడిన్. 1221

చ. అనిన విరించి యిట్లను మహాద్భుత మైనభవత్తపంబు పెం
పున కులభంబులైనవి సమున్నతశాశ్వత పుణ్యలోకముల్

జననుత నీవు నం దమితసౌఖ్యము లొందుచు నుండు గాక యీ
యనువున నందరానిఫల మందఁగఁ జేతులు చాఁచ నేటికిన్. 1222

వ. అనిన నతం డిట్లనియె. 1223

క. మది కింపు గానిమాటలు । పదివేలును జెప్ప నేల భాషాధిప యిం
పొదవెడి వాదివిజాధిప । పదమైనను నొల్ల వేదపాఠముదక్కన్. 1224

వ. అనిన నామాటలు సమ్మతింపక భారతీకాంతుం డంతర్హితుం డయ్యె నాప్రభాకరుం
డును దృఢనిశ్చయుండై వెండియు నతిఘోరతపంబు గావింప నిలింపప్రబోధితుండై
చతుర్ముఖుండు మఱియు రెండుసరుసల నాతపోధనసత్తముపాలికిం జనుదెంచి యాతని
పూనిక వదలింప లేక నిజలోకంబున కరిగె నంత. 1225

శా. పాదం బొక్కటి నేల నూఁది శుచియై పంచాగ్నిమధ్యస్థితుం
డై దృష్టుల్ దివిఁ జేర్చి యమ్మునివరుం డస్వీకృతాహారుఁడై
వేదాత్మున్ శ్రీధవిష్ణుశంకరమయున్ విశ్వైకసంపూజ్యు న
య్యాదిత్యున్ మది నిల్పి చేసెఁ దప మత్యంతస్థిరస్వాంతుఁడై 1226

చ. అరుదుగఁ దత్తపంబుమహిమాతిశయంబున కిచ్చ మెచ్చి బం
ధురమణిభూషణప్రతతితోఁ బరితప్తసువర్ణవర్ణవి
స్ఫురణ దలిర్ప మేనిజిగిపాతొనగూడి ప్రవాళపాటలాం
బరకుసుమానులేపనవిభాసురుఁడై యతఁ డున్నచోటికిన్. 1227

సీ. తొవలవాకట్టు చందురుతోడిపెన్నిద్దు తమ్ములవిందు వేదముల ప్రోవు
వెన్నెలపులుగులవెలిగొంగ జక్కవకవలమోహాపుమందు కైటభారి
కుడికన్ను పచ్చనిగుఱ్ఱాలదొరయందు మూఁడుమూర్తుల గట్టి వేఁడివేల్పు
కైవల్యమునకుఁ ద్రోవ గ్రహములమొగదంబు మునిమిడిచీకటి మాఁకవిప్ప
జనులమ్రొక్కులపంట తేజములపెలవు । వఱుసఁబన్నెండుదామముల్ పఱఁగుమేటి
గగనరత్నంబు త్రిభువనకర్మసాక్షి । భానుఁ డేతెంచె దేదీప్యమానుఁ డగుచు 1228

గీ. అత్తెఱంగున నరుదెంచినట్టిలోక । బాంధవునిఁ జూచి నిజమనఃపద్మ మలర
ధరణిఁ జాఁగిలి మ్రొక్కి హస్తములు మొగిచి । యాప్రభాకరుఁ డిట్లని యభినుతించె.

లయ. జయ జయ సకలదివిజచయముకుటఘటితమణిచయరుచిరపదయుగళయకలపద్మ
ద్వయనిబిడతరతిమిరలయకరణచణహరితహయవినుతసుజనభవభయశమననామా
మయవిపినదహనఫణిశయనవరచరణకృతనియమమునినుతనిగమమయసరసిజాలి
ప్రియదురితహరనిరతిశయమహిమవితతరథరయవిహగవిభవకువలయవసతిసేనా.

క. శ్రీకరములు సుమహితశో । భాకరములు భవవిషోపహరజంతుసుధా
శీకరము లబ్జబాంధవ । నీకరములు దనుజకుముదినీభీకరముల్. 1231

క. అని వినుతించి ప్రభాకరుఁ । గనుఁగొని రవి నీతపంబు గడు మెచ్చితి నీ
మనమున కొద్ది యభీష్టం । బనఘా వినిపింపు మనిన నతఁ డిట్లనియెన్. 1232

ఉ. పారము నందఁగా నిగమపాఠ మొనర్పఁగఁ బూని యాగతిన్
ఘోరతపంబు సేసి కనుఁగొంటిని వేదము లాత్మ భక్తమం
దారుఁ ద్రిమూర్తిశక్తియుతు దారుణదుర్భగవైరి నిన్ను నా
కోరిక బాగుసేయు కొదఁగూడఁగఁ జేయుము సత్కృపామతిన్. 1233

వ. అనిన ప్రభాకరునకు విభాకరుం డిట్లనియె. 1234

క. పురుషునిపురుషార్థంబుల । నరికట్టు ననేకదుర్భవార్జితదురితో
త్కరముల వినాశ మొందఁగఁ । బరిపూర్ణముగా నభీష్టఫలసంసిద్ధుల్. 1235

క. కావునఁ బాపక్షయ మగు । నా వెర వెఱిఁగింతు నీకు నబ్జోదరని
త్యావాసమై త్రిలోకీ । పావన మగురంగధామపరిసరభూమిన్. 1236

వ. సకలతీర్థోత్తమం బగుపుష్కరిణీతీర్థంబు గల దచటికిఁ జని తపంబు గావింపు మాతపంబున నశేషదోషఘ్నంబు లగుఁ గావునం దత్సంకల్పంబు ఫలియించు నింక నొక్క విశేషంబు వినుము. 1237

సీ. కలఁడు సునేత్రవిఖ్యాతుఁ డచ్చట నొక్క పక్షీంద్రుఁ డతఁడు దపంబు పేర్మి
నజునిచే వేదంబు లన్నియుఁ దుదముట్ట నెఱుఁగునట్లుగ వరం బెలమి వడసి
యఖిలవిద్యాజ్ఞానియై నిర్మలజ్ఞానపరుఁ డయి భోగైకనిరతుఁ డగుచు
నాత్మసమానసాచారసంపన్ను లగు విహంగములు తన్నర్థిఁ గొల్వ
రంగనాథుదివ్యమంగళవిగ్రహ । ధ్యానసౌఖ్యలీలఁ బూని పెద్ద
గాలమెసఁగి పాల్చు కావేరితటమున । నొక్కదినముఁ బాయకున్న వాఁడు. 1238

క. నీ వచ్చటికిఁ దడయక చని । యావిద్వత్ప్రియచిత్తు మలరఁగ భక్తిన్
సేవించి యడుగు మెఱుఁగుము । గావలసినవెల్ల నతఁడు క్రమమునఁ దెలుపున్. 1239

గీ. అనిన వాతాపసోత్తముఁ డబ్జమిత్ర । యతులితజ్ఞాననిధి యైనయమ్మహాత్ముఁ
డేమికతమునఁ దా నొందె నీఖగత్వ । మానతి మ్మన్న నతని కిట్లనియె నినుఁడు. 1240

క. ఖగవిహగప్రముఖాకృతు । లొగిఁ బూని మహాత్ము లుందు రొక్కొకయెడలన్
జగమున నమితమహిమలఁ బ్రు । నిగిడినసంప్రీతి నదియె నెపము దలంపన్. 1241

మ. క్షితిపై జిక్కిరకాఖ్యకద్విజుఁడు లక్ష్మీనాయకున్ మున్ను సం
న్మతి నత్యుగ్రతపంబు సెంపునఁ బ్రసన్నస్వాంతుఁ గావింప నా
శ్రితరక్షామణి యైనయవ్విభుఁ డతిప్రీతిం దదీయాంతికా
గతుఁడై వేఁడు వరంబు నీ వనిన సద్గాఢప్రమోదాత్ముఁడై. 1242

క. ధర జాఁగి మ్రొక్కి భక్తిన్ । గరములు ముకుళించి నుదుటఁ గదియించి శ్రుతి
స్ఫురితము లగుసూక్తంబులఁ । బరువడి వినుతించి విన్నపం బొనరించెన్. 1243

క. వారిజదళలోచన నేఁ । బారము నొందంగ వేదపఠనము సేయం
గోరెద నవ్వర మొసఁగుము । కారుణ్యము నివ్వటిల్లఁగా నిపు డనినన్. 1244

ఉ. శ్రీరమణీవిభుం డతనిచిత్తవిశుద్ధికి నెమ్మనంబునం
బ్రీతి దలిర్ప భూసురవరేణ్య శ్రుతుల్ గలయంతవట్టుఁ బ్ర
ఖ్యాతము గాఁగ నీ వెఱుఁగునట్టుగ నిచ్చితి నస్మదంఘ్రిసం
జాతనిబద్ధభక్తిని నజస్రము నీమదిఁ బాయకుండెడిన్. 1245

మ. క్షితిదేవోత్తమ సేయు మింకొకటి భక్తిన్ సర్వవిద్యాధిదే
వత నంభోరుహగర్భదేవిఁ ద్రిజగద్వంద్యన్ శరచ్చంద్రికాం
చితవర్ణోజ్జ్వల సద్ధిభారతిఁ దగన్ సేవింప నీ కాసర
స్వతి యిచ్చున్ నిగమాదివిద్యలు సమస్తంబున్ బ్రసన్నాత్మయై. 1246

వ. అని యానతిచ్చి యచ్యుతుం డంతర్హితుం డయ్యె నయ్యగ్రజన్ముండును సమగ్రం
బగుపూజావిశేషంబుల దేవి నారాధించి యిట్లని ప్రస్తుతించె. 1247

గద్యము. శ్రీమదఖిలభువనచరాచరప్రముదరచనామనోహరచతురాననమానసమానసాం
తర్నిరంతరకేళీవిలోలమరాళబాలికా మనల్పకల్పప్రసూనాకల్పితమాలికామ
రాళవిహారరమణీరమణీయమణికంకణఘణఘణారావముఖరకరతామరసచా
మరసముంచితా చంచలాచంచలచంచరీకనీలాలకాంతకాంతాంసేవాయత్తదిక్పా
లకాంతా మష్టమీశశాంకాహంకారధిక్కారపటునిటలతలతిలకాయమానశ్రీ
యనేత్రాం కరకలితలలితాక్షసూత్రా మసమశరశరాశనవిలాసాపహాసభాసు
రానతభ్రూలతాం బ్రథిమాయుతాంతసీమా మగణ్యలావణ్యసరోవరవిహారహారిశఫ
రాయమానకర్ణాంతవిశ్రాంతలోచనాం కృతకృపణకృపారససేచనాం మదీ
య్య వికసితాగ్రలంబమానహిమబిందుసుందరతిలకుసుమసముల్లాసమౌక్తికనా
సికోద్భాసితాం యోగిజనశాంతస్వాంతసంవాసితా మిందుకాంతదర్పణవిదగ్ధ

స్నిగ్ధకపోలపాలికాభ్యర్ణ వికీర్ణవాలుకాసక్తముక్తాఫలకాంతాగళితమందస్మిత సాంద్రచంద్రికాసదనవదనచంద్రమండలా మమలప్రకర్ణ్యాగకుండలా మధరీకృతానేకమణిభంగమాంగళికసుషమావిశేషాధరబింబా మఖిలజగదంబా మతివిమలకంబుప్రతిబింబశోభాబంధురబంధురకంధరాం వివిధవిలాసమంథరా మారూఢబాలప్రవాళలలితపారిజాతలతాగర్వనిర్వాపణక్రియాచతురచతుర్బాహాం భజమానదానవారిసమూహా మభ్రముకరికుంభకుంభతుల్యాటపాటవాభిషంగప్రసంగసముత్తుంగశృంగారరసతరంగిణీరథాంగమిథునాయిత పృథుస్తనవిన్యస్తకాంచనవిపంచికాపంచమ స్వరసుధారసాస్వాదనాదరమేదురామోదజనితరోమాంచకంచుకితకోమలాంగీం నిగమవనసంచారసారంగీమమర్త్యసరిదావర్తనివృత్తప్రవర్తగంభీరనాభిసంకాశతమాలలతాయితశ్యామసాధ్యమధ్యభాగాం మహాభాగా మఘృష్యషితనిశితపనోరుహభోగపరాగానురాగానూదితమదవదళిమదవతీవినీలనీలమణిఘృణిసారసరసవానితంబబింబాం హృద్యాధరవిద్యాధరమానినీజేగీయమానగుణకదంబా మంబుదాశసానసమయసముదితసంపూర్ణపూర్ణిమాచంద్రచంద్రికాపటలామకూలదుకూలాంతరతిరస్కృతిభారంభ రంభాస్తంభశోభావిజృంభణస్తంభనోద్దీర్ణవర్ణనీయోరుయుగళాం విమోచితసంసారనిగళా మృజారచితకాహళోదారచారుతాసముల్లంఘనజంఘాలజంఘావిలాసా మఖిలసుమనోమనోనివాసా ముదయదహిమకరకరనికరదరదరుణతరతరుణసరసీరుహ విలసనపరిహాసనపరికరణపరిణతజతురసకలితమృదుపదయుగళయుగపదవనతచతురఖచరయువతివిసరలసదలికతలతిలకమృగమదజలకణజనితకళంకకళంకాకర నఖశశంకాభిరామా మసమానభాగ్యసీమా మవిరళతరళతారకాతిరస్కృత్తముక్తాఫలహారకేయూరవలయభద్రముద్రికామంజుమంజీరప్రముఖనవ్యాభరణకిరణస్ఫురణపరిణాహదేదీప్యమానదివ్యదేహాం కమలభవవదనగేహా మీహానురూపవరప్రదానకరుణారసతరంగితాపాంగవిలోకాం పరిపాలితసకలలోకా మిందుకుందచందనమందారకబృందారకవాహినీనీహారహారహారహీరాదిసమస్తగౌరవస్తువైకల్యకరకల్యాణకల్యాఘునాపఘునసీకాం త్రివిశపవిశదీకృతదశదిశావకాశాం విముక్తభక్తమోహపాశా మారూఢవేదాంగాద్యశేషవిద్యావిశేషపరిషదున్మీలితవిశ్వదృశ్యప్రపంచవైభవాం దూరీకృతభవా మభిధానభేదాపాదితానేకదేవతాశక్తిభావానుభావైకభాస్వరూపాం కలకంఠకలాపా మభినవశరదనేహారంభవిస్రంభవిజృంభమాణశోభిణీ

రమణకిరణనిరుద్ధసమృద్ధదుగ్ధార్ణవసవోద్భూతబహులలహరీఘుమఘుమధ్వాన
సంరంభసాహిత్యసుకవిశుకనికరఫలభరితమధురమాకందశాఖాం శేఖరీకృతశీ
తాంశురేఖా మమితసౌభాగ్యసారదాం శారదాం మన్వహే మన్వహే 1248

వ. అని సన్నుతించి. 1249

గీ. మౌక్తికాక్షసూత్రమాణిక్యవల్లకీ । కలితపాణిఁ బద్మగర్భరాణి
వాక్యరాజకీరవరనీలవేణికా । కలిత యైనవాణి గారవించి. 1250

క. తడయక ప్రత్యక్షంబై । యడుగుమ మన్నినవాతఁ డామ్నాయంబుల్
గడముట్ట నెఱుఁగువైఖరి । గడనొత్తఁగ నొసఁగు మనినఁ గరుణ దలిర్పన్. 1251

వ. ఆవాగ్దేవి భూదేవున కిట్లనియె. 1252

క. నాముందట విహరించెడి । నీమహితపతగచతుష్క మిప్పు డుమిసినయా
యామిషము నములు మిఁక నీ । యామిషమున నొందవు నీవు నభిమతసిద్ధుల్. 1253

చ. అనుటయు నట్లకా కని రయంబునఁ దాను బక్షిరూప మిం
పెనయ ధరించి తత్పలల మించుక యేనియుఁ జిక్కనీక చ
క్కన భుజియించియున్న నధికం బగుశాఖలగల్గువేదముల్
తనమదిఁ బ్రస్ఫురింప వసుధామరముఖ్యుఁడు నాటినుండియు 1254

క. ఆవిహగవిమలరూపము । తా వదలకయున్న వాఁడు తత్సన్నిధికిన్
నీవరుగు మనిన నాభూ । దేవుఁడు వెండియును దిగ్మదీధితితోడన్. 1255

క ఆవిహగము లెవ్వియు శుచి । భావుం డగువిప్రుఁ డెట్లు పతగోచ్ఛిష్టం
బేవలనను శంకింపక । తా వేడ్క భుజించె ననుచుఁ దపనుఁడు పలికెన్. 1256

చ. వెలసినతద్విహంగములు వేదము లాపలలంబు సర్వవి
ద్యలు నొకలైన ముగ్ధపతగావలి కామిషవాంఛ యెంతయున్
గలుగుటఁ జేసి యమ్మునిశిఖామణియున్ వలనొప్పఁ బక్షిరూ
పలర ధరించె నంచుఁ దెలియన్ వినిపించి దినేశుఁ డేఁగినన్. 1257

వ. అప్రభాకరుండును బ్రభాకరోపదిష్టక్రమంబున సునేత్రుండును బతత్రివరుం డున్న యచ్చటికిం జని యభివందనంబుచేసి నిజవృత్తాంతం బంతయు నెఱింగించిన నాదరించి యిట్లనియె. 1258

శా. ఆరాధింపుము నీవు సన్మతిఁ ద్రిలోకాధారు నారాయణున్
గారుణ్యాంబుధి నిందిరాకుచతటీకస్తూరికాసౌరభ

శ్రీగేహోరుభుజాంతరాళు నిగమశ్రేణీసదాసన్నుతున్
శ్రీరంగేశుని బీతవస్త్రు విలసజ్జీమూతసంకాశునిన్. 1259

క. ఆవలి వాత్సుఁడు వరదుం । డై నిలిచినఁ బడయరానియవియును గలవే
వానియఱచేతిలోనివి । వో నలినజరుద్రపదసుఖోన్నతులెల్లన్. 1260

చ. అని యుతిఁగించి నంబ్రమదమారఁ బ్రభాకరుఁ డేకచిత్తుఁడై
యనుపమలీల నంబుజదళాక్షు గుఱించి త్రిలోకసేవ్యమై
యొనరిన చంద్రపుష్కరిణియొద్ద సురల్ వెఱఁ గందఁ గన్గొనన్
ఘనతప మాచరించిన మనంబున శ్రీహరి మెచ్చి చెచ్చెరన్. 1261

సీ. కలువపువ్వుచాయఁ గమకించు మెయిమించు పసిఁడినిగ్గుల నొరపట్టుపట్టు
విరిదమ్మిరేకులసిరి మీఱుకనుఁదోయి భవపరితాపంబుఁ బాపుచూపు
నిలువఁ దీర్చినఫాలఫలకంబుతిలకంబు చిఱునవ్వువెన్నెలచిలుకు తళుకు
కల్పమంజరులచేఁ గడునొప్పు నునుగొప్పు సొంపారు నురమునై కెంపుసొంపు
బాలమార్తాండబింబంబు ప్రభఁ దడంబు । నంబరంబున నెఱపుచక్రంబునొఱపు
గలిగి జగదేకకల్యాణలలితమూర్తి । వెలయు నమ్మునియెదుర నావిర్భవించె. 1262

చ. అతఁడు నభూతపూర్వ మగునప్పరమేశుని దివ్యవిగ్రహం
బతులితభక్తిఁ జూచి వినయంబున హర్షము సంభ్రమంబు న
ద్భుతమును నంతరంగమునఁ దొట్రుకొనన్ మహిఁ జాఁగి మ్రొక్కి యూ
ర్జితబహువేదసూక్తములచే వినుతించె ననేకభంగులన్. 1263

క. అప్పుడు మదిఁ గృప చిప్పిల । నప్పరమేశ్వరుఁడు ప్రీతుఁడై భవదిష్టం
బిప్పుడు ఫలింపఁ జేసెద । చెప్పుము నీ వనిన నతఁడు చిత్తం బలరన్. 1264

గీ. కదియ మోడ్చినచేతులు మకుటిఁ జేర్చి । పంకజోదర నావిన్నపంబు వినుము
యెల్లవేదంబులను బారమెల్లఁ జదువఁ । నోపువిజ్ఞానశక్తి నా కొసఁగవలయు. 1265

చ. అనుటయు నవ్వరం బొసఁగి యాతని కిట్లను బుండరీకలో
చనుఁడు గణింప నెవ్వరికి శక్యముగాని శ్రుతుల్ పఠింప నే
యనువునఁ దీఱఁ గొంత మగు నాయువు నుం గలయట్టిదేహికిన్
వినుము మటు గాక పాపములు వీడినఁ గాని ఫలింప దేమియున్. 1266

క. కావున బహుజన్మార్జి । తై వెనుకం దగులుదారుణాఘప్రతతిం
బోవ నడిచి చెప్పం బయి । పై విశ్రుతి కెక్కు నమ్మహాతీర్థమునన్. 1267

క. అతఁ డెఱిఁగించె నఖిల । శ్రుతితతియు మదీయ శక్తిచేఁ దెలుఁపై నీ
కతియుగమున నని లక్ష్మీ । పతియగుఁడుఁ నరిగె నంత సంచితలీలన్. 1268

వ. పరమపవిత్రుం డగు సునేత్రుం డిట్లు పలికి కుంజరవరద వర ప్రకారంబుఁ జెప్పి యప్పవిత్ర
వరు ననుమతంబున సమంత్రకంబు గాఁ దత్తీర్థస్నానంబు సేసి చరితార్థత్వం బొంది
గురుభజనావరూపంబు గాఁ దాను విహగరూపంబుఁ బూనిన నాసమ్మదంబునఁ బవి
త్రివరుండు తద్విప్రముఖ్యునకు నఖిలవేదంబు లుపన్యసించె నతండును బుండరీకాక్షు
ప్రసాదసాధితప్రభావంబున సకృదుచ్చారణమాత్రంబున సకలనిగమపారగుం డైయచ్చట
జిరకాలంబు వసించి విష్ణుపదప్రాప్తుం డయ్యె సునేత్రుండు నిర్గళం బగునపవర్గంబు
నొందె నాప్రభాకరమునీంద్రునకు శిష్యులు నలువురు గలిగి రందు సుదర్శనాఖ్యుండ
నగు నేనును సువర్ణబిందుండును సుతామ్రమాడుండును బృహన్మయుండును గ్రమంబున
ఋగ్యజుస్సామాథర్వణంబులు తత్తచ్ఛాఖాసమేతంబుగా స్వగాకారధరుల మై యభ్య
సించితిమి నీడోద్భవంబులు నాతోడం జదువు మునికుమారు లని చెప్పి జయధరునకు
నయ్యండజశ్రేష్ఠుండు వెండియు నిట్లనియె, 1269

క. పరమం బగు తప మనినం । బరమపద బనిన దానిఁ బరికించుము నీ
పరదేశము నాదేశము మఱియితరము తెలుఁగ । నేను మనుజాధీశా. 1270

క. ఈతరువులు నీలతలును । నీతృణగుల్మాదివనమహీస్థలి పుణ్యో
పేతాత్మ లగుమహర్షి । వ్రాతముగా నెఱుఁగు మాత్మ వసుధాధీశా. 1271

మ. ధరణీనాయక నీకులం బతిపవిత్రం బయ్యె నీ విష్ణులం
బరిపాలించుమహీతలంబు నతిధన్యం బయ్యె నీపుత్రులున్
బరలోకోన్నతసౌఖ్య మొందిరి దివాపాలిన్ భవత్కీర్తులం
జరగెన్ బుష్కరిణీనిమజ్జనము నిష్ఠన్ నీవు గావించుటన్. 1272

ఉ. నావుడు సంతసించి జననాథుఁడు తన్నుఁ గృతార్థుఁగా మదిన్
భావన సేయుచున్ విహగనాథునకున్ ధరఁ జాఁగి మ్రొక్కి సం
భావన చేసి యాతఁ డనుపన్ బహుమంగళతూర్యమంజులా
రావము లుల్లసిల్లఁగఁ బురంబున కేఁగెఁ జమూసమేతుఁడై. 1273

క. అతనికిఁ గలిగిరి నూర్వురు । సుతు లందఱు రూపవిధవసుస్వరమతు ల
చ్యుతసుప్రతనిష్ఠాపర । రతులును నగువారు సుజనరంజితచరితుల్. 1274

క. వారు తనపంపు సేయఁగ । నారాజవరుం డొనర్చె నమితాధ్వరముల్
నేరుపున ముజను లానన । వారక దక్షిణలతోడ వైభవ మెసఁగన్. 1275

క. ఈలీల నతఁడు ధరణీ । పాలన మొనరించి రాజ్యపదమునఁ దనయుం
జాలించి యితరసుఖములఁ । దెలియఁ దప మాచరించి త్రిదివము కేఁగెన్. 1276
వ. అని చెప్పి మార్కండేయుం డన్నరేంద్రున కిట్లనియె. 1277
చ. జనవర నీవు సోమకులసంజనితుం డనివార్యశౌర్యస
ద్వినయవివేకబాహుబలవిక్రమశాలివి భూప్రజానురం
జనచతురుండ వట్లగుటఁ జాల కృతార్థుఁడ వయ్యె భక్తి నె
క్కొనఁ జని చంద్రపుష్కరిణిఁ గ్రుంకిడి యచ్చటివిప్రకోటికిన్. 1278
చ. ధనకనకాదివస్తువులు దాన మొనర్పుము దానఁ జేసి చ
య్యనఁ బెడఁబాయు నీయఘము లన్నియు నంత ననంతకీర్తియున్
ఘనతరరాజ్యవైభవసుఖంబుఁ బవిత్రచరిత్రులైన సం
దనులు ననామయత్వము ఘనం బగు నాయువు నీకుఁ గల్గెడిన్. 1279
వ. అని యుపదేశించి యారాజుచేతఁ బూజితుండై నిజాశ్రమంబునకుం జనియె సోమ
కుండును బ్రహృష్టమానసుండై తదుపదిష్ట ప్రకారంబున కళత్రమిత్రాప్తబంధుసమే
తంబుగాఁ బుష్కరిణీతీర్థంబున కరిగి కృతస్నానుండై యచ్చట హిరణ్యాదినానా
విధదానంబుల విప్రులనతితృప్తులఁ గావించి నిత్యమంగళాభిరామం బగుశ్రీరంగధామం
బునకుఁ బోయి తదభ్యంతరంబున. 1280
సీ. పుండరీకాక్షుఁ బ్రస్ఫురితకౌస్తుభవక్షు నాజానుబాహు నీలాభ్రదేహు
మకరకుండలకర్ణు మహితకృపాపూర్ణు నవపీతకౌశేయు నతవిధేయు
లక్ష్మీసముల్లాసు లలితకోమలహాసు నానావిధాకల్పు నాగతల్పు
బహువేదసంవేద్య భవమహామయవైద్యు వరతులసీదాము సురలలాముఁ
గలితశృంగారుఁ ద్రిగుణవికారదూరు । శోభనాకారు భువనసంస్తుత విహారు
యోగిహృద్గేయు నిజభక్తిభాగధేయు । సకలఫలదాయి శ్రీరంగశాయిఁ గనియె. 1281
క. ధరఁ జాఁగి మ్రొక్కి రత్నా । భరణసువర్ణాంబరాదిబహువస్తుతతుల్
పరువడిఁ గానుక లిడి సు । స్థిరమతి తత్పూజనంబుఁ జేసినపిదపన్. 1282
చ. అవిరళవిష్ణుచింతనపరాయణులై యచటన్ వసించుభా
గవతవరేణ్యులన్ బరమగాత్రులఁ జూతు గదయ్య యంచు ద
త్పరమపవిత్రులౌ మునులఁ బిల్చుచు సువ్రతనిష్ఠచారులన్
వివిధవిశేషసత్కృతుల వేడుకఁ బ్రీతులఁ జేసి సన్మతిన్. 1283

వ. అప్పార్థివోత్తముండు కృతార్థుండై మరలి తరలపతాకాభిశోభితాభిరామాతపత్ర
భాసురంబును సముల్లసితపల్లవతోరణాలంకృతంబును బ్రాలంచితప్రసూనదామాభి
రామంబును సరసశృంగారపురాంగనాకీర్ణసువర్ణసౌధవీధివిరాజితంబును నీరాజన
క్రియాసంభ్రమసముల్లాసవిలాసినీచరణమంజీరశింజితమంజులంబును వివిధమంగళవా
ద్యహృద్యంబును బ్రతిహారసంఘప్రదేశనియంత్రితసముత్తుంగమదముదితమధుకర
ఝంకారముఖరితగోపురంబును నగునిజపురంబు ప్రవేశించి సముచిత సామ్రాజ్య
భోగంబు లనుభవించుచుఁ జతురుదధివలయవలయితవసుమతీభాగం బనురాగంబునఁ
బాలించుచుండె నప్పుడు. 1284

ఉ. ఆతనిరాజ్య మొప్పె నిగమాగతజానపదప్రకీర్ణమై
యాతతవేదశాస్త్రపఠనారవశోభితమై నిరుపద్రవ
వ్రాతవిదూరమై సకలవస్తువిశేషసమృద్ధిమంతమై
వీతకళంకమై సతతవిష్ణుమహోత్సవరమ్యదేశమై. 1285

క. శ్రీరమణసుచరితామృత। సారంబై బహుపురాణసమ్మతమై సం
సారాబ్ధితారకం బగు। శ్రీరంగక్షేత్ర మొప్పె సిరి పెంపారన్. 1286

సీ. గ్రహణకాలంబునఁ గపిలాసహస్రంబు నవనీసురల కిచ్చినట్టిఫలము
భూరియాగములు సంపూర్ణదక్షిణ లిచ్చి కావించునట్టిసత్కర్మగరిమ
పసిఁడిపుష్పముల సద్భక్తిసాలగ్రామపూజనం బొనరించుపుణ్యమహిమ
సంతతజపతపస్స్వాధ్యాయనూపాససువ్రతంబుల వచ్చుసుకృతచయము
నవనియంతయు సత్పాత్రమైనయతని। కొసఁగ నెసఁగెడి పుణ్యధర్మోన్నతియును
గలుగుశ్రీరంగమాహాత్మ్య మెలమిఁ జదువు। నలఘుమతులకు వినువిమలాత్ములకును.

క. ఈయాఖ్యానరతిన్ జది। రాయువు నారోగ్యమును గులాభ్యున్నతియున్
శ్రీయు బహుపుత్రలాభముఁ। బాయనిసౌఖ్యములు విష్ణుభక్తియుఁ గలుగున్. 1288

చ. అని మును లంచితంబుగను నందఱు సమ్మదమార నారదం
బునకుఁ బరాశరప్రియసుతుం డెఱిఁగించిన యాకథాంశ మిం
పెనయఁ దెనుంగుబాస రచియించితి నాయువు శ్రీయుఁ గీర్తియున్
ఘనవిజయంబు నీ కెపుడు గల్గఁగఁ బాగయమంత్రిరాఘవా. 1289

చక్రబంధము.

శా. నవ్యశ్రీకపరాతిభైరవచరన్నాకిద్రుమావర్ణభా
గ్భవ్యారంభకఘుసృగస్తవకుచిస్యాంతప్రపూర్ణప్రభా
ధవ్యాంగప్రసవాంకవాసకతతః ప్రాముఖ్యనందేందుభా
భావ్యాళీనసురాదిశోవిభవశోభాభద్రభాస్వన్నిభా. 1290

నాగబంధము.

చ. వరగుణరత్నవిశ్రుతసువర్ణవతంససబాలసత్పగ
స్ఫురితమరాళశ్రీగురువచోవశచిత్తవిలాసవాసవా
వరజసమాంగవైరికరివారిధరానిలధీమాంచితో
త్తరసకుభానురక్తతతతత్పరచాగయమంత్రిరాఘవా 1291

గోమూత్రికాబంధము.

క. హరిపదసరసిజమధుకర । మురభిదసితమూర్తిరామభోగసురామా
కరిగదసురకుజవిధుకర । శరదుదసితకీర్తిధామచాగయరామా. 1292

మాలిని. కమలనయననీవాకౌతుకాధీనభావా
విమతభయదకోపా వీతిహోత్రప్రతాపా
సుమహితభుజసారా సుందరీమానచోరా
సుమనపక్షరామా చాగయామాత్యరామా 1293

గద్యము.

ఇది శ్రీమద్భ్రమరాంబావరప్రసాదలబ్ధసిద్ధసారస్వతగౌరవ గౌరనామాత్య
పుత్ర సుధీవిధేయ భైరవనామధేయ ప్రణీతం బైన శ్రీరంగ
మహాత్త్వం బను పురాణకథయందు సర్వంబును
పంచమాశ్వాసము.

# "విస్మృతకవులు."

ఈపేర నతిమనోహరము లగు ప్రాచీనకావ్యములు మాశక్తి
...ది దిద్ది కవిచరిత్రాదివిషయములఁ జేర్చి ముద్రించుచున్నారము.
...డు వెలకు సిద్ధముగా నుండుకృతు లేవనఁగా:—

1. క్రీడాభిరామము. శ్రీనాథకవివిరచితము. (వెలకు లభింపదు.)
2. కుమారసంభవము - పూర్వభాగము. నన్నెచోడదేవకృతము. } 1—0—0
3. నీతిశాస్త్రముక్తావళి - భద్రభూపాలరచితము. 0—5—0
4. పరతత్త్వరసాయనము - ఫణిభట్టప్రణీతము. 0—12—0
5. ప్రబంధమణిభూషణము - సంగ్రథితము. 0—12—0
6. త్రిపురాంతకోదాహరణము - తిప్పరాజుప్రణీతము. 0—3—0
7. అనర్ఘరాఘవము - తిమ్మభూపాలరచితము. 1—0—0
8. శ్రీరంగమహాత్త్వము - భైరవకవిప్రణీతము. 1—0—0
9. ఉదయనోదయము. (అచ్చులోనున్నది.)
10. ఐరావతచరిత్రము ,,
11. డిండిమప్రహసనము. ,,
12. రఘునాథరామాయణము. ,,
13. సాంబోపాఖ్యానము. ,,
14. ముద్రామాత్యము - క్షేమేంద్రరచితము. ,,

మా - రామకృష్ణకవి.

నరసరావుపేట... జానంపేటపోస్టు.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
HYDERABAD ( A. P. )

Cl. No. 294 5925 Acc. No. 29425
B4tS

DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29425

Call No. 294.5925 B46S

Author [illegible]

Title [illegible]

**UNIVERSITY OF HYDERABAD**

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**